# తెలంగాణ సాయుధపోరాట పతాక
# దొడ్డి కొమురయ్య

## అంబటి వెంకన్న

జాబిలి కళామండలి
నల్లగొండ

జాబిలి కళామండలి ప్రచురణ -5

జనవరి, 2016
ప్రతులు: 1000

**తెలంగాణ సాయుధ పోరాట పతాక**
**దొడ్డి కొమురయ్య**

వెల : 100/- రూ॥

**ముఖచిత్రం**: రమావత్ శ్రీనివాస్‌నాయక్

**కవర్ డిజైన్** : కత్తుల గిరి

ప్రతులకు :-
**జాబిలి కళామండలి**
ఇం.నెం. 7-1-155/D9/7
శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్
నల్లగొండ - 508 001
సెల్ : 9966376072

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో

ముద్రణ :- చరిత ప్రింటర్స్
హైద్రాబాద్

# అంకితం....

వీరయోధులగన్న తల్లిదండ్రులు

**దొడ్డి కొండయ్య - గట్టమ్మలకు**

ఉద్యమాభివందనాలతో....

## ఇండ్లు....

పేజి నెం


| | | |
|---|---|---|
| 1. | దక్షిణభారతదేశం - కుతుబ్‌షాహీల రాజ్యం | 01 |
| 2. | నిజాం ఉల్‌ముల్క్- అసఫ్‌జాహీల పాలన | 05 |
| 3. | ప్రపంచ చరిత్రలో వివిధ తిరుగుబాట్లు | 10 |
| 4. | నిజాంరాజ్యం - హైద్రాబాద్ సంస్థానం | 19 |
| 5. | నిజాం పాలన - కౌల్దారి విధానం | 24 |
| 6. | పోటీ ఆంధ్రమహాసభలు | 37 |
| 7. | చారిత్రక కడవెండి గ్రామం | 43 |
| 8. | దొడ్డి కొమురయ్య కుటుంబం | 46 |
| 9. | వెల్లువెత్తిన ప్రజాపోరాటాలు | 53 |
| 10. | హోరెత్తిన గుత్పల సంఘాలు | 59 |
| 11. | 1946 జులై 6 దొడ్డి కొమురయ్య వీరమరణం | 61 |
| 12. | దొడ్డి కొమురయ్య మరణానంతరం నిజాం రాజ్యం | 72 |
| 13. | దొడ్డి కొమురయ్య చనిపోయింది జులై 4 కాదు | 81 |
| 14. | సాయుధపోరాట పతాక దొడ్డి కొమురయ్య | 86 |
| 15. | అమలుకాని రావి ఆలోచన | 92 |
| 16. | ఎవరికీ పట్టని దొడ్డి కొమురయ్య | 97 |
| 17. | దొడ్డి మల్లయ్య కొడుకు భిక్షపతి | 104 |
| 18. | కొమరయ్య వీరమరణం - భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి | 106 |
| 19. | ఊరేగింపులు - ఆవుల పిచ్చయ్య కథ | 109 |
| | ముఖ్యాంశాలు | 113 |
| | రచయిత పరిచయం | 116 |

# ప్రజల ద్వారా ప్రజలకు తెలుస్తున్న చరిత్ర

**– డా॥ బెల్లి యాదయ్య**

చరిత్ర ఎవరు రాసినా రాసిన ప్రతి రచయిత ఏదో ఒక నూతన విషయం చెప్ప గలుగుతడు. ఎందుకంటె చరిత్ర ఒడువని ముచ్చట, విడువని ఆలింగనం, తీరొక్క గోస. తెలంగాణకు సంబంధించి ఉద్యమ సందర్భంలో సభలు, సమావేశాల్లో మౌఖిక చరిత్ర చాలా చర్చకు వచ్చేది. ఒకరిద్దరు లిఖిత చరిత్రను కూడ అందించిండ్రు. రాష్ట్ర అవతరణ తర్వాత సర్వీస్ కమీషన్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థుల అవసరాల రిత్యా తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక ఉద్యమ చరిత్రను అనేక మంది అనేక పేర్లతో గ్రంథాలను వెలువరిస్తుండ్రు. ఈ క్రమంలోనే కవి, గాయకుడు శ్రీ అంబటి వెంకన్న జాబిలి కళామండలి, నల్లగొండ ద్వార దొడ్డి కొమురయ్య అమరత్వాన్ని స్మరిస్తు ఈ పుస్తకాన్ని తెస్తున్నడు. ఇందుకు వెంకన్న అభినందనీయుడు.

వాఙ్మయంలో కవిత్వం, కథ, నవల, నాటకం వంటి ఊహాత్మక కల్పనాసహిత రసాన్విత రచన కాదు చరిత్ర. పక్కా ఆధారాలు, సాక్ష్యాలున్న యదార్థ ఘటనలే చరిత్ర. తెలంగాణలో సూపుతి అంటరు. గా సూపుతి లెక్కలు, పత్రాలు ఉన్నదే చరిత్ర. ఇతివృత్తం రిత్యా చెప్పాలనుకుంటె ప్రజానుభవమే ఒక కాలంలో, ఒక స్థలంలో జరిగిన సంఘటనలే చరిత్ర. దీన్ని రాయడానికి లైసన్స్ ఎవరి దగ్గర ఎవరు పొందాల్సిన పనిలేదు. చరిత్ర రచయిత ప్రధానంగ తాను ఏదైతే రాస్తున్నాడో ఆ ఘటనలకు, ఘట్టాలకు సంబంధించిన పరిసరాల్లో కనీసం తిరగాలి. వ్యక్తులను, సంస్థలను కలవాలి. తిరగకుండ, వ్యక్తులను, సంస్థలను పలకరించకుండ కేవలం గతంలో వచ్చిన పుస్తకాలేవో ముందేసుకొని తాను చెప్పదలుచుకున్న దానికి అనుకూలమైన ఉటంకింపులను ఎత్తిరాసే పేజీలు చరిత్ర ఎప్పటికి కాదు. అది చరిత్ర తాలూకు అగాథాలను ఎంతమాత్రం పూడ్చలేదు. పూడ్చకపోగ కొత్తపేచీలు, తగాదాలకు దారితీసే కొట్లాటల పుస్తకం అవుతది.

అట్లా కాకుండ ఈ పుస్తకం రాయడానికి అంబటి వెంకన్న కడివెండి, పాలకుర్తి, విసునూరు ప్రాంతాలను సందర్శించిండు. ఎరుకున్న పెద్దమనుషుల్ని కలిసిండు. విషయాలను తెలుసుకున్నడు. సేకరించిన సమాచారంతో ఆయా పుస్తకాల్లో చెప్పబడిన సంగతులను బేరీజు వేసుకుండు. తన భావనలో తేలిన కోణాలను చెప్పిండు. అక్కడక్కడ ప్రాంతేతర కమ్యూనిస్టుల మీద ఆగ్రహం వెలిబుచ్చిండు. దొడ్డి కొమురయ్య వీర మరణం రగిల్చిన సాయుధ రైతాంగ పోరాట ఆరణికి సంబంధించిన

వాతావరణాన్ని తెలంగాణ కోణంలో విశ్లేషించిండు. కొన్నిచోట్ల కమ్యూనిస్టు పార్టీపైన తీవ్ర విమర్శకూడ చేసిండు. నిజాం పాలనను కొన్ని సందర్భాలలో పొగిడిండు. ఇదట్లా ఉంచితే పర్యటించి చరిత్ర రాసినందుకు అమరుడు దొడ్డి కొమురయ్యను కేంద్రం చేసుకొని తెలంగాణ స్ఫూర్తితో, బహుజన దృక్పథంతో ఇంతపెద్ద గ్రంథం తెస్తున్నందుకు అంబటి వెంకన్నకు పాఠకుల తరపున మరొకమారు అభినందన.

దొడ్డి కొమురయ్య యువయోధుడు "Warriors are forceful souls; they embody qualities of strength, courage and determination" అనే నిర్వచనానికి ఎంతమాత్రం తీసిపోని త్యాగ పురుషుడు, సాహసమూర్తి, మహావీరుడు హైద్రాబాద్ రాష్ట్రం కాని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాని దొడ్డి కొమురయ్య స్మృతికి చేసింది ఏమి లేదు. కుటుంబానికి ఇచ్చింది కూడ ఏమి లేదు. ఏదో వస్తుందని ఇవ్వాలని చెప్పి కొమురయ్య యుద్ధంలో దూకలేదు. తన అన్న దొడ్డి మల్లయ్య సంఘంలో చేరలేదు. నాటి పరిస్థితుల్లో దోపిడీని ఎదుర్కోవడం, అరాచకాన్ని అంతమొందించడం సాంఘీకధర్మంగ, విధిగ కర్తవ్య నిర్వహణ చేసింద్రు.

అయితే ఆ ఉత్తమోత్తమమైన త్యాగం పొందాల్సిన గౌరవం పొందలేదు.

చరిత్రలోకి ఎక్కవలసినంతగ ఎక్కలేదు. ఈలోటును ఈ పుస్తకం కొంతమేరకు భర్తీచేయగలదు. ఇందులో దొడ్డి కొమురయ్య జన్మదినానికి సంబంధించి, ఈడుకు సంబంధించి కొత్త స్థాపనలు అంబటి వెంకన్న చేస్తున్నడు. ఇవి మరింత స్పష్టంగ రుజువు కావాల్సి ఉంది. లోకం ఆమోదం పొందాల్సి ఉంది.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రపంచ చరిత్రలో ఎంతటి మహత్తరమైందో చెప్పడానికి వెంకన్న ఈ గ్రంథంలో విశ్వవ్యాప్తంగ జరిగిన అనేక ప్రజోద్యమాలను సమాంతరంగ చర్చించిండు. ఈ రకంగ చూసినప్పుడు ఈ పుస్తకం విద్యార్థులకు ప్రపంచ చరిత్రకు సంబంధించిన విషయాలను ఎన్నింటినో అందిస్తుంది. తెలంగాణ, తెలంగాణేతర నాయకుల గుణశీలాలను కూడ పట్టిస్తుంది. తెలంగాణ కొద్దిగ ముందుకు ఆలోచిస్తే, చారిత్రకంగ గొల్ల, కురుమల ధైర్యసాహసాలు 12వ శతాబ్దం నుంచి అక్కడ కనిగిరి కాటమరాజు అయితేనేమి, ఇక్కడ దేవగిరి మహాదేవరాయలు అయితేనేమి, గొల్లకొండ (గోల్కొండ) నేపథ్యం భాగ్యనగర నిర్మాణంలో గొల్ల, కురుమల పాత్రపై ప్రత్యామ్నాయ రాజకీయశక్తుల చరిత్ర పుస్తక రచనకు అవసరమైన, ఘాటైన పౌరుషాన్ని, ఘాడమైన ఉద్యమోన్ముఖతను యాదవులకు ఈ పుస్తకం నిశబ్ధంగ అందిస్తుంది.

"History is the study of past, particularly how it relates to human. It is an umberella term the relates to past events as well as the memory, discovery, collection, organization, presentation and interpretation of information about these events" అంటాడు. నికోలాస్ గైజిస్. చరిత్రకారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు చరిత్ర రచన ఒక నిరంతర దర్యాప్తు అని తేలుతుంది. సాక్ష్యాలు, ఆధారాలు దొరకబట్టే కొద్ది ప్రజలకు ప్రజలద్వార కొత్త విషయాలు తెలియగలవు. ఈ బాటలోనే పాటగాడు అంబటి వెంకన్న మాటామంతి కొనసాగింది. ఖండించడంలోను, ఏకీభవించడంలోను నిష్పక్షపాతంగ వ్యవహరిద్దాం. వెంకన్న కోరుకుంటున్నది ఇదే..

**డా॥ బెల్లి యాదయ్య**

అధ్యక్షులు, తెలుగు పి.జి. విభాగం,

నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వ)

నల్లగొండ. సెల్: 9848392690

## వీరభూమి కడివెండికి పోదాం...

1924 జనవరి 6న దొడ్డి కొండయ్య గట్టమ్మలకు జన్మించిన దొడ్డి కొమురయ్య గొర్లను కాసుకునే ఒక మామూలు మనిషి. తన లోలోతుల్లో రగిలిన చైతన్యంతో విసునూరు దేశముఖ్ గూండాలను ఎదిరించిండు. వాళ్ళ తుపాకి తూటాలను లెక్కచేయకుండ ముందుకు ఉరికిండు. సాయుధపోరాట పతాకాన్ని ఎగరేసిండు. సామాన్య జనాన్ని సైతం కదిలించిండు. దొడ్డి కొమురయ్య చూపిన సాహసంతో, వీరత్వంతో విజృంభించిన సాధారణ రైతుకూలీ జనం వీరయోధులై తిరగబడ్డరు. కరుడుగట్టిన భూస్వామ్య విధానాన్ని కాలరాసింద్రు. ఈ విధంగ నల్లగొండ జిల్లా జనగామ తాలూకా కడవెండిలోని ప్రజావెల్లువ ప్రపంచ విప్లవాలకు ఏ మాత్రం తీసిపోని మహత్తర పోరాటమైంది. ఆనాడు అమెరికా వలసరాజ్యాల మీద ఇంగ్లాండ్ ఆధిపత్యాన్ని భరించలేని ప్రజలు ప్రభుత్వ ఆంక్షల్ని తిరస్కరించింద్రు. వాళ్ళ శాసనాల్ని ధిక్కరించింద్రు. ఆఖరికి జార్జి వాషింగ్టన్ నాయకత్వంలో తిరుగుబాటు చేసి స్వాతంత్ర్యాన్ని సంపాదించింద్రు. ఫ్రాన్స్‌లో వెట్టిచాకిరి, పన్నులభారాన్ని భరించలేని జనం ఒక్కసారిగ భగ్గుమన్నరు. భూస్వాముల దౌర్జన్యాన్ని ఎదిరించింద్రు. ఆ క్రమంలోనే ఫ్రాన్స్ నిరంకుశ రాజు 16వ లూయికి వ్యతిరేకంగ ప్రజ్వరిల్లిన ప్రజాపోరాటం బాస్టిల్ కోటని బద్దలు కొట్టింది. రష్యాలో భూస్వాముల అరాచకాలకు సేద్యబానిసలు ఎదురు తిరిగింద్రు. బోస్నియాలో ఆస్ట్రియా యువరాజును సతీసమేతంగ నడివీధిలో కాల్చి చంపినందుకు గాను ఏకంగ మొదటి ప్రపంచయుద్ధమే చెలరేగింది.



**కడివెండిలో దొడ్డి కొమురయ్య స్తూపం దగ్గర**

ప్రపంచ చరిత్రలో అమెరికా, రష్యా, ఫ్రాన్స్, చైనా వంటి విప్లవాలతో పాటు మొదటి, రెండవ ప్రపంచయుద్ధాలు భీకరంగ జరిగినయి. అదేవిధంగ భారతదేశంలో కూడ స్వాతంత్ర్యం కోసం ఎన్నో తిరుగుబాట్లు జరిగినయి. ఇట్లాంటి అనేక ఉద్యమాలు పోరాటాలే, ప్రపంచచరిత్ర గతిని మార్చి స్వేచ్ఛా పతాకాన్ని ఎగరేసినయి. ఆ పోరాట క్రమంలో రగిలిన ఒకానొక జ్వాలే కడివెండి కన్నబిడ్డ దొడ్డి కొమురయ్య. విసునూరు దేశముఖ్ గూండాల దౌర్జన్యానికి అగ్రహోదగ్రుడై విప్లవసింహంలా ముందుకురికి మహావిప్లవాన్ని సృష్టించిన ఆ వీరుని చరిత్రను పుస్తకంగ తీసుకురావాలని అనుకున్న. అందుకోసం వీరభూమి, పోరాటాల పాటిగడ్డ కడివెండి మట్టికి దండంపెట్టి రావాలని కొందరు మిత్రులతో పాటు కలిసి కడివెండికి చేరుకున్న. కడివెండిలో అడుగుపెట్టిన మరుక్షణమే మనసు రణరంగంలో నిలబడ్డట్టయ్యింది. దొడ్డి కొమురయ్య స్తూపాన్ని చూసినంతనే పోరాట దృశ్యాలు ఒక్కటొక్కటి కండ్లముందు కదలాడి రక్తం ఉప్పొంగినట్టయ్యింది.

ముందుగ కడివెండి సర్పంచ్ ఇంటికి పోయినం. ఏదోవిధంగ దొడ్డి మల్లయ్య చిన్న కొడుకు బిక్షపతి నెంబరు తీసుకొని ఫోన్‌చేసినం. బిక్షపతిని వెంటబెట్టుకొని దొడ్డి కొమురయ్య జ్ఞాపకాలను నెమరు వేసుకుంటు దొడ్డి కొమురయ్యకు సంబంధించిన సమాచారం కోసం గ్రామంలో పెద్దవాళ్ళందరిని కలిసినం. వాళ్ళలో మందడి మోహన్‌రెడ్డి, దరగాని సోమయ్య, బాషపాక ఉప్పలయ్య, బైరు అయిలయ్యలు విలువైన సమాచారం ఇచ్చింద్రు. దరగాని సోమయ్య 90 సంవత్సరాల పెద్దమనిషి గట్టిగ సంపూర్ణ ఆరోగ్యంతోని ఉన్నడు. దొడ్డి కొమురయ్య మీద కాల్పులు జరిగిన సంఘటనకు సంబంధించిన విషయాలు ఆయనకు బాగ గుర్తున్నట్టు, చెప్పిండు. ముఖ్యంగ దొడ్డి కొమురయ్యకు సంబంధించి అతి విలువైన విషయం ఏం జెప్పిండంటే దొడ్డి కొమురయ్య



**దరగాని సోమయ్యతో...**



బాషపాక ఉప్పలయ్యతో..

చనిపోయేనాటికి ఇరవై, ఇరవైరెండేండ్లకు పైన్నే ఉంటయని చెప్పిండు. కాని ఇప్పటి దాక దొడ్డి కొమురయ్య వయసు పద్దెనిమిది సంవత్సరాలని రాసింౘ్రు. అక్కడున్న పెద్దమనుషులు మరికొన్ని జ్ఞాపకాలను నెమరేసుకొని, దొడ్డి భిక్షపతితో పాటు దొడ్డి కొమురయ్య సరిగ్గ సంక్రాంతి ఇంకా ఏడెనిమిది రోజులు ఉన్నదనంగ పుట్టినట్టు చెపింౘ్రు. దాంతో అప్పుడే అందరం కలిసి ఒక గట్టి నిర్ణయానికి రావడం జరిగింది.

దొడ్డి కొమురయ్య పుట్టిన తేదీని 1924 జనవరి 6గా నిర్ణయించడం జరిగింది. ఇంకా ఆ పెద్దమనుషులు చెప్పిన వివరాల ప్రకారం దొడ్డి కొమురయ్య మనిషి కిందికిమీదికి జిట్టసంగ ఉండేటోడని, ఎవనయ్యకు భయపడేటోడు కాదని చెప్పింౘ్రు. ఆ కొరివి వీరన్న మా కొమురయ్య అవతారం ఎత్తినట్టు అనిపిచ్చేదని అన్నరు. అంతేకాకుండ దొడ్డి కొమురయ్య గొర్లను కాసుకుంటనే ఎవరికి అంతుబట్టకుండ, రహస్యంగ సంఘం కార్యక్రమాలను కూడ చూసుకునేటోడని, అసలు ఒక్కమాటలో చెప్పాలంటె దొడ్డి మల్లయ్య సంఘం కార్యక్రమాలలో పాల్గొనడానికి పూర్తిగ సహకరించింది దొడ్డి కొమురయ్యేనని చెప్పింౘ్రు. ముఖ్యంగ కడివెండిలో దొరసాని ధాన్యం బస్తాల గుట్టును బయటపెట్టి అత్యంత కీలకమైన సమాచారాన్ని సేకరించడంలో దొడ్డి కొమురయ్య పాత్ర అమోఘమైనదని, అత్యంత సాహసంతో కూడుకున్నదని రోమాలు నిక్కపొడిచేలా ఎన్నో విషయాలు చెప్పింౘ్రు. అయితే ఈ సందర్భంగ నేను చెప్పదల్చుకున్నది ఏందంటే చరిత్ర అనేది ఒకరోజుతోనో, ఒక్కరితోనో అంతమయ్యేది కాదు. పరిపూర్ణమయ్యేది కూడ కాదు . అది సమాజంలో అనేక పొరలుగ నిక్షిప్తమై ఉంటుంది. తొవ్వినాకొద్ది ఏదో ఒక కొత్త అంశం దొరుకుతనే ఉంటది. కాని పోరాటయోధుడు దొడ్డి కొమురయ్యకు సంబంధించి ఆయన చనిపోయిన తేదీనే తప్పుగా రికార్డు చేసిన ఘనచరిత్ర ఇక్కడి కమ్యునిస్టు చరిత్రకారులకు ఉన్నది. దొడ్డి కొమురయ్య చనిపోయిన 1946 జులై 6వ తేదీన ఆయన ఫోటోలు తీయడానికి హైద్రాబాద్ నుంచి ఫోటోగ్రాఫర్ వచ్చిండు. ఆంధ్రమహాసభ నాయకులే



బైరు అయిలయ్యతో...

ఆయనను పంపి ఫోటోలు తీసుకరమ్మని చెప్పిండ్రు. కాని ఎక్కడకూడ దొడ్డి కొమురయ్య, దొడ్డిమల్లయ్యల ఫోటోలు లేవు. అనేక విధాలుగ ప్రయత్నించి ఆ పెద్ద మనుషుల్ని దొడ్డి కొమురయ్య రూపురేఖల్ని గురించి, గుణగణాలను గురించి అడిగి మిత్రుడు, ప్రముఖ చిత్రకారుడు రమావత్ శ్రీనివాస్‌నాయక్‌తో దొడ్డి కొమురయ్య బొమ్మని ఉన్నది ఉన్నట్టు గీయించడం జరిగింది. అయితే ఇప్పటివరకు దొడ్డి కొమురయ్యనిగాని, ఆయన కుటుంబాన్ని గాని ఎవరు పట్టించుకోలేదన్న బాధ ఉన్నది. అది అట్ల ఉంచితే కులసంఘాలు, బీసి సంఘాలు, బహుజన సంఘాలు, ప్రజాసంఘాలు అని చెప్పుకునే మనం ఎంతమందిమి కలిసి ఎన్నిసార్లు కడివెండికి పోయినం. ఆ కుటుంబాన్ని పలకరించి ఆత్మీయతను పంచుకున్నం. మనం ఓ నాలుగుసార్లు ఆ ఊరికిపోతే కదా బాటపడేది. అక్కడ నిత్యం జనజాతర జరిగేది. విగ్రహాన్ని ప్రతిష్టించి జయంతులు, వర్ధంతులు పెద్దఎత్తున నిర్వహిస్తే కదా పార్టీలు, ప్రభుత్వాలు పట్టించుకునేది. మనం ఎవరికివాళ్ళం చేతులు వోళ్ళోపెట్టుకొని కుసున్నంత కాలం మన చరిత్ర ఇట్లనే మరుగున పడిపోతదని గ్రహించి తెలంగాణ సాయుధ పోరాట పతాక దొడ్డి కొమురయ్య చరిత్రను ఒక పుస్తకంగ మీ ముందుకు తీసుకురావాలని నిశ్చయించుకున్నాను. నా సంకల్పానికి సహకరించిన సహృదయులు, నేను అడిగిన వెంటనే ముందుమాట రాసిచ్చిన అన్న **డా॥ బెల్లి యాదయ్యకు,** అన్నివిధాల సహకరించిన మిత్రులు **ఎలికట్టె శంకర్‌రావుకు** ప్రత్యేక కృతజ్ఞతలు. అదేవిధంగ నిరంతరం నన్ను ప్రోత్సహించే పెద్దలు, ప్రముఖ విమర్శకులు **డా॥ అంబటి సురేందర్ రాజు,** అంతర్జాతీయ క్యారికేచరిస్ట్ అవార్డు గ్రహీత **పామర్తి శంకర్,** పెద్దలు **దేవులపల్లి కృష్ణమూర్తి, జూలూరి గౌరీశంకర్, సంగిశెట్టి శ్రీనివాస్,** కేంద్రసాహిత్య అకాడమీ యువపురస్కార్ అవార్డు గ్రహీత **డా॥పసునూరి రవీందర్,** తెలంగాణ కళల నెలవు, మా తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్మన్ **రసమయి బాలకిషన్,** సాహిత్యాభిలాషి, శాసనమండలి సభ్యులు **కర్నె ప్రభాకర్** గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

**-అంబటి వెంకన్న**

# దక్షిణ భారతదేశం– కుతుబ్‌షాహీల రాజ్యం

**కుతుబ్‌షాహీల రాజ్య ఆవిర్భావం:** చరిత్రలో మహ్మద్‌బిన్ తుగ్లక్‌ను గురించి తెలియనివారు ఉండరు. నిజానికి అతడు చాలా తెలివైనవాడు. కాని తన ఎత్తుగడలు ఏవి ఫలించకపోవడం వల్ల సర్వం కోల్పోయిండు. అస్తవ్యస్తమైన తుగ్లక్ పాలనాకాలంలోనే దక్షణ భారతదేశంలో ముస్లిం రాజ్యం ఏర్పడ్డది. అదే బహమనీ రాజ్యం. 1347లో ఇస్లాం సున్నీ తెగకు చెందిన అల్లావుద్దీన్ బహమన్‌షా ఈ రాజ్యాన్ని స్థాపించిండు. బహమనీ రాజ్యానికి మొదటి రాజధాని గుల్బర్గ, తదుపరి రాజధాని బీదర్. బహమనీ రాజ్యాన్ని మొత్తం పద్దెనిమిది మంది సుల్తాన్‌లు పరిపాలించిండ్రు. వీరందరిలో మూడవవాడైన మహ్మద్‌షా ప్రజల మన్ననలు పొంది గొప్పరాజుగ కీర్తించబడినాడు. అయితే ఈ బహమనీ రాజ్యం ఉన్నత స్థితికి చేరుకోవడానికి మహ్మద్‌గవాన్ కృషి ఎంతగానో ఉన్నది. 1481లో మహ్మద్ గవాన్ హత్యకు గురికావడం వల్ల బహమనీ రాజ్యపతనం ఆరంభమైందని చెప్పవచ్చు. క్రమంగా బహమనీ రాజ్యం ఐదు స్వతంత్ర రాజ్యాలుగ చీలిపోయింది. అవే బీరార్, బీదర్, బీజాపూర్, అహ్మద్‌నగర్, గోల్కొండ. బీరార్‌ని ఇమాద్‌షాహీలు, బీదర్‌ని బరీద్‌షాహీలు, బీజాపూర్‌ని ఆదిల్‌షాహీలు, అహ్మద్‌నగర్‌ని నైజాంషాహీలు, గోల్కొండని కుతుబ్‌షాహీలు కైవసం చేసుకొని పాలించిండ్రు. అయితే 1547లో బీరార్ అహ్మద్‌నగర్‌లోను,1619లో బీదర్ బీజాపూర్‌లోను కలిసిపోయినయి.

1526లో అప్పటి వరకున్న ఢిల్లీ సల్తనత్‌ను అంతం చేసి బాబర్ మొఘల్ సామ్రాజ్యాన్ని స్థాపించిండు. ఈయన అసలు పేరు జహీరుద్దీన్ అహ్మద్. మొఘలుల పాలనా కాలంలో జమీందారీ వర్గం రైతుల నుంచి శిస్తు వసూలు చేసేవారు. ఆ శిస్తులో జమీందారులు కొంత భాగం తీసుకొని మిగతాది రాజులకు చెల్లించేవారు. వీళ్ళకు ఆరోజుల్లోనే గుర్రాలు, తుపాకులతో కూడిన చిన్న సైన్యం కూడ ఉండేది. మొఘల్ పాలనా కాలంలో జమీందారులు స్వంతంగ కూలీల చేత సాగు చేయించుకునే భూమినే “ఖుద్‌ఖాస్తే” భూములని పిలిచేవారు. ఈ భూస్వాముల భూములను సాగుచేసే వాళ్ళను కౌలుదారులని అంటరు. మొఘల్ పాలకులలో మితిమీరిన రాజ్యకాంక్ష కలిగిన ఔరంగజేబు1686లో బీజాపూర్‌ను, 1687లో గోల్కొండను మొఘల్ సామ్రాజ్యంలో వీలీనం చేసిండు.

**ఔరంగజేబు (1658-1707):** షాజహాన్‌కు దారాషికో, షా షుజా, ఔరంగజేబ్, మురాద్‌లతో పాటు రోషనార, జహనార అనే ఇద్దరు బిడ్డలు కూడ ఉన్నరు. అన్నదమ్ములను లొంగదీసుకొని సింహాసనాన్ని అధిష్టించిన ఔరంగజేబు ముస్లిమేతరులపై అనేక ఆంక్షలు విధించి అమలు జరిపిండు. అక్బర్ రద్దుచేసిన తీర్థయాత్రికుల పన్నును తిరిగి విధించిండు. హిందువులు బహిరంగంగ పండుగలు జరుపుకోకూడదని శాసించిండు. ఈ విధంగ ఔరంగజేబు తన దురాక్రమణ విధానాన్ని దక్కన్ ప్రాంతంలో సైతం విస్తరింపజేసిండు. ఔరంగజేబు దక్కన్ విధానమంత మతంతోనే ముడిపడి ఉంది. షియా రాజ్యాలైన బీజాపూర్, గోల్కొండలను ఆక్రమించిండు. 1707 మార్చి3న ఔరంగజేబు చనిపోయే వరకు తన పోరాటాన్ని కొనసాగించిండు. ఈ దక్కన్ యుద్ధాల ఫలితంగ మొఘల్ సామ్రాజ్యానికి అపార నష్టం సంభవించడమే కాకుండ రాజ్య పతనానికి దారితీసింది.

# కుతుబ్‌షాహీలు

దక్షిణ భారతదేశంలో సువిశాల బహమనీ రాజ్యం యొక్క అవశేషాల మీద ఆవిర్భవించిన గొప్ప స్వతంత్ర రాజ్యాలలో గోల్కొండ సామ్రాజ్యం ఒకటి. గోల్కొండ గవర్నర్‌గ పనిచేస్తున్న కులీకుతుబ్‌షా 1512లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొని కుతుబ్‌షాహి రాజవంశాన్ని స్థాపించిండు. ఇట్ల మొదలైన కుతుబ్‌షాహీల పాలన దాదాపు 170 సంవత్సరాలు నిరాఘాటంగ కొనసాగింది.

**కులీకుతుబ్‌షా (1512-1543):** పర్షియా, ట్రాన్స్ ఆక్జియానాలను పాలించిన హమ్‌దమ్ రాజవంశానికి చెందిన కులీకుతుబ్‌షా ఉద్యోగ అన్వేషణలో భారతదేశానికి వచ్చిండు. బహమనీ సుల్తాన్ మూడవ మహ్మద్‌షా కొలువులో చేరిండు. పాలనాపరమైన అంశాలలో తగిన సహాయ సహకారాలు అందిస్తూ మహ్మద్‌షా చేత శభాష్ అనిపించుకుండు. ఆ తర్వాత తెలంగాణ ప్రాంతానికి గవర్నర్‌గ నియమించబడిండు. తన పరిపాలనా దక్షతతో గోల్కొండ దుర్గాన్ని పటిష్ఠం చేసి దానికి మహ్మద్ నగరమని పేరుపెట్టిండు. తీరాంధ్రను జయించాలనే ప్రయత్నంలో కృష్ణదేవరాయల చేతిలో ఓడిపోయిండు. రాయల మరణానంతరం విజయనగర సామ్రాజ్యం మీద దాడిచేసి రాచకొండ, దేవరకొండ, పానగల్లు, ఘనాపూర్ దుర్గాలను ఆక్రమించిండు. ఖమ్మంమెట్టు దుర్గాన్ని పాలించే శితాబ్‌ఖాన్‌ను ఓడించి ఓరుగల్లు, కొండపల్లి, కొండవీడు, బెల్లంకొండ, ఖమ్మంమెట్టు దుర్గాలను జయించిండు. బీదర్, బీజాపూర్ సుల్తాన్‌లను

కూడ ఓడించిండు. కులీకుతుబ్‌షా తన రాజ్యాన్ని నేటి తెలంగాణ కృష్ణా, గోదావరి నదుల మధ్య ప్రాంతానికంతటికి విస్తరింపజేసిండు. కులీకుతుబ్‌షా షియా మతానికి చెందినవాడైనప్పటికి పరమత సహనాన్ని ప్రదర్శించిండు. భాషా, సాహిత్యాల పట్ల ఎనలేని అభిమానాన్ని చూపించిండు. గోల్కొండను సుందర నగరంగ తీర్చిదిద్దిండు.

**జంషీద్ (1543–1550):** కులీకుతుబ్‌షా మూడవ కొడుకు జంషీద్. ఇతడు తండ్రిని చంపి గోల్కొండ సింహాసనాన్ని అధిష్టించిండు.

**ఇబ్రహీం కుతుబ్‌షా (1550–1580):** జంషీద్ మరణానంతరం అతని సోదరుడైన ఇబ్రహీం కుతుబ్‌షా రాజ్యాధికారాన్ని చేపట్టిండు. ఇబ్రహీం విజయనగరం నుంచి వచ్చి ముప్పయ్ సంవత్సరాలు గోల్కొండ రాజ్యాన్ని పాలించిండు. దారిదోపిడి దొంగలను అణిచివేసిండు. గూఢచార వ్యవస్థను పటిష్ఠం చేసి పోలీస్‌శాఖను పునర్వ్యవస్థీకరించిండు. ఇబ్రహీం కుతుబ్‌షా ఒక అద్భుతమైన కవి. ఇతని ఆస్థానంలో అరబ్బీ, పారశీక, తెలుగు కవులు ఉండేవాళ్ళు. తన ఆస్థానంలో తెలుగు కవులైన కందుకూరి రుద్రకవి, అద్దంకి గంగాధర కవి, మరింగంటి సింగనాచార్యులను పోషించి 'మల్కిభరాముని' గా కీర్తించబడినాడు.

**మహ్మద్ కులీ కుతుబ్‌షా (1580–1612)** ఈయన ఇబ్రహీం కుతుబ్‌షా కొడుకు తన తండ్రి మరణానంతరం 1580లో సింహాసనాన్ని అధిష్టించిండు. ఈయన కాలంలోనే గండికోట, నంద్యాల, కడప, కర్నూలు కూడ గోల్కొండ రాజ్య భూభాగంలో చేరడం, మొగల్ చక్రవర్తి అక్బర్ ఆస్థానం నుంచి, పర్షియా రాయబారులు గోల్కొండను సందర్శించడం జరిగింది. మహ్మద్ కాలంలోనే బ్రిటీష్‌వాళ్ళు 1611లో మచిలీపట్నం వద్ద వర్తకస్థావరాన్ని ఏర్పాటు చేసుకుండ్రు.

మహ్మద్ కులీ కుతుబ్‌షా తన ప్రియురాలు భాగ్యమతి పేరున మూసీనది ఒడ్డున అందమైన భాగ్యనగరాన్ని నిర్మించిండు. అది అన్ని రంగాలలో అతి సుందర నగరంగ విరాజిల్లి ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. అదే మన ప్రస్తుత హైద్రాబాద్ నగరం. మహ్మద్ కులీకుతబ్‌షా భాగ్యనగరంలో దాద్‌మహల్, ఖుదాదాద్ మహల్, చార్మినార్, జామమసీద్, చందన్‌మహల్ వంటి అనేక సుందరమైన కట్టడాలను నిర్మించిండు.

**మహ్మద్ కుతుబ్‌షా (1612–1626):** మహ్మద్ కులీకుతుబ్‌షా మరణానంతరం అతని అల్లుడైన మహ్మద్ కుతుబ్‌షా గోల్కొండ పాలకుడయ్యిండు.

**అబ్దుల్లా హుసేన్ కుతుబ్‌షా (1626–1672):** మహ్మద్ కుతుబ్‌షా కొడుకైన అబ్దుల్లా హుసేన్ కుతుబ్‌షా గోల్కొండ సింహాసనాన్ని అధిష్ఠించిండు. ఇతని కాలంలోనే గోల్కొండ రాజ్యం మొగల్ పాలకుల సార్వభౌమాధికారాన్ని అంగీకరించింది.

**అబుల్ హసన్ (తానీషా) (1672–1687):** అబ్దుల్లా హుసేన్ కుతుబ్‌షాకు కొడుకులు లేకపోవడం మూలంగ అతని అల్లుడైన అబుల్ హసన్ 1672 గోల్కొండ సింహాసనాన్ని అధిష్ఠించిండు. ఇతన్ని తానీషా అని కూడ పిలుస్తారు. ఇతని కాలంలోనే క్షేత్రయ్య మువ్వగోపాల పదాలను రచించిండు. అక్కన్న, మాదన్నలనే హిందు అధికారుల అండదండలతో రాజ్యపాలన కొనసాగించిండు. అనంతరం ఔరంగజేబు గోల్కొండ కోటను ముట్టడించి తానీషాను బంధీగా తీసుకొని పోయిండు. ఈ సంఘటనతో కుతుబ్‌షాహి వంశం అంతరించింది.

ఔరంగజేబ్ మరణంతో మొగల్ సామ్రాజ్యం క్షీణంచడం మొదలైంది. సువిశాల మొగల్ సామ్రాజ్యం క్రమంగ చిన్నచిన్న రాజ్యాలతో పాటు హైద్రాబాద్, అవద్ వంటి అనేక స్వతంత్ర రాష్ట్రాలుగ విడిపోయింది. దక్కన్ ప్రాంతంలోని నిజాం ఉల్ ముల్క్ 'అసఫ్‌జా' అనే బిరుదుతో అసఫ్‌జాహీ వంశాన్ని స్థాపించిండు. దీంతో1724 నుంచి అసఫ్‌జాహీల స్వతంత్ర పాలన మొదలైంది. ఈ నిజాం రాజులు దాదాపు మొగల్ పాలనా కాలంనాటి విధానాలనే అనుసరించిండ్రు. వీరు దక్కన్ ప్రాంతంలోని ఆరు సుబాలను సర్కారులుగా విభజించిండ్రు. హైద్రాబాద్ సుబాను 43 సర్కారులుగా విభజించిండ్రు. ఇవి కృష్ణానదికి దక్షిణ భాగంలో 22 సర్కారులు, కృష్ణానదికి ఉత్తర భాగంలో 21 సర్కారులు ఉండేయి. ఈ సర్కారులను మళ్ళీ పరగణాలుగ విభజించిండ్రు. తిరిగి పరగణాలను ఖస్బాలుగ విభజించిండ్రు. ఈ విధంగ మొదలైన అసఫ్‌జాహీ వంశీయుల పాలన 1948వరకు ఏడుగురు రాజులతో నిరాఘాటంగ 224 సంవత్సరాల పాటు కొనసాగింది.

# నిజాం ఉల్ ముల్క్ - అసఫ్‌జాహీల పాలన

నిజాం ఉల్ ముల్క్ అసలు పేరు మీర్ ఖమ్రుద్దీన్ ఖాన్. ఈయన రాజనీతిని పరిపాలనా దక్షతను చూసి ఫతేజంగ్, నిజాం ఉల్ ముల్క్ అనే బిరుదులను ఇచ్చి దక్కన్ సుభేదారుగ నియమించిండ్రు. నాటి దక్కన్ సుభాలో కాందేశ్, బీరార్, తెలంగాణ, దౌలతాబాద్, అహ్మద్‌నగర్, ఆర్కాట్‌లతో కూడిన సువిశాల ప్రాంతం.

నిజాం తన స్వతంత్ర పాలనతో భాగంగ మొదట తెలంగాణ మీద ఆధిపత్యాన్ని సాధించిండు. తర్వాత తన రాజ్యాన్ని నలుదిక్కులకు విస్తరింపజేసిండు. నిజాం నిత్యం ప్రజల యోగక్షేమాలను గురించి ఆలోచించేటోడు. దక్కన్ సుభా రాజధాని ఔరంగాబాద్‌లో కవి పండిత సభలు జరుగుతుండేవి.

నిజాం ఉల్ ముల్క్ 1724 నుంచి 1748లో చనిపోయేంత వరకు దాదాపు 24 సంవత్సరాలు పరిపాలించిండు. ఉల్ ముల్క్ మరణానంతరం ఇతని రెండవ కొడుకు నాజర్‌జంగ్ దక్కన్ సుబేదార్ అయ్యిండు.

**నాజర్ జంగ్ (1748-1751):** 1748 నుంచి 1751వరకు నాజర్ జంగ్ (మీర్ అహ్మద్ అలీఖాన్) పరిపాలించిండు. ఈయన కాలంలో ఆంగ్లేయులు, ఫ్రెంచి వాళ్ళు పాలనలో జోక్యం చేసుకొని ఏకంగ నిజాం మేనల్లుడైన ముజఫర్‌జంగ్‌ను దక్కన్ సుబేదార్‌గ ప్రకటించిండ్రు. ఆ వెంటనే ఆంగ్లేయులు నాజర్ జంగ్‌ను బలపరిచిండ్రు. కాని ఫ్రెంచి వాళ్ళు చేసిన కుట్రల వల్ల నాజర్‌జంగ్ హత్యకు గురయ్యిండు. హైద్రాబాద్‌లో అడుగు పెట్టక ముందే ముజఫర్‌జంగ్ కూడ హత్య చేయబడిండు. దీంతో నిజాం మూడవ కొడుకైన సలాబత్ జంగ్ ఫ్రెంచి వాళ్ళ సహకారంతో దక్కన్ సుబేదార్ అయ్యిండు.

**సలాబత్ జంగ్ (1751-1763):** 1751 నుంచి 1763వరకు సలాబత్‌జంగ్ పాలించిండు. తనకు సహకరించిన ఫెంచివారికి కొండవీడు, నిజాంపట్నం, నర్సాపురం ప్రాంతాలను ఇచ్చేసిండు. తన అసమర్ధ పాలనను చూసి నిజాం ఉల్ ముల్క్ నాల్గవ కొడుకు బ్రిటీష్‌వాళ్ళ సహకారంతో సింహాసనాన్ని అధిష్ఠించిండు.

**నిజాం అలీ ఖాన్ (1763-1803):** 1763 నుంచి 1803 వరకు గల నిజాం అలీఖాన్ పాలనకాలంలో నిజాం రాజ్యం మీద ఫ్రెంచి వారి పెత్తనం నశించి బ్రిటీష్ ఆధిపత్యం

మొదలైంది. నిజాం అలీఖాన్‌కు రెండవ అసఫ్‌జా అనే బిరుదును కూడ ఇచ్చింద్రు. నిజాం అలీఖాన్ తన రాజధానిని ఔరంగాబాద్ నుండి హైద్రాబాద్‌కు మార్చిండు. నిజాం అలీఖాన్ ఆంగ్లేయులతో కలిసి టిప్పు సుల్తాన్‌ను వధించి అతని రాజ్యాన్ని సమానంగ పంచుకున్నరు. రాజమండ్రి, ఏలూరు, ముస్తఫానగర్‌ల మీద బ్రిటీష్ వాళ్ళకు ఆధిపత్యం కల్పించిండు. ఇందుకుగాను ఏటా ఐదు లక్షల విలువచేసే ధనాన్ని ఇవ్వవలసిందిగ ఒప్పందం చేసుకుండు. కాని లార్డ్ వెల్లస్లీతో చేసుకున్న సైన్య సహకార పద్ధతి వల్ల బ్రిటీష్ సైనిక నిర్వహణకు గాను బళ్ళారి, కడప, కర్నూలు, అనంతపురం ప్రాంతాలను ఆంగ్లేయులకు ధారాదత్తం చేయవలసి వచ్చింది. ఈ నాలుగు జిల్లాలుగల రాయలసీమ ప్రాంతాన్నే సీడెడ్ (దత్తమండలం) అని పిలిచింద్రు. ఈ విధంగ 1768 నాటికే కోస్తాంధ్ర, 1798 నాటికే రాయలసీమ ఆంగ్లేయుల పాలైనయి.

ఆ తర్వాత 1800 సంవత్సరంలో ఈ ప్రాంతానికి థామస్ మన్రోని కలెక్టర్‌గా నియమించింద్రు. మన్రో పాలెగార్లను లొంగదీసుకొని రైత్వారి పద్ధతిని అమలు చేసిండు. వ్యవసాయ అభివృద్ధికి రైతులకు అప్పులు ఇప్పించే పద్దతిని ప్రవేశపెట్టిండు. నిజాం అలీఖాన్ కాలంలోనే మోతీమహల్, గుల్షన్ మహల్, రోషన్‌బంగ్లా వంటి అద్భుతమైన భవనాలను నిర్మించింద్రు.

**సికిందర్ జా (1803-1829):** 1803 నుంచి 1829 వరకు పరిపాలించిన సికిందర్ జాని మూడవ అసఫ్‌జా అని పిలిచేవాళ్ళు. ఈయన కాలంలో జాగీర్దారులు పెద్దఎత్తున తిరుగుబాటు చేసింద్రు. రాజ్యంలో అల్లకల్లోల పరిస్థితులు తయారైనయ్. ఇదే అదునుగ దివాన్ మీర్ ఆలం ప్రాబల్యాన్ని తగ్గించడానికి చందూలాల్‌ని పేష్కార్‌గ నియమించింద్రు. కోలుకోలేని ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. సర్కారు ప్రాంతం పూర్తిగ ఆంగ్లేయుల వశమైంది. తర్వాత ఈయన కొడుకు నాసిరుద్దౌలా రాజయ్యిండు.

**నాసిరుద్దౌలా బహదూర్ (1829-1857):** 1829 నుంచి 1857 వరకు పరిపాలించిన నాసిరుద్దౌలా బహదూర్ కాలంలో దేశంలో అనేక ఉద్యమాలు తలెత్తినయ్. ముఖ్యంగ బ్రిటీష్ ప్రభుత్వ కార్యకలాపాలను నిరసిస్తూ దేశవ్యాప్త పోరాటాలు కొనసాగినయ్. అందులో భాగంగానే వహాభి ఉద్యమానికి హైద్రాబాద్‌లో సికిందర్ జా మూడవ కొడుకు ముబారిజ్ ఉద్దౌలా నాయకత్వం వహించిండు. సరిగ్గా ఇదే సమయంలో ఖజానా ఖాళీ అయ్యింది. అప్పులు పెరిగిపోయినయ్. ఈ స్థితిలో మరికొన్ని ప్రాంతాలను బ్రిటీష్ వాళ్ళకు ధారాదత్తం చేయవలసి వచ్చింది. ఇట్ల రాజ్యం దివాళ తీస్తున్న సమయంలో తురాజ్ అలీఖాన్ సాలార్‌జంగ్ అనే బిరుదుతో దివాన్ (ప్రధాని)గా అధికారాన్ని చేపట్టిండు.

**సాలార్‌జంగ్ (1853-1883):** అప్పుల్లో కూరుకుపోయిన నిజాం రాజ్యంలో వరుస కరువులు రావడంతో ఎంతో మంది చనిపోయింద్రు. ఈ పరిస్థితులను ఎదుర్కోనేందుకు 19వ శతాబ్ధపు చివరి భాగంలో హైద్రాబాద్ తన అభివృద్ధి పంథాను మార్చుకుంది. దానికి ప్రధానమైన కారణం 1853లో ముఖ్తారుల్ ముల్క్ సర్ సాలార్‌జంగ్ బహదూర్ ప్రధానమంత్రి (దివాన్) గా నియమించబడడం. నాటి నుంచి 1883 వరకు నిజాం రాజుల వద్ద సాలార్‌జంగ్ దివాన్‌గ అనేక సంస్కరణలు చేపట్టిండు. హైద్రాబాద్ రాష్ట్ర అభివృద్ధికి ఆయన ఎనలేని సేవలు చేసిండు. మొత్తం రాజ్యాన్ని ఏడు డివిజన్‌లుగ విభజించిండు. ఉర్దూ రాజ్యభాషగా ఉన్నప్పటికి 1855లో దార్-ఉల్- ఉలూమ్ వంటి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలను ఏర్పాటు చేసిండు. 1862 నాటికే జిల్లాకో తపాలా కార్యాలయాన్ని ఏర్పాటు చేసిండు. రాజ్యాన్ని సుభాలుగా, జిల్లాలుగా విభజించి అప్పటివరకు ఉన్న దేశ్‌ముఖ్‌లను తొలగించిండు. రెవెన్యూ విధానంలో అనేక మార్పులు చేసిండు. 1864లో శిస్తు వసూలు చేయడం కోసం రెవెన్యూబోర్డును ఏర్పాటు చేసిండు. రైతుల నుంచి నేరుగ జిల్లా అధికారులే పన్నులు వసూలు చేసే విధంగ చర్యలు తీసుకుండు. జిల్లాకొక మొహత్‌మీమ్ (సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్) ను ఏర్పాటు చేసిండు. న్యాయ సంస్కరణల్లో భాగంగ సివిల్, క్రిమినల్ కేసులను వేర్వేరుగ పరిశీలించుటకు గాను సుప్రీంకోర్టును, హైకోర్టును, జిల్లాకోర్టులను ఏర్పాటు చేసిండు. విద్యా, వైద్యం, జైళ్ళు దేనికదే వేరువేరుగా జిల్లాకో అధికారిని నియమించి నిర్వహణలో అనేక పద్ధతులను అవలంభించిండు. 1867 నాటికి అటవీశాఖను ఏర్పాటు చేసి విద్యా సంస్థలను నెలకొల్పిండు. రవాణా సౌకర్యాలు మెరుగు పర్చి రైలు, రోడ్డు మార్గాలను అభివృద్ధి చేసిండు. హైద్రాబాద్ నుంచి వాడి వరకు, మద్రాస్ నుంచి షోలాపూర్ వరకు, అదేవిధంగ మద్రాస్ నుంచి బొంబాయికి ముఖ్యమైన రైలు మార్గాలను వేయించిండు. 1870లోనే సిటి కాలేజ్, దక్కన్ ఇంజనీరింగ్ కాలేజ్ ఇంకా అనేక ఇతర మదర్‌సాలను స్థాపించిండు.

**అఫ్జల్ ఉద్దౌలా (1857-1869):** నాసిరుద్దౌలా చనిపోవడంతో ఆయన పెద్దకొడుకు అఫ్జల్ ఉద్దౌలా రాజ్య సింహాసనాన్ని అధిష్ఠించిండు. 1857 నుంచి 1869 వరకు అఫ్జలుద్దౌలా పరిపాలించిండు. ఇతని కాలంలోనే 1857 సిపాయిల తిరుగుబాటు చెలరేగింది. ఆ సమయంలో ఇతడు ఆంగ్లేయులకు సహకరించిండు. క్రమంగ బ్రిటీష్ వలస పాలనలో భూస్వాములు వాళ్ళ స్వంత భూములలో రైతులతో బలవంతంగ పనులు చేయించుకోవడం మొదలు పెట్టింద్రు. ఎవరైన ఎదురు తిరిగితే కఠినంగ

శిక్షించేవాళ్ళు. ఆంగ్లేయుల వ్యవహారాలకు వ్యతిరేకంగ మొదలైన సిపాయిల తిరుగుబాటు నిజాం రాజ్యంలో కూడ చెలరేగింది. అల్లా ఉద్దీన్ మౌల్వి, తుర్రెబాజ్‌ఖాన్ లాంటి వాళ్ళు ఈ వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించిండ్రు. కోఠి లోని బ్రిటీష్ రెసిడెంట్ మీద దాడికి ప్రయత్నం చేసిండ్రు. అరాచకాలకు పాల్పడుతున్నరన్న నెపంతో అల్లా ఉద్దీన్ మౌల్వి మరికొందరు నాయకులను అండమాన్ దీవులకు పంపిండు. 1859లో జరిగిన ఈ ఆందోళనలో తుర్రెబాజ్‌ఖాన్ పోలీసు కాల్పుల్లో చనిపోయిండు. నిజాం సర్కారు ఎందరినో జైళ్ళలో నిర్భందించింది. దీంతో ఆంగ్లేయులు అఫ్జల్ ఉద్దౌలాను 'స్టార్ ఆఫ్ ఇండియా' బిరుదుతో సత్కరించి పొగడ్తలతో ముంచెత్తిండ్రు. అప్పు పత్రాలు రద్దు చేసిండ్రు. కొన్ని ప్రాంతాలు తిరిగి నిజాంకు ఇచ్చేసిండ్రు. అసఫ్‌జాహీలు మొగలుల పాలనను అనుసరించి నాణాలు ముద్రించే విధానాన్ని తీసుకొచ్చిండు. 1858 నుంచి హాలిసిక్కా పేరుతో స్వంతంగ నాణేలు తయారు చేయడం ప్రారంభించిండ్రు. ఈ దశలో అంటే నిజాం పాలకుల వరుస క్రమంలో భాగంగ ఆరవ నిజాం అయిన మీర్ మహబూబ్ అలీ పాషా సింహాసనాన్ని అధిష్ఠించిండు.

**మీర్ మహబూబ్ అలీ పాషా(1869-1911):** మహబూబ్ అలీఖాన్1869 నుంచి 1911 వరకు పాలించిండు. ఈయన ఆరవ అసఫ్‌జాహీగ పరిపాలన కొనసాగించిండు. ఇతని కాలంలో కూడా కొన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఈయన కాలంలో సాలార్జంగ్ కొంతకాలం, కిషన్ పర్‌షాద్ కొంతకాలం దివాన్‌లుగ పనిచేసిండ్రు. అందులో ముఖ్యంగ అసిఫియా గ్రంధాలయం, విక్టోరియా స్మారక అనాథ పాఠశాల, మహబూబియా బాలికల పాఠశాలను ఈయన కాలంలోనే నిర్మించడం జరిగింది. భూములను రైతులకు కౌలుకిచ్చి వాణిజ్య పంటల సాగును తీసుకొచ్చిండు. వేతనాలు తగ్గించి సుంకాలు పెంచి ఆదాయాన్ని క్రమబద్దీకరించిండు. హాలిసిక్కా విలువను బ్రిటీషు రూపాయి కంటే 15శాతం పెంచిండు. మంత్రులను ఆయా శాఖల (న్యాయ, భూమ్యాదాయ, రక్షణ) కు విడివిడిగా నియమించిండు. జిల్లాలో సివిల్ క్రిమినల్ కోర్టులతో పాటు హైద్రాబాద్ ఉన్నత న్యాయస్థానాన్ని ఏర్పాటు చేసిండు. వాడి-సికింద్రాబాద్‌ల మధ్య రైలు మార్గాన్ని 1874లో పూర్తి చేసిండ్రు. సికింద్రాబాద్ విజయవాడ మధ్య రైలు మార్గాన్ని 1886నాటికి పూర్తి చేసిండ్రు. అనేక సంస్కరణలు చేపట్టిన నిజాం రాజ్యాభివృద్ధి ప్రధాత సాలార్జంగ్ 1883లో చనిపోయిండు. మూడు సంవత్సరాల బాలుడిగ సింహాసనం అధిష్ఠించిన మీర్

మహబూబ్ అలీఖాన్‌కు సాలార్జంగ్ చనిపోయే నాటికి కేవలం 15 సంవత్సరాలు మాత్రమే. ఈ పరిస్థితుల్లో సాలార్జంగ్ కొడుకు మీర్ లాయఖ్‌ని, రాజ నరేంద్రుని సంయుక్త పాలకులుగా నియమించిండ్రు. 1884 ఫిబ్రవరి 5న రాజు మేజర్ అయ్యిండు. ఆనాటి నుంచి ఖాళీగా ఉన్న దివాన్ పదవిలో మీర్ లాయఖ్‌ని నియమించిండు. అప్పటి వరకు అధికార భాషగా ఉన్న పర్షియన్ స్థానంలో ఉర్దూ భాషను ప్రవేశపెట్టిండు. 1901లో దివాన్‌గ నియమించబడిన కిషన్ పర్‌షాద్ నిజాం రాజ్యాన్ని నాలుగు సుభాలుగ పునర్విభజించిండు.

**వరంగల్ సుభా:** (వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామబాద్)

**మెదక్ సుభా:** (మెదక్, భాగాత్, మహబూబ్‌నగర్, నల్లగొండ)

**గుల్బర్గా సుభా**

**ఔరంగాబాద్ సుభా**

మరొక ప్రధానమైన విషయం ఏందంటే మీర్ మహబూబ్ అలీఖాన్ 1908లో మూసినదికి వరదలు వచ్చినప్పుడు హైద్రాబాద్ ప్రజలకు అండగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తి. వరద బాధిత ప్రాంతాలను సందర్శించి సహాయ కార్యక్రమాలను ముమ్మరం చేసిండు. భగవంతునికి ప్రార్థనలు చేయడంతో పాటు బాధితులకు ఆశ్రయం కల్పించడంలో ఎక్కడలేని ఔదార్యాన్ని కనబర్చిండు. ఇక్కడ మరొక విషయాన్ని మనం చర్చించవలసిన అవసరం ఉన్నది.

1892లో స్థాపించబడిన హైద్రాబాద్ ఆర్యసమాజ్ శాఖ గణేశ్ ఉత్సవాలను, వ్యాయామ శాలలను ప్రారంభించింది. రాజ్యభాష ఉర్దూ అయినప్పటికి తెలుగు భాషకు వచ్చిన చిక్కేమి లేదు. కాని ఆనాటి ఆంధ్ర మేధావులు తెలుగుకు ఆదరణ కరువయ్యిందని, అవమానించబడుతుందని చేసిన ఆరాటం అంతా ఇంతా కాదు. దీంతో సహజంగానే లోతుపాతులు తెలువని తెలంగాణ మేధావులు వాళ్ళు చెప్పినట్టల్లా ఆడిండ్రు. చేసిన ప్రతి ఉద్యమానికి సైయన్నరు. వాస్తవానికి కొన్ని ముఖ్య నగరాలలో తప్పితే మిగతా తెలంగాణ ప్రాంతమంత స్వచ్ఛమైన తెలుగునే మాట్లాడిండ్రు. ఇప్పటికీ తెలుగును బతికిస్తున్నది, తెలుగు భాష పట్ల అపార గౌరవాన్ని కలిగి ఉన్నది తెలంగాణ మాత్రమే. భాషా వ్యవహారం ఈ విధంగ ఉంటే భూముల మీద జాగీర్దారులు, దేశముఖ్‌లు, మఖ్తేదార్‌ల ఆదిపత్యం పెరిగింది. రైతులు, వృత్తికులాల వాళ్ళు, వెట్టి చాకిరికి గురైన వర్గాల్లో ఒక రకమైన అసంతృప్తి పెరిగి ప్రభుత్వ వ్యతిరేఖ భావన నెలకొని ఉంది. ఇలాంటి అనేక కారణాల రిత్యా తెలంగాణలో సామాజిక, సాంస్కృతిక,

రాజకీయ ఉద్యమాలు మొదలైనయి. అందులో భాగంగ 1901లో వచ్చిన గ్రంధాలయోధ్యమం ద్వార విస్తృతమైన భావజాల వ్యాప్తి జరిగింది. మహబూబ్ అలీఖాన్ 1911 ఆగస్టు 29న అకాల మరణం చెందిండు. దీంతో తన కొడుకైన మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1911 సెప్టెంబర్ 12న ఏడవ నిజాంగ పరిపాలనకు వచ్చిండు.

**మీర్ ఉస్మాన్ అలీఖాన్ (1911–1948):** ఉస్మాన్ అలీఖాన్ పూర్తిపేరు నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్. ఈయన 1886 ఏప్రిల్ 6న జన్మించిండు. తల్లిపేరు అంతుజ్ జహరాబేగం. హైద్రాబాద్ రాష్ట్రం అనేక సంఘర్షణలకు లోనై ప్రజల్లో భావావేశం కట్టలు తెంచుకుంటున్న సమయంలో ఉస్మాన్ అలీఖాన్ సింహాసనాన్ని అదిష్ఠించిండు. 1917 నవంబర్ 17న మంత్రి మండలిని ఏర్పాటు చేసిండు. అసఫ్‌జాహీలలో చివరిపాలకుడైన మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1911నుంచి 1948వరకు పరిపాలించిండు. అనేక ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేపట్టిండు. 1919లో ముల్కీ నిబంధనలు తీసుకొచ్చి స్థానికులకే ఉద్యోగాలు వచ్చే విధంగ చర్యలు తీసుకుండు. ఉస్మాన్ అలీఖాన్ చేసిన కృషి ఫలితంగ అనేక పరిశ్రమలు స్థాపించబడి హైద్రాబాద్ అన్ని రంగాలలో అభివృద్ది చెందింది. ప్రధానంగ గ్లాసు, కాగితం, అగ్గిపెట్టెలు, గుండీల వంటి పరిశ్రమలు స్థాపించబడినయి. ఉస్మాన్‌సాగర్, నిజాంసాగర్, హిమాయత్‌సాగర్ వంటి చెరువులను నిర్మించి నీటిపారుదల సౌకర్యాలు కల్పించబడినయి. ఉస్మాన్ అలీఖాన్ కాలంలోనే విద్య, వైద్యానికి ఎనలేని ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. 1919లో ఉర్దూ బోధనభాషగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏర్పడింది. 1927లో రాష్ట్రంలో ప్రాథమిక విద్య ఉచిత విద్యగా చేయబడింది. 1934లో హైద్రాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ స్థాపించబడింది. 1936లో సెకండరీ విద్యాబోర్డు, 1942లో హైద్రాబాద్ స్టేట్ బ్యాంకు వంటి ప్రజాసంక్షేమ కార్యక్రమాలతో పాటు,1944లో సింగరేణి బొగ్గుగనులు ప్రభుత్వపరం చేయడం లాంటి సంస్కరణలు ఉస్మాన్ అలీఖాన్‌ని గొప్ప పరిపాలనా దక్షకుడిగా, హైద్రాబాద్ అభివృద్ధి ప్రదాతగ అభివర్ణించడానికి ఆస్కారం కల్పిస్తాయి. అయితే ఇదే సమయంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో కమ్యునిస్టులు, రజాకార్లకు నడుమ చెలరేగిన ఘర్షణలు నిజాం ప్రతిష్టని కొంతవరకు దెబ్బతీసిన మాట వాస్తవం. అయితే చరిత్రను వాస్తవకోణంలో పరిశీలించినప్పుడు నిజాం నిజమైన రాజుగానే కనిపిస్తడు.

# ప్రపంచ చరిత్రలో
# వివిధ తిరుగుబాట్లు - పోరాటాలు

**అమెరికా స్వాతంత్ర్య పోరాటం:** ఉత్తర అమెరికా అట్లాంటిక్ సముద్రతీరంలో పదమూడు ఇంగ్లీష్ కాలనీలు ఏర్పడ్డయ్. అమెరికాలోని ఈ పదమూడు వలస రాజ్యాలు దాదాపు 150సంవత్సరాలు తన మాతృదేశమైన ఇంగ్లండ్ పరిపాలనలో ఉన్నయి. వలసరాజ్యాలు తమ అనుమతి లేనిదే ప్రత్యక్ష పన్నులు విధించటం, శాసనాలు అమలుచేయడం వంటి చర్యలు చేపట్టవద్దని ఎన్నోసార్లు విన్నవించినా వాళ్ళమొరను ఆలకించిన పాపాన పోలేదు. పైగా వలసరాజ్యాల ప్రజల మీద అనేక ఆంక్షలు విధించడం జరిగింది. 1764 స్టాంపుల చట్టాన్ని, ప్రజలు పెద్దఎత్తున తిరస్కరించడం వల్ల బ్రిటీష్ ప్రభుత్వం 1766లో డిక్లరేటరీ చట్టం రూపొందించింది. దీనివల్ల 'మాతృదేశానికి వలసలపై ఎప్పుడైనా పన్ను విధించే హక్కు ఉందని స్పష్టం చేసింది. ఇంగ్లండు నుంచి వలసలకు దిగుమతి అయ్యే గాజుసామాన్లు, సీసం, రంగులు, కాగితాలు, టీ వంటి సరుకుల మీద కొత్త పన్నులు విధించింది. పన్ను నిరాకరించిన వాళ్ళను కఠినంగ శిక్షించాలని ఆదేశాలు జారిచేసింది. ఈ విధమైన డిక్లరేటరీ చట్టాన్ని వలసప్రజలు తీవ్రంగ వ్యతిరేకించింద్రు. జార్జి వాషింగ్టన్ నాయకత్వంలో వలస సైన్యాలు బ్రిటీష్ సైన్యాలకు ధీటుగ తిరుగుబాటు చేసింద్రు. చివరికి ప్రపంచ వ్యాప్తంగ అనేక యుద్ధాలతో అలసిపోయిన ఇంగ్లండు 1783లో అమెరికా వలస రాజ్యాలతో పారిస్ సంధి కుదుర్చుకుంది. తప్పనిసరి పరిస్థితుల్లో అమెరికా వలసరాజ్యాల స్వాతంత్ర్యాన్ని బ్రిటన్ అంగీకరించింది.

**1789 ఫ్రెంచి విప్లవం:** 1610లో నాల్గవ హెన్రీతో అధికారాన్ని చేజిక్కుంచుకున్న బూర్బన్ వంశరాజులు అత్యంత నిరంకుశులు. ప్రజాభిప్రాయానికి ప్రతిబింబంగ ఉండవలసిన ఎస్టేట్స్ జనరల్ (పార్లమెంట్) ని 1614 నుంచి దాదాపుగ 175 సంవత్సరాల వరకు ఏవిధమైన సమావేశాలు నిర్వహించలేదు. దీనివల్ల ప్రజల్లో తీవ్ర అసహనం నెలకొని ఉన్నది. ప్రజల్లోని అశాంతిని, అసంతృప్తిని రాజులు ఏనాడు గుర్తించిన సంధర్భం లేదు. రాజు, ప్రభువు, పూజారి వర్గాలు వర్సయిల్స్ రాజప్రసాదమే సమస్త ప్రపంచమని భావించి ఏనాడు దానిని వీడి బయటకు రాలేదు. ఇలాంటి అసమర్థ పాలన వలన గూడు కట్టిన ప్రమాదం16వ లూయి కాలంలో మహావిప్లవాన్ని సృష్టించింది.

"ఇది ఉల్క వలె హఠాత్తుగ సంభవించిన విప్లవం కాదు" -లార్డ్ ఆక్టన్.

ఫ్రెంచి సమాజం రెండు వర్గాలుగ చీలిపోయి ఉండేది. మతాచార్యులు, భూస్వాములు ఉన్నతవర్గంగాను, మిగిలిన ప్రజలు సామాన్య వర్గంగాను ఉండేవాళ్ళు. క్రైస్తవ మతాచార్యులైన బిషప్పులు, ఆర్చిబిషప్పులది ప్రథమస్థానం. వ్యవసాయ భూమిలో చాలామటుకు వీళ్ళ ఆధీనంలో ఉండడం వల్ల వీరు ఫ్రాన్స్‌లో అత్యంత ధనికులయ్యిండ్రు. రెండవ స్థానం భూస్వాములది. మతాచార్యుల మాదిరిగానే వీరికి అనేక హక్కులు, అవకాశాలు ఉండేయి. ప్రజల్లో తొంబైశాతం సామాన్య జీవనం సాగించే, కర్షకులు, వర్తకులు, ఉద్యోగులు మధ్యతరగతి వర్గంగాను, మిగిలిన వాళ్ళు సేద్య బానిసలుగాను ఉండేవాళ్ళు. పన్నుల భారమంత వీళ్ళే భరించవలసి ఉండేది. కర్షకులు భూస్వాములకు వెట్టిచాకిరి, నిర్బంధ సేవలతో పాటు అనేక విధాల నజరానలు చెల్లించవలసి ఉండేది.

"రాజులు యుద్ధాలు చేస్తే, మతాధికారులు ప్రార్థనలు చేస్తే, ప్రజలు పన్నులు చెల్లించాలి" అనే మధ్యయుగ నానుడి నేటికి అనేక రూపాలలో రాజ్యమేలుతుందంటే అతియోక్తి కాదు.

శ్రామికులు, వర్తకులు, ఉపాధ్యాయులు, వకీళ్ళు, రచయితలు, ప్రచురణ కర్తలు, ఇతర వృత్తిదారులను కలిసి బూర్జువ వర్గంగ పిలిచేవాళ్ళు. విద్యావంతులు, శక్తి సామర్థ్యాలున్నవాళ్ళు, ధనికులు సైతం ప్రభుత్వానికి పన్నులు చెల్లించేవాళ్ళు. ఈ విధంగా ఫ్రాన్స్‌లో కొనసాగుతున్న నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగ డాంటన్, రామిన్‌పయర్ వంటి నాయకులు ఫ్రెంచి విప్లవాన్ని నడిపించిండ్రు.

1789 జూన్ 17న తీవ్రవాదులైన మిరాబు, మారట్, డాంటన్, రామిన్‌స్పియర్‌ల నాయకత్వంలో తమకు తామే మూడవ ఎస్టేట్‌ను జాతియసభగా ప్రకటించిండ్రు. జూన్ 20న జాతియసభ తొలి సమావేశానికి హాజరైన మూడవ ఎస్టేట్ సభ్యులను లూయి తిరస్కరించిండు. భవనంలోకి రాకుండ సైనికులను కాపలా ఉంచిండు. ఇది గమనించిన సభ్యులు టెన్నిస్ కోర్టులో సమావేశమై బిగించిన కుడిచేతిని పైకెత్తిండ్రు.

"దేశానికి రాజ్యాంగ చట్టం ఏర్పరిచే వరకు విడిపోం-అందుకు ఎప్పుడు అవసరమైతే అప్పుడు సమావేశం కాగలం" అని శపథం చేసిండ్రు. ఇదే చరిత్రలో టెన్నిస్‌కోర్టు శపథంగ ప్రసిద్ధి చెందింది.

భూర్భన్ రాజుల నిరంకుశత్వానికి చిహ్నమైన బాస్టిల్ కోటపై దాడిచేసింద్రు. జులై 14న బాస్టిల్ కోటను బద్దలుకొట్టి ఏండ్ల తరబడి కోటలో నిర్బంధించిన వాళ్ళను విడిపించింద్రు. బాస్టిల్ పతనం విప్లవచరిత్రలో ఒక ప్రధానమైన ఘట్టంగ అభివర్ణించబడింది. నాటినుంచి జులై 14ని ఫ్రాన్స్ జాతియదినంగ, ప్రపంచ చరిత్రలో విప్లవదినంగ పరిగణిస్తుంద్రు.

పారిస్‌లో ఆకలిగొన్న స్త్రీలు గుంపులు గుంపులుగ కర్రలు ఇతర ఆయుధాలు చేతపట్టి "రొట్టె కావాలె " అనే నినాదంతో వర్సెల్స్ రాజప్రసాదాన్ని అక్టోబర్5న చుట్టుముట్టింద్రు. 16వలూయిని, అతని భార్య అంతువానెత్‌ని, కొడుకుని పారీస్ నగర వీధుల గుండ ఊరేగింపుగ తీసుకొచ్చింద్రు.

**భారతదేశంలో సిపాయిల తిరుగుబాటు:** భారతదేశాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని పాలిస్తున్న ఈస్టిండియా కంపెనీకి చెందిన బ్రిటీష్ అధికారులు జాత్యహంకారంతో సిపాయిలను చిన్నచూపు చూసింద్రు. అరకొర సౌకర్యాలు కల్పించడంతో పాటు సైన్యంలో ఎంత నైపుణ్యాన్ని ప్రదర్శించినా సుబేదార్‌కు మించిన హోదా లభించేది కాదు. పైగా ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వం 1856లో ఎన్‌ఫీల్డ్ తుపాకులను ప్రవేశపెట్టింది. ఆ తుపాకులను పేల్చడానికి కొత్తరకం తూటాలు తయారు చేసింది. ఈ తూటాలను సైనికులు నోటితో కొరికి ఉపయోగించవలసి వచ్చేది.

ఆ తూటాలు ఆవుకొవ్వు, పందికొవ్వు పైపూతగా తయారైనయన్న వార్త గుప్పుమనడంతో సైనికుల్లో ఆవేశం కట్టలు తెంచుకుంది.

గోరఖ్‌పూర్‌లో మంగళ్‌పాండే అనే సైనికుడు ఆ తూటాలను ఉపయోగించికుండ నిరసన తెలిపిండు. అది క్రమంగ 1857 సిపాయిల తిరుగుబాటుకు దారితీసింది. దేశ చరిత్రలో ప్రథమ స్వాతంత్ర సంగ్రామంగ చెప్పుకునే ఈ సంఘటన భారతీయ సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేసింది.

**మొదటి ప్రపంచ యుద్ధం:** ఐరోపాలో బాల్కన్ యుద్దాలు సమసిపోవడం వల్ల ప్రజలు పెను యుద్ధ ప్రమాదం తప్పిపోయిందని సంబరపడ్డరు. కాని సెర్భియా, ఆస్ట్రియాల మధ్య ద్వేషం నానాటికి పెరిగిపోయింది. ఆస్ట్రియాకు జర్మని అండగా నిలిచింది. సెర్భియాకు రష్యా మద్దతునిచ్చింది. ఆస్ట్రియా, సెర్భియాల మధ్య స్పర్థలు పెరిగిపోయినయి. 1914 జూన్ 28న ఆస్ట్రియా యువరాజు ఫ్రాన్సిస్ ఫెర్డినాండ్ సతీసమేతంగ బోస్నియా రాజధానియైన సెరాజివో నగరవీధుల్లో సంచరించిండు. ఆ సమయంలో 'నరోనా ఒబ్రవా' అనే అఖిల సెర్భియా సంఘంలో సభ్యుడైన 'గరిలో

ప్రిన్సిప్ అనే యువకుడు ఆ యువజంటను దారుణంగ కాల్చి చంపిండు. ఈ వార్త ప్రపంచం నడినెత్తిన పిడుగుపడ్డట్టయ్యింది. 1914 జులై 23వ తేదీన ఆస్ట్రియా–హంగరి ప్రభుత్వం పది అంశాలతో కూడిన తుది హెచ్చరికను సెర్బియాకు పంపింది. 48 గంటల్లో సమాధానం ఇయ్యాలని ఆదేశించింది. నిర్ణీత కాలానికి రెండు నిమిషాల ముందుగ జూలై 25న సెర్బియా తన సమాధానాన్ని పంపింది. సెర్బియా సమాధానం సంతృప్తికరంగ లేదని, 1914 జూలై 28న ఆస్ట్రియా సెర్బియాపై యుద్ధాన్ని ప్రకటించింది. ఊహించని విధంగ జర్మని, ఫ్రాన్స్, బ్రిటన్, రష్యా వంటి పెద్ద దేశాలు యుద్ధంలో పాల్గొనడం వల్ల అంతులేని నష్టం సంభవించింది. ప్రశాంతంగ సాగిపోతున్న మానవ జీవనంలో మారణహోమానికి దారితీసిన ఈ రోజు ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగ నిలిచిపోయింది. ఐరోపాలో ఏర్పడిన అనేక రహస్యకూటముల ఫలితంగ మొదలైన ఈ యుద్ధం 1918 వరకు దాదాపు నాలుగున్నర సంవత్సరాలు జరిగింది. ప్రపంచ మానవజాతిని భయభ్రాంతులకు గురిచేసింది.

**రష్యా విప్లవం:** 19వ శతాబ్ధంలో రష్యా ఆర్థిక వ్యవస్థలో భూస్వామ్య పద్ధతి పాతుకపోయింది. రష్యాలో భూస్వాములు, సేద్యబానిసలు అనే భిన్నమైన వర్గాలు ఏర్పడ్డయి. భూస్వాముల ఆధీనంలో ఉండే ఎస్టేట్లలో సేద్యబానిసలు పనిచేసేవాళ్ళు. శతాబ్ధి చివరి నాటికి రష్యా రోమనోవ్ వంశ రాజుల పాలనలో శక్తివంతమైన రాజ్యంగ రూపొందింది. రష్యా రాజుల విదేశాంగ విధానం వల్ల ఆసియా, ఐరోపాల్లో అధిక భూభాగాన్ని జయించి కైవసం చేసుకుండ్రు. దీనివల్ల ఫిన్‌లు, యూదులు, రుమేనియన్‌లు, పోల్‌లు లిథువేనియన్‌ల వంటి రష్యనేతర జాతులు అధికంగ జార్ చక్రవర్తుల పాలనకిందికి వచ్చినయి.

రష్యన్‌లు స్లావ్ జాతికి చెందినవారు కావడం వలన రష్యా ప్రభుత్వం స్లావ్ భాషను, సంస్కృతిని రష్యనేతర జాతులు అవలంభించవలసిందిగ ఆజ్ఞాపించింది. ఈ పద్ధతినే రష్యన్‌లు రూసీకరణ అన్నరు.

రష్యాలో 1890 తర్వాతనే పారిశ్రామికాభివృద్ధి మొదలైంది.

రష్యాలో పెట్టుబడిదారులు లాభాలే ధ్యేయంగ స్త్రీలు, పిల్లల చేత నిర్బంధంగ పని చేయించి శ్రమదోపిడి చేసిండ్రు. రష్యాలో కరుడుగట్టిన జార్ చక్రవర్తుల నిరంకుశత్వాన్ని మధ్యతరగతి మేధావులు, విద్యావంతులు తమ రచనలు, సాహిత్యం ద్వార ప్రజల్ని చైతన్యం చేసిండ్రు. టాల్‌స్టాయ్, గోర్కి, టర్గినోవ్, చెకోవ్ వంటి విజ్ఞులు ఎందరో ఈ కృషి చేసిండ్రు. గోర్కి అమ్మ నవల శ్రమజీవుల కడగండ్లను కళ్ళకు

కట్టినట్టు చూపించింది. కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ సామ్యవాదానికి ఒక నిర్దిష్టమైన రూపాన్నిచ్చి ఒక ఉద్యమంగ ముందుకు తీసుకొచ్చింద్రు.

రష్యన్ చక్రవర్తి రెండవ నికోలస్ పాలనాకాలంలో కారల్‌మార్క్స్ సిద్ధాంతాల ప్రాతిపదిక మీద "సాంఘిక విప్లవ పార్టీ" ఆవిర్భవించింది. ఈ పార్టీ లెనిన్ నాయకత్వంలో బలపడింది. 1903లో ఈ "సాంఘిక విప్లవపార్టీ" మెన్షవిక్ (మితవాదులు) బోల్షవిక్ (అతివాదులు) అనే రెండు శాఖలుగా చీలిపోయింది. ప్లెఖనావ్ మెన్షవిక్‌ల నాయకుడు. లెనిన్ బోల్షవిక్‌ల నాయకుడు.

రష్యా 1905లో అతి చిన్నదేశమైన జపాన్ చేతిలో ఓడిపోయింది. అదేవిధంగ మొదటి ప్రపంచయుద్ధ సమయంలో 1916లో జర్మనీ చేతిలో ఘోరంగ ఓడిపోయి అవమానానికి గురైంది. భయంకరమైన కరువు పరిస్థితుల్లో కూరుకుపోయిన రష్యా అన్ని రకాలుగ చితికిపోయింది. కార్మికులు, కర్షకులు, సైనికులు సైతం విధిలేని స్థితిలో తిరుగుబాటుకు సిద్ధమై ఉన్నరు. 1917 మార్చి నెలలో పెట్రోగ్రాడ్ (గతంలో ఇది సెయింట్ పీటర్స్ బర్గ్) నగరంలో సమ్మె చేస్తున్న కార్మికుల మీద కాల్పులు జరపవలసిందిగ జార్ ఆజ్ఞాపించిన వెంటనే, వారి ఆదేశాలను తిరస్కరించి విప్లవకారులతో చేతులు కలిపింద్రు. అకస్మాత్తుగ సంభవించిన ఈ పరిణామాన్ని ఎవరూ ఊహించలేదు. అంతకు ముందే దేశం నుంచి బహిష్కరించబడిన లెనిన్, ట్రాట్స్కీలు తిరిగి రష్యాకు వచ్చింద్రు. 1917 నవంబర్ 7న కరెన్స్కీ ప్రభుత్వాన్ని కూలదోసి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింద్రు. దీనినే బోల్షవిక్ లేదా కమ్యునిస్టు విప్లవం అని అన్నరు. రష్యాలో లెనిన్ శ్రామిక నియంతృత్వాన్ని నెలకొల్పడంతో పాటు సోవియట్‌లకు స్వయం నిర్ణయాధికారాన్ని ఇచ్చి 1918లో రష్యా రాజ్యాంగాన్ని అమల్లోకి తెచ్చిండు.

**చైనాలో జాతీయోద్యమం:** ప్రాచీన నాగరికతా నగరాల్లో చైనాకు ప్రత్యేక స్థానం ఉన్నది. చైనా నాగరికతను చూసిన విదేశీ యాత్రీకులు చైనాని 'ప్రాశ్చ్య విజ్ఞానకోశమని' వేనోళ్ళ పొగిడింద్రు. చైనా వస్తువులకు యూరప్‌లో మంచి గిరాకి ఉండేది. దీంతో యూరప్ దేశాలకు పోటీ ఏర్పడి అనేక యుద్ధాలకు దారి తీసింది.

దాదాపు 268 సంవత్సరాలు పరిపాలించిన మంచూ రాజవంశం 1911లో పతనమై, దీని స్థానంలో రిపబ్లిక్ ఏర్పడింది. అయితే జపాన్ సామ్రాజ్యవాద విధానంతో "యుద్ధప్రభువులు" దేశంలో అరాచకాన్ని సృష్టించింద్రు. చైనా ఐక్యతే ఆశయంగ విప్లవ నాయకుడు సన్‌యట్‌సేన్ అనేక ప్రయత్నాలు చేసిండు. కాని అనుకోకుండ

1925లో సన్‌యట్‌సేన్ మరణించిండు. 1917లో రష్యా విప్లవం విజయం సాధించిన తర్వాత ఈ ప్రయత్నం మరింత ముమ్మరంగ జరిగింది. రష్యా విప్లవ ఫలితంగ కమ్యూనిస్టు భావాలు చైనాలో మొదలై 1930 నాటికి మావో నాయకత్వంలో బలపడ్డయి. సిద్దాంత రిత్యా అనేక భేధాలున్న కొమింగ్‌టంగ్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నది. జపాన్ సామ్రాజ్య వాదాన్ని ఎదుర్కోవడానికి రెండు కలిసినప్పటికి ఎక్కువ కాలం దోస్తి నిలబడలేదు. ఈ లోపు వచ్చిన రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ ఓడిపోవడంతో చైనా నుంచి శాశ్వతంగ విరమించుకుంది. దీంతో అధికారాన్ని చేజిక్కుంచుకోవడం కోసం రెండు పార్టీల మధ్య అంతర్యుద్ధం మొదలైంది. చివరికి 1949లో మావో నాయకత్వంలో విజయం సాధించిన కమ్యూనిస్టులు చైనాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింద్రు.

**రెండవ ప్రపంచ యుద్ధం:** సెప్టెంబర్ 1, 1939న ప్రపంచ చరిత్ర మరిచిపోలేని చేదు జ్ఞాపకం. ఆరోజే రెండవ ప్రపంచ యుద్ధం మొదలయ్యింది. జర్మన్ సేనాని వాల్దర్ వాన్ బ్రాకిట్ష్ ఎలాంటి యుద్ధ ప్రకటన చేయకుండానే తన సైన్యంతో పోలెండ్‌లో ప్రవేశించడం వలన యుద్ధం ఆరంభమైంది. బ్రిటన్‌పై జర్మన్‌ల దాడి 1940 ఆగష్టులో ప్రారంభమైంది. హిట్లర్ కమ్యూనిస్టులను ద్వేషించినంతగ మరెవ్వరిని ద్వేశించలేదు. జర్మన్‌లు రష్యాపై చేసిన దండయాత్రకు 'ఆపరేషన్ బార్బరోసా' అనే పేరు పెట్టింద్రు. ఈ దాడి 1941 జూన్ 22న ప్రారంభమైంది. 1945 నాటికి మిత్ర రాజ్యాలు జపాన్‌పై బాంబుల దాడిని విస్తృతం చేసినయి.

జపాన్ అమెరికా యుద్ధనౌకల మీద దాడి చేయడంతో రజూవెల్ట్ మరణించిండు. ఆ వెంటనే అమెరికా అధ్యక్షుడైన లార్డ్ ట్రూమన్ అణుబాంబుల దాడికి ఆదేశాలు జారీ చేసిండు. 1945 ఆగష్టు 6న హిరోషిమా, ఆగస్టు 9న నాగసాకి ప్రాంతాల మీద అణుబాంబులు వేయడంతో లెక్కలేనంత ప్రాణనష్టం జరిగింది. ఈ విధంగ దాదాపు ఆరు సంవత్సరాల పాటు కొనసాగిన ఈ యుద్ధం సెప్టెంబర్2, 1945లో జపాన్ లొంగి పోవడంతో ప్రపంచ వినాశనానికి కారణమైన రెండవ ప్రపంచ యుద్ధం ముగిసింది. ఈ యుద్ధంతో అప్పటి వరకు అగ్రరాజ్యాలుగ చెలామణి అవుతున్న బ్రిటన్, ఫ్రాన్స్‌ల స్థానంలో అమెరికా, రష్యాలు అగ్రరాజ్యాలుగ అవతరించినయి. ఈ యుద్ధ సమయంలోనే ఆసియా, ఆఫ్రికా ఖండాలలో అనేక దేశాలు పోరాటాలు చేసి స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నయి.

**స్వాతంత్ర్యానంతరం హైద్రాబాద్ సంస్థానం:** సుదీర్ఘ పోరాటాలు, ఉద్యమాల అనంతరం 1947 ఆగష్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. నిజాం సంస్థానం తప్ప దేశంలోని మిగతా సంస్థానాలన్ని భారత యూనియన్‌లో విలీనం చేయబడినయి. హైద్రాబాద్ నిజాం మాత్రం స్వతంత్ర రాజ్యంగ ప్రకటించుకున్నడు. బ్రిటీష్‌వారితో పాటు వారు నియమించిన సర్ మీర్జా ఇస్మాయిల్ కూడ వెళ్ళిపోయినందున కాశీం రజ్వీకి అనుకూలంగ ఉండే లాయఖ్ అలీని నిజాం ప్రధానమంత్రిగ నియమించిండు. అయితే కమ్యునిస్టులు ప్రజా ఉద్యమాలు లేవదీయడంతోపాటు అజ్ఞాతంలో ఉండి గెరిల్లా దాడులు చేయడం వంటి సంఘటనలు చెలరేగడంతో నిజాం కఠినచర్యలకు ఉపక్రమించిండు. ఈ సమయంలోనే అధికారాన్ని ఉపయోగించుకొని కాశీంరజ్వీ ముస్లింలను మత పరంగ రెచ్చగొట్టి అనతి కాలంలోనే తిరుగులేని నాయకుడుగ ఎదిగిండు. ఒక దశలో నిజాం చెప్పినా వినే పరిస్థితి లేదు. దీంతో పరిస్థితి చేయి దాటుతుందని గమనించిన నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పటేల్‌తో ఒప్పందం చేసుకొని భారత యూనియన్‌లో చేరడానికి అంగీకరించిండు. అదే సెప్టెంబర్ 17, 1948. హైద్రాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన రోజు. దీంతో ఇటు కమ్యూనిస్టులు, అటు రజాకార్లు సందిగ్ధస్థితిలో పడిపోయింద్రు.

కేంద్రంలో జాతీయ ప్రభుత్వం ఏర్పడింది. కాశీంరజ్వీ చర్యల వల్ల తెలంగాణలో నిజాం వ్యతిరేకత వెల్లువెత్తింది. స్టేట్ కాంగ్రేసు నిజాంకు వ్యతిరేకంగ ఉద్యమించాలని చేపట్టిన కార్యక్రమం కమ్యునిస్టులు స్వీకరించి ఇది వాళ్ళ స్వంత కార్యక్రమంగ ప్రజల ముందుకు తీసుకపోయింద్రు. సత్యాగ్రహాలతో నిజాంను ఎదిరించలేమని గ్రహించిన కమ్యునిస్టులు గ్రామాలలో జాతీయ జెండాలతో పాటు ఎర్రజెండాలను ఎగరేసి, పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చింద్రు.

పోరాట భూమిలో రక్తసిక్తమైతున్న కమ్యునిస్టు నాయకులకు ఏ సమాచారం అందించకుండ ఆంధ్ర కమ్యునిస్టు నాయకులు పార్టీలో అగ్రనాయకులుగ చెలామణి అయితున్నవాళ్ళు, వాళ్ళ నిర్ణయాన్ని వాళ్ళు తీసుకొని కింది క్యాడర్‌ని అయోమయానికి గురిచేసింద్రు. భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి, దాయం రాజిరెడ్డి, దళాలు ఇంకా భీకరంగ పోరాడుతూనే ఉన్నయి. రజాకార్లు, పటేల్ సైన్యాలను ధీటుగా ఎదుర్కొంటూనే ఉన్నయి. పాలకుర్తి కేంద్రంగ పనిచేసే చకిలం యాదగిరిరావు, నల్ల నరసింహులు కలిసి సూర్యాపేట ప్రాంతం నుంచి వచ్చే సమాచారంతో ఎప్పటికప్పుడు తగిన నిర్ణయాలు

చేసుకుంటూ పోరాటం కొనసాగించింద్రు. పార్టీ బలంగా ఉన్న కడివెండి, ధర్మాపురం, దేవరుప్పల గ్రామాలనుంచి కొంతమంది యువకులను సమీకరించి దళాలను తయారు చేసింద్రు. ప్రజలు భయభ్రాంతులకు గురైతున్న ఈ సంధర్భంలో వాళ్ళు బయటికి వచ్చి పోరాటం చేసే స్థితిలో లేరు. నల్ల నరసింహులు లాంటి నాయకులు కడివెండిలో ఊరేగింపు జరిగితే నిండా పదిమంది కూడా రాకపోవడంతో నాయకులు వెనుదిరిగి వెళ్ళి పోయింద్రు. పార్టీ కార్యకర్తలతో రాత్రివేళ రహస్యంగ మాట్లాడటం తప్ప చేసేదేమి లేకపోయింది.


అయితే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, బ్రిటీష్ పాలకులు తరిమివేయబడ్డారని నిజాం పాలన కూడ ఎంతోకాలం కొనసాగదు కాబట్టి నిజాం ప్రభుత్వాన్ని కూలదోయడానికి ప్రజలు తమ చేతికందిన ఆయుధాలతో భూస్వాముల గూండాలను, నిజాం పోలీసులను ఎదుర్కోవాలని కమ్యునిస్టు నాయకులు ప్రసగించింద్రు. ఇంకా ఎక్కువ సేపు ఉంటే పోలీసులు అరెస్టు చేస్తరని అక్కడినుంచి అడవిలోకి వెళ్ళిపోయింద్రు. ఈ ప్రసంగం ఊరేగింపు అయిపోంగనే పోలీసులు కడివెండికి వచ్చి ప్రజలను బెదిరించింద్రు. కడివెండిలో కోటబురుజు మీద కమ్యునిస్టులు జెండాలు పాతడం,పోలీసులు పీకడం ఈ తంతు జరగినన్ని రోజులు కడివెండిలో సామాన్యజనం పడ్డ బాధలు ఇన్నీఅన్ని కావు. కడివెండిలో కమ్యునిస్టులు పోలీసులకు దొరకకుండ తప్పించుకొని రహస్యంగ తిరుగుతూనే రాజ్యం సాధిస్తమనే తప్పుడు సంకేతాలను ప్రచారం చేసింద్రు.

# నిజాం రాజ్యం - హైద్రాబాద్ సంస్థానం

భారతదేశాన్ని అనేక రాజవంశాలు పాలించినప్పటికి, ఏ ఒక్కరు గూడ మొత్తం దేశాన్ని ఏకంచేసి పాలించిన సందర్భం లేదు. అత్యధికంగ మన దేశాన్ని పాలించింది ఒక్క బ్రిటీష్‌వాళ్ళు మాత్రమే. అయితే దాదాపు ఐదొందలకు పైగా సంస్థానాలున్న భారతదేశంలో హైద్రాబాద్ సంస్థానమే అతి పెద్ద స్వతంత్ర రాజ్యం.

మిగతా సంస్థానాలకు లేని విధంగ హైద్రాబాద్‌కు ప్రత్యేక చట్టాలున్నయ్. హోలిసిక్కా పేరుతో స్వంత నాణేలు చలామణిలో ఉండేయి. రోడ్డు, రైలు మార్గాలు, ప్రత్యేక విమానయాన సంస్థతో పాటు తపాల బిళ్ళలు, పోస్టుకార్డుల వంటి ఎన్నో ప్రత్యేకతలు నిజాం స్వతంత్ర రాజ్యానికి ప్రతీకలుగ నిలబడతాయి.

హైద్రాబాద్‌ను పాలించిన రాజవంశాలలో ప్రధానంగ శాతవాహనులు, ఇక్ష్వాకులు, వాకాటకులు, విష్ణుకుండినులు, బాదామి చాళుక్యులు, రాష్ట్రకూటులు, వేములవాడ చాళుక్యులు, కళ్యాణి చాళుక్యులు, వెన్గొండ వంశీయులు, కందూరు చోడులు, కాకతీయులు, ముసునూరి వంశీయులు, రేచర్ల పద్మనాయకులు, బహమనీ సుల్తానులు, కుతుబ్‌షాహీలు, మొగలు వంశీయులు, అసఫ్‌జా వంశీయులు



హైదరాబాదు రాజ్యం

పాలించింద్రు. నిజాం బిరుదుతో పాలించిన అసఫ్‌జాహీలలో ఆఖరివాడు మీర్ ఉస్మాన్‌అలీఖాన్.

నిజాం రాజ్య భూభాగంలో మూడు భాషా ప్రాంతాలు కలిసి ఉండేయి. తెలంగాణ, మరత్వాడ, కన్నడ ప్రాంతాలు. తెలంగాణ ప్రాంతంలో ఎనిమిది జిల్లాలు ఉండేయి. నల్లగొండ, వరంగల్, కరీంనగర్, నిజాంబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, అత్రాఫ్‌బల్దా. ఈ అత్రాప్‌బల్దా ప్రాంతమే ఆ తర్వాత హైద్రాబాద్, రంగారెడ్డి జిల్లాలుగా ఆవిర్భవించింది. మరత్వాడలో ఔరంగాబాద్, బీడ్, పర్భనీ, నాందేడ్, ఉస్మానాబాద్ అనే ఐదు జిల్లాలు, కన్నడ ప్రాంతంలో గుల్బర్గా, రాయచూర్, బీదర్ అనే మూడు జిల్లాలు ఉండేయి. మొత్తం పదహారు జిల్లాలతో హైద్రాబాద్ సంస్థానం రాజ్యవైభోగాన్ని చాటింది. ఉర్దూ రాజ భాషగ ఒక సుదీర్ఘమైన, పరిపూర్ణమైన రాజరిక పరిపాలన కొనసాగింది. పాలనా సౌకర్యం కోసం పదహారు జిల్లాలను మెదక్, వరంగల్, ఔరంగబాద్, గుల్బర్గా అనే నాలుగు సుభాలుగా విభజించింద్రు. తెలంగాణప్రాంతంలో మెదక్, వరంగల్ అనే రెండు సుభాలు ఉండేయి. మరత్వాడ ప్రాంతం ఔరంగబాద్‌గా, కన్నడ ప్రాంతం గుల్బర్గా సుభాలుగా ఉండేయి. వరంగల్లు సుభాకు వరంగల్లు ముఖ్య స్థానమైతే, మెదక్ సుభాకు హైదరాబాద్ ముఖ్యస్థానంగ ఉండేది. ప్రతి సుభాకు సుభేదార్లను నియమించి వాళ్ళ ద్వార తమ పాలనకు కావలసిన రెవెన్యూను సంపాందించేవాళ్ళు.

మెదక్ సుభాలోని ఐదు జిల్లాలు– మెదక్, అత్రాఫ్‌బల్దా (హైదరాబాద్) నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ. నల్లగొండ జిల్లాలో నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, రామన్నపేట, దేవరకొండ, భువనగిరి, హుజూర్‌నగర్, జనగాం తాలూకాలు ఉండేయి. ఆ తర్వాత కాలంలో జనగాం వరంగల్లు జిల్లాలో కలిసింది.

**నిజాంల పాలనలో భుస్వాముల పెత్తనం:** నిజాం పాలనలోని హైద్రాబాద్ రాష్ట్రంలో జాగీర్దారులు, సంస్థానాధీశులు, ఇనాందారులే కాకుండ ఒక స్థాయి పెత్తందారులు కూడ అనేక మంది ఉండేవాళ్ళు. వాళ్ళ ఆధీనంలో ఉన్న ప్రాంతానికి వాళ్ళే స్వతంత్రులు. అదేవిధంగ వాళ్ళు వసూలు చేసిన శిస్తులో కొంతభాగాన్ని మాత్రమే నిజాంకు చెల్లించేవాళ్ళు. ఇట్ల చెల్లించిన శిస్తునే 'పేష్‌కప్' అంటరు. హైద్రాబాద్ రాష్ట్రంలో 6535 గ్రామాలు ఉండేయి. 1500 జాగీర్లు, 497 గ్రామాలతో కూడిన 14 సంస్థానాలు ఉండేయి. నిజాం స్వంత జాగీరు కింద దాదాపు పధ్నాలుగు వేల గ్రామాలు

ఉండేయి. వీటినే సర్ఫ్–ఎ–ఖాస్" భూములని అంటరు. హైద్రాబాద్ రాజ్యంలో మెదక్, వరంగల్ సుభాలలో ఆరు వందలకు పైగా ఉన్న చిన్న, పెద్ద భూస్వాముల చేతుల్లో లక్షలాది ఎకరాల భూమి ఉండేది.

నల్లగొండ జిల్లా సూర్యాపేట తాలూకాలోని ఎర్రబాడు భూస్వామి జెన్నారెడ్డి ప్రతాపరెడ్డికి లక్షా యాభైవేల ఎకరాల భూమి ఉండేది. నూతనకల్లు ప్రాంతంలో ఉన్న కౌలు రైతులను కాదని వేలాది ఎకరాల్లో మామిడి తోటలను సాగుచేసిన ఘనుడు ప్రతాపరెడ్డి. రైతులను బేదఖళ్ళకు గురిచేసి దుర్భర దారిద్రంలో ముంచిండు. ముందుగాల భూస్వాముల భూములు సాగుచేసిన తర్వాతనే రైతులు వాళ్ళ కౌలు భూములను సాగుచేసుకోవాలె. ప్రతాపరెడ్డి గడీలో జరిగే వేడుకలకు, పెండ్లీలకు వృత్తిదారులందరు వారివారి ఉత్పత్తులను ఉచితంగ తెచ్చి ఇయ్యాలె. కూలికొచ్చిన ఆడవాళ్ళను సైతం అనేక తిప్పలుపెట్టి కనీసం పసిపిల్లలకు పాలియ్యాలంటే కూడ జాలి చూపించెటోడు కాదు జన్నారెడ్డి ప్రతాపరెడ్డి.

జనగామ తాలూకాలోని విసునూరు దేశముఖ్ రాపాక వెంకట రామచంద్రారెడ్డికి నలవై వేల ఎకరాల భూమి ఉండేది. ఈయన గడీముందు వందబిందెల సాంపి బట్టేదంటే ఎంతమంది ఆ గడీలో వెట్టిసాకిరి చేసేదో మనం అర్థం చేసుకోవచ్చు. అదేవిధంగ జనగామ తాలూకాలోని మొండ్రాయి భూస్వామి కడారు నరసింహారావుకు ఇంకా సూర్యాపేట, బేతవోలు, హుజూర్ నగర్ తాలూకా బొక్కమంతలగూడెం భూస్వాముల చేతుల్లో వందల ఎకరాల భూములు ఉండేయి.



**విసునూరు గడీ ప్రహారి గోడ**

వాస్తవానికి ఈ భూస్వాములు వ్యవసాయం చేసేవాళ్లు కాదు. వీళ్ళంత జీతగాళ్ళ మీద ఆధారపడి భూమిని సాగుచేసేటోళ్ళు. జీతగాళ్ళతోని వెట్టిచాకిరి చేయించుకునేటోళ్ళు. ఈ విధంగ జీతగాళ్ళ చెమట ఊటలోంచి పుట్టిన పుట్లకొద్ది ధాన్యాన్ని దేశముఖ్‌లు గరిసెల్లో నింపుకున్నరు. కడవెండిలో జానమ్మ దొరసాని చుట్టూ ఎప్పుడు ఇరవై మంది జీతగాళ్ళు ఊడిగం చేసేటోళ్ళు. రెక్కలు ముక్కలు చేసుకొని కన్నసాకిరి చేస్తే దొరసాని వాళ్ళకిచ్చే జీతం రెండు కుంచాల జొన్నలు మాత్రమే, ఇలాంటి అనేక సందర్భాలలో జరిగిన సంఘటనల పట్ల ఆర్తితో సుద్దాల హన్మంతు రాసిన జీతగాళ్ళపాట ఇప్పటికి ప్రజల హృదయాల్లో నిలిచిపోయింది. జీతగాళ్ళ దుఃఖంలోంచి, వేదనలోంచి పొంగుకొచ్చిందే సుద్దాల హన్మంతు రాసిన పల్లెటూరి పిల్లగాడ అనే పాట. ఆ పాటలోని కొన్ని చరణాలు...

"పల్లెటూరి పిల్లగాడ పసులగాసే మొనగాడ
పాలు మరిసి ఎన్నాళ్ళయ్యిందో ఓ పాలబుగ్గల జీతగాడ
కొలువు కుదిరి ఎన్నాళ్ళయ్యిందో
చాలి చాలని చింపులంగి చల్లగాలికి సగము ఖాళీ
గోనెచింపు కొప్పెర బెట్టావ ఓ పాలబుగ్గల జీతగాడ
దాని చిల్లులెన్నో లెక్కబెట్టావా
తాటి జగ్గల కాళ్ళజోడు తప్పటడుగుల నడకతీరు
బాటతో పని లేకుంటయ్యిందా ఓ పాలబుగ్గల జీతగాడ
చేతికర్రే తోడై పోయిందా
మాయదారి ఆవు దూడలు మాటిమాటికి కంచె దుంకి
పంటచేలూ పాడు చేశాయా ఓ పాలబుగ్గల జీతగాడ
పాలి కాపు నిన్నే కొట్టాడా
నీకు జీతం నెలకు కుంచం తాలు వడిపిలి కల్తిగాసం
కొలువగా సేరు తక్కువ వచ్చిందా ఓ పాలబుగ్గల జీతగాడ
తలుచుకుంటే దుఃఖం వచ్చిందా....."

అంటూ గుండెల్ని పిండే ఒక్కో పదం జీతగాళ్ళ బతుకు చిత్రాన్ని కళ్ళకు కట్టినట్టు చూపించింది. ఇన్ని సంవత్సరాలైన ఆ పాట మతికొస్తే హృదయం ద్రవిస్తది. కన్నీరు కాల్వగడ్తది.

సమాజంలో అధికులమనే అహంభావంతో ఆస్తులు కూడబెట్టడం కోసం జనగామ తాలూకాలో దేశముఖ్‌లు, భూస్వాములు అనేక దౌర్జన్యాలకు తెగబడ్డరు. అక్షర జ్ఞానంలేని, అమాయకులైన బడుగు బలహీనవర్గాలకు చెందిన ప్రజల్ని చిత్రహింసలకు గురిచేసింండ్రు. అధిక వడ్డీలకు అప్పులిచ్చి ఇంటిల్లిపాదిని పొలాల్లో పనిచేయించుకుండ్రు. జీవితాంతం వాళ్ళకు ఊడిగం చేసేవిధంగ అప్పు పత్రాలు సృష్టించి రైతు కూలీలను "బాంచెన్‌దొర నీ కాల్మొక్త" అన్న స్థితికి తీసుకొచ్చింండ్రు. ఎడ్లకు గడ్డెయ్యాలె. బర్ల పాలు బిండాలె. వ్యవసాయ పనులన్ని ఉత్తగనే చెయ్యాలె. కూరగాయలు పండించి ఇయ్యాలె. ఆయా కులవృత్తులోల్లు (గొల్ల కురుమలు గొర్లను ఇయ్యాలె, గౌడ్‌లు కల్లుబొయ్యాలె, బెస్తోల్లు పచ్చాపలు పట్టుకొచ్చి తేటగ కడిగియ్యాలె, మంగలి క్షవరం, చాకలి బట్టలు, వడ్ల కమ్మరులు వ్యవసాయ పనిముట్లు చేసియ్యాలె) తమ ఉత్పత్తులు, సేవలను ఉచితంగనే చేసి పెట్టాలె. భూస్వాములకు ఎంత సేవచేసినా, ఎన్ని లాభాలు తెచ్చిపెట్టినా వృత్తిదారులు మాత్రం కట్టడిగింజలతోనే సరిపెట్టుకోవాలె. రోగమొచ్చినా, నొప్పులు బెట్టినా అలసట లేకుంట పనులు చెయ్యాలె. అయినా కూడ భుస్వాములు పెట్టే బాధలకు ఏ ఒక్కరు ఎదురు తిరిగేవాళ్ళు కాదు. ఒకవేళ భరించలేక ఎవరైన ఎదురితిరిగితే వాళ్ళని నానావిధాల చిత్రహింసలకు గురిచేసేవాళ్ళు. పండుగలు, పబ్బాలు, దావత్‌లు అన్ని భుస్వాములకే తప్ప సామాన్య జనానికి ఏవిధమైన సంతోషం ఉండేది కాదు. కులవృత్తి దారులమీద కూడ అనేక రకాల పన్నులు వేసేవాళ్ళు. దాదాపుగ అన్ని కులాల చేత వెట్టి చేయించుకునే వాళ్ళు. దేశముఖ్‌లు ప్రభుత్వం విధించిన శిస్తుల కన్న ఎక్కువ శిస్తును వసూలు చేసేవాళ్ళు. పన్నుల ద్వార వచ్చిన ఆదాయంలో అధికభాగం భూస్వాములే తమ స్వంతానికి వినియోగించుకునే వాళ్ళు. వాస్తవానికి ఇలాంటి అనేక విషయాలు, భూస్వాముల అరాచకాలు నిజాం ప్రభువుకు తెలిసేయి కావు. వాళ్ళు తెలియనిచ్చేవాళ్ళు కాదు. నిజాం పాలకులు ప్రభుత్వానికి రావలసిన పన్నులను సరిచూసుకునే వాళ్ళు తప్ప భూస్వాములు ప్రజలను ఏ విధంగ పీడిస్తున్నరో ఏనాడు తెలుసుకున్న పాపాన పోలేదు. అది అలుసుగా తీసుకున్న భూస్వాములు మరింత రెచ్చిపోయి ప్రజల్ని హింసించింండ్రు. దీంతో సహనం కోల్పొయిన ప్రజలు, రైతు కూలీలు భూస్వాముల్ని శత్రువులుగ భావించింండ్రు. ఆవేశాన్ని అణిచిపెట్టుకొని బతికింండ్రు. అదునుకోసం ఎదురు చూసింండ్రు.

# నిజాం పాలన - కౌలుదారి విధానం

జాగీర్దారులు భూములపై సర్వహక్కులు కలిగి ఉన్నప్పటికి నిజాం ప్రభుత్వానికి తన రాబడిలో ఒక నిర్ణీత మొత్తాన్ని చెల్లించవలసి ఉండేది. అయితే మఖ్తేదారులు మాత్రం భూముల మీద పరిమిత హక్కులను కలిగి ఉండేవాళ్ళు. వాళ్ళకు వచ్చే రాబడిలో కూడ ప్రభుత్వం నిర్ణయించిన మేరకు శిస్తులు చెల్లించేవాళ్ళు. నిజాం ప్రభుత్వం భూస్వాములకు దేశముఖ్, దేశపాండే అనే బిరుదులను ప్రధానం చేసేది. ఈ ప్రత్యేక గుర్తింపుతోని వీళ్ళే నవాబులైనట్టు ప్రవర్తించింద్రు. అనేక దౌర్జన్యాలకు పాల్పడి ప్రజలను కొల్లగొట్టింద్రు. కౌలురైతుల నించి వందల ఎకరాల భూములు గుంజుకొని స్వంతం చేసుకుంద్రు.

నిజాం ప్రభుత్వం తెలంగాణ ప్రాంతంలో సాగు భూమిని పెంచి రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో బంజరు భూములను సాగులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. అందుకోసం కాంట్రాక్టు పద్ధతిన బంజరు భూములను సేద్యానికి ఇచ్చింది. ఆర్థికంగ బలవంతులైన భూస్వాములు, అప్పటికే రైతులు, కూలీల మీద పెత్తనం చేస్తూ, నిజాం తలపెట్టిన ఈ గొప్ప అవకాశాన్ని పెద్దఎత్తున ఉపయోగించుకున్నరు. వందల ఎకరాల బంజరు భూములను తమ గుప్పిట్లోకి తెచ్చుకున్నరు. ఇట్ల బంజరు భూముల్ని సాగుచేయడానికి ముందుకొచ్చిన వాళ్ళందరిని ఇజారాదారులని పిలిచింద్రు. ఆ ఇజారాదారులందరికి నిజాం ప్రభుత్వం అనేక రాయితీలు కల్పించింది.

నిజాం ప్రభుత్వానికి ఇజారాదారులకు నడుమ రాతపూర్వకమైన ఒప్పందం కూడ జరిగింది. ఆ ఒప్పందం ప్రకారం ఇజారా బంజరుదారు ఖచ్చితంగ చెరువును తవ్వించాలనె నియమం ఉంది. అంతే కాకుండ ఆ చెరువు కింద తరి పొలం సాగు చేయ్యాలనే ఒప్పందం కూడ ఉన్నది. సాధ్యమైనంత మేర మెట్ట పంటలు కూడ సాగు చెయ్యాలె. ఇంకొక ముఖ్యమైన అంశం ఏందంటే తప్పకుండ ఇజార బంజరుదారు ఒక గ్రామాన్ని సైతం కట్టించాలె. ఈ పద్ధతినే ఆబాదీ అన్నరు. ఈ ఆబాది ప్రకారం ఆ గ్రామంలో ఇండ్ల సంఖ్య కనీసం ఐదు నుంచి 30 వరకు ఉండాలనే నియమం కూడ ఉన్నది. అయితే చాల వరకు చెరువు కింద సాగుజేసె తరి 50 నుంచి 100 ఎకరాలు, కుంటల కింద సాగుజేసే భూమి ఐదు నుంచి 30 ఎకరాల వరకు ఉంటుంది. తరితో పాటు దానిని ఆనుకొని ఉండే మెట్టభూమిని ఎట్లాగు సాగుచేయవలసి ఉంటుది. ఈ విధంగ ఇజారా బంజరుదారు శక్తి సామర్థ్యాల మీద, ఆర్థిక స్థోమత మీద ఆధారపడి సాగుభూమి విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉండేయి.

ఇజారబంజరుదారులు ఈ పద్ధతిలో ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం సాధారణంగ 20 నుంచి 30 సంవత్సరాల వరకు అమలులో ఉండేది. గడువు పూర్తి అయిన వెంటనే సాగుచేసిన మొత్తం భూమి రైత్వారీ భూమిల కలిసి పోయేది. దీనిని సర్వే సెటిల్మెంటు చేసి అన్నిటి మాదిరిగానే ఈ భూముల మీద కూడ శిస్తును నిర్ణయించెటోళ్లు. ఇజారాబంజరుదారు ఈ శిస్తును చెల్లించెటోడు. చెరువును వేసి, తరి, మెట్టభూమిని సాగుచేసి, గ్రామాన్ని ఏర్పాటు చేస్తే ఆ రైతుకు కొన్ని రాయితీలు ఇచ్చెటోళ్లు. నాలుగో వొంతు భూమి వరకు శిస్తులేకుండ పట్టా ఇచ్చెటోళ్లు. వీటినే సేరీ భూములని పిలిచేటోళ్లు. అదేవిధంగ తాటి, ఈత చెట్లపై ఆబ్కారీ హక్కులిచ్చెటోళ్లు. ఏ గ్రామంలోనైన మాలీపటేలుకే అధికారాన్ని ఇచ్చెటోళ్లు. నిర్ణీత గడువు పూర్తి అయిన వెంటనే ఇజారాబంజరుదారు ఆ భూమికి పట్టాదారు అయ్యేటోడు. ఏ ఇతర కారణాలవల్లనైనా ఇజారా బంజరుదారు ఒప్పందంలో ఉన్న షరతులను ఉల్లంఘించినట్లయితే, రాయితీలను రద్దు చేసి, సాగుభూమిలో కూడ శిస్తును వసూలు చేసెటోళ్లు. సాధారణంగ చెరువు తెగిపోయినప్పుడో, లేదంటే ఇజారాదారు దివాలా తీసినప్పుడో ఇట్లాంటి పరిస్థితి ఏర్పడేది.

ఇజారదారులు భూమిని సేద్యం చేయడం వల్ల భవిష్యత్తులో ఎంతో కొంత భూమి దక్కుతుందనే ఆశతో భూస్వాములు చెప్పిన ప్రతి పనిని చేసేవాళ్ళు. ఒకవేళ ఆ ఇజారాదారులే దేశముఖులైతే ఇక ఆ గ్రామ ప్రజల బతుకు బండలైనట్టే. రైతులను సేద్య బానిసలుగ చేసుకొని దేశముఖ్‌లు సకల సౌఖ్యాలను అనుభవిస్తు, ఆయా గ్రామాలమీద పెత్తనం చేసుకుంట హాయిగ బతికేది.

ఈ విధంగ ఇజారాబంజర్ల రూపంలో ఆ రోజుల్లో 1,40,000 ఎకరాల భూమి సాగులోకి వచ్చింది. మొత్తం భూమిని 420 గ్రామాలల్ల 10,000 మంది రైతులు సాగు జేసింద్రు. ఎవరు ఎంత కష్టపడి భూమిని సాగు జేసినా చట్టరిత్యా భూస్వాములే ఆ భూములకు యజమానులయ్యేది. దేశముఖ్‌లు, దేశపాండేలు, కొన్నిచోట్ల జాగీర్దారులు, మఖ్తాదారులు ఇజారాదారులయ్యింద్రు. ఆ తర్వాత వాళ్ళే ఆ భూములకు పట్టాదారులయ్యింద్రు. రేయింబవళ్ళు రెక్కలు ముక్కలు జేసుకొని భూమిని సాగు చేసిన రైతులు కౌలుదారులుగానే మిగిలిపోయింద్రు.

ఇట్లాంటి అనేక కారణాల వల్ల భూస్వాములు, కౌలుదారుల నడుమ తగాదాలు మొదలైనయ్. "భూములకు పట్టాలిప్పిస్తమని తీసుకొచ్చి వాళ్ళతోని వెట్టి పనులు చేయించింద్రు. "నిరుపయోగంగ పడి ఉన్న భూములను సేద్య భూములుగ

రూపొందించి చెమట నెత్తుర్లు ధారపోసినమని, అయినా మేము కౌలుదారులుగానే మిగిలిపోయినమనే” భావనతో రైతులు ఆవేదనతోఉన్నరు. ఈ సమస్యల నేపథ్యంలోనే నిజాం ప్రభుత్వం పరిస్థితిని సమీక్షించి ఒక చట్టం చేసింది. 1907లో నిజాం ప్రభుత్వ రెవెన్యూ చట్టాన్ని అనుసరించి ఎవరైతే భూమిని వరుసగ పన్నెండు సంవత్సరాలు తమ స్వాధీనంలో సాగు చేస్తూ ఉంటరో అట్లాంటి రైతులకు ఆ భూమిమీద ఖబ్జాహక్కు ఉంటుందని తగిన ఆదేశాలు జారి చేసింది. అయితే భూస్వాములు ఈ విధమైన రికార్డులు రైతులకు అందకుండ అనేక జాగ్రత్తలు పడ్డరు. ఇజారాదారులే దేశముఖ్‌లు, పటేల్, పట్వారీలు, పలుకుబడి ఉన్నోళ్లు కావడం వలన రైతులు భూమిని సాగుచేస్తున్నట్టు ఎక్కడ రికార్డులు ఉండేయికావు.

ఫలితంగ ఎన్నేండ్లు సేద్యం చేసినా రైతులు కౌలుదారులుగానే మిగిలి పోయింద్రు. వాళ్ళకు చట్ట ప్రకారం భూమి మీద ఏ విధమైన హక్కు లభించేది కాదు.

### విసునూరు దేశముఖ్ – రాపాక వెంకట రామచంద్రారెడ్డి

మెదక్ సుబాలోని నల్లగొండ జిల్లాలో జన్నారెడ్డి వంశానికి చెందిన వారు పెద్ద భూస్వాములు. గోరంట్ల వంశానికి చెందిన వాళ్ళు చిన్న భూస్వాములు. ఆధిపత్యం కోసం వీళ్ళ నడుమ తరచు గొడవలు జరుగుతుండేయి. అయితే ఈ చిన్న భూస్వాములకు కొంతవరకు మధ్యతరగతి ప్రజల తోడ్పాటు ఉండేది.




**నాటి జనగామ తాలూకా**

ఆనాడు జనగామ తాలూకాలో 257 గ్రామాలు ఉండేయి. వీటిలో 17 మాత్రమే జాగీర్ గ్రామాలు. మిగిలిన 240 జమీందారి గ్రామాలు. ఒక్క విసునూరు రామచంద్రారెడ్డికే 60 గ్రామాలు ఉండేయి. ఇవే కాకుండ ఇతర చిన్నపెద్ద దేశముఖ్‌ల మీద కూడ తన ఆధిపత్యాన్ని కొనసాగించేటోడు.

విసునూరు దేశముఖ్ ప్రజలను పీడించి తన ఇష్టానుసారంగ వ్యవహరించేటోడు. ఈయన పూర్తిపేరు రాపాక వెంకట రామచంద్రారెడ్డి. జనం ఈయనని విసునూరు రామచంద్రారెడ్డి అని, విసునూరు దొర అని పిలిచెటోళ్లు. రామచంద్రారెడ్డికి సొంతంగ నలభై వేల ఎకరాల భూమి ఉండేది. ఎంతో మంది జీతగాళ్ళు, రైతుకూలీలు తన వ్యవసాయ క్షేత్రంలో పని చేసేవాళ్ళు. అనుముల రాంరెడ్డి, వనలమాల వెంకయ్య లాంటివాళ్ళు ఎందరో విసునూరు దేశముఖ్ చేతి కింద పనిజేసింద్రు. అనుముల రాంరెడ్డి  విసునూరు రామచంద్రారెడ్డికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు చూసేటోడు. అప్పు పత్రాలు రాసి, వడ్డీ లెక్కలు చూసి దేశముఖ్ దగ్గర మెప్పులు పొందేటోడు. విసునూరు దేశముఖ్ చేతికింద మిష్కిన్ అలీ అనే వ్యక్తి ముఖ్తార్ ఎ ఆమ్-పవర్ ఆఫ్ అటార్నిగ ఉండెటోడు.

రామచంద్రారెడ్డి ప్రత్యక్షపాలన కింద నలభై గ్రామాలు ఉండేయి. దేవరుప్పల, కడివెండి గ్రామాలు, మడిపడిగె, సీతారాంపురం గ్రామాల శివార్లలోని ఊర్లు ఈయన పాలనకిందనే ఉన్నయ్. ఇవే కాకుంట చిన్నచిన్న భూస్వాములు ఉన్న ఊర్లల్ల కూడా ఈయన పెత్తనం సాగింది. జనగామ, మానుకోట, వరంగల్, సూర్యాపేట తాలూకాలల్లో గూడ ఈయన పెత్తనం జేసిన ఊర్లు ఎన్నో ఉన్నయ్. ఆ ఊర్లల్ల కొన్నింటిని రామచంద్రారెడ్డి తమ్ముడు రాపాక ప్రతాపరెడ్డి చూసుకునేటోడు. నల్లగొండ జిల్లాలోని జనగామ తాలూకా విసునూరు గ్రామం కేంద్రంగ ఈయన కార్యకలాపాలు సాగించిండు. విసునూరు చుట్టుపక్కల నలభై ఊర్లు రామచంద్రారెడ్డి అదుపు ఆజ్ఞలతోని కాలం ఎల్లదీసేయి. రామచంద్రారెడ్డి కచ్చడం సప్పుడయ్యిందంటే కాళ్ళు చేతులు బొయ్యి కడుపుల బడేయి. జనాన్ని గజ్జున వణికిచ్చుకుండు. నాటి నిజాం ప్రభుత్వం రామచంద్రారెడ్డిని  ఎమ్మెల్యే పదవికి నామినేట్ చేసిందంటే ఆయన శక్తిసామర్థ్యాలు ఏపాటివో మనం అర్థం చేసుకొవచ్చు. ఆ రోజుల్లోనే తన అవసరాల కోసం విదేశాల నుంచి కారు, పిస్తోలు వంటి విలువైన వస్తువులు తెప్పించుకుండు. రాజభోగాన్ని అనుభవించిండు.

రామచంద్రారెడ్డి 1938 నాటకే రెండు లక్షల రూపాయల వ్యయంతో పెద్ద గడీ నిర్మాణం చేసిండు. అందుకోసం అయిన ఖర్చు మొత్తం జనాన్ని పీడించి అవినీతి, అక్రమాలతోనే సంపాదించిండని ప్రజలు చెప్పుకుంటరు. దొర చేసే ప్రతిపనిలో తనకు నమ్మినబంట్లుగ మిష్కిన్ అలీ, షరీఫ్ ఉద్దీన్, అనుముల రాంరెడ్డి లాంటివాళ్ళు నిరంతరం సహకరించేవాళ్ళు. విసునూరు రామచంద్రారెడ్డికి అత్యంత సన్నిహితుడు,

ఎర్రబాడు భూస్వామి జెన్నారెడ్డి ప్రతాపరెడ్డి గడీ నిర్మాణ బాధ్యతను తీసుకుండు. ఆంధ్రా నించి వొచ్చి తెలంగాణలో స్థిరపడ్డ వల్లూరు బసవరాజు ఆ గడీ నిర్మాణానికి తగిన ప్లాను గీసి ఇచ్చిండు.

ఊరికి తూర్పురోకు ఐదెకరాల స్థలంలో నిర్మించిన దొర గడీ అనేక ఆధునిక హంగులతో కూడుకొని ఉంటది. గడీలోని ప్రధాన భవంతి దాదాపు అరేక్రం స్థలంలో చూపరులను అబ్బురపరిచే విధంగ ఉంటది. భవంతి చుట్టు ఎత్తయిన ప్రహరీ గొడ ఉంటది. మూడంతస్థుల ఈ భవనంలో ప్రతి అంతస్థులోను పది విశాలమైన గదులు, వంటగది, భోజనశాల అని ప్రతి అవసరానికి ప్రత్యేకమైన గదులను ఏర్పాటు చేసుకుండు. ఈ ఇంటికి ఇంగ్లాండ్ నుంచి బండలు, బెల్జియం నుంచి గ్లాసులు, జపాన్ నుంచి టైల్స్ తెప్పించి ఎవరికీ సాధ్యంకాని రీతిలో గడీ నిర్మాణం చేసిండు. ఇంకా ఇంటి అలంకరణ కోసం జపాన్ నుంచి ఎన్నో వస్తువులు తెప్పించిండు. సకల హంగులతో కట్టుకున్న ఈ గడీలో ఇరవై మంది జీతగాళ్ళు నిత్యం పనిచేసేవాళ్ళు.



**విసునూరు రామచంద్రారెడ్డి గడీ**

కడవెండిలో ఈటూరి చినధర్మారావు అనే పట్వారి చనిపోయినప్పుడు వారసులకు బదులుగా కోడలుకు కొంత డబ్బిచ్చి 150 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఘనుడు విసునూరు దేశముఖ్. ఇట్ల భూమిని గుంజుకునే ఏ చిన్న అవకాశాన్ని కూడ దేశముఖ్ వదులుకోడు. అవసరమైతే అందుకోసం సామాన్య జనానికి తగవులు పెట్టి తనకు కావల్సింది రాబట్టుకుంటడు. ఇట్లాంటి ఎన్నో దుర్మార్గాలకు అండగా నిలిచే నలబై మంది గూండాలను నిత్యం తన వెంట తిప్పుకుంటడు. ఇంట్లో ఉన్నంత సేపు హిందు సంప్రదాయాలను పాటించి, బయటకు వెళ్ళేటపుడు మాత్రం కుచ్చుటోపి, షేర్వాని వంటివి ధరించి ముస్లీం సంస్కృతిని ప్రదర్శించేటోడు. పోలీసులను, అధికారులను మచ్చిక చేసుకొని ప్రతి ఒక్కరి చేత ''రాజాసాహెబ్'' అని పిలిపించుకునేటోడు.

విసునూరు దేశముఖ్ చేతికింద గల నలబై మంది గూండాలు విసునూరు రామచంద్రారెడ్డి ఎప్పుడు ఏంచెప్పిన ఎనక ముందు ఆలోచించరు. ఎవరి ప్రాణాలు తీయడానికైన ఎనుకాడరు. విసునూరు రామచంద్రారెడ్డి కూడ ఎప్పటికప్పుడు వాళ్ళ అవసరాలను తీర్చుతూ పెంచి పోషించెటోడు. ఈ రకమైన గూండాలు రామచంద్రారెడ్డి పెత్తనం సాగే ప్రతి ఊరిలోనూ ఉండెటోళ్లు. జనం వీళ్ళను 'దొర గూండాలు' అని చెప్పుకునేవాళ్లు. ప్రతి ఊరికి ఒక గూండా నాయకుడై పనిచేసేటోడు. దొర గుండాలలో కొందరికి తుపాకులు గూడ ఉండేయి. మరికొందరి దగ్గర ఎప్పుడు బరిసెలు, కత్రలు ఇతర ఆయుధాలు ఉండేయి.

విసునూరులో దొరకు వెన్నుదన్నుగ నిలిచే మిష్కిన్ అలీ, వనమాల వెంకయ్య దొర గూండా నాయకులు. దేవరుప్పలలో అబ్బసలి, వలిమడిలో జానిమియా, ముత్తారంలో రాంరెడ్డి దొరకు నమ్మిన బంట్లుగా ఉండెవాళ్లు. దేశముఖ్ మాటను జవదాటకుండ, చెప్పిన పనికి తొడగొట్టి మరీ ముందుకు కదిలేటోళ్ళు. దేశముఖ్ తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ఆ గూండాలతోని అనేక అరాచకాలు చేయించెటోడు.

విసునూరు చుట్టుపక్కల గ్రామాలల్ల రామచంద్రారెడ్డికి ఎకరాల కొద్ది భూములు ఉండేయి. ఆయనతో పాటు మరి కొంతమంది దేశముఖ్‌లు, జాగీర్దారులు, మఖ్తాదారులకు కూడా ఆ గ్రామాలల్ల భూములు ఉండేయి. దాదాపుగ ఆ చుట్టుప్రక్కల రామచంద్రారెడ్డి పెత్తనమే నడిచేది. ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తు విసునూరు చుట్టుపక్కల ప్రాంతంలో ఎదురులేకుంట చేసుకుండు. విసునూరు రామచంద్రారెడ్డికి కడవెండి

రెండవ ముఖ్యస్థానం. ఈయన ఎప్పుడు విసునూరుకు పోవాలన్న కడవెండి మీదంగనే పోయెటోడు. ఎందుకంటే కడవెండిలో రామచంద్రారెడ్డి తల్లి జానమ్మ దొరసాని ఉండేది. ఈమె అక్కడ వ్యవసాయం చేపిస్తూ, అన్ని వ్యవహారాలు చూసుకుంటుండేది. మిత్తీలకు పైసలు ఇచ్చి వాటిని వసూలు చేసే విషయంలో చాలా కర్కషంగ ప్రవర్తించేది. ప్రతి విషయంలోను అత్యంత క్రూరంగ వ్యవహరించే జానమ్మ దొరసాని ఏనాడు బయట జనాలకు మాత్రం కనిపించేది కాదు. పరదా పద్ధతిని పాటించి ప్రజలను ముప్పుతిప్పల బెట్టేది. ఎనభై ఏండ్ల వయసులో కూడా ఊరును తన చెప్పుచేతుల్ల బెట్టుకుంది. దొరసాని చేతికింద కూడా కొంత మంది మనుషులు తనకు రక్షణగా ఉండెటోళ్లు.

కడవెండిలో ముంజ రామక్క, మేడిశెట్టి నర్సయ్య, ఎర్రమరెడ్డి బుచ్చిరాంరెడ్డి, ఎర్రమరెడ్డి చినకొండల్‌రెడ్డి, ఎర్రమరెడ్డి సత్తిరెడ్డి, బీతూరు రామానుజాచార్యులు జానమ్మ దొరసానికి నమ్మకంగ పనిచేసెటోళ్లు. ముంతకల్లుకు ఆశపడి దొరసాని చెప్పుచేతుల్లో బతికినోల్లు ఉన్నరు. దొరసాని వీళ్ళ బలహీనతలను గమనించి మనిషిని బట్టి, వాడు చేసే పనిని బట్టి కల్లు ముంతలు ఇప్పించేది. కల్లు తాగి ఊల్లె జరిగే ముచ్చట్లు దొరసానికి చెప్పెటోళ్లు. వీళ్లు కూడా దొరసాని పెత్తనం నిలబెట్టడానికి ఎంతటి దుర్మార్గాలకైనా ఎనకాడేవాళ్ళు కాదు.

విసునూరు రామచంద్రారెడ్డి ఎప్పుడైన తన ఊరికి కారులోనె పోయెటోడు. ఈయన వచ్చేటపుడు పోయేటపుడు వందలాది మంది గ్రామస్థులు పొరకలు పట్టుకొని బాటని తేటగ ఊకేది. కారు పోవడానికి వీలుగ రోడ్డును శుభ్రం చేసేది. ఇట్ల తన రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, తన కారు తిరగడం కోసం సూర్యాపేట, జనగామ ప్రధాన రోడ్డును కలిపే విధంగ చిన్నరోడ్డును సీతారాంపురం నుంచి విసునూరు దాక వేయించుకున్నడు.

విసునూరు దేశముఖ్ నిరంతరం తన ఆధిపత్యాన్ని పెంచుకోవడానికే ప్రయత్నం చేసిండు. ఎవరైన తనకు ఎదురు తిరుగుతున్నట్టు అనిపిస్తే వాళ్ళను ఏదోవిధంగ లొంగదీసుకునెటోడు. ఏ ఊర్లోనైన తన పెత్తనాన్ని ఎదిరించిన భూస్వాములను అదునుచూసి, వాళ్ళ ఇండ్లను లూటీ చేయించెటోడు. వాళ్ళ పంటలను నాశనం చేయించెటోడు. ఆయా గ్రామాలల్ల భూస్వాముల మధ్యన వచ్చే చిన్నచిన్న తగాదాలను పెద్దగ చేసి విషయం తనదాక తెచ్చుకునేటోడు. ఇందుకు తన గూండాలను సరిగ్గా ఉపయోగించుకునేటోడు. అట్లా ఆయా గ్రామాల్లోని పెత్తందార్లను తన అదుపులోకి తెచ్చుకుంటూ రాబోయే ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి కట్టడి చేసేటోడు.

విసునూరు రామచంద్రారెడ్డిని వ్యతిరేకించినందుకు పడిశాల వెంకట్‌రెడ్డి హత్యకు గురయ్యిండు. రామచంద్రారెడ్డిని కాదని న్యాయపోరాటానికి సిద్ధమైనందుకే 1941లో బందగీ హత్యకు గురయ్యిండు. ఈ రెండు హత్యలు విసునూరు దేశముఖ్ మనుషులే చేసింగ్రని తెలిసినా ఎవరు నోరెత్తేవాళ్ళు కాదు. మూడోకంటికి తెలువకుంట విసునూరు దేశముఖ్ చేసే దుర్మార్గాలు, దౌర్జన్యాలకు ప్రజలు నోట్లో నాలుక లేని మూగజీవాలుగ బతుకులు ఎల్లదీసింగ్రు. "బాంచన్‌దొర నీ కాల్మొక్త" అన్న మాట తప్ప జనం మారు మాటకు నోచుకోలేదు.

ఊర్లల్ల అన్నదమ్ములు గాని, పెండ్లం మొగళ్ళు గాని, ఎవరైనా సరే పంచాదులు పెట్టుకుంటే సాలు, ఆ తగాదాలు తీర్చే క్రమంలో ఇద్దరి దగ్గర పైసలు వసూలు జేసెటోడు. ఇట్ల కొన్నిసార్లు తానే పంచాదులు పెట్టి, తనకు సంబంధం లేని దాంట్లో తల దూర్చి డబ్బులు దండుకునేటోడు. ఇట్ల తన బిడ్డ పెండ్లికి అయ్యే ఖర్చులన్నీ ప్రజల నుంచి, భూస్వాములు, సంపన్నులను సైతం పీడించి వసూలు జేసిండు.

మామూలు జనంతో పాటు తన మాట వినని దేశ్‌ముఖ్‌లను మఖ్తాదారులను సైతం విసునూరు రామచంద్రారెడ్డి వదిలిపెట్టేటోడు కాదు. ఈయన ఇతర భూస్వాముల మీద కూడా పెత్తనం చేసెటోడు. ఆయన మాటకు ఎదురు చెప్పటానికి కూడా ఎవరు సాహసం చేసేవాళ్లు కాదు. ఈ విధమైన విసునూరు దేశముఖ్ దురాగతాలు జనగామ తాలూకా మొత్తం వ్యాపించి, ఆ సుట్టుపక్కల గ్రామాల్లో ఏ ఒక్కరు కూడ విసునూరు రామచంద్రారెడ్డికి ఎదురుతిరిగేవాళ్ళు కాదు.

## భాషా సాంస్కృతికోద్యమం – నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలు

దేశంలో జరిగే సంఘ సంస్కరణోద్యమాల ప్రభావం హైద్రాబాద్ రాజ్యం మీద కూడ ఉండేది. అందులో భాగంగానే 1874లోనే హైద్రాబాద్‌లో 'సతి' సంప్రదాయాన్ని నిషేదించింగ్రు. ఆ తర్వాత స్వామి దయానంద సరస్వతి 1875 మార్చి 7న బొంబాయిలోని కాకడ్‌వాడి ప్రాంతంలో ఆర్యసమాజాన్ని స్థాపించిండు. మూఢనమ్మకాలను పారద్రోలి, వేదాలను ప్రచారం చేయడంలో భాగంగ ఏర్పడిన ఈ సంస్థ ప్రభావం క్రమంగ హైద్రాబాద్ మీద పడ్డది. 1892లో స్వామి నిత్యానంద చొరవతోని హైద్రాబాద్‌లో ఆర్యసమజ్ శాఖ ఏర్పడ్డది. మహారాష్ట్రలో బాలగంగాధర తిలక్ ప్రారంభించిన గణేశ్ ఉత్సవాలను మొదటిసారి 1895లో హైద్రాబాద్ శాలిబండ, చాదర్‌ఘాట్ ప్రాంతాల్లో జరిపింగ్రు.

అయితే నిజాం రాజ్యాన్ని పరిపాలన సౌలభ్యం కోసం 1925లో తెలంగాణ, కన్నడ, మహారాష్ట్ర ప్రాంతాలుగ విభజించింద్రు. ఆ సమయంలో భారతదేశ వ్యాప్తంగ బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగ వివిధచోట్ల అనేక జాతీయవాద ఉద్యమాలు నడిచినయ్. రాబర్ట్‌రావెల్ రాసిన ఆంగ్ల పుస్తకం "ఫర్‌గాటెన్ ఎంపైర్" చదివిన మునగాల రాజు నాయిని వెంకట రంగారావు, దివాన్ కొమర్రాజు లక్ష్మన్‌రావులు దాన్ని తెలుగులోకి అనువదించి ముద్రించింద్రు. ఈ విధంగ చరిత్ర మరిచిపోయిన గొప్ప చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయలు వెలుగులోకి వచ్చిండు. ఆయన సామ్రాజ్యం యొక్క విశిష్టత సమాజానికి తెలిసింది. పుస్తకాలు సమాజానికి చాల అవసరమని, ఇందుకోసం గ్రంథాలయాల స్థాపన జరగాలని కొమర్రాజు లక్ష్మణ్‌రావు రాజా నాయిని వెంకట రంగారావుకు విన్నవించడంతోని 1901లో హైద్రాబాద్‌లోని కోఠిలో శ్రీకృష్ణదేవరాయ భాషాంధ్ర నిలయాన్ని ఏర్పాటు చేసింద్రు. 1905లో కొమర్రాజు లక్ష్మణరావు విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలిని స్థాపించిండు. అట్ల అనతి కాలంలోనే గ్రంథాలయాల స్థాపన ఒక ఉద్యమంగ జరిగింది. నల్లగొండ పట్టణంలో 1918లో శ్రీ ఆంధ్ర సరస్వతి గ్రంధాలయాన్ని ఏర్పాటు చేసింద్రు. 1927 నాటికే వందకు పైగా గ్రంథాలయాల ఏర్పాటు జరిగింది. హైదరాబాద్ సంస్థానంలో గ్రంథాలయ ఉద్యమం ప్రేరణతో అనేక సంఘసంస్కరణ ఉద్యమాలు కూడ జరిగినయ్. ఆ విధంగ 1921లో హైదరాబాద్‌లో కర్వే అధ్యక్షతన ఒక సంఘసంస్కార సభ జరిగింది. ఈయన మహిళా విశ్వవిద్యాలయ స్థాపకుడు కూడ. కర్వే ఇంగ్లీషు, మరాఠీల అనర్గళంగ మాట్లాడేటోడు. ఆయన తర్వాత సభలో వక్తలు కూడ మరాఠీ, ఉర్దూ, ఆంగ్ల భాషలల్ల మాట్లాడింద్రు.

ఇదే సమావేశంలో తెలంగాణకు చెందిన న్యాయవాది ఆలంపల్లి వెంకట రామారావు ఒక తీర్మానం విషయమై తెలుగులో మాట్లాడటానికి ప్రయత్నిస్తే మిగతా సభ్యులు ముఖ్యంగ మరఠ్వాడా ప్రాంతానికి చెందిన వారు గోల పెట్టి, ఉపన్యాసం సాగకుంట చేసింద్రు. ఇది ఆనాటి తెలుగోళ్లకు ముఖ్యంగ తెలంగాణ వాళ్లకు తీవ్ర మనస్తాపాన్ని కలిగించింది. ఈ సంఘటననే దేశచరిత్రలో మాతృభాషకు జరిగిన అవమానంగ భావించింద్రు. దీనికి నిరసనగా సభ జరుగుతుండగానే అర్ధాంతరంగ అందరు బయటికి వచ్చింద్రు.

తెలంగాణ వారికి ఒక ప్రత్యేక వేదిక అవసరమని భావించి, వెంటనే టేకుమాను రంగారావు ఇంట్లో సమావేశమైన మందుముల నర్సింగరావు, కొండా వెంకట రంగారెడ్డి తదితరులు ఆంధ్ర జనసంఘం అనే పేరుతో ఒక సంస్థను ఏర్పాటు

చేసింంద్రు. నిజాం రాష్ట్రాంధ్ర జన సంఘం అనే పేరుపెట్టి సంఘం విధి విధానాలు తయారు చేసింంద్రు. 1922లో కొండ వెంకట రంగారెడ్డి అధ్యక్షతన సంఘ నియమావళిని రెడ్డి హాస్టల్‌లో జరిగిన సమావేశంలో ఆమోదించింంద్రు.

ఈ సమావేశానికి టేకుమాను రంగారావు, బోయినపల్లి వెంకటరామారావు, మాడపాటి హనుమంత రావు, మిట్టా లక్ష్మీనరసయ్య, ఆదిరాజు వీరభద్రరావు, నడింపల్లి జానకిరామయ్య, బూర్గుల రామకృష్ణారావు, మందుముల నర్సింగరావు, కొమ్మవరపు సుబ్బారావు, బూర్గుల నరసింహారావు, పందిరి రామస్వామినాయర్‌లు హాజరయ్యింంద్రు. ఆనాటి సమావేశంలో ఆంధ్ర జన సంఘం అధ్యక్షునిగ రాజగోపాలరెడ్డిని, కార్యదర్శిగా టేకుమాను రంగారావుని ఎన్నుకున్నరు.

అయితే ఆంధ్ర జనం సంఘంలోని ఆంధ్ర అనే పదం కోస్తాంధ్ర ప్రజలకు సంబంధించింది కాదు. నాటి ఆంధ్ర శబ్ధం తెలుగుకు పర్యాయపదంగ మాత్రమే ఉపయోగించబడింది.

1928లో గోల్కొండ పత్రిక ద్వార సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ భాషా, సంస్కృతికి సంబంధించి అనేక విషయాలను బయటికి తీసుకొచ్చిండు. హైద్రాబాద్ రాజ్యంలో వాక్‌స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం కావాలని పట్టుబట్టి, బట్లర్ కమిటీకి తన నివేదికను అందజేసిండు. ఈ క్రమంలోనే నిజాం రాష్ట్రాంధ్ర జన సంఘం నాలుగు సభలను నిర్వహించింది. అదేవిధంగ 1922లో నీలగిరి, తెలుగు పత్రికలు స్థాపించబడినయి. వాటి ద్వార తెలంగాణ వైభవాన్ని చాటి చెప్పడం, కరపత్రాలు, పుస్తకాలు ముద్రించి ప్రజలను చైతన్యవంతులుగ తీర్చిదిద్దేందుకు గాను అనేక ప్రయత్నాలు మొదలు పెట్టింంద్రు. 1925లో మదిరలో మొదటి గ్రంధాలయ మహాసభ జరిగింది. 1926లో సూర్యాపేటలో రెండవ గ్రంధాలయ మహాసభ జరిగింది. సూర్యాపేట, తిప్పర్తిలలో రైతుసంఘాలు కూడ ఏర్పడ్డయి. ఆ తర్వాత ఆంధ్ర జనసంఘం ఆంధ్రమహాసభలో విలీనం చేయబడింది. దీనినే నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలు అన్నరు. వాడుక భాషలో వీటిని ఆంధ్రమహాసభలు అని కూడా పిలవడం జరిగింది. అయితే మనం ఇక్కడ ఒక విషయాన్ని గమనించవలసిన అవసరం ఉన్నది.

ఈ రకమైన ఆంధ్ర మహా సభలు కోస్తాంధ్ర ప్రాంతంలో కూడా జరిగినయ్. కాని వాటిని బ్రిటీష్ ఆంధ్ర మహా సభలు అని పిలవడం జరిగింది. వాస్తవానికి నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభలకు, బ్రిటీష్ ఆంధ్ర మహాసభలకు ఏవిధమైన సంబంధం లేదు. ఎందుకంటే తొలి నిజాం రాష్ట్ర ఆంధ్రమహాసభ 1930లో జోగిపేటలో జరిగింది.

తొలి బ్రిటీష్ ఆంధ్ర మహా సభ 1913లో బాపట్లలో జరిగింది. నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభలు జరిగింది తెలంగాణలో, బ్రిటీష్ ఆంధ్ర మహా సభలు జరిగింది కోస్తాంధ్రలో. నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభలు తెలంగాణ నాయకుల ఆధ్వర్యంలో జరిగినయ్. బ్రిటీష్ ఆంధ్రమహాసభలు కోస్తాంధ్ర నాయకుల ఆధ్వర్యంలో జరిగినయ్. పైగా ఈ రెండు ఆంధ్ర మహాసభల లక్ష్యాలు కూడా వేరు వేరుగా ఉన్నయ్.

అయితే తెలంగాణలో ఆంధ్ర ఉద్యమం మొదట సాంస్కృతిక ఉద్యమంగ మొదలై, సంస్కరణ ఉద్యమంగ మారింది. రాజకీయ అంశాల పట్ల అవగాహన కల్పిస్తూ, స్థానిక సంఘాలను ఏకం చేయాలనే లక్ష్యంతో ఆంధ్రమహాసభలు ఏర్పాటైనయి. నిజాం రాష్ట్రంలో ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవటానికి, వాళ్ల అభిప్రాయాలను పంచుకోవటానికి తెలంగాణ మెత్తానికి ప్రాతినిధ్యం వహించే సంస్థగా ఆంధ్రమహాసభ రూపుదిద్దుకుంది. ఇది కేవలం ప్రజల సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేసి, ఆ తీర్మానాలను అమలు చేయాలని మాత్రమే నిజాం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

ఆ విధంగ మొదటి నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ 1930లో మార్చి 3,4,5 తేదీలలో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన మెదక్ జిల్లా జోగిపేటలో జరిగింది. వెట్టిచాకిరి నిర్మూలన, మద్యపాన నిషేదం, తాగునీటి సమస్యలు, బాల్య వివాహాలు, విద్యావ్యాప్తి, స్త్రీ విద్య, రైతుల సమస్యలు, హరిజనోద్ధరణ, వాక్ స్వాతంత్ర్యం వంటి తీర్మాణాలు చేయబడి వాటి సాధన కోసం సభలు, సమావేశాలు నిర్వహించబడుతూ ఉండేయి. నిరంతరం ఈ అంశాల పట్ల ప్రజలను చైతన్యం చేయడమే లక్ష్యంగ ఆంధ్రమహాసభ పని చేసింది. మరికొందరు వ్యక్తులే శక్తులుగా వ్యవస్థలోని దురాచారాల నిర్మూలనకు కృషి చేసింద్రు. భాగ్యరెడ్డి వర్మ హరిజనోద్ధరణకు గాను హ్యూమనిటేరియన్ లీగ్‌ను ఏర్పాటు చేసిండు. రెండవ ఆంధ్రమహాసభ 1931లో బూర్గుల రామకృష్ణారావు అధ్యక్షతన దేవరకొండలో జరిగింది. మూడవ ఆంధ్రమహాసభ 1934లో పులిజాల వెంకటరంగారావు అధ్యక్షతన ఖమ్మంలో జరిగింది. నాలుగో ఆంధ్రమహాసభ 1935లో మాడపాటి హనుమంత రావు అధ్యక్షతన సిరిసిల్లలో జరిగింది. ఐదవ ఆంధ్రమహాసభ 1936లో కొండా వెంకటరంగారెడ్డి అధ్యక్షతన షాద్‌నగర్‌లో జరిగింది.

ఆరో ఆంధ్రమహాసభ 1937లో మందుముల నరసింగరావు అధ్యక్షతన నిజామాబాద్‌లో జరిగింది. భారత జాతీయ కాంగ్రెస్‌కు అనుబంధంగా 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఏర్పడ్డది. నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభలో పని చేసే రావి నారాయణరెడ్డి వంటి చాలా మంది నాయకులు స్టేట్ కాంగ్రెస్‌లో చేరింద్రు.

కాని ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే నిజాం సర్కారు ఈ సంస్థను నిషేధించింది. ఈ సమయంలోనే తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీకి బీజాలు పడ్డయ్. ఆంధ్రమహా సభలోని యువ నాయకులు కొందరు కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితులై అందులో చేరడం మొదలు పెట్టిండ్రు.

ఏడో ఆంధ్రమహాసభ 1940 ఏప్రిల్ 7న హైద్రాబాద్ (అత్రాఫ్‌బల్దా)కు నలభై కిలోమీర్ల దూరంలో ప్రస్తుతం నల్లగొండ జిల్లాలో ఉన్న మల్కాపురంలో జరిగింది. ఈ సభకు మందుముల రామచంద్రరావు అధ్యక్షత వహించిండు. ఈ సభ నాటికి అతివాదులు కమ్యునిజం వైపు, మితవాదులు కాంగ్రేసు వైపు ఆకర్శితులైండ్రు. ఈ సభలోనే నిజాం సర్కారు ప్రవేశపెట్టిన రాజ్యాంగ సంస్కరణల మీద చర్చ జరిగింది. మితవాదులు సంస్కరణలను సమర్థించిండ్రు. కాని అతివాదులకు అనుకూలంగ తీర్మాణం నెగ్గింది. ఈ సంధర్భంగ ఇరువర్గాల నడుమ చెలరేగిన వివాదాల పరిష్కారానికి 30 మందితో కూడిన స్థాయిసంఘాన్ని ఎన్నుకున్నరు. ఈ మహాసభకు ఆంధ్ర కమ్యునిస్టు పార్టీకి చెందిన చంద్ర రాజేశ్వర్‌రావు రహస్యంగ వచ్చిండు. దీంతో మొదలు క్రమంగ ఆంధ్ర నాయకులు తెలంగాణ విషయాలలో జోక్యం చేసుకోవడం మొదలైంది.

ఎనిమిదో నిజాం రాష్ట్రాంధ్రమహాసభ 1941 జూన్ 3,4,5 తేదీలలో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన నల్లగొండ జిల్లా చిలుకూరులో జరిగింది. అప్పటికే 1937 సెప్టెంబర్‌లో మొదలైన రెండవ ప్రపంచ యుద్ధం కీలకదశకు చేరుకుంది. ఈ ఎనిమిదో సభతో పాటుగ నిజాం రాష్ట్రాంధ్ర మహిళాసభను కూడ జరిపిండ్రు. దానికి యోగ్య సుశీలాదేవి అధ్యక్షత వహించి పలు సమస్యల మీద తీర్మాణాలు చేసింది. ఈ సభ తర్వాతనే రావి నారాయణరెడ్డి తెలంగాణ జిల్లాలల్లో విస్తృత పర్యటనలు చేసిండు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకపోయిండు. తొమ్మిదో ఆంధ్రమహాసభ 1942 మే 22,23,24 తేదీలలో మాదిరాజు రామకోటేశ్వరరావు అధ్యక్షతన వరంగల్ జిల్లా ధర్మవరంలో జరిగింది. క్రమంగ ఆంధ్రమహాసభల్లో కమ్యునిస్టుల ఆధిపత్యం పెరిగింది. 1942 ఆగష్టు 8న జాతీయ ఉద్యమాల్లో భాగంగ గాంధీజీ 'క్విట్‌ఇండియా' ఉద్యమానికి పిలుపునిచ్చిండు. ఈ ఉద్యమానికి దేశవ్యాప్తంగ అన్ని పార్టీలు, సంఘాలు మద్దతు పలికినయ్. కాని కమ్యునిస్టు పార్టీ మాత్రం 'క్విట్‌ఇండియా' ఉద్యమాన్ని వ్యతిరేకించింది. పదో నిజాం రాష్ట్రాంధ్ర మహాసభ 1943 మే 23,24,25 తేదీలలో కొండా వెంకటరంగారెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగింది. ఈ సభ నాటికి కమ్యునిస్టులు ఆంధ్రమహాసభలో కొంత ఆధిపత్యాన్ని సాధించగలిగిండ్రు. కాని

కమ్యునిస్టులుగ కాకుండ ఆంధ్రమహాసభ పేరుమీదనే కార్యక్రమాలు చేసింద్రు. దీన్ని గమనించిన ఆంధ్రమహాసభ మితవాద జాతీయపక్ష నాయకులు కమ్యునిస్టుల పన్నాగాన్ని నిలదీసింద్రు. దీంతో మొత్తం సభ్యులు మితవాదులు, జాతీయవాదులు, కమ్యునిస్టులుగ విడిపోయింద్రు. మొదటిసారి అధ్యక్ష పదవికోసం పోటీ ఏర్పడి పోటాపోటీగ సభ్యత్వాలు చేయించింద్రు. అధ్యక్ష స్థానానికి గాను కమ్యునిస్టులు బద్దం ఎల్లారెడ్డిని, మితవాదులు కొండా వెంకటరంగారెడ్డిని నిలబెట్టింద్రు. రెడ్డి హాస్టల్‌లో జరిగిన ఈ ఎన్నికల్లో కొండా వెంకట రంగారెడ్డి గెలిసిండు. అయినప్పటికినీ అందరినీ కలుపుకొని పోవాలని కమ్యునిస్టులను కూడ కార్యవర్గంలోకి తీసుకుండు. ఈ మహాసభలో "ఆహార కొఱత నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, మద్యపానాన్ని నిషేధించాలని" ఒక ఇరవై తీర్మానాలు చేసింద్రు. ఈ సమయంలో ప్రపంచ యుద్ధం ముగిసినప్పటికి భూస్వాములు రైతుల నుంచి అక్రమ లెవీ ధాన్యాన్ని వసూలు చేయడం మాత్రం ఆపలేదు. భూస్వాములు గరిసెలు నింపుకొని రైతులకు తిండి గింజలు లేకుంట చేసింద్రు. కమ్యునిస్టులు దీనంతటికి కారణం నిజాం సర్కారేనని తప్పుడు ప్రచారం చేయడం మొదలు పెట్టింద్రు. ఆంధ్రమహాసభలోని వివిధ పక్షాల నాయకులు ఎవరికి వారై ప్రవర్తించింద్రు. రాజాబహద్దూర్ వెంకటరామారెడ్డి అన్ని పక్షాలను కలిపే ప్రయత్నం చేసిండు. అందుకోసం మితవాదుల పక్షాన మందుముల నరసింగరావును, జాతీయవాదుల పక్షాన మందుముల రామచంద్రరావును, కమ్యునిస్టుల పక్షాన రావినారాయణరెడ్డితో పాటు మరికొందరితో సమావేశం ఏర్పాటు చేసిండు. ఎంత సుదీర్ఘంగ చర్చించినప్పటికి కమ్యునిస్టులు మాత్రం మిగతావారితో కలిసి పనిచేయడానికి అంగీకరించలేదు. ఈ స్థితిలోనే పదకొండవ ఆంధ్రమహాసభకు ఏర్పాట్లు జరిగినయి. భువనగిరిలోని మిత్రమండలి సంస్థ అధ్యక్షుడు ఆరుట్ల లక్ష్మినర్సింహ్మారెడ్డి, జైని మల్లయ్య, సిద్దుల బాలరాజు, పెండెం వాసుదేవ్‌ల సహకారంతో సభ నిర్వహించాలని నిర్ణయించుకుండు. సభ నిర్వహణకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేసుకుండు.

పదకొండో ఆంధ్ర మహాసభ 1944లో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన భువనగిరిలో జరిగింది. ఇక్కడినుంచే ఆంధ్రమహసభల నిర్వహణలో అభిప్రాయబేధాలు తలెత్తినయి. ఈ పదకొండో ఆంధ్రమహాసభ తర్వాతనే ఆంధ్ర మహాసభ నాయకులు అతివాదులు, మితవాదులు అనే రెండు వర్గాలుగ చీలిపోయింద్రు. ఈ దశలోనే పోటీ ఆంధ్రమహాసభలు జరిగినయి.

# పోటీ ఆంధ్రమహాసభలు

ఆంధ్రమహాసభ తరపున దేవులపల్లి వెంకటేశ్వరరావు అనేక గ్రామాలల్లో రహస్యంగా పర్యటించి, రైతులకు ధైర్యం కలిగించే ప్రయత్నం చేసిండు. ఆంధ్రమహాసభ ఈ కేసుల విచారణలో ఉన్న రైతులకు సహకరించే బాధ్యతను సూర్యాపేట తాలూకా కార్యకర్త అయినటువంటి నల్లు ప్రతాపరెడ్డికి అప్పజెప్పింది. ఈ పరిస్థితులలో 12వ ఆంధ్రమహాసభ 1945 మార్చిలో మడికొండ (వరంగల్) లో మందుముల నర్సింగరావు ఆధ్వర్యంలో జరిగింది. 12వ మహాసభ కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో 1945 మార్చిలోనే మధిరలో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన రెండవ ఆంధ్ర మహాసభ జరిగింది. అతివాదులుగా ముద్రపడ్డ రావి నారాయణరెడ్డి, ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, బద్దం ఎల్లారెడ్డి అనతికాలంలోనే కమ్యూనిస్టు పార్టీలో చేరిండ్రు. ఆ తర్వాత మరికొద్ది కాలానికే మితవాదులైన దేవులపల్లి వెంకటేశ్వరరావు, సర్వదేవభట్ల రామనాథం, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఎ.గురువారెడ్డి లాంటి వారు కూడా కమ్యూనిస్టులతో కలిసిపోయింద్రు.

13వ ఆంధ్రమహాసభ 1946 మేలో కంది (మెదక్)లో జమలాపురం కేశవరావు అధ్యక్షతన జరిగింది. మితవాద నాయకులైన మాడపాటి హనుమంతరావు బూర్గుల రామకృష్ణారావు, కొండ వెంకట రంగారెడ్డి వంటి నాయకులతో ఏర్పడిన జాతీయ ఆంధ్రమహాసభ 1945, 46లలో రెండు సభలు జరిపి హైద్రాబాద్ స్టేట్ కాంగ్రేసులో విలీనం అయ్యింది. ఈ సభలల్లో 12,13 మహాసభలు మాత్రం కాంగ్రెస్‌వాదులు విడిగా జరుపుకున్నరు. బూర్గుల రామకృష్ణారావు, మాడపాటి హనుమంతరావు, మందుముల రామచంద్రరావు, జమలాపురం కేశవరావు లాంటి వాళ్ళు పోటి ఆంధ్రమహా సభలను జరుపుకున్నరు.

13, 14వ మహాసభలను మితవాదులు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ పేరుతో జరుపుకున్నరు. ఆ తర్వాత మితవాద నాయకులందరు కాంగ్రెస్ పార్టీల చేరింద్రు. అతివాద నాయకులు కమ్యూనిస్టు పార్టీల చేరింద్రు. జాతీయపక్ష మితవాదులుగ ఈ సభలో మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకట రంగారెడ్డి, మందుముల నరసింగరావు పాల్గొనడం జరిగింది. జాతీయ వాదులల్ల మితవాదులు అయిన మందుముల రామచంద్రరావు, నాగమిల్లి కోదండ రామారావు, కోదాటి నారాయణ రావు, కాళోజి నారాయణరావు, కొమరగిరి నారాయణరావు, ఎంఎస్ రాజలింగం, పాగ పుల్లారెడ్డి, హయగ్రీవాచార్యులు, కాంచనపల్లి పెద వెంకట రామారావులు పాల్గొన్నరు.

1945 ప్రారంభంలో జనగామ తాలూకా ప్రథమ ఆంధ్రమహాసభ జరిగింది. దేవరుప్పల, కడవెండి ధర్మాపురం, పాలకుర్తి నుంచి పెద్ద ఎత్తున స్త్రీలు, పిల్లలు, యువకులు 30 మైళ్ళ దూరం నడిచి వచ్చి సభను విజయవంతం చేసింర్రు.

## పదకొండవ ఆంధ్రమహాసభ

పదకొండవ ఆంధ్రమహాసభకు ముందు రాజబహద్దూరు వెంకట్రామారెడ్డి మితవాదుల, జాతీయవాదుల, కమ్యూనిస్టుల ఐక్యత కోసం ఒక సమావేశం ఏర్పాటు చేసిండు. ఈ సమావేశానికి మిత వాదుల పక్షాన మందుముల నర్సింగరావు, జాతీయవాదుల పక్షాన మందుముల రామచంద్రరావు, కమ్యూనిస్టుల పక్షాన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల లక్ష్మీ నరసింహారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావులు హాజరయ్యింర్రు. ఈ సమావేశంలో జరిగే చర్చలు వినటానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి, రెడ్డి హాస్టలు నుంచి కూడ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యింర్రు. సుదీర్ఘ చర్చలు జరిగినయ్. కలిసి పని చేయడానికి ఇష్టపడుతున్నట్లు మితవాదులు, జాతీయ వాదులు అంగీకరించింర్రు. కాని కమ్యూనిస్టుల పక్షాన హాజరైన యువనాయకులు కొంత దూకుడుగా ప్రవర్తించింర్రు. మిగతా వారితో కలిసి పనిచేయడానికి వాళ్ళు ఏ కోశాన ఒప్పుకోలేదు. వీళ్ళ దుందుడుకు స్వభావం వల్ల ఆనాటి సమావేశంలో వీళ్ళందరిని ఒక తాటిమీదికి తీసుకురావడం సాధ్యం కాలేకపోయింది.

ఇట్లాంటి ఒక ప్రత్యేక సంధర్భంలో పదకొండవ ఆంధ్రమహాసభ సమావేశాలు నిర్వహించడానికి సన్నాహాలు చేసింర్రు. రావి నారాయణరెడ్డి నాయకత్వంలో సభ ఏర్పాట్లు జరగాలని నిర్ణయించింర్రు. తన సొంత తాలూకా కేంద్రం అయిన భువనగిరిలో సభ పెట్టడానికి రావి నారాయణరెడ్డి ఉత్సాహంగ ఉన్నడు. సభ నిర్వహించడానికి అనువైన పరిస్థితులు కూడ ఉన్నయ్.

అప్పటికే భువనగిరిలో కొంతమంది యువకులు ఏర్పాటు చేసిన మిత్రమండలి అని ఒక సంస్థ ఉంది. ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి ఈ సంస్థకు అధ్యక్షుడు. జైని మల్లయ్య గుప్త, సిద్దుల బాలరాజు, పెండెం వాసుదేవ్ మొదలైన వారు ఈ సంస్థలో చురుకుగా పని చేసింర్రు. వాళ్ళు అప్పటికే వృద్ధవివాహాల నిషేధం, బాల్యవివాహాల నిషేధం, గ్రంథాలయాలను స్థాపించడం మొదలైన కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో మంచి గుర్తింపును సంపాదించింర్రు.

వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఈ మిత్రమండలిలో సభ్యుడే. ఈయన అధ్యక్షతన గాంధీ జన్మదినం, 1943లో జపాన్ వ్యతిరేకదినం లాంటి సభలను భువనగిరిలో నిర్వహించింద్రు. జపాన్ వ్యతిరేకదినం సభకు రావి నారాయణరెడ్డి అధ్యక్షత వహించిండు. ఈ సభలో ఆలంకుంద్ మీరీ, రాజబహదూర్‌గౌర్, జవ్వాద్ రజ్వీ, ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి కూడ ఉన్నరు.

రావి నారాయణ రెడ్డి మిత్రమండలి చొరవతో పదకొండవ ఆంధ్రమహాసభను భువనగిరిలో నిర్వహించటానికి సిద్ధమయ్యిండు. సభా నిర్వహణ కోసం ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి అధ్యక్షుడుగ, ఆయన తమ్ముడు ఆరుట్ల రామచంద్రారెడ్డి కార్యదర్శిగ ఆహ్వానసంఘాన్ని ఏర్పాటు చేసింద్రు. ఈ ఆహ్వానసంఘంలో సర్వదేవభట్ల రామనాథం, దేవులపల్లి వెంకటేశ్వరరావు కూడా ఉన్నరు. ఈ ఆహ్వాన సంఘం స్థానిక మిత్రమండలి, వర్తకప్రముఖులతో కలిసి పెద్ద ఎత్తున సభ ఏర్పాటు చేసింద్రు. ఇట్ల పదకొండవ ఆంధ్రమహాసభ భువనగిరిలో 1944 మే 27, 28 తీదీలల్లో రెండు రోజులు అంగరంగ వైభవంగ జరిగింది. ఈ సభకు రావి నారాయణరెడ్డి అధ్యక్షుడుగ ఎన్నికయ్యిండు. దీనికి రాజాబహదూర్ వెంకటరామారెడ్డి కూడ హాజరయ్యిండు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలి వచ్చింద్రు. ఈ సభలో ఆంధ్రమహాసభ అధ్యక్షుని హోదాలో రావి నారాయణరెడ్డి అద్భుతంగ, అందరిని ఆకర్శించే విధంగ మాట్లాడిండు. బద్దం ఎల్లారెడ్డి, రాజ బహదూర్‌గౌర్, ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు, సర్వదేవభట్ల రామనాథం ఈ ఆంధ్రమహాసభ వేదిక నుంచి మాట్లాడినవాళ్ళలో ఉన్నరు. సభకు హాజరైన అనేకమంది యువకులు, నాయకుల ప్రసంగాలు విని ఉత్తేజితులయ్యింద్రు.

పదకొండవ ఆంధ్రమహాసభ సందర్భంగ కమ్యూనిస్టు నాయకులుగ ముద్రపడ్డవారు దూకుడుగ ప్రవర్తించింద్రు. దీంతో మితవాదులు కొండా వెంకటరంగారెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, మర్రి చెన్నారెడ్డి, మందుముల రామచంద్రరావు సభలో పాల్గొనకుండానే తిరిగి వెళ్ళిపోయింద్రు.

భువనగిరి ఆంధ్రమహాసభకు కమ్యూనిస్టు పార్టీతో సంబంధం ఉన్న రావి నారాయణరెడ్డి నాయకత్వం వహించడంతో, ఈ సభ దాదాపు కమ్యూనిస్టు మహాసభగానే జరిగింది. ఈ సభలో మితవాదులు, జాతీయవాదుల భాగస్వామ్యం నామమాత్రం అయ్యింది.

ఆంధ్రమహాసభ రాజకీయేతర వేదిక. అప్పటి వరకు నాయకత్వం వహించిన వారు పార్టీ రహితంనే కార్యకలాపాలు నిర్వహించింద్రు. కమ్యూనిస్టులు కూడ అప్పటి వరకు ఆంధ్రమహాసభలో భాగంగనే పనిచేసింద్రు. ఆంధ్రమహాసభ నాయకులు గానే గుర్తింపు పొందింద్రు. కాని భువనగిరి సభతో ఆంధ్రమహాసభకు పార్టీల రంగు అంటుకున్నట్టయ్యింది. కమ్యూనిస్టు నాయకుల ఒంటెద్దు పోకడ వల్ల ఆంధ్రమహా సభ రెండు వర్గాలుగ చీలిపోయింది.

1935 షాద్‌నగర్‌లో జరిగిన 5వ ఆంధ్రమహాసభలో ప్రసంగం చేసిన కవి కాళోజీ నారాయణ రావు ఆంధ్రమహాసభ రెండుగా విడిపోయిన భువనగిరి సభకు సాక్షీభూతంగ నిలిచిండు. ఇరువర్గాలను వారించిండు. అయినా ప్రయోజనం లేకుండ పోయింది. అయినప్పటికి భువనగిరి ఆంధ్రమహాసభ అనేక తీర్మానాలు చేసింది. సభ్యత్వ రుసుము నాలుగు అణాల నుండి అణాకు తగ్గించింది. అహింసా మార్గానికి కట్టుబడి వుండాలని గతంలో చేసిన తీర్మానాన్ని కాదని కమ్యూనిస్టుల నాయకత్వం హింసకు నాంది పలికింది. ఈ సభలోనే ఆంధ్రమహాసభల నియమావళిలో కూడ అనేక మార్పులు తీసుకొచ్చింద్రు. నిజాం మంత్రి వర్గంలో ఆంధ్రమహాసభ, కర్నాటక పరిషత్తు, మహారాష్ట్ర పరిషత్తులకు సగం స్థానాలు, ఇత్తెహాదుల్ ముసల్మీన్‌కు సగం స్థానాలు కేటాయించాలని, తక్షణమే ఈ తీర్మానాలను అమలు పరచాలని కూడ వారు 11వ ఆంధ్రమహాసభ ద్వార విన్నవించడం జరిగింది.

### గ్రామసభలు - సంఘాల నిర్మాణం

ఆంధ్రమహాసభ ప్రజల్లో చైతన్యం నింపడం కోసం అనేక ప్రయత్నాలు చేసింది. ముఖ్యంగ తొమ్మిదవ ఆంధ్రమహాసభ నుంచి పదకొండవ ఆంధ్ర మహాసభ దాక కలిసి వచ్చిన ప్రజలతో జిల్లా తాలూకా కమిటీలను వేయడం జరిగింది. ఆంధ్రమహాసభకు రావి నారాయణరెడ్డి అధ్యక్షునిగా ఎన్నికయినంక కూడ జిల్లా కమిటీలను వేసింది. అందులో భాగంగానే నల్లగొండ జిల్లాకు దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు జిల్లా అధ్యక్షునిగ, ఆరుట్ల రామచంద్రారెడ్డి కార్యదర్శిగా, వట్టికోట ఆళ్వారుస్వామి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కమిటీ ఏర్పాటు అయ్యింది.

ఆంధ్రమహాసభ కేంద్ర కమిటీ అధ్యక్షుడు రావి నారాయణరెడ్డితో పాటు దేవులపల్లి, ఆరుట్ల కూడా నల్లగొండ జిల్లాకు చెందిన వారే కావడం జిల్లా ప్రజలు గర్వించదగిన అంశం. రావి నారాయణరెడ్డిది భువనగిరి తాలూకాలోని బొల్లెపల్లి గ్రామం. ఆరుట్లది భువనగిరి తాలూకా కొలనుపాక. దేవులపల్లిది సూర్యాపేట

సమీపంలోని బండమీది చందుపట్ల. భువనగిరి, సూర్యాపేటలతో పాటు జనగామ తాలూకా కూడా ఆనాడు నల్లగొండ జిల్లాలనే ఉన్నది. ఈ మూడు తాలూకాలల్ల భూస్వాములు కూడా ఎక్కువగానే ఉన్నరు. విసునూరు రామచంద్రారెడ్డి కూడా ఈ ప్రాంతం వాడే కావడం వల్ల ఈ ప్రాంతంలో భూస్వాముల వేధింపులు, దోపిడీ ఎక్కువుగా ఉండేది. ప్రజలు ఇబ్బంది పడుతున్న ప్రాంతం, తమకు తెలిసిన ప్రాంతం కాబట్టి ముందుగా నల్లగొండ జిల్లాలోని ఈ ప్రాంతంలో ఆంధ్రమహాసభను విస్తృత పరచాలని, పీడిత ప్రజల పక్షాన నిలబడి న్యాయమైన పోరాటం చేయాలని ఆంధ్రమహా సభ నాయకత్వం గొప్ప ఆలోచన చేసింది.

అనుకున్నదే తడవుగ అనతి కాలంలోనే రావి నారాయణరెడ్డి ఆధ్వర్యంలోని ఆంధ్రమహాసభ సభ్యత్వాలు చేర్పించే కార్యక్రమం మొదలు పెట్టింది. ఈ ఆంధ్ర మహాసభనే ఆ రోజుల్లో సంఘం అని కూడ పిలిచెటోళ్లు. ఈ సంఘానిది ఎర్ర జెండ. నల్లగొండ జిల్లాలో ఈ సంఘ సభ్యత్వాల బాధ్యతను తీసుకున్న ఆరుట్ల గ్రామగ్రామాన తిరిగిండు. ఈ సభ్యత్వనమోదు కార్యక్రమంతో ఆంధ్రమహాసభతో ప్రజలను మమేకం చేసే ప్రయత్నం చేసిండు. ప్రజలు పడే ఇబ్బందిని దగ్గరినుంచి చూసి చలించిపోయిండు. భూస్వాముల దౌర్జన్యాలను ఎదిరించడమే ఆంధ్రమహాసభ లక్ష్యమని చాటిచెప్పిండు. దీంతో దేశముఖ్‌ల బాధలు భరించలేని ప్రజలకు ఆంధ్రమహాసభ కొండంత అండ లెక్క కనపడింది. ఈ దశలో ఆంధ్రమహాసభ, సంఘం నాయకులు రావి నారాయణరెడ్డి నాయకత్వంలో మూడు నెలల పాటు విపరీతంగ గ్రామాలల్లో తిరిగింద్రు. జనగామ తాలూకాలో ప్రజలకు ఒక్కసారిగ పండుగొచ్చినట్టయ్యింది. ఆంధ్ర మహాసభ అధ్యక్షుడు రావి నారాయణరెడ్డికి ప్రజలు ఊరూర బ్రహ్మరథం పట్టింద్రు. పదహారు జతల ఎడ్ల బండ్లను కట్టి జనం తమతమ ఊర్లకు తీసుక పోయింద్రు. మంగళ హారతులతో స్వాగతం పలికింద్రు. మంచి చెడ్డలు చెప్పుకున్నరు.

ఊర్లల్లో సమావేశాలు ఏర్పాటు చేసింద్రు. కడివెండి, దేవరుప్పల, సీతారాంపురం, కామారెడ్డి, కడారు, రామారం, కొడకండ్ల తదితర గ్రామాలల్లో తొలి విడత గ్రామ సభలు జరిగినయ్. ఈ సభలల్లో రావి నారాయణరెడ్డి అద్భుతమైన ఉపన్యాసాలు ఇచ్చిండు. సహజంగానే ఆయన మంచి వక్త కావడం వల్ల ఆ మాటలు ప్రజలను ఆకట్టుకున్నయ్. దీంతో జనం సభలకు హాజరు కావడానికి ఆసక్తి చూపింద్రు. తమ సమస్యలకు పరిష్కారం ఆంధ్రమహాసభ ద్వారనే జరుగుతుందని భావించింద్రు. అట్ల

ఆంధ్రమహాసభ అధ్యక్షుడు రావి నారాయణరెడ్డి, అప్పటి ఆంధ్రమహాసభ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఆరుట్ల రామచంద్రారెడ్డి నల్లగొండ జిల్లాలోని నలవై ఊర్లు కలెతిరిగింద్రు.

గ్రామకమిటీల నిర్మాణం చేపట్టింద్రు. ఈ విధంగ తొలి గ్రామ కమిటీ కడివెండిలోనే ఏర్పాటు అయ్యింది. అదే గ్రామానికి చెందిన దావూద్‌రెడ్డి ఇంట్లో 1944 అక్టోబర్ 3న మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దావూద్‌రెడ్డి అధ్యక్షత వహించిండు. కడవెండి గ్రామ కమిటీ అధ్యక్షునిగ దావూద్‌రెడ్డి, కార్యదర్శిగ నల్లా నరసింహులు ఎన్నికయ్యింద్రు. అదే గ్రామంలోని మాశెట్టి రామచంద్రయ్య ఇంటిని సంఘ కార్యాలయంగ ఉపయోగించుకున్నరు. మొదటి దశలో మడిపడిగె, నిర్మాల, సీతారాంపురం గ్రామాలల్లో సంఘాలు ఏర్పాటు చేసింద్రు. దాదాపు ఈ గ్రామాలన్ని విసునూరు రామచంద్రారెడ్డి ఆధీనంలోనే ఉన్నయ్. ఇట్ల భువనగిరి సభ జరిగిన అతి కొద్ది కాలంలోనే దాదాపు అన్ని గ్రామాలల్లో కమిటీలు ఏర్పాటు చేసింద్రు. భూస్వాముల పెత్తనానికి వ్యతిరేకంగ నినదించిన గ్రామకమిటీలు ఊరేగింపులు జరిపినయి.

ఆ తర్వాత కడవెండిలో దొడ్డి కొమురయ్య మరణంతో రంగప్రవేశం చేసిన కమ్యునిస్టులు ఆవేశంతో కదిలిన జనసమూహంలో కలిసింద్రు. బరిసెలు అందుకున్నరు. బలాన్ని ప్రదర్శించింద్రు. ఇట్లాంటి శక్తివంతమైన ప్రజాపోరాటాన్ని క్రమంగ కమ్యునిస్టు పోరాటంగ మల్చుకున్నరు. దీంతో అప్పటి వరకు ప్రశాంతంగ సాగిన ఉద్యమం ఒక్కసారిగ సాయుధ పోరాట రూపందాల్చింది.

# చారిత్రక కడివెండి గ్రామము

ఆ రోజుల్లో జనగామ తాలూకా మొత్తం నల్లగొండ జిల్లాలో ఉండేది. పోలీసు చర్య అనంతరం కొన్నాళ్ళకు దీన్ని వరంగల్లు జిల్లాలో కలిపిండ్రు. జనగామ నుంచి సూర్యాపేటకు వేళ్ళే రోడ్డు మార్గంలో కడివెండి అనే ఊరు ఉంటది. సూర్యాపేట రోడ్డు పక్క ఊరు సీతారాంపురం. సీతారాంపురం విసునూరుకు మధ్య 12 కిలోమీటర్ల దూరం ఉంటది. కడివెండికి పోవాలంటే సీతారాంపురుం స్టేజి దగ్గరినుంచి ఉత్తరం దిక్కుగా సుమారు రెండు కిలోమీటర్లు లోపలికి పోవాల్సి ఉంటది. మధ్యన ఒక వాగు అడ్డం వస్తది. వాగు దాటంగనే కనపడేదే కడివెండి గ్రామం. వానకాలంలో కొన్నిసార్లు ఈ వాగు ఉధృతంగ ప్రవహిస్తది. అప్పుడు కడవెండికి పోవాలన్న రావాలన్న చాల కష్టంగ ఉండేది. అయితే ఇప్పుడు ఆ బాధ లేదు.

కడివెండి ప్రజలు చాలాసార్లు మంచినీళ్ళ కోసం కూడ ఆ వాగు దగ్గరికి పోయేవాళ్ళు. వాగుల నీళ్ళు అంత తేటగ ఉండేయి. ఎండాకాలంలో బాటసారులు, పశువులు, మేకలు, గొర్రెల కాపరులు వాగులో చెలిమలు తవ్వి నీళ్ళు తాగిన సంధర్భాలు కోకొల్లలు. అంతేకాకుండ మన మహాకవి పోతన పుట్టిన బమ్మెర గ్రామం గాని, శైవ సాహిత్య సృజన కారుడు పాల్కుర్కి సోమనాధుడు పుట్టిన పాలకుర్తి గ్రామం గాని కడివెండికి కూతపెట్టు దూరంలోనే ఉంటయి. పాలకుర్తి కొండ మీద గల సోమేశ్వరాలయంలో ప్రతి శివరాత్రికి పెద్ద జాతర జరుగుతది.

అతిగొప్ప ప్రాచీన శైవక్షేత్రం గల ఈ పాలకుర్తి పేరు తల్చుకుంటెనే తెలంగాణ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ గుర్తుకు వస్తది. ఇట్ల ఈ ప్రాంతమంత ఆధ్యాత్మికభావనతో కూడిన సాహితీసౌరభాల గుభాళింపు నిండి ఉండడంతోపాటు బానిసత్వాన్ని ధిక్కరించిన వీరయోధుల గంభీరస్వరం నిత్యం మారుమోగుతుంటది. ఆ పోరాటయోధుల రక్తంతో తడిసిన వీరభూమి వెదజల్లే మట్టివాసన మనలోని పిరికితనాన్ని తరిమికొడ్తది. మనిషిగా ఆలోచింపజేస్తది.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని రగిలించిన కడివెండి పేరు చెప్పంగనే వీరుల పోరాటఘట్టాలు ఒక్కటొక్కటిగ కండ్లముందు కలదలాడ్తయ్. నల్లగొండ జిల్లాని ప్రపంచ విప్లవాల సరసన నిలబెట్టిన ఊరు కడివెండి. అనేక ఉద్యమాలకు ఆలవాలమై ఘనచరిత్రను సృష్టించిన గ్రామం కడివెండి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి మూలకారకుడైన కరుడుగట్టిన భూస్వామి రాపాక వెంకట రామచంద్రారెడ్డి నివసించే

విసునూరు కడివెండికి సుమారు ఐదు కిల్లోమీటర్ల దూరంలో ఉంటది. అయితే ఈ విసునూరు, కడివెండి రెండు కూడ ఆనాటి జనగామ తాలూకాలోనివే. విసునూరు రామచంద్రారెడ్డి ఎదురులేని మనిషి. చుట్టు అరవై గ్రామాల ప్రజల్ని పీడించి పన్నులు వసూలు చేసేటోడు. కడివెండిలో ఏనాడు ఆబ్కారి హక్రాజు పాటలో దేశ్‌ముఖ్‌కు పోటీ వచ్చేటోళ్ళు లేరు. ఏ విషయంలోనైన ఏకచ్ఛత్రాధిపత్యంగ వ్యవహరించెటోడు. ముస్తాదుకు ఇంత పన్ను కట్టాలని గౌండ్లోల్లను పీడించెటోడు. ఇతర వృత్తిదారులను కూడ హింసించి కన్నశెరలు బెట్టెటోడు. రైతు కూలీల నుంచి సంవత్సరానికి నాలుగు వేల రూపాయల వరకు వసూలు చేసి ప్రభుత్వానికి మాత్రం వెయ్యి రూపాయలకు మించి చెల్లించేటోడు కాదు. అట్ల ఆయా కులవృత్తిదారులను, ప్రజలను పీడించి వాళ్ళచేత వెట్టిపనులు చేయించుకునేటోడు. వృత్తిపనులు చేసేవాళ్ళు కష్టపడి వాళ్ళు పోగేసిన ప్రతిది దేశముఖ్‌లకు ఎంతో కొంత ముట్టజెప్పవలసిందే. గొల్ల, కురుమలు మందకు ఒక మేకనో, గొర్రెనో ఇయ్యవలసిందే. ఇట్ల దాదాపుగ ప్రజలందరు ఎట్టిపనిలో మగ్గి బతుకులు ఎల్లదీసేటోళ్ళు. పసిపిల్లలు, పిల్లతల్లుల విషయంలో కూడ జాలి చూపించెటోడు కాదు. దేశముఖ్ తన ఇంటి నించి ఎక్కడికి బయలుదేరినా ఆయన వస్తుండన్న సంకేతం ఇవ్వడం కోసం కచ్చడం ముందు చాకలివాడు అలుపులేకుండ పరుగెత్తాలె. ఎక్కడ ఆగిపోతే అక్కడ దొర గూండాల కొరడా చాకలి వంటి మీద నాట్యం చేసేది. ఆ దెబ్బలకు తట్టుకోలేక ఊపిరి బిగబట్టి ఉరికిఉరికి ప్రాణాలు పోగొట్టుకున్నవాళ్ళు ఎందరో ఉన్నరు.

ఈ అరాచకాలు చాలవలన్నట్టు విసునూరు రామచంద్రారెడ్డి ఏలుబడిలో ఉన్న ఈ కడివెండిలోనే ఆయన తల్లి జానమ్మ దొరసాని ఉండేది. ఆమె సాటంత సెవులు, ఊరంత నోరేసుకొని ఎవనయ్యకు కనపడకుంట పెత్తనాన్ని చెలాయిస్తుండేది.

కడివెండిని కాకి పొడిచినట్టు పొద్సుక తినేది. ప్రతి చిన్న విషయానికి ప్రజలను వేదిస్తూ అనేక రకాలుగ దోపిడి చేస్తుండేది. కొడుకు పావులంటె తల్లి రూపాయంటది. జానమ్మ దొరసాని కడివెండికి వచ్చినప్పుడు ఇరవై ఎకరాలకు మించి స్వంత భూమి ఉండేది కాదట, కాని ఆంధ్రమహాసభల కాలం నాటికి ఆమె నాలుగువందల ఎకరాల భూమికి యజమానురాలైంది. జానమ్మ దొరసాని అన్ని రకాల పన్నులు బలవంతంగ వసూలు చేసి తిరిగి ఆ ప్రజలకే అప్పుగా ఇచ్చి, వడ్డీలకు వడ్డీలు పీడించి వసూలు చేసేది. రైతులు అప్పులు తిరిగి ఇయ్యలేని పక్షంలో వాళ్ళ ఇండ్లను భూములను గుంజుకొని ఆ కుటుంబాలను దుర్భర దారిద్రంలో ముంచేది.

రైతుల నుంచి అడ్డగోలిగ భూముల్ని గుంజుకుంది. ఆ భూముల్ని సాగుచేయడానికి బడుగు బలహీనవర్గాల ప్రజలతో వెట్టి చేయించుకునేది. తన పొలంలో నాటువేయడానికి, కలుపుతీయడానికి వచ్చిన కూలీలకు నాలుగు పైసలకు మించి కూలి ఇచ్చేది కాదు. (నాటి హాలిసిక్కా నాణెం విలువ ప్రకారం ఆరు పైసలైతే ఒక అణా) కడివెండిలో పరదా చాటున కుసోని చుట్టూ అరవై ఊర్లలో వ్యవసాయం చేయిస్తూ వ్యవహారం నడిపించేది.

1937 ప్రాంతంలో జనగామ తాలూకాలో 'తబ్లీగుఅంజుమన్ ఇస్లామియా' ఆధ్వర్యంలో హరిజనులను మహ్మదీయ మతంలోకి మార్చే ప్రయత్నం జరిగింది. హిందువులను ముస్లీంలుగ మార్చే ఈ ప్రక్రియ 'తబ్లీక్' అనే పేరున కొనసాగింది. హైద్రాబాద్ రాజ్యాన్ని ముస్లీం రాజ్యంగ మార్చే ప్రయత్నం కాశీం రజ్వీ వచ్చిన తర్వాత ఎక్కువగ జరిగింది.

కడివెండిలో తక్కువ కులాలకు చెందిన వాళ్ళు వృత్తిదారులు జానమ్మ దొరసానికి వెట్టి చేయలేక విసునూరు రామచంద్రారెడ్డి పెట్టే బాధలని భరించలేక అనేకమంది ముస్లీం మతాన్ని స్వీకరించింద్రు. వీళ్ళనే ఆరోజుల్లో కొత్త తురకలని కూడ అన్నరు. ముస్లీం మతపెద్దల ధైర్యంతోని కొత్త ముస్లీం నాయకుడు బాషిపాక పొట్టి మల్లయ్య హరిజనులచే వెట్టి చేయించడాన్ని మాన్పించిండు. కాని ఇది ఎంతోకాలం కొనసాగలేదు. ఆ సమయంలోనే సాధారణ హిందువులకు – కొత్త తురకలకు అనేక సంఘర్షణలు జరిగేయి. కొత్త తురకల కోరికలు తీర్చడం కోసం తబ్లీగు సంఘం వాళ్ళు ఆయా గ్రామాల్లో హిందు మతందార్లపైన, ఆసాములపైన ఫోజ్దారీ మొకద్దమాలను పెట్టి నడిపించేవాళ్ళు. అట్ల జనగామ మున్సఫీలో దాదాపు 15 మొకద్దమాలు నడిచేయి. వీటిలో వందలాది మంది హిందువులు నిందితులుగ సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టు తిరగడం జరిగింది. జానమ్మ దొరసాని పెట్టే బాధలు భరించలేక మళ్ళీ రెండు సంవత్సరాలలోపే ముస్లీం మతాన్ని విడిచి దొరసాని దగ్గర వెట్టిసాకిరి చేయడం మొదలు పెట్టింద్రు.

ఈ విధంగ కడివెండిలో ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆఖరికి విసునూరు రామచంద్రారెడ్డికి లొంగిపోయి, జానమ్మ దొరసానికి ఊడిగం చేయక తప్పేది కాదు. ఇలాంటి పరిస్థితులలో కడివెండి గ్రామంలో దొడ్డి కొమురయ్య చూపిన సాహసం, వీరత్వం చరిత్రలో నిలిచిపోయింది. ఆ పోరాటం ప్రపంచ చరిత్రలో ప్రధాన విప్లవాల సరసన చేరిపోయింది. కడివెండి పవిత్ర పుణ్యభూమిగ మారిపోయింది.

# దొడ్డి కొమురయ్య కుటుంబం

కండగల్ల భూములున్న కడివెండి కష్టజీవులకు పుట్టినిల్లు. పత్తి, పసుపు, మిర్చి, పొగాకు వంటి వాణిజ్యపంటలే గాక కందులు, పెసర్లు, బొబ్బర్లు, సజ్జ, జొన్న, మొక్కజొన్న, వరి వంటి ఆహారధాన్యాలు పుష్కలంగ పండే పాటినేల. బంగరు పంటలకు ఆలవాలమైన కడివెండి వ్యవసాయంతో పాటు కోళ్ళు, మేకలు, గొర్రెలు, పశువుల వంటి జంతుజాలం కూడ విరివిగా ఉండేది. అయితే గొడ్డు, గోద, పాడి, పంట దేని మీద కూడ ప్రజలకు పూర్తి హక్కు ఉండేది కాదు. చేతిలో ముద్ద నోట్లోకొచ్చేదాక నమ్మకం లేకపోయేది. సర్వస్వం విసునూరు దేశముఖ్ చెప్పుచేతుల్లో ఉండేది. ఈ రకంగ విసునూరు రామచంద్రారెడ్డి కబంధహస్తాలలో నలుగుతున్న అనేక గ్రామాలలో కడివెండి ఒకటి. అదనంగ ఇక్కడ ఆయనతల్లి జానమ్మ దొరసాని కూడ ఉండడం వల్ల పాము పడగనీడలో ఉన్నట్టు జనం భయంభయంగ బతికేటోళ్ళు. విసునూరు దేశముఖ్ ఏది అడిగితే అది, ఎప్పుడు అడిగితే అప్పుడు ఇయ్యవలసిందే.

ఏ ఒక్కరు ఎదురుతిరిగి ప్రశ్నించేటోళ్ళు కాదు. దీంతో సాధారణ రైతుకూలీలు ఎంత కష్టం చేసినా ఆకలి, దరిద్రంతో అల్లాడిపోయేది.

పొద్దుగూకులు రెక్కలు ముక్కలు చేసుకుంటె దొరసాని గరిసెలు నిండేయి తప్ప రైతులగోస తీరేది కాదు. చేయని తప్పుకు శిక్షలు వేసి జరిమానా విధించినా నోరు మెదిపెటోళ్ళు కాదు. "బాంచన్ నీ కాల్మొక్త" అంటూ భరించడం తప్ప వేరే గత్యంతరం లేకపోయేది. ఇట్ల కడివెండి ప్రజలు కనపడని సంకెళ్ళతో కన్నతిప్పలు పడేటోళ్ళు. పండుగన్న, పబ్బమన్న సంబరం ఉండేది కాదు. గంపెడు గుంపున్న సబ్బండ జాతులు బానిసలై ఇట్ల బతుకీడ్చేది. అన్యాయం రాజ్యమేలుతున్న కడివెండిలో భూస్వాముల, దేశముఖ్‌ల పెత్తనాన్ని ధిక్కరించి బానిస సంకెళ్ళను బద్దలుకొట్టిన మహా విప్లవకారుడే దొడ్డి కొమురయ్య. ఆయన చూపిన త్యాగం, వీరత్వమే సాయుధ రైతాంగ పోరాటమయ్యింది. దొడ్డి కొమురయ్య కుటుంబం గురించి మాట్లాడటమంటే దొడ్డి కొండయ్య, గట్టమ్మల గురించి మాట్లాడటమే. దొడ్డి మల్లయ్య గురించి మాట్లాడటమే. దొడ్డి మల్లయ్య కొడుకు ఆగయ్యని గురించి మాట్లాడటమే. మొత్తంగ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని మననం చేసుకోవడమే.

అట్లాంటి వీరయోధుల్ని కన్న తల్లి దండ్రులే దొడ్డి కొండయ్య, గట్టమ్మలు.

ఖర్మసిద్ధాంతాన్ని తలకు సుట్టుకొని కాలం ఎల్లదీసె నిరుపేద కుటుంబం దొడ్డి

కొండయ్యది. కులవృత్తినే దైవంగ భావించే దొడ్డి కొండయ్య, గట్టమ్మలు గొర్లను కాసుకుంటు కుటుంబాన్ని పోషించుకునేటోళ్ళు. కడివెండి పరిసర ప్రాంతాల్లోని దేశముఖ్‌లు, జాగీర్దారులకు దండంపెట్టి, బాంచన్ నీ కాల్మొక్తా అంటూ తలదించుకొని బతికేటోళ్ళు. దొడ్డి కొండయ్య దుడ్డుగట్టె, సిత్సగొడ్డలే ఆయుధంగ జీవాలే తన ప్రపంచంగ బతికెటోడు.

కురుమ కులంలో పుట్టిన దొడ్డి కొండయ్య, గట్టమ్మలకు నలుగురు మగపిల్లలు, ఒక్క ఆడపిల్ల. మొత్తం ఐదుమంది సంతానంలో దొడ్డి మల్లయ్య పెద్దోడు. తర్వాత వరుసగ రాజయ్య, బుచ్చయ్య, కొమురయ్య, బీరయ్య, బుచ్చమ్మ. వీళ్ళందరిలో ఒక్కగానొక్క ఆడపిల్ల బుచ్చమ్మ చిన్నప్పుడే చనిపోయింది. కటిక పేదరికంతో అష్టకష్టాలు పడుతున్న దొడ్డి కొండయ్యను చూసి చిన్నకొడుకు బీరయ్యని మేనమామలు తీసుకపోయ్ సాదింగ్రు. దొడ్డి మల్లయ్య – లచ్చుమ్మ దంపతులకు ముగ్గురు కొడుకులు, ముగ్గులు బిడ్డలు. వారు వరుసగా నర్సమ్మ, అనసూయ, ఆగయ్య, ఐలయ్య, భిక్షపతి, గట్టమ్మ. దొడ్డి రాజయ్య – బయ్యమ్మ దంపతులకు ఒకేఒక్క కొడుకు ఐలయ్య. దొడ్డి బుచ్చయ్య – ముత్తమ్మ దంపతులకు మల్లయ్య, కొండయ్య అనే ఇద్దరు కొడుకులతోపాటు కొండమ్మ అనే బిడ్డ ఉన్నది. దొడ్డి మల్లయ్య ఇద్దరు తమ్ములు రాజయ్య, బుచ్చయ్యలు పెండ్లీలు కాంగనే ఏరుబడి సంసారం చేసింగ్రు. దేశముఖ్‌లు పెట్టే బాధలు భరించలేక ఊరూర మందబెట్టుకుంట కొంతకాలం సంచార జీవితం గడిపింగ్రు. ఎప్పుడో ఏడాదికి వస్తె వచ్చినట్టు లేకుంటె లేదన్నట్టు కాలం గడిపింగ్రు. వీళ్ళలో రాజయ్య కాలక్రమంలో షుమారు1977 ప్రాంతంలో కడివెండిని విడిచిపెట్టి ఏటూరు నాగారం ఎల్లిపోయిండు. అదేవిధంగ దొడ్డి బుచ్చయ్య కూడా దాదాపు అదే సంవత్సరంలో హైద్రాబాద్ నాచారం దగ్గరలోని మల్లాపురంలో స్థిరపడ్డరు. ఇంటికి పెద్దకొడుకైన దొడ్డి మల్లయ్య తల్లిదండ్రులను చూసుకుంట వాళ్ళకున్న మూడెకరాల భూమిని సాగుజేసుకుంట, జీవాలను చూసుకుంట బతికేది. ఈ విధంగ దొడ్డి కొండయ్యది కులవృత్తిమీద బతికే సాధారణ వ్యవసాయ కుటుంబం. గొర్ల పెంపకం వీళ్ళ ప్రధాన వృత్తి. వ్యవసాయం కన్న మిన్నగా గొర్ల మీద వచ్చే ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించుకుంటూ బతికింగ్రు. తన ఇల్లు, పిల్లలు గొర్లు తప్ప వేరే లోకం తెలియని మనిషి. కొండయ్యకు చేదోడు వాదోడుగ పిల్లలు ఒకరి తర్వాత ఒకరు గొర్లకాడికి పోయేటోళ్ళు.

దొడ్డి కొమురయ్య పుట్టే నాటికి ఆ కుటుంబంలో ఏ విధమైన కష్టాలు లేవు. కాని భూస్వాముల పోరు పెరిగింది. దేశముఖ్‌లు ఎవరిని నిమ్మలంగ

బతుకనియ్యకపొయ్యేది. దొడ్డి కొండయ్యకు గొర్ల మంద పెరగడంతో దేశముఖ్‌ల కన్నుబడ్డది. అయినా కొండయ్య తెలివితోని ఎట్లనో బతిలాడుకొని వాళ్ళ కనుసన్నలలో నడుచుకునేటోడు. దొడ్డి కొమురయ్యకు ఏడెనిమిదేండ్లు వచ్చేటప్పటికే కొండయ్య చనిపోయిండు. ఆ వెంటనే గట్టమ్మ కూడ చనిపోయింది. దొడ్డి మల్లయ్య ఇంటికి పెద్దోడు కాబట్టి కుటుంబ భారాన్ని భుజాన పెట్టుకుండు. దొడ్డి కొమురయ్య బరువు బాధ్యతల్ని మల్లయ్య చూసుకునేటోడు. కాలక్రమంలో దొడ్డి మల్లయ్యకు గొర్లతోపాటు సంఘం బాధ్యతలు పెరిగినయి. గొర్ల మందను తిప్పుకొస్తందుకు మనిషి లేకపోవడం మూలంగ తన భార్య లచ్చమ్మతో కొమురయ్యని కూడ గొర్లకాడనే పెట్టిండు. దొడ్డి మల్లయ్య తమ్ములు రాజయ్య, బుచ్చయ్యల సంసారం వేరైనా గొర్లను మాత్రం అందరు కలిసి ఒక్కదగ్గరనే మలిపేది. ఉండి లేని కుటుంబం కావడం వల్ల ఇంట్ల ఎవరిని బడికి పంపాలన్న ఆలోచన కూడ వచ్చేది కాదు. ఆరోజుల్లో అట్లాంటి అవకాశం కూడ ఉండేది కాదు. ఇట్ల కుటుంబంలో ఎవరికీ అక్షరజ్ఞానం లేకుండా పోయింది.

పట్టుమని పదేండ్లు కూడ నిండని దొడ్డి కొమురయ్య గొర్లకాడ వస్తాదులెక్క నిలబడెటోడు. ఎంత చీకట్లనైన ధైర్యంగ తిరిగెటోడు. కంప, కట్టెనకుంట, పురుగుబూషిని లెక్కచేయకుండ, ఎవరికి భయపడకుండ తిరిగెటోడు.

అన్నలు, వదినెలతో కలిసి గొర్లని కాసుకుంట ఉండెటోడు. సహజంగ ఏ



**దొడ్డి కొమురయ్య గొర్లను దొడ్డ్యదోలే ప్రదేశంలో..**

వృత్తిలోనైన నైపుణ్యం ఒకరు చెప్పితే వచ్చేది కాదు. ఆయా వృత్తి కులాలల్లో వాళ్ళ పుట్టుక నుంచే ఆ పనుల్లో నిమగ్నమై ఉంటరు. కాబట్టి బెస్తోల్లు వలలు అల్లడం, అవుసలోల్లు నగలు చేయడం, మాదిగోల్లు చెప్పులు కుట్టడం వంటి పనులల్లో ఆ పిలల్లకు వేరొకరు శిక్షణ ఇవ్వవలసిన అవసరం లేదు. అట్ల గొర్లను కాయడంలో కొమురయ్యకు ఎన్నో మెళకువలు తెలిసినయి. ఎందుకంటే చిన్నప్పటినుంచే అయ్య భుజాల మీదినుంచి అన్ని విషయాలను నేర్చుకున్నడు. గొర్లెమ్మటి తిరుగుతూ అయ్యను గమనించడమే కాకుండ మాటల్లో చేతల్లో తండ్రిని అనుకరించడం కొండయ్యకు ఎంతగానో సంతోషాన్ని కలిగించేది. ఆ తర్వాత గొర్లను కంటికి రెప్పోలె కనిపెట్టడం, గొర్లు ఎంత దూరంగ ఉన్న కూతబెట్టి పిలవడం వంటి అనేక విషయాలలో ఆరితేరిండు. కొమురయ్యకు పద్దెనిమిది, ఇరంయ్యేండ్లు వచ్చేటప్పటికి నిండైన యువకుడిగ తయారయ్యిండు. విసునూరు దేశముఖ్ దౌర్జన్యాలను గురించి కలుపులు, కోతలకు వచ్చిన కూలీలు వస్త, పోత మాట్లాడుకోవడం కొమురయ్య విన్నడు. జీతగాళ్ళు వాళ్ళ మీద జరిగే దౌర్జన్యాలను, దేశముఖ్ తల్లి జానమ్మ దొరసాని పెట్టే బాధలను గురించి మాట్లాడుకోవడం ఎన్నోసార్లు కొమురయ్య విని తన ఆవేశాన్ని అణుచుకునేటోడు. కొన్నిసార్లు బయటికి వెళ్ళగక్కేటోడు. విసునూరు రామచంద్రారెడ్డి పంటభూముల్లోనే మందపెట్టాలని ఆజ్ఞాపించినా మాటమాట్లాడకుంట ఆ పని చేసేటోడు. ఇట్ల దొడ్డి కొండయ్య ఎవరు ఏమన్నా దండంపెట్టి “బాంచన్‌దొర నీ కాల్మొక్త” అని తన పని తాను చేసుకునేటోడు.

దేశ్‌ముఖ్ బాధలు భరించలేక సాక్షాత్తు దొడ్డి కొమురయ్య అన్న దొడ్డి మల్లయ్య బహద్దూర్ యార్‌జంగ్ దగ్గరికి వెళ్ళి ముస్లీం మతాన్ని స్వీకరించిండు. ఖాదరలీ అని పేరు పెట్టుకొని, తన భాషని, వేషాన్ని పూర్తిగ మార్చుకుండు. ఆ విధంగ గొల్ల కురుమలకు నాయకుడుగ ఉన్న దొడ్డి మల్లయ్య కొంతకాలం దేశముఖ్‌లకు వెట్టి గొర్లను ఇయ్యకుంట చేసిండు. దీంతో కక్ష్యగట్టిన విసునూరు రామచంద్రారెడ్డి దొడ్డి కొండయ్య కుటుంబాన్ని అనేక ఇబ్బందులకు గురిచేసిండు. దొడ్డి మల్లయ్య మీద రేప్‌కేస్ పెట్టి అరెస్ట్ చేయించిండు.

కడివెండిలో దొరసానికి నమ్మిన బంటు ముంజ రామక్కను ఉసిగొల్పిండు. దొడ్డి మల్లయ్య తనను చెరిచిండని కోర్టులో తప్పుడు సాక్ష్యం చెప్పించిండు. దీంతో దొడ్డిమల్లయ్య నెలల తరబడి కోర్టుసుట్టు తిరిగిండు ఆఖరికి బహదూర్ యార్జంగ్ చేసిన సహాయం వల్ల దొడ్డి మల్లయ్య ఆ కేసులో శిక్షపడకుండ బయటపడ్డడు.

ఇంత చేసినప్పటికి తిరిగి భూస్వాములకు వెట్టి చేయక తప్పలేదు. గొల్ల, కురుమలు వెట్టి గొర్లను ఇయ్యక తప్పలేదు. ఇట్లాంటి అనేక సంఘటనలు దొడ్డి కొమురయ్య మనసుని గాయపరిచినయి. పోరాటం వైపు మళ్ళించినయ్.

హైద్రాబాద్ రాష్ట్రంలో అప్పటికే ఆంధ్రమహాసభలు జరుగుతున్నయి. ఆంధ్రమహాసభల ద్వార పల్లెపల్లెని చైతన్యం చేసే క్రమంలో గ్రామ కమిటీల నిర్మాణం కూడ జరిగింది. దొడ్డి కొండయ్య, పెద్ద కొడుకు మల్లయ్య విసునూరు రామచంద్రారెడ్డి పెట్టే బాధలు భరించలేక, వాళ్ళకు ఎట్టిగొర్లను ఇయ్యలేక అర్వపల్లి దగ్గర తిమ్మాపురంలో ఉన్న మేనమామల ఇంటికి పోయిండ్రు. మందని గూడ తోలుకపోయిండ్రు. అయినాగూడ భూస్వాముల దౌర్జన్యాలు ఆగలేదు. తిమ్మాపురంలో కూడ దేశముఖ్‌ల అరాచకాలు పెరిగినయి. దీంతో ఆంధ్రమహాసభను గురించి తెలుసుకున్న దొడ్డి మల్లయ్య నాయకులను కలవడం కోసం హైద్రాబాద్‌కు నడిచిపోయిండు. అక్కడ అనేక విషయాలు తెలుసుకుండు. ఆ తర్వాత 11వ ఆంధ్రమహాసభకు నల్లా నరసింహులుతో కలిసి భోనగిరికి పోయిండు. ఇట్ల దొడ్డి మల్లయ్య ఆంధ్రమహాసభ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనడానికి కారణం తమ్ముడు దొడ్డి కొమురయ్య ఒక్కడైనా గొర్లను కంటికి రెప్పలా కాపాడగలడనే నమ్మకం. దొడ్డి కొమురయ్యకు వందగొర్లను మలుపుకొచ్చే ఒడుపు ఉండడం వల్ల జీవాలను కొమురయ్య మీద వదిలిపెట్టి మల్లయ్య సభలు, సమావేశాలంటూ తిరిగెటోడు.

దొడ్డి కొమురయ్య చిన్నప్పటినుంచే బాగ బలంగ, దిట్టసంగ ఉండేటోడు. పదునైన సూపులతోని గొర్లను కాపులకాసేటోడు. తోడేళ్ళ ఉనికిని పసిగట్టి వాటిని పరుగులు పెట్టించేటోడు. తోడేళ్ళ వెంట చిరుతపులి లెక్క ఉరికెటోడు. రేయింబవళ్ళు గొర్లని కాపుల కాయడమే కాకుండ, తన అన్న దొడ్డి మల్లయ్య సభ్యుడిగ పనిచేస్తున్న ఆంధ్రమహాసభలను గురించి, తెలుసుకునేటోడు. విసునూరు దేశముఖ్ కదలికలను గమనించేటోడు. దేశముఖ్ గుండాలు గొర్లను కాస్తున్న దొడ్డి రాజయ్యను తన తమ్ముడు కొమురయ్యను చూసి మందలించిన సంధర్భాలు ఎన్నో ఉన్నయి. రాజయ్య ధైర్యం తక్కువోడు. కొమురయ్య గుండెబలాన్ని, మొండితనాన్ని చూసి వదినె లచ్చుమ్మ ఎంతగానో మురిసిపోయేది. లచ్చుమ్మ దొడ్డి కొమురయ్యను కన్నతల్లి లెక్క చూసుకునేది. ఒకసారి మందని తిప్పట్లాడిన తోడేళ్ళను తరిమికొట్టిన కొమురయ్యను చూసి, అన్న వదినలు లోలోపల ఎంతో సంతోషపడేటోళ్ళు. ఒకనాడు దొడ్డి కొమురయ్య మేకలకు మండ కొడదామని తుమ్మచెట్టు ఎక్కిండు. సరిగ్గ అప్పుడే దొరసాని మనుషులు దొడ్డి

రాజయ్య దగ్గరికి వచ్చి నిలబడి, ఎవరి గురించో అడుగుతుంట్రు. కండ్లతోని బెదిరిస్తుంట్రు. దాన్ని గమనించిన కొమురయ్య చెట్టుమీదినించి గొడ్డలి వదిలిపెట్టిండు. ఆ గొడ్డలి సరాసరి వాళ్ళ మీద పడ్డంత పనయ్యింది. గూండాలు అదుర్కొని పైకి చూసింట్రు. మల్ల తమాయించుకొని కొమురయ్యని బెదిరించబోతుంటె దొడ్డి రాజయ్య వాళ్ళని బతిలాడి దండంపెట్టి పంపించిండు. దొడ్డి కొమురయ్య ప్రవర్తన మీద రాజయ్యకు అనుమానం వస్తనే ఉంది. అప్పటికే దొడ్డి మల్లయ్య ఆంధ్రమహాసభలో చేరి దేశముఖ్‌లకు వ్యతిరేకంగ చేస్తున్న కార్యక్రమాల వల్ల కుటుంబం చెల్లాచెదురైంది. రాజయ్య, బుచ్చయ్యలు చాలాకాలం దాక ఇంటికి రాకుండ దేశాలుబట్టి పోయింట్రు. అందుకని దొడ్డి కొమురయ్యను విసునూరు రామచంద్రారెడ్డి కంటపడకుంట పెంచాలని లేకుంటె ఆళ్ళ కండ్లల్ల బెట్టుకుంటరని వదిన లచ్చమ్మ భయం. ఇంటికి ఎవరన్న వచ్చిన సాధ్యమైనంత వరకు కొమురయ్యని వాళ్ళ కంట పడకుంట చూసేది లచ్చమ్మ. దొడ్డి కొమురయ్య గొర్లకాడ నిలబడి కర్రదిప్పుతుంటె అందరికి భయమయ్యేది. కడివెండిలో దొరసాని మనుషులు దొడ్డి కొమురయ్య కండబలాన్ని, గుండె ధైర్యాన్ని చూసి ఆశ్చర్యపోయేది. "వీడు చూస్తే చిన్నగుండు కొడదామంటె పెద్దగనిపిస్తుండు" అని అనుకోవడమే గూండాల పనయ్యింది. ఈ విషయాన్ని బయటికి చెప్పితే ఎక్కడ వాళ్ళ ఇజ్జతి పోతదోనని ఎవరితోని అనేటోళ్ళు కాదు. దేశముఖ్ గుండాలను చూసి కూడ జడవని మొండి ధైర్యాన్ని దొడ్డి కొమురయ్యలో వాళ్ళు గమనించింట్రు.

## ఆంధ్రమహాసభలు – దొడ్డి కొమురయ్య ఆలోచన

విసునూరు దేశముఖ్ తల్లి జానమ్మ దొరసానిని చూసి కడవెండితో పాటు చుట్టు నాలుగూళ్ళ జనం భయంతో వణికిపోయేటోళ్ళు. ఆ సమయంలో ప్రజల భయాన్ని పోగొట్టి వాళ్ళలో సామాజిక చైతన్యాన్ని కలిగించడం కోసం ఆంధ్రమహాసభ ఎంతోగానో ప్రయత్నం చేసింది. ప్రజల జీవనవిధానాన్ని మెరుగపర్చడం కోసం దేశముఖ్‌ల దౌర్జన్యాలను ఎదిరించే విధంగ ఆంధ్రమహాసభ అనేక కార్యక్రమాలను రూపొందించేది.

కడివెండిలో అన్నలు, వదినెల వెంట గొర్లను కాసే కొమురయ్య చిన్నతనము నుంచే అనేక విషయాల మీద ఆసక్తిని కనబరిచేటోడు. ఆంధ్రమహాసభ కార్యక్రమాల మీద దృష్టి సారించెటోడు. కొమురయ్యకు తెలివి వచ్చిన కానించి మొదట తండ్రి తర్వాత అన్న ఇద్దరు కూడ గొర్లను పట్టి ఇచ్చి ఆ గూండాలను చూసి భయపడడం చాలాసార్లు చూసిండు. తన అన్న దొడ్డి మల్లయ్య గొల్ల, కురుమ సంఘానికి నాయకుడిగ

ఉండి జానమ్మ దొరసాని మనుషులకు ఎన్నోసార్లు ఇట్ల వెట్టిగొర్లను ఇయ్యడం కొమురయ్యకు అస్సలు నచ్చేది కాదు. గొర్లను ప్రాణంగ చూసుకునే కొమురయ్య ఈ తంతును చూసిన ప్రతిసారి ఏమి చేయలేక కోపం, కసి నిండిన కండ్లతో ఏడ్చుకుంట కుసునేటోడు. ఇవే కాకుండ పాలు, పెరుగు దొరసాని ఇంటికి పంపియ్యడం కూడ చాలాసార్లు చూసిండు. ఉండబట్టలేక తండ్రిని ఈ విషయమై ప్రశ్నించినప్పుడు సమాధానం చెప్పలేక మౌనం వహించేటోళ్ళు. కొమురయ్య చిన్ననాటి నుంచి మొండి పట్టుదలతోని ఉండెటోడు. కొమురయ్య తండ్రి కొండయ్య, అన్న మల్లయ్య ఇద్దరు బతిలాడి మల్లా గొర్లకాడికి తోలేటోళ్ళు.

భువనగిరి ఆంధ్రమహాసభ నాటికి దొడ్డి కొమురయ్యకు ఇరవై సంవత్సరాలు పైబడడంతో యువరక్తం ఉప్పొంగుతుండేది. కడవెండిలో జానమ్మ దొరసాని పెట్టే బాధలు, దేశముఖ్‌ల దౌర్జన్యాలు భరించలేని జనం ఏకంగ మతం మార్చుకొని అవమాన భారంతో కుమిలిపోయిన ప్రజలను చూసి రగిలిపోయిండు. కడవెండిలో మనుషులు గొర్లకన్న హీనంగ బతుకుతున్నరనే వాస్తవాన్ని గ్రహించిండు. మనుషుల్ని మాయం జేస్తున్న తోడేళ్ళను అదును చూసి దెబ్బ తీసేందుకు తగిన శిక్షణను, నైపుణ్యాన్ని పెంపొందిస్తున్న ఆంధ్రమహాసభ కృషికి గర్వంతో ఉప్పొంగిపోయిండు. భువనగిరిలో జరిగిన 11వ ఆంధ్రమహాసభలో తన అన్న దొడ్డి మల్లయ్య తెచ్చిన కరపత్రాలను, సాహిత్యాన్ని గ్రామంలో చదివి వినిపించేవాళ్ళు. ఆ మాటల్ని ఆనోట, ఈనోట విన్న దొడ్డి కొమురయ్య ఉత్తేజితుడయ్యిండు. ఉక్కుపిడికిలి భిగించిండు. జనగామ తాలూకాలో జరుగుతున్న అన్యాయాన్ని దేశముఖ్‌ల దోపిడీ విధానాన్ని అంచనా వేసిండు. ఆరోజు నుంచి గొర్లకాడ నిలబడ్డట్టే గాని ఆంధ్రమహాసభ కార్యకలాపాల గురించే సుదీర్ఘంగ ఆలోచించేటోడు. దొరసాని గూండాలను తరిమికొట్టాలనే తలంపులో మునిగిపొయ్యేటోడు. అయితే సహజంగ పొద్దునలేస్తే గొర్లకాడికిపొయ్యే కొమురయ్య గొర్లను దొడ్లదోలి గ్రామస్థులందరిని పలకరించి ఆప్యాయంగ మాట్లాడెటోడు. ఊర్ల అందరిని వరుసలుబెట్టి పిలిచేటోడు. ఆ తర్వాత వదిన లచ్చమ్మ వచ్చి కేకలుబెట్టి పిలిచేదాక సంఘపోల్లతోని, సమవయస్కులతోని ముచ్చటబెట్టేటోడు. యువకుడైన దొడ్డి కొమురయ్య చెప్పే కొన్ని విషయాలు అందరిని ఆశ్చర్యపరిచేవి. అక్షరజ్ఞానం లేకపోయినా అనేక ఉపాయాలతో ఉండేటోడు. విసునూరు రామచంద్రారెడ్డి గూండాలను చూసి దొడ్డి కొమురయ్య ఏనాడు భయపడ్డది లేదు. పైగా గూండాలు ఎదురుపడితే ఎగిరి తన్నాలన్నంత కోపంతో అదును కోసం ఎదురుచూస్తూ రగిలిపోయేటోడు.

# వెల్లువెత్తిన ప్రజా పోరాటాలు

1860 ప్రాంతంలో రాయచూరు దోఆబ్ నిజాం ప్రభుత్వ పాలనలోకి వచ్చినపుడు ఎలాంటి గందరగోళ పరిస్థితులు తలెత్తకుండ అప్పటి వరకు ఉన్న పాలనా విధానమే అమలు చేయబడింది. భూమి ఆదాయ వివాదాలకు సంబంధించి "కచహెరి అదాలత్ ముస్తరిదా" అనే సంస్థ ఏర్పడింది. ఈ విధంగ గతంలో ఏర్పాటు చేయబడిన "మున్షీఖానా, కచహెరి అజులాయె ముస్తరిదా" అను రెండు ప్రభుత్వ కార్యస్థానములు కలిపి1824లో "మాలుగుజారీ" (భూమ్యాదాయ శాఖ) అనే నూతన శాఖ ఏర్పడింది. ఈ శాఖ ద్వార దివానీ ఇలాకాలో భూమిశిస్తు నిగ్రానీ ఉండేది.

ఆ రోజుల్లో నల్లగొండ జిల్లా భువనగిరి వ్యాపార, వాణిజ్య, విద్యాకేంద్రంగ ఉండేది. హైద్రాబాద్‌కు సమీపంలో (50 కి.మీ) ఉండడం వల్ల ముఖ్యపట్టణంగ వెలుగొందింది. ఆనాటి భువనగిరి తాలూకాలో 297 గ్రామాలు ఉండేయి. వీటిలో 11జమీందార్ గ్రామాలు, 67 షేరిగ్రామాలు. ఈ తాలూకాలోనే 19 గ్రామాలున్న రాజపేట సంస్థానం ఉండేది. రాజా జస్వంతరావు నిజాం ప్రభువుకు సామంత రాజుగ ఉండెటోడు. శిస్తు వసూళ్ళ విషయంలో కఠినంగ వ్యవహరించేటోడు. దీంతో భువనగిరి, జనగామ, సూర్యాపేట తాలూకాలల్లో ప్రజాపోరాటాలు వెల్లువెత్తినయి.

విసునూరు రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగ జరిగిన పోరాటానికి నాయకత్వం వహించిన రావి నారాయణరెడ్డి, ఆరుట్ల లక్ష్మి నర్సింహ్మారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, కట్కూరి రామచంద్రారెడ్డి భువనగిరి తాలూకాకు చెందినవాళ్ళే కావడం వల్ల సహజంగానే ఈ ప్రాంతంలో ఆంధ్రమహాసభ బలపడింది. అయితే దీనికన్న ముందు 1933 జూన్ 3నే దాదాపు 1000మంది దాక భువనగిరి తాలూకా రైతులు హైద్రాబాద్‌కు చేరుకొని పెద్ద ప్రదర్శనగా మాల్గుజారీ కార్యాలయానికి పోయి మొహతేమీం మాల్గుజారీకి వినతిపత్రం సమర్పించడం జరిగింది. అప్పటి బందోబస్తు (1338 ఫసిలి) విధానాన్ని బట్టి పైరు విలువను పరిశీలించి ఖర్చులు పోను మిగిలిన ఆదాయంలో ఒక భాగం భూమిశిస్తుగా విధించబడింది. అయితే ఇతర తాలూకాలలోని రేట్లకంటే నల్లగొండ జిల్లా భువనగిరి తాలూకాలో శిస్తు అధికంగ ఉన్నదని, దీనివల్ల రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగ మారిందని, నిజాం ప్రభుత్వ దృష్టికి తీసుకపోవడం కోసం హైద్రాబాద్‌లో భువనగిరి రైతులు ప్రదర్శన చేసింద్రు. నల్లగొండ జిల్లాలో జొన్నలు, సజ్జలు, ఆముదాలు, వరి ప్రధాన పంటలు. రైతులు పండించిన ధాన్యానికి ధర తగ్గడం, ఎగుమతులు లేకపోవడం, పన్నులు అధికంగ ఉండడం

వల్ల క్రమంగ సాగు విస్తీర్ణం పడిపోవడం జరిగింది. ఈ పరిస్థితి ఎందుకు దాపురించిందో, ఎవరెవరు ఇందుకు కారణమో కూడా వాళ్ళు వివరంగ వినతిపత్రంలో రాయడం జరిగింది. భువనగిరి తాలూకా రైతులు ఈ ఆర్థిక దుస్థితి నుండి ప్రాణాలు కాపాడుకునేలా భూమి శిస్తులో నూటికి ఎనభై శాతం కాకపోయిన కనీసం యాభై శాతమైన శాశ్వతంగ తగ్గించవలసి ఉన్నదని ర్యాలి చేసి ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. ఆ క్రమంలోనే వెట్టిచాకిరి విధానానికి, నిర్బంధ వసూళ్లకు వ్యతిరేకంగ ఆంధ్రమహాసభ గ్రామాల్లో ప్రచారం ప్రారంభించింది. ఆ ప్రచార ప్రభావంతో క్రమంగ గ్రామాలల్ల వెట్టిచాకిరీని ఎదిరించడం మొదలైంది.

పది, పదకొండవ ఆంధ్రమహాసభల మధ్య కాలం నాటికి రెండవ ప్రపంచ యుద్ధం కూడ జరగుతూ ఉండేది. ఆనాటి సైనిక ఒప్పందం ప్రకారం బ్రిటీష్ ప్రభుత్వానికి నిజాం ప్రభుత్వం సహకరించవలసి వచ్చింది. యుద్ధానికి కావలసిన నిధులను సమకూర్చవలసి వచ్చింది. ఈ నిధుల సేకరణ కోసం నిజాం ప్రభుత్వం కొత్త కొత్త పన్నులను విధించింది. భూస్వాముల, ధనవంతుల నుండి అధిక లాభాల పన్నును వసూలు చేసింది. రైతుల నించి నిర్బంధ లేవీ ధాన్యాన్ని వసూలు చేయడం మొదలు పెట్టింది. వృత్తిపనివాళ్ళు ప్రభుత్వ లైసెన్సులను తీసుకోవాలని హుకుం జారీ చేసింది. నిత్యావసర వస్తువుల సరఫరాలో కంట్రోలు విధానాన్ని తీసుకొచ్చింది. ప్రజలకు అత్యవసరమైన గ్యాసునూనె, పొగాకు మీద అధికంగ పన్నులు విధించింది. బలవంతపు వసూళ్ళకు కూడ పాల్పడింది. ప్రభుత్వం భూస్వాముల నుంచి పన్నులు వసూలు చేస్తున్న ఈ సమయంలోనే భూస్వాములు కూడ ఇంతకు మించిన అవకాశం మళ్ళీ రాదని గ్రామాలమీద విరుచుకపడ్డరు. వ్యవసాయ కూలీలను, పేదరైతులను ధాన్యంకోసం పీడించడం ప్రజలను అనేక రకాలుగ ఇబ్బందులు పెట్టడం, క్రూరంగ హింసించడం వంటి కార్యక్రమాలకు పాల్పడ్డరు. ఈ పరిస్థితిలో ఆంధ్రమహాసభ సభ్యులు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగ ప్రచారం చేసింన్రు. ప్రజాచైతన్యం కోసం సభలు నిర్వహించిన్రు. భూస్వాముల పీడనకు దేశముఖ్‌ల దౌర్జన్యానికి విసిగివేసారిన ప్రజలు ఒక్కటయ్యింన్రు.

ప్రజల ధైర్యాన్ని చూసిన భూస్వాములకు కొంత ఆందోళన మొదలయ్యింది. మొత్తానికి ఏ క్షణాన్నయిన ప్రజలు తిరుగుబాటు చేసే అవకాశం ఉందని గ్రహించిన్రు. ఈ పరిస్థితులు ఇట్లనే కొనసాగితే ఇజారా బంజరు భూములు రైతుల చేతుల్లోకి పోతయని భయపడ్డరు. అందుకని ముందుగా భూస్వాములు వాళ్ళ భూముల్ని

కాపాడుకోవడానికి ప్రయత్నం చేసిండ్రు. అప్పటి వరకు కౌలుకు ఇచ్చిన భూములను తిరిగి వెనక్కి తీసుకోవడానికి రంగం సిద్ధం చేసుకుండ్రు. అయితే ఆ సంవత్సరం కాలం మంచిగై వేరుశనగ, ఆముదాలు వంటి వాణిజ్య పంటలు తెలంగాణ ప్రాంతంలో విస్తరించినయ్. దీంతో భూస్వాములు తమ భూములను తామే సేద్యం చేసుకోవడానికి తయారైండ్రు. ఒక పథకం ప్రకారం కౌలుదారులను వెళ్లగొట్టడానికి అందరు పూనుకున్నరు.

ఈ దశలోనే బేదఖళ్లకు నిరసనగ 1943లో ఆకునూరు రైతులు నిజాం పోలీసుల అఘాయిత్యాలకు వ్యతిరేకంగ వీరోచిత పోరాటం చేసిండ్రు. ఆ తర్వాత మొండ్రాయిలో లంబాడి రైతులు పోరాటం చేసిండ్రు. మొండ్రాయిలోని మైదం చెరువు కింద కడారు నరసింహారావుకు చెందిన భూమిని లంబాడీ రైతులు కొన్నేండ్లుగా కౌలుకు సేద్యం చేసిండ్రు. వాళ్ళను వెళ్లగొట్టడానికి భూస్వామి చేసిన ప్రయత్నాన్ని లంబాడీలు తీవ్రంగ ప్రతిఘటించిండ్రు. భూములు తిరిగి వెనక్కి ఇచ్చేది లేదని తేల్చి చెప్పిండ్రు. చేసేదిక్కు లేక భూస్వామి పోలీసులకు ఫిర్యాదు చేయవలసి వచ్చింది.

మైదం చెరువు లంబాడీ రైతులను ఆపాలని ఆంధ్రమహాసభ జిల్లా కమిటీ నిర్ణయించింది. దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు మొండ్రాయిలోని సంఘటనా స్థలానికి పోయిండు. అప్పటికే దేవులపల్లి మరికొందరు ఆంధ్రమహాసభ కార్యకర్తలు మన్‌పాడు, గొల్లపల్లి, దేవరుప్పల, కడివెండి, సీతారాంపురం, మడిపడగ, కథారుపల్లి, రామాపురం గ్రామాల నుంచి వేలాదిమంది ప్రజలు లంబాడీలకు మద్దతుగ నిలిచిండ్రు. కడారు నరసింహారావును ఎదిరించి పొలం కోసుకోవడానికి తయారై పోతున్న సంధర్భంలో, మొండ్రాయికి పెద్దఎత్తున పోలీసులు వచ్చిండ్రు. కలెక్టర్, నిజాం పోలీసు అధికారులు ఎస్.పి.తో సహా తమ బలగాలతో అక్కడికి చేరుకుండ్రు. పంటపొలంపై చేయి వేయ గూడదని లంబాడీలను హెచ్చరించిండ్రు. దీన్ని లంబాడీలు తిరస్కరించిండ్రు. నాలుగు రోజులు ఆగండి చూద్దాం అని ఆంధ్రమహాసభనాయకులు చెప్పినా వినలేదు. రెండు రోజులు గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొని ఉంది. వేలాది మంది లంబాడీలకు, భూస్వాములకు అండగా ఉన్న పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడ్డది. దేవులపల్లి వెంకటేశ్వరరావు ఇరువర్గాల నడుమ సంధి కుదిర్చే ప్రయత్నం చేసిండు. ఎట్టి పరిస్థితిలో లంబాడీలపై చేయిచేసుకోవద్దని, ఇది తరతరాలుగ లంబాడీలు సేద్యం చేస్తున్న పొలం కాబట్టి ఆ పంట వారికే దక్కేలా చూడాలని విజ్ఞప్తి చేసిండు. ఆ మాటను తాలూకాద్దారు–నాజీముద్దీన్ అన్సారీ అంగీకరించలేదు. పైగా పోలీసును, మిల్ట్రీని

తుపాకులతో సిద్ధం చేసిండు. కలెక్టర్ ఆంధ్ర మహాసభ నాయకులను పిలిపించిండు. లంబాడీలకు నచ్చచెప్పమని కోరిండు. ఆంధ్రమహాసభ నాయకులు కూడా పరిస్థితులు అనుకూలంగ లేవని గమనించి ఏదో విధంగ లంబాడీలను ఒప్పించింద్రు. దీంతో ఘర్షణ ఆగిపోయింది. అప్పటికి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ పరంగ ఇంకా బలపడలేదు. కాని అన్నదమ్ములు కొట్టుకుంటుంటే అవతలోనికి సందైనట్టు చిన్నచిన్నగ ఆంధ్రమహాసభ కార్యక్రమాలలో భాగంగానే కమ్యునిస్టులు కూడ విస్తరించే ప్రయత్నం చేసింద్రు.

జనగామ తాలూకాలో మొదటిసారిగ 1944లో కడివెండిలో ఆంధ్రమహాసభ నిర్మాణానికి సన్నాహం చేసింద్రు. భువనగిరి ఆంధ్రమహాసభతో ప్రభావితులైన ప్రజలు అన్ని గ్రామాల నుంచి సంఘంలో చేరడానికి ముందుకొచ్చింద్రు. కొన్నిసార్లు ఆంధ్రమహాసభ అని చెప్పడానికి బదులు ఆర్యసమాజ్ కార్యకర్తలమని చెప్పి పోలీసుల నుంచి తప్పించుకున్నరు. మొత్తానికి దొడ్డిమల్లయ్య, నల్లనరసింహులు వంటి వాళ్ళు ఆర్యసమాజో, ఆంధ్రమహాసభో ఏదైనా ఏంలేదు కాని దేశముఖ్‌ల దౌర్జన్యాన్ని ఎదుర్కోవడానికి తగిన బలం కావాలె అని నిశ్చయించుకొని భువనగిరి సభకు అష్టకష్టాలు పడి వెళ్ళడం జరిగింది. మార్గమధ్యలో మడిపడిగె దగ్గర ఆంధ్రమహాసభ నాయకుడు మనది ఆర్యసమాజ్ కాదని, ఆంధ్రమహాసభ అని దొడ్డి మల్లయ్యకు వివరించి చెప్పడం జరిగింది. “తెలంగాణ ప్రజల ఆర్థిక, రాజకీయ, భాషా, సంస్కృతి అభివృద్ధి కోసం పాటుపడే ప్రజాసంస్థ అని, భూస్వాముల నుంచి విముక్తి కోసం, వెట్టిచాకిరి నిర్మూలన కోసం ప్రజలను సంఘటితం చేయడం కోసం రావి నారాయణరెడ్డి అధ్యక్షతన భువనగిరిలో సభ జరుపుతున్నట్టు వివరించి చెప్పడం జరిగింది. ఇక మీదట ఎలాంటి విషయంలోనైన మీకు అండదండగ, ప్రభుత్వానికి మధ్యవర్తిగా ఆంధ్రమహాసభ పనిచేస్తదని దొడ్డి మల్లయ్యకు వివరించి చెప్పడం జరిగింది. దొడ్డి మల్లయ్య తన సహచరులు 11వ ఆంధ్రమహాసభ తీర్మాణాలను, కరపత్రాలను, మీజాన్ పత్రికలో ప్రచురించబడిన రావి నారాయణరెడ్డి ప్రసంగాన్ని ఇతర సాహిత్యాన్ని తీసుకొని కడవెండికి చేరుకున్నరు.

నల్లనరసింహులుతో పాటు, దొడ్డి మల్లయ్య, మచ్చరామయ్య, మాచర్ల కొండయ్య వంటి వాళ్ళు మరి కొందరు ఆంధ్రమహసభ కార్యక్రమానికి పోయినట్టు దొరసాని గ్రహించింది. దొడ్డి మల్లయ్య, నల్లనరసిహులు ఏ మాత్రం అధైర్యపడకుండ అప్పటికప్పుడే గ్రామంలో చిన్న సభని ఏర్పాటు చేసింద్రు. తీర్మానాలు చదివి

వినిపించింద్రు. దీంతో ప్రజలు తలా అణా ఇచ్చి దాదాపు 300 మంది సభ్యత్వం తీసుకున్నరు. దేశముఖ్‌లు, భూస్వాముల దౌర్జన్యాలకు నిరసనగా మడిపడిగెలో పెద్ద సభను ఏర్పాటు చేసింద్రు. దీనికి నిజాం సర్కారు నుంచి అనుమతి తీసుకున్నరు. గంగుల శాయిరెడ్డి పద్యాలు, ఆరుట్ల రామచంద్రారెడ్డి ప్రసంగాలు పల్లెపల్లెని చైతన్యం చేసినయి. గుంపులు గుంపులుగా జనం దేశముఖ్ గూండాలతోపాటు దొరసాన్ని సైతం భయపెట్టించే విధంగ ప్రజలు సంఘటితమయ్యింద్రు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత కూడ కడివెండిలో జానమ్మ దొరసాని అక్రమంగ ధాన్యం వసూళ్ళు చేపట్టింది. దొరసాని గరిసెల్లో ఉన్న 100 పుట్ల ధాన్యాన్ని కాదని ప్రజల నించి తిరిగి వంద పుట్ల ధాన్యం వసూలు చేయడాన్ని ఆంధ్రమహాసభ కార్యకర్తలు అడ్డుకున్నరు. దేశముఖ్‌ల దౌర్జన్యం నశించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేసింద్రు. ఆ ధాన్యాన్ని దొరసానికి దక్కకుండ చేయడంలో గ్రామంలోని యువకుల పాత్ర ఎంతగానో ఉన్నది.

కడివెండిలో పద్మశాలీలు, గొల్ల కురుమలు, ముఖ్యంగ వెనుకబడిన బీసి కులాలకు చెందినవాళ్ళు జానమ్మ దొరసాని చర్యలకు వ్యతిరేకంగ ఒక్కటై కదిలింద్రు. ఆంధ్రమహాసభ కార్యకర్తలతో కలిసి గ్రామంలో ప్రతిరోజు సాయంకాలం ఊరేగింపు నిర్వహించింద్రు. జనం లాఠీలు చేతబట్టి దేశముఖ్‌కు వ్యతిరేకంగ పాటలు పాడుతూ కవాతు చేసింద్రు. దేశముఖ్ ఏమి చేయలేక స్త్రీలను బెదిరిస్తున్నరని, శాంతి భద్రతలకు బంగం కలిగిస్తున్నరని ప్రజలమీద, కార్యకర్తల మీద పోలీసు కేసులు పెట్టించిండు. కడివెండిలోని భూస్వాముల వ్యతిరేకపోరాటాన్ని ఆనాటి ఆంధ్ర కమ్యునిస్టు అగ్రనాయకులు నిజాం వ్యతిరేక పోరాటంగ మార్చే ప్రయత్నం చేసింద్రు. కాని వాళ్ళ ఆటలు చాలాకాలం వరకు సాగలేదు. ఆంధ్రమహాసభ నాయకుల ద్వార వాస్తవ పరిస్థితిని తెలుసుకొని అప్పటి వరకు భూస్వాముల మీద ఉన్న ఆవేశాన్ని తర్వాత కాలంలో నిజాం ప్రభుత్వం మీదికి మల్పింద్రు. ప్రజల అసంతృప్తిని గ్రహించిన ప్రభుత్వం 1944-45 సంవత్సరంలో ఒక ఫర్మానా జారీ చేసింది. ఎవరైన వెట్టి చేయించుకుంటె దానికి తగిన ప్రతిఫలం ఇయ్యాలని అధికారులను ఆదేశించింది. రెండు మైళ్లు బరువు మోసిన కూలీకి అణాపైసలు ఇయ్యాలని ఫర్మానాలో వివరంగ చెప్పింది. దీనినే 'కోసుకు-వీసం' అన్నరు ఆనాడు. అయితే ఈ ఆదేశాలు అనుకున్నంతగ అమలు కాకపోవడం మూలంగానే ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందనే ప్రచారంతో రెండవశ్రేణి నాయకులు గ్రామాలల్ల తిరిగి సభ్యత్వాలు చేయించి, ఆ తర్వాత గ్రామకమిటీలు ఏర్పాటు చేసింద్రు. ఇందుకోసం పడరాని పాట్లు పడ్డరు. ఆ

తర్వాత జిల్లా, కేంద్ర నాయకులు వచ్చి ఆయా గ్రామాలల్ల సమావేశాలు నిర్వహించుకునేందుకు అనేక ప్రయత్నాలు చేసింద్రు.

విసునూరు రామచంద్రారెడ్డి ఆంధ్ర మహాసభ నాయకుల కార్యకలాపాలను సాగకుండ చూడాలని అందుకు తగిన ఏర్పాట్లు చేసుకుండు. ఆరుట్ల రామచంద్రారెడ్డి కదలికలను కనిపెట్టి అడ్డుకోవాలని తన మనుషులను సమాయత్తం చేసిండు.

పాలకుర్తి సభను అడ్డుకునే ప్రయత్నంలో ఒకదశలో ఆరుట్ల రామచంద్రారెడ్డిని చంపటానికి కూడా సిద్ధమయ్యింద్రు. సభలనే ఆరుట్ల రామచంద్రారెడ్డిని చంపుతమని బహిరంగంగ హెచ్చరించింద్రు.

విసునూరు రామచంద్రారెడ్డి గూండాలు వనమాల వెంకన్నతో పాటు మరికొందరు గొడ్డండ్లతో వొచ్చింద్రు. సాధారణ రైతుల లెక్క గొంగళ్లు కప్పుకొని జనం నడుమ కూసుంద్రు. అదును చూసుకొని ఆరుట్ల రామచంద్రారెడ్డి మీద దాడి చేయాలనుకుంద్రు. ఈ ప్రమాదాన్ని చాకలి ఐలమ్మ కొడుకులు సోమయ్య, లచ్చయ్య, భర్త నర్సయ్య పసి గట్టింద్రు. వెంటనే ఉరికి దొర గూండాలను అడ్డుకున్నరు. సభలో గందరగోళం జరిగింది. విసునూరు దొర మనుషులు పారిపోవడంతో జనం చెల్లాచెదు రయ్యింద్రు. ఈ గొడవల్లో వనమాల వెంకన్న తలకు దెబ్బలు తగిలినయన్న కారణంతో పోలీసులు విసునూరు రామచంద్రారెడ్డి చెప్పినట్టు హత్యాయత్నం కేసు నమోదు చేసింద్రు. పాలకుర్తి ఐలమ్మ కుటుంబంలోని ముగ్గురితోపాటు అదే ఊరుకు చెందిన సుమారు ఇరవై మంది మీద కేసులు పెట్టింద్రు. ఈ కేసులో ఆరుట్ల రామచంద్రారెడ్డి కూడ ఉన్నడు. అయితే అప్పటికే ఆయన రహస్య జీవితంలోకి వెళ్ళి పోయిండు.

# హోరెత్తిన గుత్పల సంఘాలు

పాలకుర్తి జాతర్ల జరిగిన గొడవను అడ్డుకోవడంలో విఫలమయినట్లు ఆంధ్ర మహాసభ జిల్లా కమిటీ భావించింది. ఆంధ్రమహాసభ కార్యకర్తల చేతుల్లో ఆయుధాలు లేక పోవడం వల్లనే దాడిని ఎదుర్కోలేక పోయినట్లు అర్థం చేసుకుంది. అందుకని కార్యకర్తలకు ఆయుధాలు సమకూర్చాలని తీర్మాణించింది. అయ్యాల ఆయుధాలంటె కత్తులు  కటార్లు తుపాకులే కాదు కర్రలు, వడిసెలలు కూడ ఆయుధాలే. గుత్పలంటె గుంటుకమీది కర్రలే. మొదట గూండాలను ఎదిరించటానికి అనువైన కర్రలను కార్యకర్తలు సేకరించింర్రు. ఆ తర్వాత గడగొయ్యలను గూడ గుత్పలుగ ఉపయోగించింర్రు. ఈ విధంగ దాదాపు అన్నిచోట్ల గుత్పల సంఘాలు ఏర్పడ్డయి. ఈ కార్యకర్తలల్ల సబ్బండజాతులకు చెందిన యువకులు, మధ్యతరగతి పేదరైతులు, వ్యవసాయకూలీలు ఉండేవాళ్ళు. ఈ కార్యకర్తల వెంట దేవులపల్లి కూడా ఉండేటోడు. ఇట్ల సంఘం (ఆంధ్రమహాసభ) ఆధ్వర్యంలో పాటలు పాడుకుంట, ప్రదర్శన చేసుకుంట రాత్రి పదకొండు గంటల దాక తిరిగింర్రు.

ఇండ్లళ్ళ ఉన్నోళ్లు మొదట బయటకు రావటానికి భయపడ్డరు. ఆ తర్వాత దర్వాజల దగ్గరకు వొచ్చి తొంగిచూసి లోపలికి పోయింర్రు. అంతకు మించి ఎవ్వరూ ధైర్యం చేయలేదు. ఇక లాభం లేదని పక్కనే ఉన్న బమ్మెర గ్రామానికి దేవులపల్లితో పాటు కార్యకర్తలంతా వెళ్లిపోయింర్రు. కాని కొద్ది గంటల్లోనే పాలకుర్తి రైతులు తిరిగి వొచ్చింర్రు. ఇక మీదట సహకరిస్తమని చెప్పింర్రు. వెంటనే దేవులపెల్లి కార్యకర్తలతో కలిసి పాలకుర్తి చేరుకుంర్రు. పాలకుర్తిలో ఐలమ్మ ఇంట్ల కార్యకర్తలు దాదాపు మూడు నెలలు ఉన్నరు. చాకలి ఐలమ్మ సంఘటన చుట్టు పక్కల గ్రామాలకు చేరింది. అనేక గ్రామాలల్ల ప్రజలు భూస్వాముల గూండాలను ఎదుర్కోవటానికి సిద్ధమయ్యింర్రు.

ఆంధ్రమహాసభ అధ్యక్షుడు రావి నారాయణరెడ్డి, కట్కూరి రామచంద్రారెడ్డి, చకిలం యాదగిరిరావు ఆంధ్రమహాసభ సభ్యత్వాలు పెంచే ప్రయత్నంలో అనేక గ్రామాలు తిరగడం మొదలుపెట్టింర్రు. కడివెండి, పాలకుర్తి, దేవరుప్పల పోరాట కేంద్రాలుగా చుట్టుపక్కల గ్రామాలల్ల కార్యక్రమాలు ముమ్మరం చేసింర్రు.

చైతన్యం పెరిగిన ప్రజలు వెట్టి చాకిరీని ఎదిరించడం మొదలుపెట్టింర్రు. పదకొండవ ఆంధ్రమహాసభ కంటె ముందే ఆకునూరు గ్రామ ప్రజలు వెట్టిని వ్యతిరేకించి పోలీస్ అమీనుకు ఎదురుతిరిగింర్రు. ఈ సంఘటన విసునూరు రామచంద్రా రెడ్డికి అసహనం కలిగించింది. దాని తర్వాత జరిగిన మొండ్రాయి

గ్రామంలోని మైదం చెరువు లంబాడీల తిరుగుబాటు ఆయనకు మరింత చికాకు కలిగించింది. తన అధికారానికి ప్రమాదం పొంచి ఉందని ఆయనకు అర్థమైంది. ఎక్కడికి అక్కడ ప్రజల తిరుగుబాటును అణచివేయడానికి ప్రయత్నాలు మొదలు పెట్టిండ్రు.అట్లాంటి సమయంల పాలకుర్తి సంఘటన జరిగింది. తన అధికారాన్ని లెక్క చేయకుంట తన మనుషుల మీద జనం తిరగబడి కొట్టటం విసునూరు రామచంద్రారెడ్డికి మింగుడు పడలేదు.

జానమ్మ దొరసాని పెత్తనం చేసే కడివెండిలో కూడా ప్రజలు ఎంతో చాకచక్యంగ ధైర్యాన్ని కూడగట్టుకొని వెట్టి చాకిరిని బహిష్కరించింద్రు.

ఆంధ్రమహాసభ నాయకులు తయారు చేసిన గుత్పల సంఘాల ధైర్యంతో సామాన్యజనంలో కొంత కదలిక వచ్చింది. భూస్వాముల పట్ల ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను గమనించిన విసునూరు రామచంద్రారెడ్డి ఉక్కుపాదంతో తొక్కిపెట్టాలని నిర్ణయించుకుండు. అందుకోసం తన గూండాలను సంఘం కార్యకర్తల మీదికి ఉసిగొల్పి తిరిగి కార్యకర్తలే తన మనుషుల మీద హత్యాయత్నం చేసింద్రని ఆరోపించిండు. ఈ కారణంతో గ్రామంలోని అనేకమంది యువకులను, ఆంధ్రమహాసభ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు చిత్రహింసలకు గురిచేసింద్రు. సంఘం ముఖ్యనాయకులను జైళ్ళలో నిర్బంధించింద్రు. ఈ రకంగ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింద్రు. పాలకుర్తి, కడివెండి దేవరుప్పల వంటి గ్రామాలలో దేశముఖ్ గూండాల గుర్రాల చప్పుళ్ళతో అల్లకల్లోలమైనయ్. ఒక దశలో నాయకులు గ్రామాలను వదిలిపెట్టి రహస్య స్థావరాలల్లో తల దాసుకుంద్రు. ఇట్లాంటి సమయంలోనే కడివెండిలో దొడ్డి మల్లయ్య, రేషపెల్లి కొండయ్య, జంపాల లింగయ్య వంటి కార్యకర్తలు ప్రాణాలకు తెగించి ముందుకొచ్చింద్రు. విసునూరు దేశముఖ్ పెత్తనాన్ని ఇంకా సాగనియ్యకూడదనే ధృఢసంకల్పంతో ఉన్నరు. కడివెండిలో ఎరమరెడ్డి కోదండరామిరెడ్డిని అరెస్టు చేసింద్రు. సంఘం కార్యకర్తలు ఎరమరెడ్డి మోహన్‌రెడ్డి నాయకత్వంలో రెచ్చిపోతుంద్రని ముందుగా మోహన్‌రెడ్డి చంపాలని గూండాలు పథకం వేసినట్టు ప్రచారం జరిగింది. కాని విసునూరు దేశముఖ్ గూండాలను అర్ధరాత్రులందు భయపెట్టి, వాళ్ళ అహంకారానికే సవాలు విసురుతున్న అజ్ఞాతవ్యక్తి యువకుడు దొడ్డి కొమురయ్యేనని అందరికి అర్థమయ్యింది. అందుకని ఆరోజు గూండాలు జరిపిన కాల్పుల్లో తూటాలు గురితప్పడానికి కారణం కూడ ఇదేనని ఆ తర్వాత తెలిసింది. అట్ల కడివెండిలో దొడ్డి కొమురయ్య రూపంలో సాయుధపోరాట జ్వాల రగిలింది.

# 1946 జులై 6 దొడ్డి కొమురయ్య వీర మరణం

జనగామ తాలూకాలో విసునూరు రామచంద్రారెడ్డి ఆగడాలకు అడ్డు అదుపులేని రోజులు. తరతరాలుగ భూస్వాముల గడీలల్లో సామాన్యజనం బానిసలై కంటికి పుట్టెడు సోకంపెడుతున్న రోజులు. దేశముఖ్‌ల దౌర్జన్యాలకు కుటుంబాలకు, కుటుంబాలే నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న రోజులు. పసి పిల్లలతో సైతం వెట్టి చేయించుకునే దుష్ట సంస్కృతి పెచ్చరిల్లుతున్న రోజులు. వృత్తి దారులను హీనంగ చూసి, క్రూరంగ రాజ్యమేలుతున్న రోజులు. జమీందార్లకు ఊడిగాలు చేస్తూ వాళ్ళను పల్లకీలలో మోసే రోజులు. వాళ్ళ కచ్చడాల ముందు ఉరికిఉరికి సచ్చిన సాకలివాళ్ళ ఆర్తనాదం ప్రతిధ్వనిస్తున్న రోజులు. ఇట్ల అనేక విధాలుగ భూస్వాముల గడీలల్ల పెండ్లీలకు, పండుగలకు నిత్యం నానా చాకిరి చేసి నాశనమైన కుటుంబాలు నరకయాతన పడుతున్న రోజులు. ఎదురు తిరిగితే ప్రాణాలు తీసే నరహంతక దేశముఖ్‌ల రాజ్యంలో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని భయంభయంగ బతుకీడుస్తున్న రోజులు. ఆ రోజుల్లో జనమంత కొరివిదయ్యంగ పిలిచే విసునూరు రామచంద్రారెడ్డి తల్లి జానమ్మ దొరసాని కడవెండిలో ఓ లంకంత ఎస్టేటు నుంచి తన మాటే శాసనంగ పెత్తనాన్ని చెలాయిస్తుండేది.

కడివెండిలో ఎదురుతిరిగేవాళ్ళను లొంగదీసుకోవడంలో జానమ్మ దొరసానికి తిరుగులేదు. ఎప్పటికప్పుడు తన మనుషుల్ని సామాన్యజనం మీదికి ఉసిగొల్పి, ప్రజల్లో భయాన్ని పాదుగొల్పేది. ఆ క్రమంలోనే దొడ్డి కొమురయ్యని గురించి విన్న జానమ్మ దొరసాని ఖంగు తిన్నది. దొడ్డి కొమురయ్యతోని ఎప్పటికైన ప్రమాదమని గ్రహించింది. దొడ్డి కొమురయ్యని లొంగదీయాలనుకున్న సమయంలోనే కడివెండిలోను, కడివెండి చుట్టుపక్కల గ్రామాల్లోను ఆంధ్రమహాసభ కార్యక్రమాలు ముమ్మరమైనయి. అయితే యువకుడైన దొడ్డి కొమురయ్య అత్యంత రహస్యంగ ఆంధ్రమహాసభ వలంటీర్ దళంలో చురుకైన పాత్ర పోషిస్తున్నట్టు అన్నలు గ్రహించిండ్రు. అన్న దొడ్డి మల్లయ్య సంఘంలో సభ్యత్వం తీసుకొని జానమ్మ దొరసానికి ఎదురుతిరిగిన పాపానికి ఇంటిల్లిపాది ఆగమైన సంగతి తల్చుకొని కుమిలిపోయిండ్రు. మల్ల ఇప్పుడు కొమురయ్య కూడ సంఘంలో చేరితే ఆయింత ఇల్లు ఆగమైతదని అన్నలు, వదినెలకు ఊపిరి ఆగినంత పనయ్యింది. దొడ్డి కొమురయ్య దూకుడు తగ్గాలంటే పెండ్లి జెయ్యాలని నిర్ణయించుకుండ్రు. ఆ విషయాన్ని పెద్దన్న దొడ్డి మల్లయ్య చెవిలో ఏసిండ్రు. మల్లయ్య తానే సంఘంల చేరి అటు ముందుకు పోలేక ఇటు వెనకకు రాలేక కన్నశెరదీస్తుంటె కొమురయ్య కూడ

నా బాటే పట్టిండని బాధపడ్డడు. మల్లయ్య బాధని, అంతర్మథనాన్ని అర్థం చేసుకున్న దొడ్డి కొమురయ్య తనకు 'సంఘంతోని ఏ సంబంధం లేదని చెప్పిండు. ఎన్నితీర్ల నచ్చజెప్పినా మల్లయ్య వినలేదు. ఇంతలోనే 1944 నవంబర్‌లో ఆంధ్రమహాసభ నల్లగొండ జిల్లా కమిటి సమావేశం సూర్యాపేటలో జరిగింది. భూస్వాములు పల్లెజనాన్ని పది పదిహేను సంవత్సరాలుగా పీడించి వసూలు చేసిన జరిమానాల్ని అణాపైసతో సహా తిరిగి వసూలు చేసి ప్రజలకు ఇప్పించాలని నిర్ణయించడం జరిగింది. నిర్భంధంగ వసూలు చేసిన లెవీ ధాన్యాన్ని గరిసెల్లోంచి ఎత్తుకరావాలని, వెట్టిచాకిరి, నిర్భంధ పన్నుల వసూళ్ళకు వ్యతిరేకంగ ఉద్యమించాలని తీర్మానం చేసింది.

ఆంధ్రమహాసభ చేసిన తీర్మానాలకు అనుగుణంగ కార్యాచరణ సిద్ధం చేసుకుంది. అందుకోసం గ్రామగ్రామాన వందలాది మందితో కమిటీలను ఏర్పాటు చేసింది. దొడ్డి కొమురయ్య కడివెండిలో ఆంధ్రమహాసభకు అనుగుణంగ అతిపెద్ద గూఢచర్యాన్ని కొనసాగించిండు. పొద్దంత ఎట్లాంటి అనుమానం రాకుండ గొర్లకాడికి పొయినట్టు పొయ్యి విసునూరు రామచంద్రారెడ్డి గూండాలను పసిగట్టడంలో సిద్ధహస్తుడయ్యిండు. ఎదురుబడ్డ గూండాలనే తరిమికొట్టేటట్టు తయారయ్యిండు. ఈ విధంగ దొడ్డి కొమురయ్య తన అన్న మల్లయ్య దారిలోనే పోరాట బాట పట్టిండనే, అనుమానం నిజమని క్రమంగ ఇంటిల్లిపాధికి అర్థం అయ్యింది. కొమురయ్య ఎవరికి తెలువకుండ రహస్యంగ సంఘపోల్లను కలుస్తుండని అందరు గ్రహించిండ్రు. అపుడు ఇంక ఎంతమాత్రం ఆలస్యం చేయకూడదని దొడ్డి మల్లయ్య వెంటనే సీతారాంపురంలోని తన బంధువుల పిల్ల కొమురమ్మని, ఇంకా పెద్దమనిషి కూడ కానిపిల్లని తీసుకొచ్చి దొడ్డి కొమురయ్యతో పెండ్లి జరిపించిండు. కేవలం అన్నల పోరు పడలేక దొడ్డి కొమురయ్య చిన్నపిల్లని పెండ్లి చేసుకుండు తప్ప తన ఇష్టంతో ఎంతమాత్రం కాదు. అయినప్పటికీ దొడ్డి కొమురయ్య తన లక్ష్యాన్ని మాత్రం వదులుకోలేదు. కడివెండిలో జానమ్మ పెత్తనాన్ని అంతమొందించడంతో పాటు విసునూరు రామచంద్రారెడ్డి దౌర్జన్యాలకు చరమగీతం పాడాలనే ధృఢసంకల్పంతో ఉన్నడు. దొడ్డి కొమురయ్య ఆంధ్రమహాసభ కార్యకర్తల మాదిరిగా కాకుండ గొర్లను దొడ్లోదోలి కడివెండిలోని కడపకడపకు తిరిగిండు. కలుపుగోలు మాటలతో అందరిని కదిలించిండు. అనతికాలంలోనే దొడ్డి కొమురయ్య గ్రామస్తులందరి తల్లోని నాలుకయ్యిండు.

ఆంధ్రమహాసభ చేసిన కృషి వల్ల దేశముఖ్‌ల దౌర్జన్యాలకు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగ అప్పుడప్పుడే అక్కడక్కడ ఒక్కో అగ్నికణం చెలరేగి నివురుగప్పుకున్న

నిప్పులెక్క మారింది. అట్టడుగు వర్గాలకు చెందిన అమాయక జీవులు వెట్టి చాకిరి నశించాలని ధిక్కరించే ప్రయత్నం చేసిండ్రు. చాకలి ఐలమ్మ శౌర్యాన్ని మదిల నిలుపుకున్న జనం ఒక్కరొక్కరుగ తమ శక్తిని కూడగట్టుకొని ఆవేశంతో రగిలిపోయిండ్రు. అప్పటికే కడివెండి గ్రామంలో ప్రజలు వెట్టిచాకిరిని బహిష్కరించిండ్రు. దొరసానికి సపర్యలు చేసే మంగలోల్ల కుటుంబంలోని తల్లీ పిల్లలు ఆ రోజు పని బందుబెట్టిండ్రు. దీంతో ఆగ్రహించిన జానమ్మ దొరసాని గూండాలను రెచ్చగొట్టింది. ఇదే సమయంలో రైతుల నించి నిర్భంధంగ వసూలు చేస్తున్న లేవి ధాన్యాన్ని గ్రేడేషన్ పద్దతిలో వసూలు చేయాలని పేదలు, మధ్యతరగతి వాళ్ళని మినహాయించాలని ఆంధ్రమహాసభ అధికారులను కోరింది. మొత్తానికి ప్రజలు, కార్యకర్తలు, అధికారుల వాగ్వాదంతో కడివెండి గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొని ఉంది. ఈ విధంగ కడివెండిలో విసునూరు రామచంద్రారెడ్డి అక్రమంగ వసూలు చేసిన లెవీధాన్యం రూపంలో దొడ్డి కొమురయ్య ఎదురుచూసిన అదును రానే వచ్చింది. వాస్తవానికి అక్రమధాన్యపు నిలువల గుట్టును బయటపెట్టి, అత్యంత చాకచక్యంగ ఆ విషయాన్ని ఆంధ్రమహాసభ కార్యకర్తలకు అందజేసింది దొడ్డి కొమురయ్యే. కాని ఏమి తెలువనట్టు అసలు గ్రామంలో జరిగే ఏ సంఘటనతో తనకు సంబంధం లేనట్టు పొద్దున్లేస్తే గొర్లకాడికి పొయ్యేటోడు. విసునూరు రామచంద్రారెడ్డి ప్రజలను పీడించి వసూలు చేసిన వందపుట్ల ధాన్యాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆంధ్రమహాసభ నాయకులు ప్రభుత్వ అధికారులను కోరిండ్రు. తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని పట్టుబట్టిండ్రు. కాని విసునూరు రామచంద్రారెడ్డికి భయపడ్డ అధికారులు అందుకు సంబంధించిన కార్యాచరణను మాత్రం మొదలు పెట్టలేదు. కాలయాపన చేయడం కోసం విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటమని చెప్పిండ్రు. కాని కార్యకర్తలు అందుకు సమ్మతించలేదు. ఒక్కసారిగా ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతతో హడలెత్తిపోయిన విసునూరు దేశముఖ్ ఏ క్షణాన్నయిన కడివెండిలో కార్యకర్తల మీద దాడి చేస్తడని ముందే గ్రహించిన నల్ల నరసింహులు, దొడ్డి మల్లయ్యలు ఆత్మరక్షణ కోసం 60 మంది దాక వలంటీర్లను కర్రలతో సిద్ధం చేసుకున్నరు. ఎరమరెడ్డి సోదరులు, రేషపల్లి కొండయ్య, పైండ్ల యాదగిరి, జంపాల లింగయ్య వంటి వాళ్ళు ఒక కమిటీగ ఏర్పడి మాశెట్టి రాంచంద్రయ్య ఇంట్లోనే రాళ్ళు, వడిసెలలు, కర్రలు సిద్ధం చేసి పెట్టుకున్నరు. ఎవరూ రాత్రిపూట ఇండ్లలో పడుకోకుంట గస్తీ కాసిండ్రు.

దొరసాని మనుషుల్ని మెసలకుంట జేసిండ్రు. ఈ సంఘటనలన్నింటిని తీవ్రంగ పరిగణించిన విసునూరు రామచంద్రారెడ్డి కడివెండిలో గొడవలు సృష్టించి ఎవరినో



దొడ్డి కొమురయ్య నేలకొరిగిన ప్రదేశం



**కడవెండిలో జానమ్మ దొరసాని ధాన్యాగారం**

ఒకరిని కతంజేస్తే ధాన్యసేకరణ విషయంలో తలెత్తిన వివాదం సమసిపోతుందని గొప్ప పథకాన్ని సిద్ధం చేసిండు. విసునూరు రామచంద్రారెడ్డి ఆజ్ఞ మేరకు మిష్కిన్‌ఆలీ నాయకత్వాన గూండాలు పెద్దఎత్తున వచ్చి కడివెండిలోని రామచంద్రారెడ్డి తల్లి జానమ్మ దొరసాని గడీల మకాం పెట్టింద్రు.

ధాన్యాన్ని పట్టుకున్న సందర్భంలోను గ్రామంలో గస్తీకాసే సందర్భంలోను దొడ్డి కొమురయ్య రహస్య రాయభారం గురించి గూండాలు అగ్గిమీద గుగ్గిలమై మండింద్రు. కాని దొడ్డి కొమురయ్య పౌరుషం, మొండితనాన్ని తల్చుకుంటే వొంట్ల వొణుకు పుట్టింది. ఇంతలో విసునూరు దేశముఖ్ మామ కోదూరుకు చెందిన గడ్డం నరసింహారెడ్డి కిరాయి మనుషుల్ని వెంటబెట్టుకొని, రామచంద్రారెడ్డి గుండాలతో కలిసి 1946 జులై 4వ తేది రాత్రి కడవెండికి చేరుకుండు. ఆ రాత్రంత మంతనాలు జరిపింద్రు. అందరు కలిసి తెల్లారి అంటే జులై 5వ తేదీన పొద్దుందాక తిన్నరు తాగింద్రు. ఆ తర్వాత వాళ్ళకు చెప్పాల్సింది చెప్పి పొద్దుగూకంతల విసునూరి రామచంద్రారెడ్డి వెళ్ళిపోయిండు. కొద్దిగ చీకటిపడంగనే పీకలదాక తాగిన గూండాలు ఈలలేస్తూ, కేరింతలు కొడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింద్రు. మొత్తానికి దాడికి సిద్ధమైతున్నట్టు సంఘ కార్యకర్తలకు సమాచారం తెలిసింది. నల్ల నరసింహులు వంటి ముఖ్య నాయకులు రాష్ట్రకమిటి నిర్ణయం కోసం హైద్రాబాద్‌కు పోయింద్రు.

మిగిలిన వాళ్ళను పోలీసులు అరెస్టు చేసింంద్రు. అనేక ప్రశ్నలతో విసిగించి ఆఖరికి వదిలిపెట్టింంద్రు. అంతలోనే విసునూరు దేశముఖ్ నలభై మంది గూండాలు కార్యకర్తలను తిట్టడం, ఇండ్ల మీద రాళ్ళు వేయడం వంటి కవ్వింపు చర్యలతో దాడిని మొదలు పెట్టింంద్రు.

ఆంధ్రమహాసభ కార్యకర్త ఎరమరెడ్డి మోహన్‌రెడ్డిని చంపాలని గూండాలు పథకం ప్రకారం మొదట జంపాల లింగయ్య ఇంటిపై రాళ్లు వేసింంద్రు. అది చూసి లింగయ్య తల్లి లచ్చమ్మ ఆంధ్రమహాసభ కార్యాలయానికి పోయి తన ఇంటిపై జరుగుతున్న రాళ్ళదాడిని గురించి చెప్పింది.

ఆ చీకట్ల కూడ ఇంకా కొన్ని జీవాలగుంపులు, ఆగమై ఎనుకముందైన బర్లు, ఊర్లెకు వస్తనే ఉన్నయ్. ఎరమరెడ్డి మోహన్‌రెడ్డి, దొడ్డి మల్లయ్య వంటి ఆంధ్రమహాసభ నాయకులు వందమందికి పైగా గూండాలు రాళ్ళు వేస్తున్న స్థలం దగ్గరికి బయలు దేరింంద్రు. గూండాలు కార్యకర్తలు ఒకరినొకరు కొట్టుకుంటుంంద్రన్న వార్త ఊరంత తెలిసింది. అయినా జనం బైటికి వస్తలేరు. ఈ పరిస్థితిని ముందే ఊహించిన దొడ్డి కొమురయ్య అగ్రహోదగ్రుడై ఆగమేఘాల మీద అప్పుడే గొర్లను దొడ్లోదోలి పెద్ద ఎత్తున కేకలు వేస్తూ ఊరందరిని కదిలించిండు. అప్పటికే దొడ్డి మల్లయ్య కర్ర పట్టుకొని జనం ముందు వేగంగ నడుస్తుండు. ఆ గుంపులో ఎరమరెడ్డి మోహన్‌రెడ్డి లాంటి నాయకులు కూడ ఉన్నరు. అయినప్పటికి దొడ్డి మల్లయ్య పెద్దపెద్ద అంగలతో మున్ముందుకు కదిలిండు. ఇంతలో నక్కల జిత్తులు, తోడేళ్ళ ఎత్తులు తెలిసిన నవయువకుడు ఇరవైరెండు సంవత్సరాలు పైబడిన దొడ్డి కొమురయ్య పెద్దగుంపుతో వచ్చి ఊరేగింపులో కలిసిండు. తన మాటలతో యువకుల్లో ఉత్తేజం కలిగిస్తూ, పౌరుషాన్ని నింపుతూ సంఘటనా స్థలానికి మెరుపువేగంతో దూసుకొచ్చిండు. దొడ్డి కొమురయ్య అంతులేని ఆవేశంతో పెద్ద పెట్టున నినాదాలు చేస్తుంటే జనసంద్రం ఉప్పెనగ మారింది. అపర చాణక్యుడై ఊరి జనాన్ని కదిలించిన దొడ్డి కొమురయ్యను చూసి గూండాలు ఉలిక్కిపడ్డరు. ఊరేగింపు గ్రామ బొడ్రాయికి చేరుకునే సమయానికి ఊరు ఊరంత ఏకమై పెద్ద సైన్యంగ మారింది. జనం ఇంకా గుంపులు గుంపులుగా తరలి వస్తున్నరు. అది చూసిన దొరసాని గూండాలు అమ్మగారి ఆజ్ఞ మేరకు జనం మీద దాడులు చేయడం మొదలు పెట్టింంద్రు. ఇంతలో ఆంధ్రమహాసభ నాయకుల మరోదళం ఊర్లెకు రానే వచ్చింది. జనంతో కలిసిన నాయకులు ఎదురు దాడి చేయడంతో గూండాలు ఉరికిపొయ్యి జానమ్మ దొరసాని ఇంట్ల బడ్డరు. ఆంధ్రమహాసభ

కార్యకర్తల ఊరేగింపులో దొడ్డి మల్లయ్య, దొడ్డి కొమురయ్యలు ముందు వరుసలో ఉన్నరు. దొడ్డి కొమురయ్య వీరుడై ఒక్కో అడుగు ముందుకు కదుల్తుంటే గూండాలు ఎదురు నిలువలేక పోయింద్రు. జూలు విదిల్చిన సింహమై కదిలిన దొడ్డి కొమురయ్య వెంట జనం తండోపతండాలుగ తరలి వచ్చింది. ఆంధ్రమహాసభ కార్యకర్తలకు సైతం అందకుంట అగ్గిపిడుగై తరలిపోతున్న దొడ్డి కొమురయ్య వెంట ప్రజలు, కార్యకర్తలు గొప్ప ప్రదర్శనగ అద్భుతమైన ర్యాలిగా జనం రాకెట్ వేగంతో కదిలింద్రు. ఇంక ఒక్కనిమిషం ఆలస్యం చేసినా దొడ్డి కొమురయ్య కోటను ముట్టడించేటట్టున్నడని, జానమ్మ దొరసాని తన కోటలో నుంచే తుపాకులతో కాల్చమని సైగ చేసింది. అంతే ఊరేగింపు సరిగ్గా గడీ ముందుకు రాంగనే గూండాలు కాల్పులు జరిపింద్రు. అత్యంత ఉత్సాహంతో దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తున్న విప్లవ సింహం దొడ్డి కొమురయ్య సహజంగానే ఆ ఊరేగింపు అగ్రభాగాన ఉన్నడు. బందిపోటు దొంగ, కిరాతకుడైన మిష్కిన్ అలీ మూలమడత కిటికిలోంచి ఊహించని రీతిలో కాల్పులు జరిపిండు. ఆ తూటా గురితప్పి ఆంధ్రమహాసభ కార్యకర్త దొడ్డి మల్లయ్య మోకాలుకు తగిలింది.




**ఆరోజు కాల్పులు జరిపినకోటగోడ ఇదే.. ప్రస్తుతం కోటలేదు**

దాంతో ఆయన అక్కడ్నే కింద పడిపోయిండు. ఆ తుపాకిశబ్ధానికి జనం చెల్లాచెదురయ్యిండ్రు. కిందపడిపోయిన దొడ్డి మల్లయ్యని కార్యకర్తలు కొందరు పక్కకు తీసుకపోయిండ్రు. అన్నకు తగిలిన గాయాలతో దొడ్డి కొమురయ్యలోని ఆవేశం కట్టలు తెంచుకుంది. ఎర్రబడ్డ కండ్లతో సింహంలా గర్జించిన దొడ్డి కొమురయ్య చెదిరిపోతున్న జనాన్ని ఆపగలిగిండు. దొడ్డి కొమురయ్య తుపాకి గుండ్లను సైతం లెక్కచేయని మొండి ధైర్యంతో ముందుకు దునికిండు. ఆ క్షణంలో జనం ఉప్పొంగిన ఆవేశంతో మళ్లా తనవెంట కదిలిండ్రు. దొడ్డి కొమురయ్య గడీని సమీపిస్తే గూండాల ఆటలు సాగవని మరోసారి కాల్పులు జరిపిండ్రు. ప్రజల కోసం గళమెత్తిన యువకుడు, వెట్టిచాకిరిని నిర్మూలించడానికి, దేశముఖ్‌లను, భూస్వాములను తరిమికొట్టడానికి ఇదే సరైన అదునుగ భావించిన నవ యువకుడు, అత్యంత పోరాట పటిమ కలిగిన యోధుడు దొడ్డి కొమురయ్య డొక్కలోనుంచి తుపాకి గుళ్ళు దూసుకపొయినయ్. అయినా ఏ మాత్రం చెక్కుచెదరని గుండె బలంతో ఎక్కడ ఆగకుండ ఒక్కడుగు వెనకకు వేయకుండ బయటపడ్డ పేగుల్ని అదిమి పెట్టుకుంటూనే తన నడకను సాగించిండు. ఆ సమయంలో దొడ్డి కొమురయ్య చూపిన సాహసం ఏనాటికి మరవలేనిది. "ఇంత జరిగినంక ఇంకా ఈ దేశముఖ్‌ల పెత్తనాన్ని తుదముట్టించకపోతే గొర్లకు, మనుషులకు తేడా ఏముందని ప్రబోధించిండు. దొడ్డి కొమురయ్య తన చివరిశ్వాస ఉన్నంత వరకు వీరుడై కదిలిండు. జనాన్ని కదిలించిండు. నెత్తుటి ధారలతో వీరంగం సృష్టించి దొర గూండాలకు ముచ్చెమటలు పట్టించిండు. నేలకొరిగిన దొడ్డి కొమురయ్యను చూసిన జనం ఒక్కసారిగ తిరగబడ్డరు.

"నా ప్రాణత్యాగం మీ దేశముఖ్‌లకు, భూస్వాములకు ప్రాణగండమని" హెచ్చరించిండు. కాల్పుల్లో మోకాళ్ళకు గాయమైన దొడ్డి మల్లయ్యతో పాటు రేషవెల్లి కొండయ్య, లక్ష్మీనరసయ్యల తలలు పగిలినప్పటికి దొడ్డి కొమురయ్య త్యాగం, పోరాటపటిమను చూసిన జనం ఏమాత్రం భయపడకుండ తూపాకీ తూటాలకు ఎదురు నిలిచిండ్రు. సింహాలై గర్జించిండ్రు. దొడ్డి కొమురయ్య ఒక్కో రక్తం చుక్క వందలాది మంది వీరుల్ని తయారు చేసింది. దుఃఖాన్ని దిగమింగి వీరావేశంతో కదలిన జనం మీదికి మరోసారి కాల్పులు జరిపే ప్రయత్నాన్ని జనం తిప్పికొట్టిండ్రు. "దేశముఖ్ గుండాల్లారా ఖబడ్దార్, మీ తుపాకులు మమ్మల్ని ఆపలేవు. ఇగ మిమ్మల్ని వదిలిపెట్టేది లేదంటూ" సింహనాదాలు చేసిండ్రు. గూండాలను వెంటబడి తరిమికొట్టిండ్రు. క్షతగాత్రులైన ప్రజలను అక్కడికక్కడే ప్రజలు తమకు తోచిన పసరు

వైద్యం చేస్తనే ఉన్నరు. పసుపు అద్దుతనే ఉన్నరు. కదలలేని స్థితిలో రక్తం మడుగులో పడిఉన్న దొడ్డి కొమురయ్యను భుజాల కెత్తుకున్నరు. ఈలోపు రాత్రి తొమ్మిది పదిగంటల ప్రాంతంలో దేవరుప్పల నుంచి పెద్దఎత్తున జనం కడివెండికి తరలి వచ్చిండ్రు. ధర్మాపురం, మొండ్రాయి నించి వేలాదిగ వచ్చిన జనం అగ్రహోదగ్రులై గడీని ముట్టడించిండ్రు. గడ్డిమోపులకు నిప్పు అంటించి కోటలోపలికి విసిరేసిండ్రు. కట్టలు తెగిన ఆవేశంతో జనం సునామీని సృష్టించిండ్రు. అమాయక ప్రజల ఆవేశాన్ని చూసిన భుస్వాములు, దేశముఖ్ గూండాలు పరుగుపెట్టిండ్రు. అర్ధరాత్రి దాటింది. జనం చీకటిని లెక్కచేయకుండ మిణుగురు పురుగులై బారులు తీరిండ్రు. కంటిమీద రెప్పవాల్చని జనం కదలలేని స్థితిలో ఉన్న దొడ్డి కొమురయ్యను భుజానికెత్తుకున్నరు. పట్టరాని ఆవేశంతో పటపట పండ్లుగొరికి గడీని చుట్టుముట్టిండ్రు. అక్రమంగ నిలువచేసిన ధాన్యం బస్తాలను తీసి బయట ఎత్తేసిండ్రు. తెల్లారేసరికి యువకుడు, ఆజానుబాహుడైన దొడ్డి కొమురయ్య మరణ వార్త దావానంలా వ్యాపించింది. దీంతో కన్నీరుమున్నీరై కట్టలు తెగిన ఆవేశంతో నీర్మాల, మడిపడిగె ప్రజలు వెయ్యి మందికి పైగా కడవెండికి కదలివచ్చి దొరసాని తోటను ధ్వంసం చేసిండ్రు. భూస్వాముల పెత్తనం నశించాలని ప్రజలు ముక్తకంఠంతో నినదించిండ్రు. ఈ విధంగ దొడ్డి కొమురయ్య తన సాహసంతో, పౌరుషంతో నిస్సహాయులైన ప్రజలను నిప్పులు చెరిగేటట్టు చేసిండు. బానిసలై మూగజీవాలై బతికిన ప్రజల ఆవేశాన్ని పోరాటస్థాయికి తీసుకొచ్చిన వీరుడు దొడ్డి కొమురయ్య1945 జులై 5న అర్ధరాత్రి జరిగిన సంఘటనతో తెల్లారెసరికి చీకట్లను చీల్చుకొచ్చే సూర్యుడయ్యిండు. తన నెత్తురుతో సాయుధ పోరాట పతాకాన్ని ఎగరేసిండు.

పల్లెపల్లెని మేల్కొలిపి తాను మాత్రం అస్తమించిండు. అమరుడై నిలిసిండు.



**దొడ్డి కొమురయ్య కుప్పకూలిన ప్రదేశం ఇదే..**

దొడ్డి కొమురయ్య మరణ వార్త నలుదిక్కులు వ్యాపించింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తండోపతండలుగ కదిలి వచ్చింద్రు. దేవరుప్పల నుంచి కట్కూరి రామచంద్రారెడ్డి, కాచం కృష్ణమూర్తి నాయకత్వాన వందలాది మంది ప్రజలు కడివెండికి చేరుకుంద్రు. వడిసెలలు, కర్రలు, కారం పొట్లాలు, రోకలిబండలు ఏది దొరికితే అది ఆఖరికి రాళ్ళకుప్పలతో ఊరు ఊరంత కడివెండి గ్రామాన్ని మాటువేసి కూసుంది. విసునూరు రామచంద్రారెడ్డి దొరకు సంబంధించిన దొంగలు ఎవరొచ్చిన ఎదుర్కొనే బలగం తయారై బరిగీసి నిలబడ్డరు. చీమలసొంటి జనం చిరుతపులులై గర్జించింద్రు.

1946 జూలై 6న తెల్లారి ఎనిమిది గంటలకల్లా హైద్రాబాద్ నుంచి రిజర్వ్ పోలీసు బలగం కడవెండిలో దిగింది. ఊరు ఊరంత అగ్నిపర్వతం బద్దలైనట్టు రగిలిపోయింది. ప్రజల చేతిలో ఉన్న కర్రలను వాళ్ళ ఆవేశాన్ని చూసి పోలీసులే ఒకడుగు వెనక్కి తగ్గింద్రు. హత్యకు కారణమైన వాళ్ళను అరెస్టు చేస్తమని హామి ఇచ్చింద్రు. అయితే గ్రామంలో శాంతి భద్రతలకు ప్రజలందరు సహకరించాలని కోరింద్రు. అందరిని ప్రాధేయపడ్డరు.

గ్రామంలో పోలీసులు దిగిన కొద్దిసేపటికే ఆంధ్రమహాసభ కేంద్రకమిటీ పక్షాన వట్టికోట ఆళ్వారుస్వామి కడివెండికి చేరుకుండు. ప్రజల తిరుగబాటును ఆసరా చేసుకొని కమ్యునిస్టులు రెచ్చిపోయి పెద్దఎత్తున విధ్వంసానికి పూనుకోవడం వల్లనే పరిస్థితి విషమించిపోయిందని అన్నరు, అంతే కాకుండ వాళ్ళందరి మీద క్రిమినల్ కేసులు నమోదైనట్టు ఆ డి.ఎస్.పి ఆళ్వారుస్వామికి వివరించి చెప్పిండు. హోరెత్తిన జనం నిరసనల నడుమ దొడ్డి కొమురయ్య శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం జనగామకు తీసుకొనిపోయింద్రు. కాని మళ్ళీ కడివెండికి తీసుకొచ్చి అంత్యక్రియలు జరపడానికి పోలీసులు అనుమతించలేదు. ఆ సమయంలో ప్రజలు మరింత రెచ్చిపోయే అవకాశం ఉన్నందున జనగామలోనే దొడ్డి కొమురయ్యకు దహన సంస్కారాలు జరిపించింద్రు. పరిసర ప్రాంతాలలో నిషేదాజ్ఞలు విధించింద్రు. అప్పటికే ఆంధ్రమహాసభను కమ్యునిస్టు పార్టీని సైతం నిషేదించింద్రు. కమ్యునిస్టుల కదలికల మీద నిఘా ఏర్పాటు చేసింద్రు తప్ప, అసలైన హంతకులను పోలీసులు అరెస్టు చేయలేదు. ఉద్రిక్తత ఎక్కువగా ఉన్న గ్రామాలలో రిజర్వు పోలీసులు నాలుగు రోజుల వరకు ఉండి వెళ్ళిపోయింద్రు. ఆ తర్వాత వాళ్ళ స్థానంలో నల్లగొండకు చెందిన 12మంది రిజర్వు పోలీసులను గ్రామంలో జానమ్మ దొరసాని గడీకి కాపులా ఉంచింద్రు. ఆంధ్రమహాసభ అగ్రనాయకులు దొడ్డి కొమురయ్య చనిపోయిన ఫోటోలు తీయడానికి మనిషిని

పంపింద్రు. ఫోన్‌లలో మాట్లాడింద్రు. పత్రికలకు సమాచారం అందించింద్రు తప్ప అటువైపు తొంగిచూసినోళ్ళు లేరు.

ఆ రోజు నుంచి దొరసాని పొలంలో పనిచేయడానికి కూలీలు నిరాకరించింద్రు. జీతగాళ్ళు ధైర్యంగ ఇండ్లల్ల పనిచేయడం బంజేసింద్రు. ఊర్లో ఉన్న పన్నెండు మంది రిజర్వు పోలీసులకు ఎవరు ఏవిధమైన సహాయం చేయకుండ కట్టడి చేసింద్రు. ఈ విదంగ దొడ్డి కొమురయ్య మరణం ఎందరినో కదిలించింది. పోరాట దారుల్లో నడిపించింది. ఆ త్యాగాన్ని, అమరత్వాన్ని జనం ఉయ్యాల, బతుకమ్మ పాటలుగా కైగట్టింద్రు. కలుపుల్లో, కోతల్లో దొడ్డి కొమురయ్య వీరత్వాన్ని పాడుకుంద్రు.

ఇట్ల వెట్టి చాకిరికి వ్యతిరేకంగ మొదలైన తిరుగుబాటు ఏకంగ ప్రజల భూముల్ని గుంజుకున్న దేశముఖ్‌లను, భూస్వాములను తరిమికొట్టి ఎవరి భూముల్ని వాళ్ళు సొంతం చేసుకునే మహోద్యమానికి దారి తీసింది. ఈ దశలోనే కమ్యునిస్టులు రంగప్రవేశం చేసింద్రు. నల్లగొండ జిల్లా అంతట దొడ్డి కొమురయ్యకు జోహార్లు అర్పిస్తూ సభలు, ఊరేగింపులు జరిపి ప్రజలను సంఘటితం చేసింద్రు. ఆ సందర్భంలో పాడి ప్రచారం చేసిన పాటే ఇది..

"అమరజీవివి నీవు కొమురయ్య / అందుకో జోహార్లు కొమురయ్య
న్యాయమన్నది లేని నైజాము రాజ్యాన / విశ్వరాక్షసుడైన విసునూరు దేశముఖ్
పాలించుచున్నటి పల్లె కడవెండిలో/ ప్రజల హక్కుల కొరకు కొమురయ్య
ప్రాణాలనిచ్చినవు కొమురయ్య / దేశముఖ్‌ల కెదురు న్యాయరక్షణ కొరకు
నడుముగట్టి నువ్వు మునుముందు నడిచావు
గూండాల తుపాకి గుండ్లకు బలియైన
వీర తేజము నీవు కొమురయ్య / విప్లవాగ్ని నీదె కొమురయ్య

ఈ విధంగ ప్రపంచ ప్రసిద్ధి చెందిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాంది పలికింది దొడ్డి కొమురయ్య వీరమరణం. భూస్వాములు, దేశముఖ్‌ల దౌర్జన్యాలకు "బాంచన్ నీ కాల్మొక్తా" అన్న బానిసజనం ప్రభంజనంగ మారింద్రు. పదంపదం కలిపి కదంతొక్కింద్రు.

దొడ్డి కొమురయ్య మరణవార్త విసునూరి రామచంద్రారెడ్డికి చేరిన వెంటనే ఆయన తన చుట్టుపక్కల ఉన్న చోటా మోటా దొరలకు వారి బలగాలకు వర్తమానం పంపి అందరిని పిలిపించిండు. "ఈ ప్రజాఉద్యమ తీవ్రతను అణిచివేయకపోతే,

మన మనుషుల్ని వాళ్ళ చెరనుంచి విడిపించుకోలేకపోతే భూస్వాములకు కాలం చెల్లినట్టే" అని విసునూరు రామచంద్రారెడ్డి ఆవేశంగ మాట్లాడిండు. ఆ మరుక్షణమే తన కొడుకు జగన్‌మోహన్‌రెడ్డి (బాబుదొర) నాయకత్వాన పెద్దసంఖ్యలో రజాకార్లను, గూండాలను వెంట ఇచ్చి కడివెండికి పంపించిండు.

జగన్‌మోహన్‌రెడ్డి రాకముందే రామన్నపేట తాలూకాలోని మడిపడగ సహా అనేక గ్రామాల నుంచి వడిసెలలు, కర్రలతో జనం కడివెండికి చేరుకుండ్రు. మంది మార్భలంతో వస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని ఊరిబైటనే అడ్డుకొని, వెంటబడి కుక్కని తరిమినట్టు తరిమి కొట్టిండ్రు. ఆయన వెంట వచ్చిన గూండాలు, రజాకార్లు కూడా పారిపోయిండ్రు. దేశముఖ్‌ల, పోలీసుల బలగాలకు ఐదురెట్లు అమాంతంగ గుమిగూడిన జనం తెల్లారి మధ్యాహ్నం వరకే మూడు వైపుల నుండి శత్రు బలగాలను చుట్టుముట్టిండ్రు.తుపాకి గుళ్ళను మించిన వేగంతో వడిసెల రాళ్ళు రయ్యిమంటూ దూసుకపోతున్నయ్. ఇంతలో పెద్దగుంపుతో వచ్చిన భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి దేశ్‌ముఖ్‌ల కచ్చడానికి ఎదురు తిరిగి ఆ బండిని అమాంతం లేవట్టి ఎత్తేసిండు. దేశముఖ్‌లు భూస్వాములు కచ్చడాలను మలుపుకొని పిచ్చికుక్కలోలె పరుగులు తీసిండ్రు. ఈ జన ప్రవాహం విసునూరు పొలిమేరల దాక కొనసాగింది. ప్రజల చేతికి చిక్కిన అత్యంత నీచులు అనుముల రాంరెడ్డి, బులిమిది జాగీర్దారు, ఖాన్‌మియా లను ప్రజలు చితకబాది కసితీర్చుకున్నరు. ఈ విధంగ దేశముఖ్‌లను, భూస్వాములను ఎదిరించి బానిసత్వాన్ని ధిక్కరించిన సామాన్యరైతులు కర్ర, కత్తి, కొడవలి అనకుంట చేతికి ఏది దొరికితే అదందుకొని తిరుగుబాటు చేసిండ్రు. ప్రపంచ చరిత్రలో జరిగిన ఏ విప్లవోద్యమానికి తీసిపోని విధంగ సాధారణ రైతుకూలీలు, యువకులు, "బాంచన్ దొరా... నీ కాల్మొక్త" అన్న పిలుపుతో అలిసిపోయిన గొంతులు సాయుధ పోరాటానికి సమరశంఖం పూరించిన వీరోచిత ఘట్టం కూడ ఇదే.

### కడివెండి సంఘటన – కాంగ్రేసు నాయకులు

దొడ్డి కొమురయ్య హత్యకు కారణమైన విషయాలను విచారించడానికి స్టేట్ కాంగ్రేసు నాయకులు కోదాటి నారాయణరావు, చౌడవరపు విశ్వనాధం కడివెండికి రావడం జరిగింది. దొడ్డి కొమురయ్య ఘటనా స్థలాన్ని సందర్శించి, వారి ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేసిండ్రు. మందుముల నర్సింగరావు "రయ్యత్" పత్రికలో కమ్యునిస్టులు ప్రజలను హింసాత్మక చర్యలవైపుకు పురికొల్పుతూ తప్పుదోవ పట్టిస్తున్నారని రాసిండు.

# దొడ్డి కొమురయ్య మరణానంతరం నిజాం రాజ్యం

దొడ్డి కొమురయ్య ఘటనకు కొద్ది రోజుల ముందుగానే ఐలమ్మ పంట పొలం పైకి విసునూరు రామచంద్రారెడ్డి దాడి చేపిచ్చిండు. ఈ దాడిని ఆంధ్రమహాసభ నాయకత్వంలో భీమిరెడ్డి నరసింహారెడ్డి, చకిలం యాదగిరిరావు తదితర నాయకులు అడ్డుకున్నరు. ఈ సందర్భంగ విసునూరు రామచంద్రారెడ్డి ప్రోత్సాహంతోటి ఆంధ్రమహాసభ నాయకుల మీద పోలీసులు దొమ్మీ కేసు పెట్టింద్రు. బలవంతపు వసూళ్ళకు సిద్ధపడ్డ ప్రభుత్వం కఠిన చర్యలకు పూనుకున్నది. ఈ నేపథ్యంలోనే విప్లవసింహమై గర్జించిన దొడ్డి కొమురయ్య సాహసం సాయుధపోరాటానికి నాంది పలికింది. దొడ్డి కొమురయ్య మీద కాల్పులు జరిగేనాటికి హైద్రాబాద్ ప్రధానమంత్రిగ ఛత్తారి నవాబు ఉండేటోడు. ఆ తర్వాత 1946 ఆగస్టులో మీర్జా ఇస్మాయిల్ ప్రధానమంత్రిగ వచ్చిండు. డిసెంబర్‌లో నల్లగొండ జిల్లా మీద "మార్షల్‌లా" విధించిండు. దేవరుప్పల, పులిగిళ్ళ, మల్లారెడ్డి గూడెం, పాతసూర్యాపేట మీద జరిగిన పరస్పర దాడులో వందలాది మంది చనిపోయింద్రు. సైన్యం వేలాది మందిని నిర్బంధించింది.

దొడ్డి కొమురయ్య మరణవార్త తెలిసిన మరుక్షణమే పెండెం వాసుదేవ్, జైని మల్లయ్య, ముత్యం ప్రకాశ్, గూండా కేశవ్, సిద్దుల బాలరాజ్ లాంటి నాయకులు భువనగిరి బంద్‌ని నిర్వహించింద్రు. భువనగిరి ప్రధాన వాణిజ్యకేంద్రం. అక్కడి వర్తక సంఘం నాయకుడు సేట్ రామ్‌దయాళ్ కాంగ్రేసు అనుకూలుడైనప్పటికి బంద్ పాటించవలసిందిగా అందరిని ఆజ్ఞాపించిండు. దీంతో కనీవినీ ఎరుగని రీతీలో భువనగిరి బంద్ జరిగింది. జిల్లా వ్యాప్తంగ నిరసనజ్వాలలు అంటుకున్నయ్. క్రమంగ పోరాటం తీవ్రరూపం దాల్చింది.

దొడ్డి కొమురయ్య పోరాటస్ఫూర్తితో పుడితొక్కటి సస్తె రెండని జనం తిరగబడ్డరు. తర్వాత అనేక మంది రైతులు తాము కోల్పోయిన భూములను తిరిగి దక్కించుకుంద్రు. ధర్మాపురంలో మఖ్తేదారు పూస్కూరు రాఘవరావు రైతులను, లంబాడీలను బేధఖల్ చేసి స్వంతం చేసుకున్న భూమిని తిరిగి సాధించుకుంద్రు. సాయుధులైన పోలీసులను సైతం లెక్కచేయకుండ "ఇది మా భూమి మధ్యల మీరెవర్రా.." అని ఆవేశంతో ఒక్క పెట్టున కదిలిన రైతులు వాళ్ళ వాళ్ళ భూముల్ని ఎర్రజెండాలు పాతి మరీ స్వంతం చేసుకుంద్రు. ప్రజలు కోపోద్రిక్తులైతున్న ఈ దశలో ఆంధ్రమహాసభ వేగంగ, విస్తృతంగ గ్రామాలల్ల వ్యాపించింది. గ్రామగ్రామాన వెట్టిచాకిరిలో మగ్గిపోతున్న జనం, ముఖ్యంగ

రైతులు, చాకలి, మంగలి, గొల్ల కురుమలు, మాలలు, మాదిగలు సంఘం జెండా ఎగురవేయడం మొదలైంది. ఏండ్ల తరబడి సాగుచేస్తున్న భూములు ఏనాడైన తమ సొంతమైతయని నిరుపేద రైతుకూలీలు రెక్కలు ముక్కలు చేసుకొని సేద్యం చేసిన భూముల కోసం ఎదురు చూస్తుంర్రన్న విషయాన్ని భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి గ్రహించిండు. కౌలురైతులు భూములను వొదిలిపెట్టవలసిన అవసరం లేదని, దున్నేవానికే భూమి దక్కాలన్న నినాదాన్ని ప్రచారం చేసిండు. ఇంతకాలం దేశముఖ్‌ల దౌర్జన్యాలకు నలిగిపోయి భూమికోసం, బువ్వకోసం అల్లాడిన సామాన్యజనం సైతం పెద్దఎత్తున పోరాటంలో ముందుకు కదిలింర్రు. దీంతో ఈ భూపోరాటాన్ని దేవులపల్లి వెంకటేశ్వరరావు కూడ సమర్ధించిండు.

దొడ్డి కొమురయ్య పోరాటస్ఫూర్తితోని నల్లగొండ, వరంగల్ జిల్లాలకు విస్తరించిన భూస్వామ్య వ్యతిరేకపోరాటంలో వెల్లువెత్తిన ప్రజాస్పందనను చూసిన ఆంధ్ర కమ్యునిస్టు నాయకులు పార్టి పేరుతో ఉద్యమాన్ని రిమోట్ చేయడం మొదలు పెట్టింర్రు. ఏడు లక్షలకు పైగా సభ్యత్వం కలిగిన ఆంధ్రమహాసభ నుంచి అతివాద దృక్పథాన్ని అవలంబిస్తున్న వారందరిని బయటికి గుంజింర్రు. పదివేల దాక సభ్యత్వాలు చేయించింర్రు. కమ్యునిస్టుపార్టీని బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేసింర్రు. ఆనాటినుంచే తెలంగాణ నాయకుల మీద పెత్తనం చేయడం కూడ మొదలు పెట్టింర్రు.

వాస్తవానికి "దున్నేవానికే భూమి" అన్న నినాదంతో కూడిన ఈ భూపోరాటం ఆంధ్రా నాయకులకు అస్సలు ఇష్టం లేకపోయినప్పటికి, ఈ పోరాటాన్ని అడ్డం పెట్టుకొని తెలంగాణలో నిజాం రాజ్యాన్ని కూల్చివేయాలనే కుట్రలకు తెరలేపింర్రు. విశాలాంధ్రలో ప్రజారాజ్యం అనే నినాదానికి ప్రాణప్రతిష్ఠ చేయడం కోసం పకడ్బందీగ ప్రణాళికలు సిద్ధం చేసుకుంర్రు. లోతుపాతులు తెలువని తెలంగాణ నాయకులు భీమిరెడ్డి నర్సింహ్మారెడ్డి నాయకత్వంలో పెద్దఎత్తున భూ పంపకాలు మొదలుపెట్టింర్రు. ముఖ్యంగా దేవరుప్పల, కడివెండి, మొండ్రాయి, కామారెడ్డిగూడెం, లక్ష్మక్కపెల్లి, పాఖాల, రామవరం, రామన్నగూడెం, ధర్మాపురం, రంగాపురం, ముత్తారం, పోచంపెల్లి, రేగుల, పెద్ద వంగర, పాలకుర్తి, దడిదపెల్లి, మల్లంపెల్లి, వావిలాల, ఈరవెన్ను, కొండా పురం, ఒగులాలపల్లి, నీర్మాల, పెద్ద మడూరు, చిన్న మడూరు, లింగాల ఘణపురం, కుర్రారం, గబ్బెట, సముద్రాల, కోమటిగూడెంలో భూ పంపకాలు ఊపందుకున్నయ్. భూ స్వాములకు సంబంధించిన వందల పుట్ల ధాన్యంతో పాటు పశువులు, వ్యవసాయ పనిముట్లు దొరికింది దొరికినట్టు ప్రజలకు పంచిపెట్టింర్రు. కరుడుగట్టిన

భూస్వాములను ప్రజాకోర్టులో నిలబెట్టి శిక్షలు అమలు చేసే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టింద్రు. భూస్వాములు ప్రభుత్వ సహాయం కోసం పరుగులు తీసింద్రు. కౌలుదారుల బాధలను ఏనాడు పట్టించుకోని భూస్వాములు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడం కోసం హుటాహుటిన హైద్రాబాద్‌కు బయలుదేరింద్రు. జనగామ తాలూకాలో ఉవ్వెత్తున ఎగిసిపడిన రైతుల పోరాటాన్ని, ప్రజాఉద్యమ పరిణామాన్ని, తీవ్రతను తట్టుకోలేని దేశముఖ్‌లు, భూస్వాములు ఉక్కిరి భిక్కిరై ఊర్లను ఇడిసిపెట్టింద్రు. ఈ విధంగ సామాన్య రైతుకూలీ జనం భూస్వాములకు ఊపిరి మెసలకుంట జేసింద్రు.

ఈ పోరాటంలో ప్రజలే సైనికులై తరలి వచ్చింద్రు. కళారూపాల ప్రదర్శనతో సమావేశాలు, సభలు జరుపుకుంటు దొడ్డి కొమురయ్య వీర మరణాన్ని కైగట్టి పాడింద్రు. వెట్టిచాకిరీ, లెవీధాన్యం సమస్యపై స్థానిక ఆంధ్రమహాసభ కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నరు. ఈ దశలో కమ్యునిస్టులు పెద్దఎత్తున విధ్వంసాలకు పాల్పడడంతో ఆంధ్రమహాసభ ప్రభుత్వాన్ని కూలదోయడానికి ప్రయత్నం చేస్తున్నదని కార్యకర్తల మీద ప్రజల మీద తప్పుడు కేసులు బనాయించింద్రు. చిత్రహింసలకు గురిచేసింద్రు. దీంతో ప్రజలు, రైతులు పోరాటంలో ఒకడుగు వెనకకు తగ్గింద్రు. ప్రజలమీద, కార్యకర్తల మీద పెట్టిన కేసులన్నింటిని ఆంధ్రమహాసభ తరఫున నాగులపల్లి కోదండరామారావు వాదించిండు. వీరిలో దేవులపల్లి రాఘవేంద్రరావు, చకిలం యాదగిరిరావు లాంటివాళ్ళు ఆరు నెలలు జైలుశిక్ష అనుభవించింద్రు. భారతదేశ స్వాతంత్ర్య ప్రకటన వెలువడిన ఈ సమయంలో ప్రజలు పోరాటాలకు సిద్దంగ లేరనే విషయం స్పష్టమయ్యింది. కాని అతివాద లక్షణాలు గల కమ్యునిస్టులు మాత్రం జనాన్ని పోరాట దారిలోనే నడిపించింద్రు. రహస్య సమావేశాలు నిర్వహించి దళాలను ఏర్పాటు చేసింద్రు.

ఆంధ్రా ప్రయోజనాల కోసం భాషా ప్రాతిపదికన రాష్ట్రం ఏర్పడాలని, విశాలాంధ్ర లక్ష్యంగ పోరాటాన్ని ఎగదోసి చిందులేసింద్రు. ఈ పాటికే కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అనే పుస్తకాన్ని తయారు చేసి పెట్టుకుండు. దీంతో తెలంగాణలోని జనగామ తాలూకాలో అప్పటి వరకు జరిగిన పోరాటమంత నిజాం వ్యతిరేక పోరాటమనే భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకపోయింద్రు. నినాదాన్ని మార్చి కొత్తగ నిజాం గద్దె దిగాలని డిమాండు చేసింద్రు. సరిగ్గ ఇదే సమయంలో భువనగిరి ఆంధ్ర మహాసభ నుండి ఆవేశంతో వెళ్ళిపోయిన కొండా వెంకట రంగారెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, మందుముల నరసింగరావులు జాతీయ పక్షం పేరుతో

పోటి ఆంధ్ర మహాసభను ఏర్పాటు చేసిన సంగతి మనకు విధితమే. అయితే కడివెండి, దేవరుప్పుల, మొండ్రాయి వంటి అనేక గ్రామాల్లో భూపంపకాలు మొదలు పెట్టిన తర్వాత భుస్వాములు నగరాలకు పారిపోయింద్రు. ప్రజా ఉద్యమానికి భయపడ్డ భూస్వాములు ఈ పోటి ఆంధ్రమహాసభలో చేరింద్రు.

ఆంధ్రా కమ్యూనిస్టు నాయకులు, తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఇద్దరు కూడా నిజాం దిగాలని ఒకే డిమాడు చేసింద్రు. అయితే తెలంగాణ కాంగ్రెస్ నాయకుల లక్ష్యం విశాల భారత దేశంలో హైదరాబాదు కలవాలని, కాని ఆంధ్రా కమ్యూనిస్టు నాయకుల లక్ష్యం ఇందుకు భిన్నమైనది. నిజాంను గద్దె దింపి హైదరాబాదును భాషా ప్రాతిపదికన ముక్కలు చేయాలన్న కుట్ర వాళ్ళ డిమాండులో ఉన్నది. బిక్కజచ్చిన ఆంధ్రా ప్రయోజనాల కోసం సుసంపన్నమైన తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రాలో కలపాలన్న కుట్ర వాళ్ళలో బలంగ నాటుకుంది. సరిగ్గా ఈ సమయంలోనే ఖాసీంరజ్వీ నాయకత్వంలో రజాకార్లు అరాచకాలు మొదలు పెట్టింద్రు. నిజాం అధికారాన్ని కాపాడటమే లక్ష్యంగ పని చేసింద్రు. నిజాం అధికారానికి ఇబ్బందిగా మారిన కమ్యూనిస్టు నాయకుల, సానుభూతిపరుల మీద దాడులు చేయడం మొదలు పెట్టింద్రు.

నిజాం రాజ్యాన్ని కూలదోయడానికి కంకణం కట్టుకున్న కమ్యునిస్టులు దళాలుగా ఏర్పడి ప్రజల ప్రాణాలను ఫణంగ పెట్టి పోరాటం కొనసాగించింద్రు. ఖాసీం రజ్వీ రజాకార్లకు సర్వసేనాని, విసునూరు దేశముఖ్ ఉపసేనానిగ నియమించబడ్డరు. విసునూరు రామచంద్రారెడ్డి కొడుకు జగన్‌మోహన్‌రెడ్డి రజాకారు నాయకుడిగా ఉంటూ సైన్యాన్ని వెంటబెట్టుకొని ఎంతోమందిని చంపిండు. ఎన్నో గ్రామాలను తగలబెట్టిండు. ప్రజలను చిత్రహింసలు పెట్టి ఆస్తులను ధ్వంసం చేసిండు. అయినా కమ్యునిస్టులు వాళ్ళ దళాలను విస్తరించడం ఆపలేదు. కొత్తవాళ్ళను దళాల్లోకి రిక్రూట్ చేస్తూనే ఉన్నరు. ఎందరో యువకులు ప్రాణాలు కోల్పోతూనే ఉన్నరు. వాస్తవంగ కమ్యునిస్టులకు గెరిల్లా సైనిక శిక్షణ పొందిన నాయకత్వం లేదు. ఒకవేళ ఉన్నా చావు బతుకుల మధ్య పోరాడుతూ శిక్షణ పొందే అవకాశం లేదు. దళాలు ఒకచోటు నుండి మరోచోటుకు కదలడమే ఒక పెద్ద పోరాటంగ మారింది.

వడ్లకొండ గ్రామం పార్టీ కేంద్రంగ, చిదురాం నాయకత్వంలో స్థానికంగ ఒక దళం ఏర్పడ్డది. ఆధునిక ఆయుధాలు కలిగిన పోలీసుల చేతుల్లో నాయకులు కార్యకర్తలు పిట్టల్లా రాలిపోయింద్రు. ఆ తర్వాత విధిలేని పరిస్థితుల్లో గ్రామస్థులు ఏకమై పోలీసు వాహనాలకు నిప్పంటించింద్రు. పోలీసులు కాల్పులు జరిపి ప్రజలను

తరిమి వేసింగ్రు. ఈ దాడి జరగడానికి ముందే తాడికొండ గట్ల మీద ఉన్న కమ్యూనిస్టు దళంపై దాడి జరిపి ఇద్దరిని చంపేసింగ్రు. ఎంతో మందిని అరెస్టుచేసింగ్రు. నల్ల నరసింహులు జాడ చెప్పమని పోలీసులు కోలుకొండలో ఇండ్లను తగులబెట్టి పది మందికి పైగా చంపేసింగ్రు. ఇలాంటి పోరాటాలనే కమ్యునిస్టులు జైత్రయాత్రలంటూ ప్రచారం చేసింగ్రు.

కడివెండిలో దేశముఖ్‌కు సంబంధించిన వరిధాన్యం, పొగాకు, మిరప, జొన్నలు, కందులు, పెసర్లు, శెనిగలు ప్రజలకు పంచిపెట్టింగ్రు. భూమితో పాటు ఎడ్లు,నాగండ్లు కూడా ప్రజలకు పంచింగ్రు. దొరసాని గడీని మొత్తం ఖాళీ చేసింగ్రు. ఈ విషయం తెలుసుకున్న దేశముఖ్ ఉగ్రరూపం ధరించిండు. తన కొడుకు జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పోలీసులను, రాజాకార్లను కడవెండి మీదికి దాడికి పంపిండు. పోలీసులు, రజాకార్లను కనిపెట్టిన ప్రజలు గ్రామాన్ని విడిచి వాగులో దాసుకున్నరు. ఆ రోజు దొడ్డి మల్లయ్య పెద్ద కొడుకు ఆగయ్యని జగన్‌మోహన్‌రెడ్డి చెట్టుకు కట్టేసి అత్యంత కిరాతకంగ కాల్చి చంపిండు. రెండు వందల ఇండ్లకు పైగా తగలబెట్టి విసునూరుకు వెళ్ళిపోయింగ్రు. ఆ తర్వాత రెండు రోజులకు మళ్ళా కడివెండి మీద దాడిచేసి మరో రెండు వందల ఇండ్లను తగలబెట్టింగ్రు. జగన్‌మోహన్‌రెడ్డి ఇంతటితో ఆగకుండ చింతకింది యాదగిరి, ఎలుకపెల్లి బాలయ్యలను తుమ్మచెట్లకు కట్టేసి కాల్చి చంపిండు. శవాలను ఎడ్లకొట్టంలోకి ఈడ్చుకొచ్చి తగలబెట్టింగ్రు. కడివెండి ప్రజలు శత్రుదాడుల నుంచి తప్పించుకోవడానికి దాదాపు ఒక సంవత్సరం పాటు ఊరునే విడిచిపెట్టి బావులకాడ, అడవుల్లో సంసారం చేసింగ్రు. కొందరు గ్రామస్థులు శాశ్వతంగ ఊరుని విడిచిపెట్టి ఎల్లిపోయింగ్రు. నడి ఎండాకాలం మే నెలలో జగన్‌మోహన్‌రెడ్డి అరవై మందితో దేవరుప్పల మీద దాడి చేసిండు. ఇండ్లను తగలబెట్టిండు. పదిమందిని నిలబెట్టి కాల్చి చంపిండు. ఈ విధంగ జగన్‌మోహన్‌రెడ్డి అకృత్యాలు ఒకటి రెండు కాదు. లెక్కలేనన్ని దుర్మార్గాలు చేసిండు.

దేవరుప్పలలో నరరూప రాక్షసుడైన అబ్బాసలి మీద దాడి చేసి చితకబాదిన దళం పోలీసులు వస్తుంగ్రన్న వార్తతో అందరు తప్పించుకుంగ్రు. ఎక్బాల్ హుస్సేన్ నాయకత్వంలో దేవరుప్పల మీద దాడిచేసిన యాభై మంది పోలీసులు దొరికినోన్ని దొరికినట్టు చితకబాదింగ్రు. నలభై ఇండ్లని తగలబెట్టి ఎల్లిపోయింగ్రు.

తెలంగాణ సాయుధరైతాంగ పోరాటానికి ప్రపంచ ఖ్యాతిని తెచ్చిపెట్టిన సంఘటన బైరాన్‌పల్లి నరమేధం. నిజాం సైన్యం పోరాటయోధులు, యువకులను ఎనభైనాలుగు

మందిని ఒకేచోట నిలబెట్టి మిషిన్‌గన్‌లతో ఒకేసారి మూకుమ్మడిగా కాల్చి చంపింది.

రజాకార్ సైన్యాలు కూటికల్లులో పధ్నాలుగు మందిని కాల్చి చంపినయ్ ఒక్కరోజే తొంభైఎనిమిది మందిని చంపడంతో ఆ ప్రాంతమంతా మృత్యునీడలు కమ్ముకున్నయ్. భయానక వాతావరణం నెలకొన్నది. ఇంతటి దారుణ మారణకాండ ఏ చరిత్రలో జరిగిన దాఖలాలు లేవు. ఈ విషాద సంఘటన నెత్తుటి మరకలతో చరిత్ర పుటలను తడిపేసింది.

ఇంత జరుగుతున్నా అజ్ఞాతవాసంలో ఉన్న కమ్యునిస్టుపార్టీ హైద్రబాద్ సిటి కమిటి "భారత యూనియన్‌లో చేరడం వలన లాభం లేదని కమ్యునిస్టు పార్టీ పోరాటం ద్వార తెలంగాణను విముక్తి చేసి ప్రజారాజ్యం స్థాపిస్తుందని" ప్రకటన చేసింది. కమ్యునిస్టుల పోరాటం ఆగకపోవడంతో కాశీంరజ్వీ నాయకత్వంలో రజాకార్ల దాడులు మరింత పెరిగినయ్.

విసునూరుకు అత్యంత సమీప గ్రామం శాతాపురం. ఇక్కడ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో దాడులు ఉధృతం కావడానికి ఆ గ్రామంలోని మాదిగలు అధికసంఖ్యలో రజాకార్లుగ మారడం ప్రధాన కారణం. రజాకార్లుగ మారిన డెబ్బయ్ ఎనభై మంది హరిజనులు తుపాకులు, బల్లాలు, బరిసెలు, గొడ్డళ్ళు పట్టుకొని జగన్‌మోహన్‌రెడ్డి వెంట కదిలి గ్రామాల మీద దాడులు చేయడం, లూటీచేసి దొరికిన వాళ్ళను కాల్చిచంపడం, స్త్రీలను చెరచడం వంటి దుర్మార్గాలకు పాల్పడ్డరు. దీంతో ఆ గ్రామంలోని దళ సభ్యుడు ఇటుకాల బక్కయ్య అత్యంత చాకచక్యంగ మాదిగ రజాకార్ల ఇండ్లమీద దాడిచేసి ఎనబై ఇండ్లను తగలబెట్టిండు. ఆరోజు నుంచి వాళ్ళు జగన్‌మోహన్‌రెడ్డి వెంట వెళ్ళడం బంజేసింద్రు. సామాన్య రైతుకూలీ జనానికి అండగా నిలబడ్డరు. ఆరోజు నుంచి ఆ పరిసర ప్రాంతంలో సంచరించే రజాకార్ల ఆగడాలను కట్టడి చేసింద్రు. హుజూర్‌నగర్ తాలూకా మల్లారెడ్డి గూడాన్ని నిజాం సైన్యం చుట్టుముట్టింది. ప్రజలు వడిసెలతో తీవ్రంగ ప్రతిఘటించింద్రు, స్త్రీలు పెద్దఎత్తున రాళ్ళు అందిస్తూ కారం పొట్లాలు, రోకలి బండలతో యుద్ధానికి సిద్ధమయ్యింద్రు. రాజీ పేరుతో కుట్ర చేసిన సైన్యం అనేకమందిని కాల్చి చంపింది.

ఐదువందల మందితో కూడిన నిజాం సైన్యం ఆధునిక ఆయుధాలతో అర్ధరాత్రి పాత సూర్యాపేటను చుట్టుముట్టింది. సూర్యాపేట ప్రజలు పథకం ప్రకారం వడిసెల రాళ్ళను సైన్యం మీదికి విసిరింద్రు. రాళ్ళ వర్షంతో భయపడ్డ సైన్యం దొంగచాటుగ జరిపిన కాల్పులకు ఆంధ్రమహాసభ కార్యకర్తలు బలైంద్రు. ఎందరో వీరులు నెత్తుటి

మడుగుల్లో దాదాపు ఏడెనిమిది గంటలు హోరాహోరి పోరాటం కొనసాగించిండ్రు. అక్టోబర్ 18న జరిగిన బాలెంల గ్రామ సంఘటన అత్యంత వీరోచితమైనది. తెల్లవారు జామున గ్రామాన్ని చుట్టుముట్టిన నిజాం పోలీసులు కాల్పులు జరపడానికి సిద్ధపడుతున్న సమయంలో ఆజానుబాహుడు, అత్యంత బలాఢ్యుడైన గార్లపాటి అనంతరెడ్డి పోలీసుల తుపాకులను గుంజుకొని ఎదురుతిరిగి పోరాడిండు. ఇదే అదునుగా గ్రామంలోని యువకులు పెద్దఎత్తున పెనుగులాడి, ప్రాణాలకు తెగించి పోలీసు ఆయుధాలను గుంజుకొని ఎదురు తిరిగిండ్రు. ఈ విధంగ భుస్వాములు, దేశముఖ్‌లు, జాగీర్ధార్‌లను ఎక్కడికక్కడ ప్రజలు నిలువరించిండ్రు. దాదాపుగ ప్రతి గ్రామంలోని ప్రజలు వడిసెల, గుత్పలతో సాయుధమూకలకు ఎదురునిలిచి తిరగబడే శక్తిని పొందిండ్రు. దొడ్డి కొమురయ్య వీరమరణం, కడివెండి పోరాట ఘట్టం ప్రజలకు సాయుధ మిలిట్రిని ఎదుర్కొనే శక్తినిచ్చింది. దొడ్డి కొమురయ్య త్యాగం పల్లెపల్లెన ప్రతిధ్వనించింది. బుసగొట్టే పాము పడగల మీద నాట్యం చేయడం నేర్పింది. ఎంతటి శత్రువునైనా తొకముడిపించే ధైర్యాన్ని పల్లెపల్లెన నింపింది.

మొత్తంగ ఈ పోరాట ఘట్టాలన్ని పాలకవర్గానికి వణుకు పుట్టించినయ్. ఏకంగ నిజాం నవాబు తన కొడుకును బాలెంలకు పంపి చనిపోయిన వాళ్ళకు మానవత దృక్పథంతో ఎక్స్‌గ్రేషియా ఇచ్చి సానుకూల వాతావరణాన్ని కల్పించే ప్రయత్నం చేసిండు. ఈ సంఘటన నిజాం ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలపట్ల గల సానుభూతిని, తెలంగాణ ప్రజల ధర్మపోరాటాన్ని తెలియజేస్తుంది. అయితే దొడ్డి కొమురయ్య మరణంతో విజృంభించిన ప్రజలు తమ పోరాటంతో దేశముఖ్‌లను, భూస్వాములను, జాగీర్ధార్‌లను గ్రామాల నుంచి తరిమితరిమి కొట్టిండ్రు. దురదృష్టవశాత్తు అప్పటి వరకు ఆంధ్రమహాసభ పేరుతో చేసిన పోరాటం కమ్యూనిస్టు పార్టీ పోరాటంగ మారింది. కమ్యూనిస్టు పార్టీ కార్యాలయాన్ని ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్న విజయవాడకు మార్చిండ్రు. 1946 అక్టోబరు నుంచి విజయవాడ కేంద్రంగానే కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలు కొనసాగించింది.

ఒకవైపు రజాకార్లు, మరోవైపు కమ్యునిస్టులు సాగిస్తున్న మారణకాండను అణిచివేయడానికి నిజాం సర్కారు "మార్షల్ లా" ని ప్రకటించింది. దీంతో కమ్యునిస్టులు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయి రహస్య ఉద్యమాలు సాగించిండ్రు. ఆ తర్వాత కొద్ది రోజులకు బ్రిటీషోళ్లు భారతదేశానికి అధికారాన్ని అప్పజెప్పిండ్రు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఇదే అదునుగా భావించిన ఆంధ్రా కమ్యూనిస్టు నాయకులు తమ ప్రణాళికను అమలులో పెట్టిండ్రు. కమ్యునిస్టు పార్టీకి చెందిన అతివాదులు 1947 సెప్టెంబర్

11న నెహ్రూ ప్రభుత్వానికి వ్యతిరేకంగ సాయుధ గెరిల్లా పోరాటానికి పిలుపు నిచ్చింద్రు. గ్రామ స్వరాజ్యాల పేరుతో గ్రామాలను తమ ఆధీనంలోకి తెచ్చుకునే ప్రయత్నం చేసింద్రు. ఇందుకోసం జైత్రయాత్రను నిర్వహించింద్రు. అయితే ఈ సందర్భంగ హింసామార్గాన్ని ఎంచుకున్నరు. తమకు అనుకూలం కాదు అనుకున్న వారి ఇండ్లపై దాడులు చేసింద్రు. తెలంగాణ రైతాంగం సాయుధపోరాటంలో నిజాం ప్రభుత్వం మీద, భూస్వాముల మీద తిరుగులేని పోరాటం జరుపుతున్న సమయంలో ఆంధ్ర కమ్యునిస్టు పార్టీ నాయకులు కాలువలు తవ్విస్తూ, చెరువుల్లో పూడికలు తీసే పనిలో మునిగిపోయింద్రు. ఆంధ్రప్రాంతాన్ని వ్యవసాయిక, పారిశ్రామిక రంగాలలో అభివృద్ధిని చేసుకునే అన్ని మార్గాలను అన్వేషించింద్రు. హరితవిప్లవాన్ని ముందే కలగన్న ఆంధ్రులు దాన్ని సాధించే క్రమంలో కమ్యునిస్టులు నిమగ్నమై పనిచేసింద్రు. తెలంగాణలో మాత్రం సాయుధపోరాటం కొనసాగేలా చూసింద్రు.

1948 జులైలో కాశీంరజ్వీ తమ్ముడు తయ్యబ్‌రజ్వీ బ్రాహ్మణపల్లి మీద దాడి చేసి మడేల్ రాజయ్యని, రావి నారాయణరెడ్డి జీతగాళ్ళను ముగ్గురిని కాల్చి చంపిండు. కొదండరామిరెడ్డి ఇంటిని తగలబెట్టిండు. ఆ తర్వాత అతన్ని కూడ చంపేసిండు. మారటి సాయన్న కొరియర్‌గా పనిచేస్తుండన్న నెపంతో చిత్తాపూర్‌లో పట్టుకొని దుప్పెల్లిలో తనతోనే బొంద తీయించి పూడ్చిపెట్టింద్రు. గడ్డం అమీన్, మహ్మద్ చోటెమియా వంటి రజాకార్ల ఆగడాలు అత్యంత పాశవికమైనవిగా చరిత్రలో నమోదు చేయబడినవి. నిజాం ఆర్మీగాని, రజాకార్లు గాని, యూనియన్ సైన్యాలు గాని అత్యాధునిక ఆయుధాలతో మెరుపువేగంతో దూసుకొస్తుంటే, కమ్యునిస్టు నాయకులు ఉత్తయే చెక్క తుపాకులు చేతికిచ్చి, వడిసెలలు, కర్రలు, కత్తులతో గెరిల్లా దళమని యుద్ధరంగంలో నిలబెడితే అవగాహన లేని జనం పిట్టెలు రాలినట్టు రాలింద్రు. ఇట్ల భారత స్వాతంత్ర్య ప్రకటన వెలువడడానికి ముందు సాయుధ పోరాటాన్ని విరమించకుండ కమ్యునిస్టులు పెద్దతప్పు చేసింద్రని చెప్పడానికి అనేక ఉదాహరణలు ఉన్నయి.

మోత్కూరు ప్రాంతానికి చెందిన గడ్డం అమీన్ అనే రజాకార్ నాయకుడు పల్లెపాడ్ మీద దాడి చేసి, ఆ ఊరిని తగులబెట్టి అమ్మనబోలు గ్రామంలోని ముస్లీంలను వెంటబెట్టుకొని పొడిచేడు సమీపంలోని మూసినది ఒడ్డుకు చేరిండు. ఆ చుట్టుపట్టు గ్రామాల నించి వచ్చిన వలంటీర్లు దాదాపు ఏడెనిమిది వేలమంది మూసీనది పరిసర ప్రాంతాలలో ఎవరికి కనపడకుండ మాటువేసి కూసున్నరు.

గడ్డం అమీన్ తన చిన్న సైన్యంతో మూసీనది మధ్యకు రాంగనే చక్రబంధం వేసి వడిసెలలు, లాఠీలతో వెంటపడ్డరు. ఆ క్షణంలో ఆ గుంపుకు నాయకత్వం వహిస్తున్న జానకిరెడ్డి ఆయన దగ్గర ఉన్న బర్మారు తుపాకితో శత్రువు మీద విరుచుక పడ్డడు. అప్పుడు గడ్డం అమీన్ దగ్గర ఉన్న రైఫిల్‌తో కాల్చితే జానకిరెడ్డి అక్కడికక్కడే నేల కూలిండు.

ఈ పోరాటం పొద్దుగూకులు జరిగిందని చెప్పింద్రు. కాని ఏంజేసింద్రు.

అన్నివేల మంది కార్యకర్తలు, వలంటీర్లు, గెరిల్లా శిక్షణ పొందినవాళ్ళు ఒక్క గడ్డం అమీన్ బృందాన్ని ఏమి చేయలేకపోయింది. దీన్నిబట్టి ఆంధ్ర కమ్యునిస్టు నాయకులు కేవలం వాళ్ళ పార్టీ బలోపేతం కోసమే సామాన్యప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడింద్రు తప్ప, నిజానికి నిజాం సర్కారును కూల్చి ప్రజారాజ్యం సాధిస్తమన్న నమ్మకం వాళ్ళకు కూడ లేదు. 12 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల లోపు పిల్లలతో బాలసంఘం అని ఏర్పాటు చేసి, చిన్నపిల్లల్ని సైతం పోరాటమార్గంలో నడిపింద్రు. అంతేకాదు కంసలి కిష్టయ్య అనే కార్యకర్త ఒక మిద్దె మీదినుంచి ఇంకో మిద్దెమీదికి దునుక లేక కాలుజారి సందులబడితే రజాకార్లు కాల్చి చంపింద్రు. కమ్మరి సత్తయ్య, మంగలి పాపయ్య లాంటి వాళ్ళు ఎందరో అవగాహన లేని పోరాటంలో అసువులు బాసింద్రు. ఈ పోరాటం మొత్తంలో సామాన్య కార్యకర్తల సాహసాలే కనపడతయి తప్ప నాయకుల ఆనవాళ్ళు కానరావు. కరుడుగట్టిన భూస్వామ్యవిధానాన్ని కాలరాసిన తెలంగాణ పోరాటయోధుల అండతో కొండకు ఎంటికనుగట్టే ప్రయత్నం చేసింద్రు. అగ్రనాయకులు, అవసరమైన నాయకులు ఆపదసమయంలో జైళ్ళల్ల ఉన్నరు. చేతులు కాలినంక ఆకులు పట్టుకున్న చందంగ పోరాటాన్ని నీరుగార్చింద్రు తప్ప యుద్ధరంగంలో నిలబడ్డవాళ్ళకు ఏవిధమైన భరోసాని కల్పించింది లేదు.

# దొడ్డి కొమురయ్య చనిపోయింది జులై 4 కాదు

జనగామ తాలూకాలో కడివెండి ఆంధ్రమహాసభకు బలమైన కేంద్రం. ఈ ప్రాంతంలో ఆంధ్రమహాసభ కార్యక్రమాలు రోజురోజుకు పెరిగినయి. కడివెండిలో విసునూరు రామచంద్రారెడ్డి తల్లి జానమ్మ దొరసాని తన ధాన్యాగారంలో అక్రమంగ నిలువచేసిన లెవీ ధాన్యాన్ని ఆంధ్రమహాసభ కార్యకర్తలు అధికారులకు పట్టించింద్రు. దీన్ని భరించిలేని విసునూరు రామచంద్రారెడ్డి కడివెండి ప్రజల మీద కసితీర్చుకోవడానికి ఆంధ్రమహాసభ కార్యక్రమాలను అణిచివేయాలని పథకరచన చేసిండు. అందులో భాగంగానే జులై 4వ తేది రాత్రి విసునూరు పోలీస్‌స్టేషన్ ముంతజీం (ఎస్.ఐ) ముప్పయ్ మంది విసునూరు దేశముఖ్ గూండాలతో కలిసి కడివెండికి చేరుకుండు. దేశముఖ్ ముఖ్య ఏజెంట్లు మిష్కిన్ అలీ, అబ్బాస్ అలీ ఆ గూండాల దళానికి నాయకత్వం వహించింద్రు. ఆ మరుసటిరోజు మధ్యాహ్నం అంటే 5వ తేదీన దేశముఖ్ మనుషులను కొట్టింద్రనే ఆరోపణలతో పదిమంది ఆంధ్రమహాసభ కార్యకర్తలను అరెస్టు చేసింద్రు. ఆ తర్వాత జమానత్ మీద విడిచిపెట్టింద్రు. ఆ తర్వాత ముంతజీం ఎల్లిపోయిండు. సాయంకాలనికి గూండాలు తాగి, ఈలల వేస్తూ, కేరింతలు కొడుతూ గ్రామంలో భయభ్రాంతులు కలిగించింద్రు. పొద్దుగూకంతల ఆరేడు గంటల ప్రాంతంలో జంపాల లచ్చమ్మ ఇంటిమీద గూండాల రాళ్ళదాడి మొదలైంది. దేశముఖ్ గూండాలు కాల్పులు జరపడంతో దొడ్డి మల్లయ్యకు కాలు విరిగింది. దొడ్డి కొమురయ్య కండుపులోంచి తూటా దూసుకుపోవడం వల్ల అతను బతికే అవకాశం ఎక్కడ కనపడలేదని, ఇంకో ఆరుగురికి బలమైన గాయాలైనయనే వాస్తవాన్ని నలుగురు నాలుగు విధాలుగ ప్రచారం చేసింద్రు. ఆ మాటల సారాన్ని యధాతథంగ మీ ముందు పెడుతున్నాను.

**తెలంగాణ ప్రజల సాయుధపోరాట చరిత్రలో దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు చెప్పిందాని ప్రకారం** జనగామ తాలూకాలో వలంటీర్ దళాలు ఏర్పడ్డయి. కాని అప్పటికి భయంకరమైన నిర్బంధం ఉన్నది. దీంతో ప్రజలు 1944లో పోరాటానికి సిద్దంగ లేరు. రైతులు, కూలీలు, యువకుల మీద తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల ప్రభావం అధికంగ ఉండేది. దీంతో ఎవరు దళాల్లో చేరడానికి ఇష్టపడలేదు. సంఘం మీద భరోసాతోని, ఆరుట్ల రామచంద్రారెడ్డి అండతోని మొత్తానికి కొన్నిచోట్ల దళాలు ఏర్పాటు చేసింద్రు. లెవీ వసూళ్లలో పేదరైతులను మినహాయించాలని, ధనికరైతులు, భూస్వాముల వద్దనించి ధాన్యం వసూలు చేయాలని ఆంధ్రమహాసభ కోరింది. అప్పటికే

కడివెండిలో ప్రజలనించి అక్రమంగ వసూలు చేసిన వందపుట్ల ధాన్యం నిలువ వుందని కార్యకర్తలు అధికారులకు ఫిర్యాదు చేసింద్రు. దీంతో విసునూరు రామచంద్రారెడ్డి కడివెండిలో గొడవలేపితే ధాన్యం కోసం జరిగే విచారణ ఆగిపోతదని పథకం వేసిండు. దేశముఖ్ గుండాలు మిష్కిన్అలీ తుపాకి కాల్చిండు. ఊరేగింపులో ఉన్న దొడ్డి కొమురయ్య అనే యువకునికి తుపాకి గుండ్లు తగిలి అక్కడికక్కడే చనిపోయిండు. అతని అన్నకూడ ఊరేగింపులో ఉన్నడు. అతనికి కూడ ఒక గుండు తగిలి గాయపడ్డడు. గూండాలు, దొరసాని గడీ వదిలిపెట్టి పారిపోయింద్రు. ప్రజలు వలంటీర్లు కొమురయ్య శవం వద్ద ఉన్నరు. తెల్లారెసరికి చుట్టు పక్కల గ్రామాలనించి పెద్దఎత్తున జనం వచ్చింద్రు. మధ్యాహ్నం వరకు నాలుగువేలమందికి పైగ జనం కడివెండికి చేరుకుంద్రు. ఆంధ్రమహాసభ నినాదాలతో ఊరంత మార్మోగింది. కొమురయ్య శవాన్ని ఊరేగింపుగ తీసుకొచ్చింద్రు. గ్రామ వలంటీర్లలో ఒకడైన దొడ్డి కొమురయ్య హత్యవల్ల ప్రజావెల్లువ పుట్టింది. విసునూరు రామచంద్రారెడ్డి కొడుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మీద దాడిచేసి అందరిని చెదరగొట్టాలని చూసిండు. కాని ఆవేశంతో రగిలిపోయిన జనం తీవ్రంగ ప్రతిఘటించింద్రు. జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన వెంట వచ్చిన గూండాలను తరిమికొట్టింద్రు. చేతికి చిక్కిన అనుముల రామిరెడ్డిని ఖాన్‌మియాను ప్రజాకోర్టులో నిలబెట్టి చితకబాది, ప్రాణాలతో వదిలేసింద్రు. కచ్చడాలను నుజ్జునుజ్జు చేసింద్రు. తూటాలకు ఎదురునిలిచింద్రు. తుపాకులు గుంజుకొని గూండాలను వెంటబడి తరిమింద్రు. ఆ మరుసటి రోజు పొద్దునట్టే 60 మంది పోలీసులు కడవెండికి చేరుకుంద్రు. నిందితులను అరెస్టు చేయకుండ కమ్యునిస్టులు విధ్వంసకాండకు పూనుకోవడం వల్లనే గొడవ జరిగిందని చెప్పింద్రు. గూండాలను అరెస్టు చేస్తమని చెప్పి చేతులు దులుపుకున్నరు. కొమురయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ తీసుకొనిపోయింద్రు. అక్కడ్నే అంత్యక్రియలు జరిపింద్రు.

దొడ్డి కొమురయ్య మరణవార్తను జనగామ నుంచి టెలిఫోన్ ద్వార హైద్రాబాద్‌లోని ఆంధ్రమహాసభ కార్యాలయానికి ఫోన్ చేసి చెప్పింద్రు. దొడ్డి మల్లయ్యకు తూటా తగిలిందని, పడిపోయిన అన్నను చూడటానికి ఉరుకొచ్చిన దొడ్డి కొమురయ్య మీద కాల్పులు జరపడంతో ఆయన చనిపోయిండని అన్నరు. రావి నారాయణరెడ్డి పోలీసు అధికారులతో మాట్లాడిండు. వేలాదిగ ప్రజలు కడివెండికి చేరుకుంద్రు.

**ఆరుట్ల రామచంద్రారెడ్డి చెప్పినదాన్ని బట్టి** ధర్మాపురం బేదఖళ్ళ సందర్భంగ

పోలీసులు అనేకమంది గ్రామనాయకులను అరెస్టు చేసింగ్రు. అందులో భాగంగనే కడివెండిలో మోహన్‌రెడ్డిని అరెస్టు చేసింగ్రు. విసునూరు దేశముఖ్ ప్రత్యక్షపాలనలో ఉన్న కడివెండిలో గూండాలు తుపాకులు, బరిసెలు, గొడ్డళ్ళు, కఱ్ఱలతో జానమ్మ దొరసాని ఇంట్లో మకాం పెట్టింగ్రు. కోళ్లు, మేకలు, కోసుకొని, కల్లు, సారా తాగి పెద్దఎత్తున గొడవ చేసింగ్రు. రాత్రి ఏడుగంటల ప్రాంతంలో గడీ ముందలున్న జంపాల లింగయ్య ఇంటిమీద రాళ్ళవర్షం కురిపించి ఈలలు, కేకలు వేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింగ్రు. దీంతో ఆంధ్రమహాసభ కార్యకర్తలు ప్రజలు గొడవజరిగే స్థలానికి ఊరేగింపుగ బయలుదేరింగ్రు. గూండాలు ప్రజలమీద కాల్పులు జరిపింగ్రు. దొడ్డి మల్లయ్యకు తుపాకి గుండ్లు తగిలి కాళ్ళు విరిగిపోయినయి. దొడ్డి కొమురయ్య అన్నకు తగిలిన గాయాన్ని వంగి చూడడంతో మరోసారి గూండాలు కాల్పులు జరిపింగ్రు. కొమురయ్య అక్కడికక్కడే మరణించిండు. మంగలి కొండయ్య, కొంగళ్ళ సాయిలు, బండారి అయిలయ్య, పెద్దగాళ్ళ నరసయ్యలు గాయపడ్డవాళ్ళలో ఉన్నరు. దొడ్డి కొమురయ్య మరణంతో జానమ్మ దొరసాని గడీని వదిలి పారిపోయింది. కడవెండికి వచ్చిన పోలీసులు నల్లానరసింహులు, కొండల్‌రెడ్డి, జంపాల లింగయ్య, మాచర్ల కొండయ్యలను అరెస్టు చేసింగ్రు.

**తెలంగాణ సాయుధపోరాటం నా అనుభవాల ద్వార నల్ల నరసింహులు చెప్పిందాని ప్రకారం** కడివెండిలో దేశముఖ్ గుండాలు ఏ క్షణంలోనైన దాడి చేసే అవకాశం ఉందని గ్రహించిన ఆంధ్రమహాసభ నాయకులు 60 మందితో కూడిన వలంటీర్ల దళాన్ని ఏర్పాటు చేసింగ్రు. ఈ దళంలో నల్ల నరసింహులు, ఎరమరెడ్డి మోహన్‌రెడ్డి, రేషపల్లి కొండయ్య, ఎరమరెడ్డి కొండల్‌రెడ్డి, పైండ్ల యాదగిరి, జంపాల లింగయ్యతో కమిటీ ఏర్పడింది. మాశెట్టి రామచంద్రయ్య ఇంట్లో కఱ్ఱలు, వడిసెలలు సిద్ధం చేసి పెట్టుకుంగ్రు. సంఘటన జరిగినరోజు నల్ల నరసింహులు హైద్రాబాద్‌లో ఉన్నడు. ఎరమరెడ్డి మోహన్‌రెడ్డి నాయకత్వంలో వందమంది కఱ్ఱలు, రాళ్ళతో సంఘటన స్థలానికి చేరుకుంగ్రు. 18 ఏండ్ల దొడ్డి కొమురయ్య గొర్లమందను దొడ్ల తొలి ఇంటికొచ్చి అన్నం తింటున్నడు. దాడి జరుగుతుందని కార్యకర్తలతో బయటికి వచ్చిండు. దొడ్డి మల్లయ్య కఱ్ఱ పట్టుకొని జనం ముందు నడుస్తుండు. ఇంతలో కొమురయ్య కూడ వచ్చి ఊరేగింపులో కలిసిండు. జనం ఆవేశంతో బయలుదేరింగ్రు.

ఊరేగింపు అగ్రభాగాన ఉన్న దొడ్డి కొమురయ్య పొట్టలోంచి తుపాకి గుండ్లు దూసుకపోయినయి. పేగులు బయటపడి రక్తం ధారగట్టింది. పేగులను ఎడమచేత్తో అదిమిపెట్టుకొని 'ఆంధ్రమహాసభకు జై' అంటు మునుముందుకు దూసుకపోయిండు.


ఇంకా కొన్ని గుండ్లు కాల్చడంతో దొడ్డి మల్లయ్య కుడికాలులో తూటాలు దూసుకపోయి కిందపడ్డడు. దీంతో రెచ్చిపోయిన జనం గడ్డిమోపులు, కంప, కట్టెదెచ్చి నిప్పు ముట్టిచ్చి గడీ లోపలికి ఇసిరేసింద్రు. చేతికి చిక్కిన గూండాలను విడిపించుకొని పోవడానికి రామచంద్రారెడ్డి రెండవకొడుకు జగన్‌మోహన్‌రెడ్డి గూండాలతో వచ్చిండు. అయితే ఆవేశంతో ఉన్న జనం జగన్‌మోహన్‌రెడ్డిని తరిమికొట్టింద్రు.

**జులై 9వ తేదీ నాటి మీజాన్ పత్రికలో అచ్చయిన దాని ప్రకారం**

తెలంగాణ సాయుధపోరాట యోధుడు దొడ్డి కొమురయ్య విసునూరు గూండాలను ఎదిరించి వీరమరణం పొందిన తేది జులై4 కాదని, అసలు జులై 4వతేదీ రాత్రి విసునూరుకు చెందిన ముంతజీం ముప్పయ్‌మంది పోలీసులతో కడివెండికి రావడం తప్ప ఇంకేమి జరగలేదని, జులై 5వతేది రాత్రి మొదలై అర్ధరాత్రి వరకు జరిగిన కాల్పులకు తెల్లారి అంటే జులై 6వ తేదీన దొడ్డి కొమురయ్య చనిపోయినట్టు "మీజాన్" పత్రిక చూస్తే మనకు స్పష్టంగ అర్థమైతది.

నాటి మీజాన్ పత్రికలో "కడివెండిలో రౌడీల తుపాకి కాల్పులు" అనే శీర్షికతో ఒక ఆంధ్రమహాసభ కార్యకర్త మరణం అనే ఉప శీర్షికతో ఉన్న రావి నారాయణరెడ్డి పత్రికా ప్రకటనను చూస్తే జులై 5వ తేది రాత్రి కాల్పులు జరిగినట్టు 6వ తేదీన దొడ్డి కొమురయ్య చనిపోయినట్టు మీజాన్ పత్రికలో స్పష్టంగ ఉంది. "విసునూరు దొర విజృంబణ" అనే పేరుతో జులై 7వ తేదీన అచ్చయిన వార్త ప్రకారం "నిన్న కడవెండిలో యథేచ్ఛగా కాల్పులు జరపడంతో కడివెండిలో భయానక వాతావరణం ఏర్పడింది. ఈ కాల్పుల వల్ల ఎనిమిది మంది గాయపడ్డట్టు ఒకరు చనిపోయినట్టు, ఇంకొకరు తీవ్రమైన గాయాలతో బాధపడుతున్నట్టు" పత్రికలో ఉన్నది. దీనినిబట్టి దొడ్డి కొమురయ్య జులై 6న చనిపోయినట్లు చాలా స్పష్టంగ తెలుస్తుంది.

(పక్కపేజీలో ఉన్న మీజాన్ పత్రికను చూడవచ్చు)



దొడ్డి కొమురయ్య మరణవార్తను ప్రచురించిన ఆనాటి మీజాన్ పత్రిక

# సాయుధపోరాట పతాక దొడ్డి కొమురయ్య

నల్లగొండ జిల్లా జనగామ తాలూకాలోని విసునూరు దేశముఖ్ రాపాక వెంకట రామచంద్రారెడ్డి ఎదురులేని పెత్తనాన్ని సాగించిండు. వేలాది ఎకరాల భూములను తన ఆధీనంలో ఉంచుకుండు. చిన్నచిన్న జాగీర్దారులను, భూస్వాములను తన చెప్పుచేతల్లో పెట్టుకుండు. సీతారాంపురం శివారు గ్రామాలైన దేవరుప్పుల, కడివెండి, మడిపడిగెలో రామచంద్రారెడ్డి ప్రత్యక్ష పాలన కొనసాగినట్టు మనకు తెలుసు. అయితే సూర్యాపేట తాలూకాలోని కొన్ని గ్రామాలకు ఆయన తమ్ముడు రాపాక ప్రతాపరెడ్డి అధికారం చెలాయించేటోడు. దేశముఖ్‌ల, భూస్వాముల దౌర్జన్యాలకు తట్టుకోలేని జనం వెట్టిచాకిరిలో మగ్గి, దుర్భర జీవితాన్ని గడిపింద్రు. విసునూరు రామచంద్రారెడ్డికి ఎదురు తిరిగిన పాపానికి పడిశాల వెంకటరెడ్డిని, బందగీని తన గూండాల చేత హత్య చేయించిండు. తన ఏలుబడిలోని ప్రజలు ప్రశాంతంగ బతుకుతుంటె భరించలేని దుర్మార్గుడు విసునూరు రామచంద్రారెడ్డి. ప్రజల నడుమ పంచాదులు పెట్టి తీర్పుజెప్పేకాడ పెద్దమనిషై కూసుంటడు. ఇరుపక్షాలకు దండుగలేసి డబ్బులు దండుకుంటడు. అయిందానికి, కానిదానికి జనాన్ని పీడించి పన్నులు వసూలు జేస్తడు. కులవృత్తి దారులను దారుణంగ హింసించి వాళ్ళచేత అడ్డమైన పనులన్ని చేయించుకుంటడు.

ఊకి సల్తందుకు సాకలోల్లను, ఇంట్ల దీపం బెద్తందుకు మంగలోల్లను, కుండల కోసం కుమ్మరోల్లను ఇట్ల ఊర్ల ఉండె అన్ని కులాల ప్రజలను ఏదోరకంగ హింసించి వాళ్ళ చేత కన్నసాకిరి చేయించుకుంటడు. వాళ్ళు కష్టపడి పండించిన పంటలను ఉత్తగనే తీసుకొని ఇంట్ల ఏసుకోవడం రామచంద్రారెడ్డి నిత్యకృత్యాలు. దేశముఖ్‌ల ఇండ్లల్ల ఏ పండుగైన, పబ్బమైన, పెండ్లి, సావు ఏదైన గొర్లు, మేకలు, కోళ్ళు వాళ్ళ ఇష్టానికి పట్టుకపోయ్ జల్సాలు చేసుకుంటరు. ఇట్లాంటి దారుణాలు ఎన్ని జరిగినా జనం "బాంచన్ నీ కాల్మొక్తా" అని పడి ఉన్నరు తప్ప, ఏనాడు ఎదురు తిరిగింది లేదు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని దేశముఖ్‌ని ఎదిరించి ప్రాణాలు పోగొట్టుకోవడం ఎందుకని జనం ఎంత హింసనైన భరించింద్రు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతికింద్రు.

అప్పుడప్పుడే దేశంలోని మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలను వ్యతిరేకించడం, ఒకరిమీద మరొకరి ఆధిపత్యాన్ని నిరసించడం వంటి సంఘసంస్కరణోద్యమాల క్రమం మొదలైంది. అందులో భాగంగానే ఆర్యసమాజం ఏర్పడింది. గ్రంథాలయాల స్థాపన

జరిగింది. మజ్లీస్ ఇత్తెహదుల్ ముసల్మాన్ వంటి మత సంస్థలు కూడ ఆవిర్భవించినయ్. ఈ క్రమంలోనే 1921 ప్రాంతంలో హైద్రాబాద్ సంస్థానంలో నిజాం రాష్ట్రాంధ్ర జనసంఘ పేరుతో సంఘ సంస్కార సభలు జరిగినయి. తెలంగాణ ప్రజల సమస్యలు నేరుగ నిజాం నవాబు దృష్టికి తీసుకుపోవడం కోసం అప్పటివరకు ఉన్న సంఘాలన్నింటిని ఒకటి చేయాలని భావించిండ్రు.

అందుకోసం నిజాం రాష్ట్రాంధ్ర జనసంఘం అనే పేరుతో సమావేశాన్ని ఏర్పాటు చేసిండ్రు. ఈ సంఘం మొదటి సమావేశం 1923 జులై 27న హైద్రాబాద్‌లోని మాడపాటి హనుమంతరావు ఇంట్లో జరిగింది. ఆ తర్వాత రెండవ సభ 1924 మార్చి21న నల్లగొండలో నీలగిరి పత్రికా సంపాదకులు షబ్నవీసు వెంకట నరసింహారావు పత్రికా కార్యాలయంలో జరిగింది. దేశస్వాతంత్ర్యం కోసం వీరోచితమైన పోరాటాలు జరుగుతున్న ఆ సమయంలోనే 1924 జనవరి 6న దొడ్డి కొమురయ్య జన్మించిండు.పోరాటమే ఊపిరిగా పురుడుబోసుకుండు. హైద్రాబాద్ సంస్థానంలో నిజాం ప్రభుత్వానికి ప్రజల సమస్యలను నివేదించడానికి నిజాం రాష్ట్రాంధ్ర జనసంఘం తీవ్రంగ కృషి చేసింది ఆ క్రమంలోనే జనసంఘం మూడవ సభ 1925 ఫిబ్రవరి 21న మధిరలోని పింగళి వెంకట రామారెడ్డి కర్మాగారంలో జరిగింది. ఆ తర్వాత ఈ కార్యక్రమాల మీద నిజాం ప్రభుత్వం కొంత నిఘా ఏర్పాటు చేసింది. సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి ప్రభుత్వ అనుమతి తప్పక తీసుకోవాలని సూచించింది. దీంతో మూడు సంవత్సరాల దాక ఏ విధమైన కార్యక్రమాలు జరపలేదు. ఆ తర్వాత 1928 మే 30న సూర్యాపేటలో కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన నాలుగవ సభ జరిగింది.

వీటన్నింటిని ఐక్యం చేస్తూ నిజాం రాష్ట్రాంధ్ర కేంద్ర జనసంఘం ఏర్పాటు చేసిండ్రు. వీటితోపాటు గ్రంథాలయ మహాసభలు, వర్తక సంఘ సమావేశాలు, స్త్రీలు, యువకులు ఎవరికివాళ్ళు పెద్ద ఎత్తున సభలు ఏర్పాటు చేసి సంఘంలో చైతన్యం కోసం కృషి చేసిండ్రు. దీనివల్ల ప్రతి ఒక్కరు విడివిడిగ ప్రభుత్వ అనుమతి తీసుకోవడం వల్ల కలిగే ఇబ్బందులను తొలగించడం కోసం తెలంగాణ మొత్తానికి ప్రాతినిధ్యం వహించే ఒక వేదికను ఏర్పాటు చేయాలని అనుకుండ్రు.

దీంతో నిజాం రాష్ట్రాంధ్ర కేంద్ర జనం సంఘంతో పాటు మిగిలిన సంఘాలన్నింటిని మిళితం చేసి నిజాం రాష్ట్రాంధ్ర మహాసభను ఏర్పాటు చేసిండ్రు. అట్ల 1930లో మొదటి నిజాం రాష్ట్రాంధ్ర మహాసభ సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన జోగిపేటలో జరిగింది. ఇది మొదలు 1944 భువనగిరిలో జరిగిన 11వ మహాసభ

దాక ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజల్ని అనేక విషయాలపట్ల చైతన్యం చేసింద్రు. గ్రామ సంఘాల నిర్మాణం జరిగింది. భూస్వాముల పెత్తనంతో అల్లాడిపోతున్న జనగామ తాలూకాలో ఆంధ్రమహాసభ విరివిగ కార్యక్రమాలు చేపట్టింది. క్రమంగ విసునూరు రామచంద్రారెడ్డి తల్లి జానమ్మ రాజ్యమేలుతున్న కడివెండిని కేంద్రంగ చేసుకొని కార్యక్రమాలు చేపట్టింద్రు. వెట్టిచాకిరికి, దేశముఖ్ దౌర్జన్యాలకు నిరసనగ సభలు, సమావేశాలతో పాటు గ్రామాల్లో ఊరేగింపుల జరిపింద్రు. కడివెండిలో గొర్లను కాసుకొని బతికే దొడ్డి కొండయ్య కుటుంబం విసునూరు దేశముఖ్ దుర్మార్గాలను ఎన్నింటినో చవిచూసింది. వెట్టిగొర్ల విషయంలో తన అన్న దొడ్డి మల్లయ్యకు జరిగిన అవమానం, అఘాయిత్యాల నుంచి పెల్లుబికిన అగ్నికణమే దొడ్డి కొమురయ్య. కడివెండిలో అక్రమ లెవీధాన్యానికి వ్యతిరేకంగ విప్లవాగ్ని సృష్టించిండు. దిక్కుతోయని విసునూరు రామచంద్రారెడ్డి గూండాలు దొడ్డి కొమురయ్య మీద కాల్పులు జరిపింద్రు. కడివెండి కన్నబిడ్డ దొడ్డి కొమురయ్య మీద కాల్పులు జరిపిన మరుక్షణమే ప్రజలు విరుచుకపడ్డరు. మహాప్రళయాన్ని సృష్టించింద్రు.

వాస్తవానికి భూస్వాముల పీడనకు మొట్టమొదట అమ్మపాళెం రైతులు ఎదురుతిరిగింద్రు. అమ్మపాళెం నాడు వరంగల్ జిల్లాలో ఉంటె ప్రస్తుతం అది ఖమ్మం జిల్లాలో ఉంది. ఆ గ్రామంలోని భూస్వామి కాళ్ళూరి రాజేశ్వర్‌రావు కౌలు రైతులను పీడించి, కోర్టులచుట్టు తిప్పిండు. దీన్ని భరించలేని రైతులు విసిగి వేసారి 1932లో కాళ్ళూరిని హత్యచేసింద్రు. ఈ విధంగ బేతవోలు, మునగాల రైతుల పోరాటాలు జరిగినయి. ఆ తర్వాత విసునూరు దేశముఖ్‌కు ఎదురునిలిచి కోర్టుద్వార విజయం సాధించిన బందగీని 1940 ప్రాంతంలో హత్య చేసింద్రు. ఆ తర్వాత 1945లో పాలకుర్తిలో చాకలి ఐలమ్మ కుటుంబం మీద కుట్రకేసు పెట్టి జైలుకు పంపింద్రు. ఆ కుటుంబాలను కన్నతిప్పలు పెట్టింద్రు. ఈ దశలో విసునూరు రామచంద్రారెడ్డి పేరెత్తితెనే ఒక్కరొక్కరికి చెమటలు పట్టినయ్. దీంతో ప్రజలు రామచంద్రారెడ్డి గడీలో ఊడిగం చేయడం తప్ప ఉద్యమాలు చేయడానికి ఒక్కరు ముందుకొచ్చింది లేదు. రావి నారాయణ రెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి వంటి ఆంధ్రమహాసభ నాయకులు జనగామ తాలూకాలోని గ్రామగ్రామాన తిరిగి సంఘం నిర్మాణం చేసింద్రు.

గ్రామ సంఘాలతో పాటు గుత్పల సంఘాలు ఏర్పాటు చేసింద్రు. ఎన్ని చేసిన దేశముఖ్ అరాచకాలను, అక్రమ వసూళ్ళను కట్టడి చేయలేకపోయింద్రు. విసునూరు రామచంద్రారెడ్డి పేరు వింటెనే ప్రజలకే కాదు నాయకులకు సైతం గుండెల్లో తుపాకులు మోగినట్టయ్యేది. ఒళ్ళు జలదరం పుట్టేది. గూండాల వికృత చేష్టలు కండ్లముందు

కరాళనృత్యం చేసినట్టయ్యేది. ఇట్లాంటి పరిస్థితుల్లో 1946 జులై 4వ తేది రాత్రి దొడ్డి కొమురయ్య అన్న రాజయ్యతో కలిసి గొర్లను తోలుకొని ఊర్లెకు వస్తుంటె విసునూరు రామచంద్రారెడ్డి మామ గడ్డం నర్సింహ్మారెడ్డి పోలీసులు, గుండాలతో కలిసి గుర్రాల మీద కడివెండికి వచ్చిన విషయాన్ని గమనించిండ్రు. అలాంటి దృశ్యాలు దొడ్డి రాజయ్యకు కూడ కొత్తేంకాదు. కాని ఆ రోజు ఎందుకో భయపడ్డడు. కాళ్ళు జేతులు ఆడ్తలేవు. అన్న దొడ్డి మల్లయ్య ఆంధ్రమహాసభలో కీలకంగ పనిచేస్తున్నప్పటికి ఆయన గురించి అంత భయం లేదు. ఎటొచ్చి దొడ్డి కొమురయ్య గురించే ఇంటిల్లిపాది ఆలోచించేటోళ్ళు. ఈ నడుమ దొడ్డి కొమురయ్య ప్రవర్తనలో వచ్చిన మార్పుని గమనించిన రాజయ్య భవిష్యత్తు భయంతో బాధపడుకుంట కుసుండు. విసునూరు దేశముఖ్ మామ ఊర్లెకు వచ్చిండంటెనే జరుగరానిదేదో జరుగబోతుందని దొడ్డి రాజయ్యకు అర్ధమయ్యింది. ఆయన జీవితంలో ఇలాంటి అనుభవాలు ఎన్నో ఉన్నాయి. ఎందుకో అయ్యాల రాజయ్య మనసు కీడును శంకించింది. విసునూరు రామచంద్రారెడ్డి మనుషులు ఈ ఊరిని ఎప్పుడు ఏంజేస్తరోనన్న భయంతో తెల్లవార్లు సింతజేసుకుంట కుసుండు. భార్య బయ్యమ్మతోని గూడ విషయాన్ని చెప్పిండు.

తెల్లారి మల్ల ఎప్పటోలిగ గొర్లని దోలుకొని శెల్కలకు బోతుంటె ఆంధ్రమహాసభ కార్యకర్తల్ని అనేక విధాలుగ ప్రశ్నిస్తున్న పోలీసుల్ని దొడ్డి కొమురయ్య గమనించిండు. దీంతో ఇయ్యాల రామచంద్రారెడ్డి గూండాలు, పోలీసులు కలిసి ఊర్లె ఏదో గత్తర లేపుతరనే విషయం దొడ్డి కొమురయ్య గ్రహించిండు. ఎందుకంటే అప్పటికే కడివెండిలో జానమ్మ దొరసాని గడీలో ఉన్న అక్రమ లెవీధాన్యాన్ని జప్తు చేయాలని ఆంధ్రమహాసభ కార్యకర్తలు పట్టుబట్టిండ్రు. వాస్తవానికి అక్రమంగ వసూలు చేసిన లెవీధాన్యాన్ని పట్టుకోవడంలో దొడ్డి కొమురయ్య చూపిన సాహసమే ఎక్కువ. అర్ధరాత్రి గూండాల కంటబడకుండ వాళ్ళ కదలికల్ని గమనించి కీలక విషయాన్ని చాకచక్యంగ ఆంధ్రమహాసభ కార్యకర్తలకు అందజేయడంలో దొడ్డి కొమురయ్య చురుకైన పాత్రని పోషించిండు. ఆ ధాన్యం విషయంలో అధికారులు, పోలీసులు, కార్యకర్తల నడుమ తీవ్ర వాగ్వాదం జరిగింది.

ఈ పరిస్థితులన్ని దొడ్డి కొమురయ్యలో వీరావేశాన్ని రగిలించినయ్. ఆరోజు గొర్లను తొలుకపోయిండ్రేగాని ఎప్పుడెప్పుడు ఊర్లెకు రావాలనే ఉంది. ఎన్నడు లేంది ఆరోజు గొర్లని పొద్దుగూకక ముందె ఊరుబాట బట్టించిండు. రాజయ్యగూడ ఎందుకు, ఏందని అడగలే. ఎందుకంటె దొడ్డి కొమురయ్య అంటె ఇంట్లోనే కాదు ఊరో అందరికి ఒక గురి. కొమురయ్య ఎప్పుడు తప్పు చేయడనే నమ్మకం ఉండేది. దొడ్డి కొమురయ్య

ఏంజేసినా దానికి ఒక కారణం ఉంటదని ఎవరు సప్పుడు జేసేటోళ్ళు కాదు. పొద్దున గూండాల, పోలీసుల హడావిడిని చూసిన రాజయ్య ఇయ్యాల ఊర్ల ఏదో అయితదనే అనుమానంతోనే ఉన్నడు. కొమురయ్యకు కొరివీరన్నకన్న కోపమెక్కువ. ఎక్కడ ఆ దేశముఖ్ కంట్లబడి ఇల్లు ముంచిపోతడేమోనని అన్నలు, వదినలు కుమిలిపోయింద్రు. మొత్తానికి గొర్లు రొజొచ్చేయాల్లకన్న జర్రంత పొద్దుగాల ఇంట్లబడ్డయ్.

అప్పటికే జంపాల లచ్చమ్మ ఇంటిమీద రాళ్ళుబడ్డయ్. ఒక్క దెబ్బకే ఊరంత ఉలికిపడ్డది. గొడవ ముదురుతనే ఉంది. ఎక్కడోల్లక్కడ ఎవరింట్ల వాళ్ళు తలుపులు పెట్టుకొని కిటికీలల్లంగ తొంగిచూసింద్రు. ఆంధ్రమహాసభ కార్యకర్తలు అందరు గుంపుగ కదిలింద్రు. గొడవ ఊరంత పాకింది. ఎరమరెడ్డి మోహన్‌రెడ్డి ముందుకు ఎనకకు ఊగిసలాడుతుంటె దొడ్డి మల్లయ్య, రేషపెల్లి కొండయ్యలు పెద్దపెద్ద అంగలతో ముందుకు కదిలింద్రు. దొడ్డి కొమురయ్య అప్పుడే గొర్లను దొడ్లదోలిండు. వదిన లచ్చమ్మ బువ్వదినమని బతిలాడినా, వినకుంట కర్రదీసుకొని బయటికి వచ్చిండు. ఇండ్లల్ల ఉన్నోళ్ళను కేకలేసి పిలిసిండు. తలుపులుగొట్టి అందర్ని రమ్మని ప్రాధేయపడ్డడు. ప్రాణాలు ముఖ్యం కాదన్నడు. పిరికితనం కంటే చావే మేలన్నడు. ఉత్తగ ఎన్నడొక్క మాట మాట్లాడని దొడ్డి కొమురయ్య పొలికేకల్ని చూసి జనం పుట్టపగిలినట్టు బయటికి వచ్చింద్రు. తాడోపేడో తేల్చుకుందామన్నట్టు, ఒక్కపెట్టున కదిలిన పెద్ద గుంపుతో దొడ్డి కొమురయ్య ఉగ్రుడై ఊరేగింపుల కలిసిండు. తనకన్న ముందు కొద్ది అడుగుల దూరంలో దొడ్డి మల్లయ్య నడుస్తుండు. దొడ్డి కొమురయ్య వెంట కదిలొచ్చే జన ప్రవాహాన్ని చూసిన రామచంద్రారెడ్డి గూండాలు హడలిపోయింద్రు. జానమ్మ దొరసాని చేసిన సైగతో మిష్కిన్ అలీ ఊరేగింపుగా వచ్చే జనం మీదికి కాల్పులు జరిపిండు. తూటాలు దొడ్డి మల్లయ్య మోకాలును చీల్చినయ్. మల్లయ్య కదల్లేని స్థితిలో కుప్పగూలిండు. దీంతో చెల్లాచెదురైన జనం భయంతో వెనకకు పరుగులుతీసే ప్రయత్నం చేసింద్రు. ఆ క్షణంలో దొడ్డి కొమురయ్య ప్రజలను ఉత్తేజపరిచిండు. గాయపడ్డ అన్నని పక్కకుతీసి పదిమందికి అప్పగించిండు. రెట్టింపు ఆవేశంతో జనాన్ని చైతన్యం చేసిండు. దొడ్డి కొమురయ్య తెగింపును చూసిన జనానికి గుండెబలం రెట్టింపయ్యింది. ఎనకకు మళ్ళినవాళ్ళంత ఎక్కడివాళ్ళు అక్కడ్నే ఆగిపోయింద్రు. ఇగ ఈ పోరాటంలో సచ్చినా సరేనని జనం దొడ్డి కొమురయ్య వెంట ఉప్పెనై కదిలింద్రు. గూండాలు ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే దొడ్డి కొమురయ్య వందలాది మందితో పెద్దపెద్ద అంగలతో గడీ సమీపంలోకి దూసుకొచ్చిండు. గూండాలు మిష్కిన్ అలీ, అబ్బాస్ అలీలు అదే మూలమదత

కిటికీలోంచి మరో సారి కాల్పులు జరపడంతో దొడ్డి కొమురయ్య కడుపులోంచి తూటాలు దూసుకపోయినయి. అయినా దొడ్డి కొమురయ్య తూటాలను ఏ మాత్రం లెక్కచేయకుండ ముందుకే సాగిండు. ఈసారి జనం వేయి ఏనుగుల బలంతో వెనకడుగు వేయకుండ కట్టలు తెగిన ఆవేశంతో కదనరంగాన్ని తలపించింద్రు. తూటాలను లెక్కచేయకుండ తన నెత్తురుతో పోరాటజెండాని ఎగరేసిన దొడ్డి కొమురయ్య వెంట కదిలిన జనసైన్యంతో, భయపడ్డ గూండాలు జరగబోయే ప్రమాదాన్ని పసిగట్టి, కచ్చడాలను సిద్ధం చేసుకొని పరుగులు తీసింద్రు. ఉప్పొంగిన ఆవేశంతో వీరులై కదిలిన సామాన్యజనం గూండాలను వెంటబడి తరిమింద్రు. దొరికినోన్ని దొరికినట్టు చితకబాదింద్రు. తనకు ఏనాడు ఎదురులేదని విర్రవీగిన విసునూరు రామచంద్రారెడ్డి అహంభావాన్ని కాలరాసింద్రు. భూస్వాముల పెత్తనానికి కాలంచెల్లిందని ఖరాకండిగ చెప్పింద్రు. ఆరోజు నుంచి వెట్టిచాకిరిని నిషేదించిన ప్రజలు పోరుదారెంట నడిసింద్రు. ఎవరి అదుపు ఆజ్ఞలకు లోనుకాకుండ వీరులై స్వేచ్ఛగ బతికింద్రు.

అన్యాయాన్ని ఎదిరించడానికి ఆత్మస్థైర్యం కావాలె. ఆపదల్లోంచి బయటపడాలంటే సమయస్ఫూర్తి కావాలె. ఆ విధంగ దొడ్డి కొమురయ్య చూపిన సాహసం, చేసిన ప్రాణత్యాగం సామాన్యజన సైన్యాన్ని తయారుచేసింది. తూటాలకు ఎదురునిలిచి పోరాడే బలాన్నిచ్చింది. దొడ్డి కొమురయ్య తన కొసప్రాణం ఉన్నంతవరకు కొట్లాడి, తరతరాల బానిసవర్గానికి అంతులేని గుండెధైర్యాన్ని కలిగించిండు. ఆయుధాలు గుంజుకొని సాయుధులై వెంటబడి తరిమేటట్టు చేసిండు.

ఈ సంఘటనతో జనగామ తాలూకాలోని గ్రామాలన్ని ఒక్కటైనయ్. భూస్వాముల, దేశముఖ్‌ల గూండాలను మెసలకుంటజేసి తమ భూముల్ని వెనకకు గుంజుకుంద్రు. పోరాటాన్ని ఉధృతం చేసింద్రు. ఇదే అదునుగ కమ్యునిస్టు పార్టీ తమ కార్యకలాపాలను వేగవంతం చేసింది. దాదాపు ప్రతి గ్రామంలో ఇరవై, ముప్పయ్ మందితో కూడిన గ్రామరక్షక దళాలను ఏర్పాటు చేసుకుంది.

## కమ్యునిస్టులు–రజాకార్లు

1946 జులై 6 దొడ్డి కొమురయ్య మరణానికి ముందు రాజ్యంలో చిన్న చిన్న తిరుగుబాట్లు జరుగుతుండేవి. అవి కూడ దేశముఖ్‌లు, భూస్వాముల దౌర్జన్యాల వల్ల తలెత్తినవే. చాలా విషయాలు నిజాంకు తెలిసేయి కావు. ఎప్పుడైతే దొడ్డి కొమురయ్యను దేశముఖ్ గూండాలు కాల్చి చంపింద్రో నాటి నుంచి ప్రజలు సాయుధులై తిరుగుబాటు చేసింద్రు. ప్రజల ఆవేశాన్ని చూసిన కమ్యునిస్టు పార్టీ ఇదే సరైన సమయంగ భావించి

దళాలను ఏర్పరచింది. ఆయుధాలు సమీకరించి పోరాటం చేయడం మొదలు పెట్టింది. లెవీధాన్యం, నిర్బంధ వసూళ్ళకు వ్యతిరేకంగ మొదలైన ఉద్యమాన్ని క్రమంగ నిజాం వ్యతిరేక పోరాటంగ మార్చింది. ఇక్కడొక ప్రధానమైన అంశం ఏందంటే భారత స్వాతంత్ర ప్రకటన అనంతరం దేశ విభజన జరిగే సమయంలో హైద్రాబాద్ రాజ్యానికి గల ప్రత్యేక ప్రతిపత్తిని, చట్టబద్ధతను ఎవరు గుర్తించింది లేదు. ఆనాడు హైద్రాబాద్‌కు బ్రిటీష్‌ప్రభుత్వంతో జరిగిన ప్రతి అగ్రిమెంట్‌తో నిజాం ప్రభుత్వం ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉంది. విభజన సమయంలోని బ్రిటీష్ వైస్రాయ్ లార్డ్ మౌంట్‌బాటన్ 1947 జూన్3న ఒక ప్రకటన చేసిండు. ఇండియా, పాకిస్థాన్ అనే రెండు దేశాలు బ్రిటీష్ పార్లమెంట్ చట్టం ప్రకారం ఏర్పడ్డయి.

నిజానికి ఈ బ్రిటీష్ విభజన చట్టం ప్రకారం ఏడవ నిజాం తీసుకున్న నిర్ణయానికి చట్టబద్ధత ఉన్నది. ముఖ్యంగ నాటి బ్రిటీష్ ప్రభుత్వం సంస్థానాలకు మూడు అవకాశాలు కల్పించింది.

1. సంస్థానం స్వతంత్రగానే ఉండటం
2. ఇండియన్ యూనియన్‌లో విలీనం కావడం
3. పాకిస్థాన్‌లో చేరడం

ఆ ఒప్పందాలన్నింటికి తుంగలో తొక్కి దేశంలోని మిగిలిన సంస్థానాలకన్న హీనంగ చూసింద్రు. హైద్రాబాద్ సంస్థానం మీద ఆంక్షలు విధించింద్రు. ఒకవైపు దేశమంత స్వాతంత్ర్య సంబరాలు చేసుకుంటుంటే హైద్రాబాద్ పరిస్థితి అల్లకల్లోలంగ మారింది. ఆఖరికి ఈ దారుణ సంఘటనలకు సంబంధించిన అంశం ఐక్యరాజ్యసమితి దృష్టికి పోయింది. సమితి జోక్యంతోనే భారత ప్రభుత్వం హైద్రాబాద్ పాలకునితో సంప్రదింపులు జరిపింది. ఆ సమయంలో హైద్రాబాద్ సంస్థానంలో ప్రజల పరిస్థితి అత్యంత దయనీయంగ మారింది. ఈలోపు సెప్టెంబర్ 13న మహ్మద్ అలీజిన్నా మరణించిండు. ఢిల్లీలోని హైద్రాబాద్ హౌజ్‌లో పెద్దఎత్తున చర్చలు జరిగినయి. భారతసైన్యం హైద్రాబాద్ మీద పోలీస్‌యాక్షన్ మొదలు పెట్టింది.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి హైద్రాబాద్ అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించి స్వతంత్ర రాజ్యంగ మనగలుగుతుంది. కాబట్టి విభజన చట్టంలోని పై మూడు అంశాల ఆధారంగ హైద్రాబాద్ నిజాం తన సంస్థానం స్వతంత్రంగానే ఉంటుందని 1947 జూన్ 11న ఒక ఫర్మాన జారి చేసిండు. ఆరోజు నుంచి హైద్రాబాద్ సంస్థానంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నిషేదించిండు. కాని కాంగ్రేసు

నాయకులు హైద్రాబాద్ ఇండియన్ యూనియన్‌లో కలవాలని ఉద్యమం చేపట్టింద్రు. కాశీంరజ్వీ పాకిస్థాన్‌లో చేరాలని వత్తిడి తెచ్చిండు. అనల్‌మాలిక్ (మేమే రాజులం) అనే సిద్ధాంతాన్ని ప్రచారం చేసిండు.

1947 ఆగష్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ భారత తొలి ప్రధానిగా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడింది. దేశంలోని సంస్థానాలన్ని భారత యూనియన్‌లో విలీనమైనయి. హైద్రాబాద్ సంస్థానంలో కాశీంరజ్వీ కుట్రలు, కమ్యునిస్టుల దుశ్చర్యల కారణంగ సంస్థానాధీశుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఏ నిర్ణయం తీసుకోలేని నిస్సహాయ స్థితిలో నిలబడి ఉన్నడు. హైద్రాబాద్ ఉంటే స్వతంత్రంగా ఉండాలె లేదంటే పాకిస్థాన్‌లో కలవాలనే దృఢ సంకల్పంతో కాశీంరజ్వీ అరాచకాలకు తెగబడ్డడు. ఎటూ తేల్చుకోలేని స్థితిలో తటస్థంగ ఉన్నడు. హైద్రాబాద్ సంస్థానంలో హిందువులు, ముస్లీంలు అనే బేధభావం ఏనాడు తలెత్తింది లేదు. ప్రజలు వాళ్ళకు నచ్చిన భాషని, నచ్చిన మతాన్ని స్వీకరించడంలో పూర్తి స్వేచ్ఛ ఉన్నది. సంపూర్ణ మత సామరస్యాన్ని పాటించిన నిజాం నవాబు భారత యూనియన్‌లో చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున మత దురహంకారి అయిన కాశీంరజ్వీ రజాకార్ (స్వయం సేవక్) సైన్యాన్ని తయారు చేసిండు. 1927లో మజ్లీస్ ఇత్తెహదుల్ ముసల్మాన్ సంస్థను స్థాపించిన బహదూర్ యార్జంగ్ 1944లో చనిపోయిండు. ఇతని తర్వాత వచ్చిన అబుల్ హసన్, ముజహర్ అలీలు ఇద్దరు కూడ కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే మజ్లీస్‌కు బాధ్యతలు వహించింద్రు. అనంతరం ఎం.ఐ.ఎం నాయకత్వం కోసం జరిగిన పోటీలో కాశీంరజ్వీ గెలిచిండు. ఆయన ఎం.ఐ.ఎం ఆధ్వర్యంలో పారామిలటరీ బలగాలను ఏర్పాటు చేసిండు. తన సైన్యంలో హిందువులు, ముస్లీంలను కూడ చేర్చుకుండు. కాశీంరజ్వి ఎక్కడైతే కమ్యునిస్టు కార్యకలాపాలు ఎక్కువగా ఉన్నయో, అట్లాంటి గ్రామాలను గుర్తించి రజాకార్ క్యాంపులు ఏర్పాటు చేసిండు. నిజాం ప్రధాని లాయఖ్ అలీ కూడ కాశీంరజ్వీని సమర్థించిండు. దీంతో రజ్వీ బలవంతంగ మత మార్పిడులు చేసే ప్రయత్నాన్ని ముమ్మరం చేసిండు. సామాన్యజనాన్ని, కమ్యునిస్టులను ఊచకోతలు కోయడం, ఊర్లు తగలబెట్టడం వంటి చర్యలకు పూనుకోవడంతో కమ్యునిస్టులు రజాకార్లను ఎదుర్కొంటు పోరాటానికి సిద్ధమయ్యింద్రు. అటు రజాకార్లు, ఇటు కమ్యునిస్టుల వల్ల ప్రజలు కన్నశెరలు అనుభవించింద్రు. ముప్పు తిప్పలతోని మూడుచెర్ల నీళ్ళ తాగింద్రు. కలుగుల్ల దాసుకున్నా, అలుగుల్ల పండుకున్నా వదిలిపెట్టకుండ వాళ్ళు వాళ్ళ లక్ష్యం కోసం జనాన్ని పిచ్చి కుక్కల్ని చేసింద్రు. కొన్నిసార్లు కమ్యునిస్టు వ్యతిరేకుల మీద దాడులు చేసి చంపేసింద్రు. కమ్యునిస్టుల

పోరాటం వల్ల నిజాం ప్రభుత్వానికి ప్రమాదం పొంచి ఉందని గ్రహించిన కాశీంరజ్వీ కమ్యూనిస్టులను ఊచకోత కోసిండు. పరస్పర దాడులు ముమ్మరమైనయి. ముస్లీం రాజ్య స్థాపన చేయాలని కాశీం రజ్వీ, కమ్యూనిస్టు రాజ్యం ఆవిర్భవిస్తుందని కమ్యూనిస్టులు పరస్పర దాడులు చేసుకోవడంలో వందలాదిమంది చనిపోయిండ్రు.

నిజాం నవాబు దిక్కుతోయని స్థితిలో హైద్రాబాద్‌ను భారతయూనియన్‌లో విలీనం చేయడానికి అంగీకరించిండు. నిజాం చేయిదాటిన పరిస్థితిని అదుపు చేయడానికి భారత సైన్యం రంగ ప్రవేశం చేసింది.

హైద్రాబాద్ రాష్ట్రంలో శాంతి భద్రతలు నెలకొల్పడం కోసం జె.ఎన్. చౌదరి నేతృత్వంలో రాష్ట్రంలో సైనిక పరిపాలన ఏర్పడింది. భారతదేశ స్వాతంత్ర్యాన్ని అంగీకరించేది లేదని సాయుధ పోరాటాన్ని తీవ్రతరం చేసింద్రు. కానీ వీళ్ళ దగ్గర సరైన ఆయుధాలు లేవు. తుపాకులల్ల ఉషిక నింపి శత్రు సైన్యాన్ని చెదరగొట్టిన సంధర్భాలు ఉన్నయి. వడిసెలలు, కర్రలు, కారం పొట్లాలతో ప్రజల ప్రాణాలతో చెటగాటం ఆడింద్రు. పోలీసు చర్యలో భాగంగ కమ్యూనిస్టులు, రజాకార్ల పరస్పర దాడుల్లో దాదాపు ఐదువేల మంది ప్రాణాలు కోల్పోయింద్రు.

1948 సెప్టెంబర్17న పోలీసుచర్య ద్వార హైద్రాబాద్ సంస్థానం భారతయూనియన్‌లో విలీనం అయ్యింది. 1947 ఆగష్టు 15 నుంచి 1948 సెప్టెంబర్ వరకు దాదాపు పదమూడు నెలలు అనేక సంఘటనలు జరిగినయి. ఆ పరిణామాల పర్యవసానమే చరిత్రలో సెప్టెంబర్ 17 విలీనదినంగ అవతరించింది. కాబట్టి ఇంకా ఇది విలీనమా, విద్రోహమా, విమోచనమా అన్న వాదవివాదాలు అర్థరహితమైనయనే భావనే ఎక్కువమందిలో నెలకొని ఉంది.

దాదాపు 70 సంవత్సరాల క్రితం జరిగిన 'పోలీసుచర్య' లేదా 'ఆపరేషన్ పోలో'ని నాటి సామాజిక, ఉద్యమ శక్తులు ఎవరికి వాళ్ళు తమపై జరిగిన దాడిగ భావించింద్రు. కొందరు దీన్ని మతపరమైన అంశంగ చూసింద్రు. మరికొందరు వాళ్ళవాళ్ళ వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతిన్నదని భావించింద్రు. వాస్తవానికి 1946 అక్టోబర్ నుంచి 1948 సెప్టెంబర్ వరకు దాదాపు రెండు సంవత్సరాలు విపరీతమైన ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగింది. ఎన్నో కుటుంబాలు ఏ రాత్రి ఏం జరుగుతదో, ఏ పగలు ఏమైతదోనని భిక్కుభిక్కుమంటు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతికింద్రు. ఇట్లాంటి పరిస్థితులలో ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ తెలివైన నిర్ణయం తీసుకుండు. అరాచక శక్తుల ఆట కట్టించి, ప్రజల ప్రాణాలు రక్షించడంతో పాటు హైద్రాబాద్ ప్రతిష్టను నిలబెట్టిండు.

సామాజిక ఉద్యమాలకు ఆద్యుడు, మహామహుల చేత 'మహాత్మ' అని పిలిపించుకున్న నాయకుడు, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు మార్గదర్శి అయిన జ్యోతిభాపూలే 1880లో నిజాం రాజును గొప్పగ కీర్తించిండు. హైద్రాబాద్ రాజ్యంలో అమలు చేయబడుతున్న నీటిపారుదల విధానం వల్లనే ఇక్కడి రైతుల పరిస్థితిలో ఘననీయమైన మార్పు వచ్చిందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసిండు. ఇదే సందర్భంలో పూలే మహనీయుడు బ్రిటీష్‌వారు అమలు చేస్తున్న నీటిపారుదల విధానం వల్ల కేవలం బ్రాహ్మణీయ వర్గాలు మాత్రమే బాగుపడ్డాయనే విమర్శను కూడ చేసిండు.

1919లో హైకోర్టు భనననిర్మాణ సమయంలో అడ్డంగ ఉన్న హిందు దేవాలయాన్ని తొలగించాలని ఇంజనీర్లు చెప్పినపుడు నిజాం "మీరు న్యాయం కోసం గుడి కడుతున్నరు, దాన్ని అన్యాయపు పునాదుల మీద ఎట్ల నిర్మిస్తరు" అన్న మాటలు హైద్రాబాద్‌లో ప్రజలు ఎప్పుడు మరిచిపోరు. ఇప్పటికి ఆ గుడి అక్కడే ఉన్నది. నిజాం రంజాన్ పండుగను ఎంత భక్తిభావతో కొలుస్తడో అంతే గొప్పగ దసరా పండుగ నాడు కూడ "ఈద్–మిలాప్" పెట్టి ప్రజలందరిని కలిసే కార్యక్రమం అత్యంత గొప్పగ నిర్వహించేటోడు. ప్రపంచంలోకెల్లా అత్యంత సంపన్నుడైన నిజాం భారత యూనియన్‌లో చేరిన వెంటనే ఆస్తులన్ని ప్రభుత్వానికి అప్పగించిండు. 1956 ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు దాక హైద్రాబాద్ రాజ్‌ప్రముఖ్‌గా కొనసాగిండు.

నిజాం ప్రత్యక్ష పాలనలో ఉన్న హైద్రాబాద్ సంస్థానంలో వెట్టిచాకిరి, దేవదాసి వ్యవస్థ వంటి మూఢాచారాలను రద్దుచేసిండు. అంటరానితనం, మద్యపాన నిషేదం వంటి సామాజిక అంశాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే విధంగ అనేక కార్యక్రమాలు చేపట్టిండు. బడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసం 1930 నాటికే తెలుగు మీడియంలో బోధించే ఉచిత పాఠశాలలు ఏర్పాటు చేసిండు. కుల,మత, లింగ బేధాలతోని పాఠశాల ప్రవేశాన్ని నిరాకరిస్తే కఠిన శిక్షలు విధిస్తామని హెచ్చరికలు జారిచేసిండు. నిజాం సైన్యంలో జంబన్న వంటి బహుజన వీరులకు ఎందరికో అవకాశం కల్పించిండు. అట్టడుగు వర్గాలను ఆదుకుండు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అదికూడ కేవలం నల్లగొండ, వరంగల్ జిల్లా పరిసర ప్రాంతాలలో కమ్యూనిస్టుల మూర్ఖత్వం, రజాకార్ల మత దురహంకారం వల్ల సాయుధపోరాటంలో ఘోరమైన తప్పిదాలు జరిగినయి. ఈ సంఘటనలకు నిజాం నిరంకుశత్వం సంగతేమో కాని సమస్యల పట్ల కమ్యూనిస్టుల అవగాహనలోపం మాత్రం ప్రస్ఫుటంగ కనిపిస్తది. ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులు పార్టీలో అగ్రభాగాన ఉండడం మూలంగ ప్రజారాజ్యం వస్తదని, ప్రపంచాన్నే ఏలుతమనే ధీమాని వ్యక్తం చేసి తెలంగాణ

అమాయక ప్రజల జీవితాలతో ఆడుకున్నరు. పోలీసుచర్య తర్వాత సాయుధపోరాటం వద్దని మొత్తుకున్న రావి నారాయణరెడ్డి లాంటి వాళ్ళ వాదనను తుంగలో తొక్కింద్రు. ప్రజలంత సాయుధపోరాటానికి సిద్దంగ ఉన్నరనే తప్పుడు ఆలోచనతో రష్యా మార్గంలో పోరాటం సాగించాలని బి.టి.రణదీవె గగ్గోలు పెట్టిండు. కాదుకాదు చైనా మార్గంలో పోరాటం చేయాలని మాకినేని బసవపున్నయ్య లొట్టిమీది కాకోలె మొత్తుకుండు. దీంతో ఏ సమాచారం సరిగ్గా అందని తెలంగాణ మట్టిబిడ్డలు లొట్టతుపాకులు భుజానికేసుకొని పిట్టెల్లా రాలిపోయింద్రు. వేలాదిమంది చనిపోవడానికి కారణం అయ్యింద్రు. 1948 సెప్టెంబర్ 16న యూనియన్ సైన్యాలు సూర్యాపేటలో ప్రవేశించినప్పుడు యుద్ధవీరుడు భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి తన దళాలతో నెల్లికుదురులో ఉన్న అతిపెద్ద రజాకారు క్యాంపు మీద గత మూడు రోజులుగా దాడి జరుపుతూనే ఉన్నడు. స్వంతంగ ల్యాండ్‌మైన్స్‌ను తయారు చేసుకొని యూనియన్ సైన్యాలకు ధీటుగా పోరాటం కొనసాగిస్తున్న తరుణంలో ఆంధ్ర కమ్యునిస్టు నాయకులు, ఏనాడు సాయుధ పోరాటాన్ని కనీసం కళ్ళార చూడని వాళ్ళు సుందరయ్య, బసవపున్నయ్యలు భీంరెడ్డి, దేవులపల్లిని సంప్రదించకుండానే సాయుధపోరాట విరమణ నిర్ణయాన్ని ప్రకటించింద్రు. దీంతో రణక్షేత్రంలో ఉండి కొట్లాడుతున్న దళాలు దిక్కుతోచని స్థితిలో అజ్ఞాతంలోకి పారిపోవలసిన దుస్థితి కలిగింది. అధిక ప్రాణ నష్టం జరగడానికి ఉద్యమం ఆగమై పోవడానికి ఆంధ్ర కమ్యునిస్టు నాయకులే ప్రధాన కారణమని వేరెవరో చెప్పవలసిన అవసరం లేదు. కమ్యునిస్టు అగ్రనాయకత్వం తీసుకున్న నిర్ణయానికి దళాలు అడవుల్లో తల దాచుకున్నయి. నెహ్రూ ప్రభుత్వంలోని పటేల్ సైన్యం కమ్యునిస్టులను అణిచివేయడం కోసం గాలింపు చర్యలను తీవ్రతరం చేసింది. కమ్యూనిస్టుపార్టీ అగ్ర నాయకుల కుట్రలు గ్రహించిన నెహ్రూ హైదరాబాదు విలీనం కోసం మోహరించిన సైనిక బలగాలను మరికొంత కాలం ఉంచాలని నిర్ణయించిండు. దీంతో ఇంకా తమ ఆటలు సాగవని గ్రహించిన కొందరు కమ్యునిస్టులు లొంగిపోయింద్రు. మరికొందరిని సైన్యం నిర్భంధంగ తీసుకొచ్చి జైళ్ళలో బంధించింది.

ఆ తర్వాత తెలంగాణ సాయుధపోరాటంలో పాల్గొన్న 57 మందికి ఉరిశిక్ష ఖరారైంది. 1950 జనవరి 23న పన్నెండు మందిని ఉరితీయాలని నిర్ణయించింద్రు. అప్పుడు లండన్ కమ్యునిస్టు పార్టీ ప్రతినిధి రజని పామిదత్ సహకారంతో ప్రపంచ న్యాయవాదుల ఫెడరేషన్ ప్రతినిధి జి.ఎన్. ప్రిట్‌ని కలిసింద్రు. ఉరిశిక్ష రద్దుకోసం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింద్రు. కోర్టు ఈ అంశం మా పరిధిలో లేదని తేల్చి చెప్పింది. చివరికి నిజాం నవాబు పెట్టిన క్షమాబిక్షతోనే బతికి బయటపడ్డరు.

# అమలుకాని రావి నారాయణరెడ్డి ఆలోచన

తెలంగాణ సాయుధ రైతాంగపోరాటంలోని అగ్రనాయకుల్లో ఒకరైన రావి నారాయణరెడ్డిది భువనగిరి తాలూకాలోని బొల్లెపల్లి గ్రామం. ఈ గ్రామం నిజాం నవాబు తల్లి జాగీరు గ్రామం. ఇక్కడి వనరులన్ని ఆమెకే చెందుతయి. ఇదే కాకుండ పక్కనే ఉన్న నందనం కూడ నిజాం సర్ఫేఖాస్ గ్రామమే.

రావి నారాయణరెడ్డి నిజమైన దేశభక్తుడే కాకుండ, ఒక నిస్వార్థ నాయకుడు, స్వచ్ఛమైన ఉద్యమకారుడు కూడ. తెలంగాణలో ఆంధ్రమహాసభ ప్రజాఉద్యమంగ రూపుదాల్చడానికి ఆయనే ఆద్యులు. కమ్యునిస్టుల అగ్రనాయకత్వం ఏ విధమైన నిర్ణయాలు తీసుకుంటుందో పోరాటంలో ఉన్న దళాలకు తెలిసేది కాదు. ఈ దశలో యాభైవేల యూనియన్ సైన్యాలు నల్లగొండ, వరంగల్ పరిసర ప్రాంతాలను చుట్టు ముట్టినయ్. రజాకార్లు కడివెండి గ్రామాన్ని పెట్రోలు పోసి తగలబెట్టింద్రు. జాతీయ స్థాయిలో ముస్లింలకు ప్రత్యేక రాజ్యం కోసం ఉద్యమిస్తున్న మహ్మదాలి జిన్నా మరణించిండన్న వార్తతో రజాకార్లు నల్లబ్యాడ్జీలు ధరించి సంతాపంలో మునిగిపోయింద్రు. ఇక్కడి నుంచి రజాకారు నాయకుడు కాశీంరజ్వీ నిజాంను కూడ లెక్క చేయకుండ ముస్లీమేతరులను, కమ్యునిస్టులను ఊచకోతలు కోయడం మొదలు పెట్టిండు. ఇటు కమ్యునిస్టులు, అటు రజాకార్లు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నరని గ్రహించిన నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ భారత యూనియన్‌లో చేరడానికి అంగీకారాన్ని తెలిపిండు. దీంతో 1948 సెప్టెంబర్ 13న హైద్రాబాద్ సంస్థానం మీద పోలీసుచర్య మొదలైంది. 1948 సెప్టెంబర్ 17నాటికి నిజాం లొంగిపోయినట్లు ప్రకటించిండు. అదే రోజున హైద్రాబాద్ రాష్ట్రం ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయబడిందని ప్రకటించడడం జరిగింది. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాదు విశాల భారత దేశంలో విలీనమైంది. దీంతో పోరాటం పూర్తి అయ్యిందని, ఇంక పోరాటం చెయ్యవలసిన అవసరం లేదని రావి నారాయణరెడ్డి వంటి తెలంగాణ నాయకులు, ఇతర మితవాదులు పోరాటాన్ని విరమించాలని పిలుపునిచ్చి శాంతిని కోరుకున్నరు.

అయితే కమ్యునిస్టు పార్టీ రావి నారాయణరెడ్డి అభిప్రాయంతో ఏకీభవించలేదు. ఆత్మరక్షణకు ఆయుధాలు ఉండాలని అవసరమైతే అడవుల్లోకి వెళ్ళాలని పార్టీ ఆదేశాలు పంపింది. ఆంధ్రా కమ్యూనిస్టు నాయకులు అత్యుత్సాహంతో హైదరాబాదు విలీనంతోటి పోరాటం ఆగలేదని, తర్వాత కూడా నెహ్రూ ప్రభుత్వాన్ని కూల్చడానికి పోరాటం

చెయ్యాలని పిలుపునిచ్చింగ్రు. మొత్తం దేశంలోనే కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కలలుకన్నరు. ఆంధ్రా కమ్యూనిస్టులను నమ్మిన తెలంగాణ కమ్యూనిస్టు నాయకులు కొంత మంది పోరాటానికి సిద్ధమయ్యింగ్రు. ఇట్ల నెహ్రూ ప్రభుత్వానికి వ్యతిరేకంగ పోరాటాన్ని కొనసాగించాలన్న అతివాదులు మితవాదులు గుంపులుగా విడిపోయి ఒకరిపట్ల ఒకరు నమ్మకాన్ని కోల్పోయింగ్రు. వ్యక్తిగత హింసాకాండకు సైతం పాల్పడ్డరు.

ఒకదశలో మితవాది అయిన రావి నారాయణరెడ్డిని కూడా హత్య చేయడానికి ప్రయత్నం చేసింగ్రు. ఈ దశలో భూస్వాములకు, నిజాముకు, జాగీర్దార్లకు భారత ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించింది. కమ్యునిస్టులు బేషరతుగ లొంగిపోవాలని విమానాల ద్వార లక్షలాది కరపత్రాలను వెదజల్లింది. అయినా కమ్యునిస్టులు లొంగిపోకుండ వేలాదిమంది ప్రజల ప్రాణాలు గాలిలో కలిపింగ్రు. గ్రామాలకు గ్రామాలు తగలబడిపోతుంటే అదేపోరాటం, అని జైత్రయాత్ర అని వీరులుగా త్యాగధనులుగా చెప్పుకున్నరనే ఆవేదన రావి నారాయణరెడ్డి అక్షరాల నిండ కనిపిస్తది. ఆఖరికి 1950లో నెహ్రూ ప్రభుత్వానికి వ్యతిరేకంగ పోరాడడానికి తమ శక్తి చాలదని విరమించుకున్నరు. 1951 అక్టోబర్ 21న ఉమ్మడి కమ్యునిస్టు పార్టీ ఏ విధమైన రాయితీలు, డిమాండ్‌లు లేకుండనే సాయుధపోరాటాన్ని ఉపసంహరిస్తున్నట్టు ప్రకటించింది. తప్పనిసరి పరిస్థితుల్లో అందరూ లొంగిపోయి 1952 జనవరిలో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికలలో పాల్గొన్నరు. ఈ ఎన్నికలలో నల్లగొండ పార్లమెంటు సభ్యులుగా పోటీచేసిన రావి నారాయణరెడ్డి దాదాపు మూడు లక్షల మెజారిటీతో గెలుపొంది నెహ్రు కన్న ఎక్కువ మెజారిటి సాధించి తన చేతుల మీదుగా పార్లమెంట్ భవనాన్ని ప్రారంభోత్సవం చేసిండు.

ఒక స్వతంత్ర రాజ్యంగ వెలుగొందిన హైద్రాబాద్ సంస్థానాన్ని ముఖ్యంగ తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రలో విలీనం చేయాలనే కుట్రకు తెరలేపిన ఆంధ్ర కమ్యునిస్టు నాయకత్వం, విశాలాంధ్రలో ప్రజారాజ్యమంటూ అడ్డగోలు పైరవీలు చేసింది. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. ఆ సమయంలో రాష్ట్ర భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకొని తప్పనిసరి పరిస్థితుల్లో యూనియన్ సైన్యాలను ఆహ్వానించవలసి వచ్చింది. అంతేకాని యూనియన్‌సైన్యాలు, నిజాం సైన్యంతో హోరాహోరి యుద్ధం చేసినట్టు ఎక్కడా లేదు. వాస్తవానికి నిజాం దేశంలోని మిగతా సంస్థానాధీశులకంటె మెరుగైన పాలన అందించండని ఎంతోమంది చరిత్రకారులు

తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింద్రు. దీనంతటికి కారణం నిజాం పాలనలో రాజుకు సలహాలనిచ్చే మేధావి వర్గం ఒకటి ఉండేది. అంతేకాకుండ రాజుకు తగిన సలహాలు ఇవ్వడానికి మంత్రిమండలి కూడ ఆవిర్భవించింది. ఇట్ల వాళ్ళ సలహాలు, సూచనల మేరకు సాధ్యమైనంతవరకు హైద్రాబాద్ సంస్థానంలో ప్రజాస్వామ్యపాలన కొనసాగింది.

ఆ రోజుల్లో ఎవరు కూడ హైద్రాబాద్‌ని ఒకమతపరమైన రాజ్యంగ చూసింది లేదు. హైద్రాబాద్ పూర్తిస్థాయి లౌకికరాజ్య పాత్రను పోషించింది. అభివృద్ధికి శ్రీకారం చుట్టి ఆధునీకరణకు బాటలు వేసిన గొప్ప పరిపాలనాదక్షుడని నిజాంను కొనియాడిన చరిత్రకారులు ఎందరో ఉన్నరు.

స్వయంగ మీర్ ఉస్మాన్ అలీఖాన్ “నా ప్రభుత్వంలో వివిధ మతాలకు చెందిన ప్రజలున్నరు. వారిని వారి మతాలను రక్షించటం నా రాజ్యాంగంలో భాగం, నా ప్రభుత్వ బాధ్యత” అని ప్రకటించడం జరిగింది. హైద్రాబాద్ సంస్థానాన్ని పాలించిన అసఫ్‌జాహీల జెండా మీద ‘రొట్టె’ గుర్తు ఉండేది. దీన్ని బట్టి పేదప్రజల సంక్షేమం పట్ల నిజాం ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధితో ఉందనే విషయం ఎవరికైన అర్థం అయితది. ఈ విధంగ మొత్తం దక్షిణ ఆసియాలోనే హైద్రాబాద్ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, కట్టుబాట్ల విషయంలో అత్యంత విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకుంది.

సెప్టెంబర్ 17 విషయంలో మతఛాందస ఖాశీంరజ్వీ నుంచి విముక్తి కలగడంతో పాటు నిజాం పాలన అంతమైంది. కాబట్టి కొందరికిది విమోచన దినం. అదేవిధంగ ఎప్పటికీ ఏ విషయంలోను సంతృప్తి చెందని కమ్యునిస్టులు ఇప్పటికీ ద్రోహం జరిగిందని భావించడంతో వారికిది విద్రోహదినం. కమ్యునిస్టులు, రజాకార్లు ఒకవైపు భారత సైన్యం మరోవైపు సృష్టించిన అలజడి యుద్ధబీభత్సం సద్దుమణిగి స్వేచ్ఛగా ఊపిరితీసుకుంటున్న సామాన్య జనం భారతదేశంలో కలిసినందుకు సంబూరపడ్డరు. కాబట్టి మెజార్టీ ప్రజలు దీన్ని విలీన దినోత్సవంగ భావిస్తున్నరు.

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కూడ ఇప్పటికీ సీమాంధ్ర పార్టీలు, నాయకులు, పత్రికలకు తెలంగాణ మీద ఆశ కొట్టుక సస్తుంది. తెలంగాణ ప్రభుత్వాన్ని అస్థిరపరిచి, ప్రజల్ని ఆగమాగం చేసే పనిలో తలమునకలై సస్తుంద్రు. తెలంగాణ ఔన్నత్యాన్ని జీర్ణించుకోలేక చెప్పులు చేతబట్టుకొని, నోరు పారేసుకునే కుక్కలకు పతాకశీర్షికలుపెట్టి తప్పుడు ప్రచారం చేస్తుంద్రు. అసమ్మతివాదులంత ఒక్కటై తాటాకు చప్పుళ్ళతో సవాలిసురుతుంద్రు. ఏదో ఒక పనిచేసుకొని హాయిగ ఆనందంగ బతికే

తెలంగాణ బిడ్డల్ని రోడ్లమీదేసి వాళ్ళ బతుకులతో చెలగాటమాడుతుండ్రు. ఆయింత బతుకుదెరువుని ఆగం జేస్తుండ్రు. వాస్తవానికి భారత స్వాతంత్ర్య ప్రకటన వెలువడినప్పుడు దేశంలో 543 సంస్థానాలు ఉన్నయి. అవన్నీ స్వచ్ఛందంగానో, బలవంతంగానో, ఎనకో, ముందో భారతయూనియన్‌లో చేరినయి. మరి ఏ సంస్థానానికి లేని విలీనదినోత్సవ ఆర్భాటం ఒక్క హైద్రాబాద్‌కే ఉండవలసిన అవరసరం లేదేమో.

ఏది ఏమైన దేశచరిత్రలో మన తెలంగాణ 29వ రాష్ట్రంగ ఆవిర్భవించింది.

తెలంగాణ మొత్తం చరిత్రలో నిజమైన విముక్తి, విమోచన కలిగిన రోజు ఏదైన ఉందంటే అది జూన్ 2, 2014 మాత్రమే. అదే మన తెలంగాణకు నిజమైన స్వాతంత్ర్యదినం. సంబరాల పండుగ దినం.

# ఎవరికీ పట్టని దొడ్డి కొమురయ్య

దొడ్డి కొమురయ్య తెగింపుని, సాహసాన్ని చూసి హడలిపోయిన గూండాలు కాల్పులకు తెగబడ్డరు. ఆ తుపాకి తూటాలను కూడ లెక్కచేయని దొడ్డి కొమురయ్య తన కొస ఊపిరి ఉన్నంతవరకు శత్రుమూకలకు చెమటలు పట్టించిండు. తన పోరాటపటిమతో సామాన్యజనాన్ని కదిలించిండు. 1946 జులై 6న కరుడుగట్టిన కర్కశ గూండాల కాల్పుల్లో అస్తమించిన దొడ్డి కొమురయ్య పోరాట పొద్దుపొడుపై ఉదయించిండు. పల్లెపల్లెని మేల్కొల్పిండు. ఆ ప్రభంజనంతో సాధారణ రైతుకూలీజనం దొడ్డి కొమురయ్య రక్తంతో తడిసిన సాయుధపోరాట జెండాను ఎగరేసి, అనేక విజయాలు సాధించిండ్రు. కరుడుగట్టిన భూస్వాములకు కంటిమీద కునుకు లేకుండ చేయగలిగిండ్రు.

దొడ్డి కొమురయ్య మరణంతో రెచ్చిపోయిన సామాన్యజనం కట్టె, కత్తి, రాయి, రప్ప ఏదిబడితె అది అందుకొని తిరగబడ్డరు. జనం వీరావేశాన్ని చూసి ఆంధ్రమహాసభ కార్యకర్తలు రెచ్చిపోయిండ్రు. కమ్యునిస్టులు మరింత ఉత్సాహంతో పోరాటాన్ని కొనసాగించిండ్రు. వేలాది మంది జనం దొడ్డి కొమురయ్య మృతదేహాన్ని ఊరేగింపుగ తీసుకొనిపోయి, దొరసాని కొటను, తోటను విధ్వంసం చేసిండ్రు. గూండాల తుపాకులు గుంజుకొని వెంటబడి తరిమిండ్రు. ఇదే అదునుగ కమ్యునిస్టులు హింసాకాండను కొనసాగించిండ్రు. పరిస్థితి అదుపుతప్పుతుందని గ్రహించిన నిజాం ప్రభుత్వం ఆంధ్రమహాసభని, కమ్యునిస్టు పార్టీని నిషేదించింది. అయినప్పటికీ మొండి పట్టుదలతో రహస్య ఉద్యమాలంటు, గెరిల్లా పోరాటం అంటూ సామాన్యజనాన్ని సావుతిప్పలు బెట్టిండ్రు. లక్ష్యం లేని పోరాటంతో తెలంగాణ పల్లెలకు కంటిమీద కునుకు లేకుండా చేసి, ఆంధ్రా కమ్యునిస్టు నాయకులు అన్ని విధాలుగా లాభపడ్డరు. ఆ తర్వాత సాయుధ పోరాట రజతోత్సవాల దాక దొడ్డి మల్లయ్య కుటుంబం గురించి గాని, ప్రాణత్యాగం చేసిన దొడ్డి కొమురయ్య గురించి గాని ఏనాడు ఏ ఒక్క కమ్యునిస్టు నాయకుడు అటువైపు తొంగి చూసింది లేదు. 1969లో ఎగిసిపడిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షని అణిచివేసేందుకు ఎత్తుకున్న జైఆంధ్ర ఉద్యమంలో భాగంగ 1971లో సాయుధపోరాట రజతోత్సవాలు ఆగమేఘాల మీద జరిపిండ్రు. అప్పుడు తెలంగాణ అమరుల త్యాగాలు గుర్తుకొచ్చినయి. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, బందగి వంటి వాళ్ళను తల్చుకుండ్రు. అమరవీరులగాథలు రాసిండ్రు. పాటలు కైగట్టి పాడిండ్రు. తెలంగాణ రైతాంగ పోరాటంలో బానిసత్వాన్ని ధిక్కరించిన

స్వరాలను, పోరాటయోధులను అతివాద దృక్పథం మెండుగా ఉన్న సి.పి.యం. పార్టీ సొంతం చేసుకుంది. ఆ క్రమంలోనే 1973 ప్రాంతంలో కడివెండిలో దొడ్డి కొమురయ్య సంస్మరణార్థం అతిచిన్న స్తూపాన్ని కట్టి సభ నిర్వహించింది. ఆ తర్వాత కడివెండికే చెందిన నల్ల నరసింహులు తన గ్రామానికి తరిమెలనాగిరెడ్డిని ఆహ్వానించి దొడ్డి కొమురయ్యను స్మరిస్తు పెద్దఎత్తున సభ జరిపింద్రు. ఈ సభకు దొడ్డి మల్లయ్యని పిలిచి స్తూపం మీద పూలు చల్లి నివాళులు అర్పించింద్రు. మరికొంత కాలం తర్వాత విశాలాంధ్ర పదవమహాసభలు నిర్వహిస్తున్న సి.పి.ఐ పార్టీ దొడ్డి మల్లయ్య చేతుల మీదుగ కడివెండి నుంచి జ్యోతిని తీసుకొని విజయవాడకు పోయింద్రు. అప్పటిదాక ఉన్న చిన్న స్తూపం స్థానంలో సి.పి.ఐ వాళ్ళు 1981లో ప్రస్తుతం ఉన్న ఎత్తయిన స్తూపాన్ని కట్టి, సురవరం సుధాకర్ రెడ్డి చేతులమీదుగ ఆవిష్కరించింద్రు. అయితే కుటుంబ సభ్యుల సూచనమేరకు స్తూపం మీద ఏ పార్టీకి సంబంధించిన గుర్తులు పెట్టలేదు. కేవలం ఎర్రరంగులో ఉన్న స్తూపం మీద సుత్తె కొడవలి మాత్రమే ఉన్నాయి. ఆ విషయం ఎట్ల ఉన్న దొడ్డి కొమురయ్య చనిపోయిన తేదీని శిలాఫలకం మీద జులై 4 అని తప్పుగానే రాసింద్రు. అన్నిచోట్ల ఆ తేదీనే ప్రచారం చేసింద్రు. ఇప్పటివరకు తెలంగాణ సాయుధపోరాట చరిత్రకు సంబంధించి అనేక పుస్తకాలు వచ్చినయ్. పెద్ధపెద్ధ గ్రంథాలు ఉన్నయ్. కాని ఆ పోరాటానికి ప్రేరణ కల్పించి ప్రాణత్యాగం చేసిన దొడ్డి కొమురయ్యకు సంబంధించి రెండుపేజీలకు మించి ఎక్కడా లేదు. అదికూడ ఒకదానికొకటి పొంతన లేకుండ ఉన్నది. దొడ్డి కొమురయ్య స్తూపాన్ని చిన్నగ ఉంటె పెద్దగ చేసింద్రు. సభలు పెట్టింద్రు. సమావేశాలు నిర్వహించింద్రు. సాయుధపోరాట చరిత్రలోని వీరత్వాన్ని, వీరయోధల జీవితాన్ని గురించి అనర్గళంగ మాట్లాడింద్రు. ఇప్పటికీ మాట్లాడుతూనే ఉన్నరు. కాని తెలంగాణ సాయుధ పోరాట వాస్తవ చరిత్రను తెలుసుకోవాలన్న కనీస ఆలోచన కూడ ఎవరు చేయలేదు. కేవలం ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని అణిచివేయడానికి ఏసిన ఎత్తుల్లో భాగంగ అనేక అబద్దాలను ప్రచారం చేసింద్రు. తెలంగాణ సాయుధ పోరాటమంత నిజాం వ్యతిరేకపోరాటమని, నిజాం అత్యంత దుర్మార్గుడన్నట్టు పాటలు కట్టి పాడింద్రు. పోరాట రజతోత్సవాలతో కేంద్రంలో కాంగ్రేసు నాయకుల మెప్పు పొందింద్రు. తెలంగాణ మీద సంపూర్ణ ఆధిపత్యాన్ని సంపాదించింద్రు. అంతేగాని ఆంధ్రకమ్యునిస్టు నాయకులకు ఈ ప్రాంతం మీద ఎప్పుడు ప్రేమలేదు. ఇక్కడి వీరయోధుల చరిత్రను సాధ్యమైనంత వరకు బయటికి రాకుండ తొక్కిపెట్టే ప్రయత్నమే చేసింద్రు తప్ప ఎక్కడ సరైన గుర్తింపు ఇయ్యలేదని చెప్పడానికి ఇంకా ఇలాంటిఆధారాలెన్నో ఉన్నయి.

అంతటి మహత్తర పోరాటానికి స్ఫూర్తినిచ్చిన దొడ్డి కొమురయ్య త్యాగం మాత్రం కనుమరుగయ్యింది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ద్వార ప్రపంచ గుర్తింపు పొందిన ఆంధ్ర కమ్యునిస్టు అగ్రనాయకులు దొడ్డి కొమురయ్యను మరిచిపోయింండ్రు. ఆ తర్వాత 1964లో కమ్యునిస్టు పార్టీ రెండుగ చీలిపోయి సి.పి.ఐ. (యం) అవతరించింది. ఆ తర్వాత పశ్చిమబెంగాల్‌లో భూసంస్కరణల విషయమై తలెత్తిన వివాదం కారణంగ చారుమజుందార్ నాయకత్వంలో సి.పి.ఐ.యం.ల్ ఆవిర్భవించింది. ఇట్ల కమ్యునిస్టు పార్టీలో అనేక చీలికలు వచ్చినయి. దేశంలోనే కాదు ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా అది ముందు ఆంధ్ర కమ్యునిస్టు నాయకులకు సొంత ఇంటి సమస్య అయితది. ప్రాపంచిక విషయాలపట్ల అతిగా స్పందించే గుణమున్న కమ్యునిస్టు నాయకులు ఏనాడు దొడ్డి కొమురయ్య విషయాన్ని పట్టించుకున్న సందర్భం లేదు. ఎవరి జెండాలు వాళ్ళందుకొని, ఆచరణ సాధ్యం కాని సిద్ధాంతాలతో ప్రజలను వక్రమార్గం పట్టించే ప్రయత్నం చేసింండ్రు. 1970లో ఢిల్లీలో కాంగ్రేసుతో చేసుకున్న లోపాయికారి ఒప్పందంలో భాగంగ ఆగమేఘాల మీద సాయుధపోరాట రజతోత్సవాలు జరిపింండ్రు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రాజుకున్న ప్రతిసారి సీమాంధ్రులు ఆ మంటల్ని ఆర్పే ప్రయత్నం తీవ్రతరం చేసింండ్రు. అందుకు తెలంగాణ కమ్యునిస్టు నాయకత్వాన్ని పావులుగ వాడుకున్నరు. అందులో భాగంగానే పోరాట రజతోత్సవాలకు తెరతీసింండ్రు. ఆ సమయంలో తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థని దుమ్మెత్తిపోయడానికి తెలంగాణ సాయుధ పోరాట అమరుల ఆనవాల్లు దేవులాడుకుంట బోయింండ్రు. కాని సాయుధపోరాటాన్ని రగిలించిన వీరయోధుడు దొడ్డి కొమురయ్య చరిత్రను మాత్రం బయటికి తీయలేకపోయింండ్రు. పోరాటంలో రెండు కాళ్ళు పోగొట్టుకున్న దొడ్డి మల్లయ్య కుటుంబానికి ఐదుపైసల సాయం అందించలేకపోయింండ్రు. హైద్రాబాద్ నడిబొడ్డున పార్టీ కార్యాలయాలుగట్టి ఆంద్రోళ్ళ పేరు పెట్టుకుండ్రు. లోపల చిన్నచిన్న గదులకు, సమావేశమందిరాలకు తెలంగాణ వీరయోధలు పేర్లు పెట్టింండ్రు. నోట్లో నాలుకలేని తెలంగాణ కమ్యునిస్టు నాయకులు పార్టీని పటిష్టం చేయడం కోసం సీమాంధ్రనాయకులు ఆడిచ్చినట్టల్ల ఆడింండ్రు. తెలంగాణకు సంబంధంలేని నాయకులను తెచ్చి నెత్తినబెడితె నోరుమూసుకొని మోసింండ్రు. తెలంగాణ సాయుధపోరాటాన్ని స్వతంత్రపోరాటంగ గుర్తించి ఎందరికో పెన్షన్‌లు మంజూరు చేసింండ్రు. కాని ఆ పోరాటానికి కారణమైన దొడ్డి కొమురయ్య కుటుంబానికి ఏ విధమైన ఆదెరువు చూపించలేకపోయింండ్రు. ఎవరైన వాస్తవాలు గట్టిగ మాట్లాడి, ఆంధ్ర అధినాయకత్వాన్ని ధిక్కరిస్తే పార్టీనుంచి బహిష్కరించింండ్రు తప్ప అసలు సమస్యను పరిష్కరించింది లేదు.

# దొడ్డి మల్లయ్య కొడుకు భిక్షపతి



1946 జులై 5న విసునూరు రామచంద్రారెడ్డి గూండాలు జరిపిన కాల్పుల్లో దొడ్డి మల్లయ్య కాళ్ళకు తీవ్ర గాయాలై నడవలేని స్థితిలో నరకయాతన అనుభవించిండు. ఆనాటి నుంచి ఏ ఒక్క కమ్యునిస్టు నాయకుడు అటువైపుగ వచ్చి పలకరించిన పాపాన పోలేదు. సాయుధ పోరాట రజతోత్సవాల సందర్భంగ దొడ్డి కొమురయ్య జాడ కోసం నాయకులు కడివెండికి పరుగులు తీసింద్రు. ఆ సమయంలోనే దొడ్డి కొమురయ్య జ్ఞాపకార్థం ఘటనాస్థలంలో స్థూపం కట్టింద్రు. దొడ్డి కొమురయ్య మీద ఏ రోజు కాల్పులు జరిగినయి, ఏ రోజు చనిపోయిండు. ఏ రోజు పోస్టుమార్టం నిర్వహించింద్రు. ఆ తర్వాత ఏం జరిగిందనే విషయాల పట్ల ఒకదానికొకటి పొంతన లేకుండ వీరగాథలు రాసింద్రు, పాటలు పాడింద్రు. కడివెండి గ్రామ నడిబొడ్డున దొడ్డి కొమురయ్య స్తూపావిష్కరణ సందర్భంగ ఏర్పాటు చేసిన సభలో దొడ్డి మల్లయ్యని వేదికమీదికి పిలిచింద్రు. ఆ సభలో మోటూరి హన్మంతరావు, ఓంకార్, భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి, మల్లు స్వరాజ్యం వంటి నాయకులు హాజరై ప్రసంగాలు చేసింద్రు. అంతే ఆ సభతో సి.పి.యం నాయకులు మల్ల వెనకకు తిరిగి చూడలేదు. ఆ తర్వాత దొడ్డి మల్లయ్య చిన్న కొడుకు భిక్షపతి ఎన్నోసార్లు సి.పి.ఐ కార్యదర్శి నారాయణకు, సి.పి.యం. కార్యదర్శి బి.వి. రాఘవులుకు కుటుంబ పరిస్థితులతో పాటు, దొడ్డి కొమురయ్యకు సంబంధించిన అంశాల మీద వినతిపత్రాలు సమర్పించిండు. చాలాకాలం దాక ఏ విధమైన స్పందన రాలేదు. తర్వాత కొంత కాలానికి సి.పి.ఐ నాయకుడు నారాయణ కడివెండిలో దొడ్డి కొమురయ్య భవన నిర్మాణం కోసం ప్రణాళిక సిద్దం చేసింద్రు. అందులో భాగంగనే 1980 ప్రాంతంలో గతంలో ఉన్న స్తూపాన్ని పెద్దగ చేసింద్రు.

ఆ తర్వాత సంవత్సరానికే 1981 జనవరి 18న దొడ్డి మల్లయ్య చనిపోయిండు.

ఆంధ్రమహాసభలో కీలకభూమిక పోషించిన దొడ్డి మల్లయ్య, లచ్చమ్మ దంపతులకు ముగ్గురు కొడుకులు, ముగ్గురు బిడ్డలు. వీళ్ళలో పెద్దకొడుకు ఆగయ్యని తెలంగాణ సాయుధపోరాట సమయంలో రాపాక జగన్‌మోహన్ రెడ్డి (బాబుదొర) రజాకార్లతో కలిసివచ్చి చెట్టుకు కట్టేసి కాల్చి చంపిండు. ఆయన తర్వాత గల ఇద్దరు కొడుకులు దొడ్డి ఐలయ్య, దొడ్డి బిక్షపతి. వీళ్ళు ప్రస్తుతం కడివెండిలోనే ఉన్నరు. పార్టీల నుంచి గాని, ప్రభుత్వం నుంచి గాని ఏవిధమైన సాయం లేక వాళ్ళకున్న కొద్దిపాటి వ్యవసాయాన్ని చేసుకుంటు దయనీయమైన స్థితిలో బతుకీడుస్తున్నరు. దొడ్డి మల్లయ్య రెండవ కొడుకు ఐలయ్యకు కొమురయ్య, యాదయ్య అనేక ఇద్దరు కొడుకులతో పాటు పద్మ అనే ఒక బిడ్డ కూడ ఉన్నది. అదేవిధంగ దొడ్డి మల్లయ్య చిన్నకొడుకు దొడ్డి భిక్షపతి భార్య అనసూర్య. వీళ్ళకు సూర్యం, చంద్రం అనే ఇద్దరు కొడుకులు ఉన్నరు. సూర్యం ఎం.సి.ఎ. చదువును మధ్యలో ఆపేసి వ్యవసాయం చూసుకుంటుండు. చంద్రం ప్రస్తుతం డిగ్రీ చదువుతుండు. సాయుధ పోరాటాన్ని రగిలించిన వీరయోధుల కుటుంబం ప్రస్తుతం అష్టకష్టాల నడుమ అల్లాడుతుంది. ఆంధ్రమహాసభ కార్యక్రమాలలో భాగంగ ఆనాటి కమ్యునిస్టుపార్టీ నిర్మాణం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబాన్ని ఏనాడు ఏ ఒక్కరు పలకరించిన దాఖలాలు లేవు. ప్రస్తుతం దొడ్డి కొమురయ్య, దొడ్డి మల్లయ్యలు ఆంధ్రమహాసభ కార్యకర్తలుగానే మిగిలిపోయినప్పటికి, మొదట అన్నిరకాల కమ్యునిస్టు పార్టీలు కండువా కప్పాలనే ప్రయత్నం చేసినయి. చివరికి వాళ్ళు ఏ కమ్యునిస్టు పార్టీకి చెందినవారో కూడ అర్థం కానంత గందరగోళానికి గురిచేసింద్రని, దొడ్డి మల్లయ్య కొడుకు భిక్షపతి తన ఆవేదనని వ్యక్తం చేసిండు. దొడ్డి భిక్షపతి పార్టీలకు అతీతంగ తెలంగాణ ఉద్యమంలో తనవంతుగా పాల్గొని పోరాట వారసత్వాన్ని కొనసాగించిండు. అమరుల త్యాగాలు, కేసీఆర్ నిరాహార దీక్ష, విద్యార్థులు, కవులు, కళాకారుల పోరాట ఫలితంగ అరవై సంవత్సరాల వలసాంధ్ర పాలన అంతమై తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజలకు, వృద్దులు, వికలాంగులకు ఆసరగా నిలిచింది. కాబట్టి మన తెలంగాణ రాష్ట్రంలోనైన దొడ్డి కొమురయ్య త్యాగాన్ని గుర్తించి ట్యాంక్‌బండ్ మీద దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుకోవడంతో పాటు అస్తవ్యస్థ జీవితాన్ని గడుపుతున్న దొడ్డి మల్లయ్య కుటుంబాన్ని ఆర్థికంగ ఆదుకోవాలని ప్రభుత్వానికి విన్నవించడం జరిగింది.

# కొమరయ్య వీర మరణం

– భీమిరెడ్డి నరసింహారెడ్డి

1946 నుండి 1951 వరకూ తెలంగాణా వీరోచిత విప్లవ పోరాటం సాగింది. ఆ మహత్తర పోరాటంలో మొదట ఆహుతైన అమరవీరుడు దొడ్డి కొమురయ్య. 1946 జూలై 4వ తేదీన జనగాం తాలూకా కడివెండి గ్రామంలో ఆ ఘటన జరిగింది. జగత్ ప్రసిద్ధికెక్కిన రైతాంగ సాయుధ పోరాటం తెలంగాణా గడ్డపై ప్రజ్వరిల్లడానికి అదే ఆరంభం. దొడ్డి కొమురయ్య వీరమరణం తిరుగుబాటు కోసం రంజిల్లిన ఒక సింహగర్జన. అది బానిసత్వాన్ని ధిక్కరించి చెలరేగిన ప్రజావిప్లవజ్వాల.

బానిసత్వం తరాల నాటి ఒక పాతకాలపు నిరంకుశ చట్రం. కుటుంబాలకు కుటుంబాలుగా ఈ చట్రంలో బలై, నుసై. మసైన ఘటనలు కోకొల్లలు. యావత్ గ్రామాలు ఈ నిరంకుశత్వం కింద నలుగుతున్న రోజులవి.

దీని ఒకానొక క్రూర స్వరూపమే వెట్టిచాకిరి. చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి, హరిజన కుటుంబాలు ఈ చాకిరీ చట్రంలో ఇరుక్కున్నాయి. పదేండ్ల పసిబాలురతో సహా వెట్టిచాకిరీకి బలి అవుతున్న రోజులవి. జమీందార్ల ప్రయాణాలకు, మేనా, పల్లకీల బరువుల మోతలకు, వారి ధూప, దీపాల అలంకరణలకు, పక్కలు వేసి పాద ధూళి నెత్తిన వేసుకొని పరిచర్యలు చేయడానికి అన్నిటినీ మించి వివాహ, తదితర పండగ పబ్బాలకు, కార్యాలకు ఈ కుటుంబాలకు కుటుంబాలు నాశమైన రోజులవి. ఎదురు తిరిగితే చివరకు శవం కూడా నవాబుల గడీలల్లో మటుమాయమయ్యే రోజులవి.

ఇది ఆనాటి విసునూరి రామచంద్రారెడ్డి కడారు సోదరులు జన్నారెడ్డి ప్రతాపరెడ్డి, నూకల్ దేశ్‌ముఖ్‌ల రాజ్యంలో సాగిన వెట్టిచాకిరీ బానిస వ్యవస్థ. ఇది తరాలుగా నడుస్తూ వచ్చిన పాత కాలపు వ్యవస్థ. ఈ వ్యవస్థ అడుగున అణగారిన శ్రమజీవుల ఆగ్రహం, ఆవేశంలో నుండి అప్పుడప్పుడే తిరుగుబాటు అగ్ని కణాలు చెదురుమదురుగా ఎగిరిపడుతున్న రోజులు. సూర్యాపేట తాలూకా తుంగతుర్తి పోలీసుస్టేషన్‌లో ఒకానొక వింత ఘటన జరిగింది. పోలీసులకు నిత్యమూ వంట చెరుకు మోస్తున్న ఒకానొక హరిజన అమాయకుడు కట్టెల మోపును అమాంతంగా కింద పడేస్తూ ఒక చీటి ఆ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌కు చూపెట్టాడు. 'ఇంతటితో ఈ చాకిరీకి స్వస్తి' అనే మాటలు అతని హృదయం నుండి అగ్నికణాలుగా దూసుకువచ్చాయి. దిగాలుపడి ఆ హెడ్‌కానిస్టేబుల్ ఆ చీటి చూశాడు.

'వెట్టిచాకిరీ నశించాలి, బానిసత్వాన్ని ధిక్కరించండి' అనే ఆంధ్ర మహాసభ,

కమ్యూనిస్టు పార్టీల పిలుపు అందులో రాసి ఉంది.

'నేటి నుండి నేనూ ఒక మనిషిని' అనే గంభీరవదనంతో ఆ శ్రమజీవి తిరిగి వెళ్లిపోతుండగా దిగాలుపడిన హెడ్‌కానిస్టేబుల్ అలాగే చూస్తూ ఉండిపోయాడు.

ఇక్కడొక వీరవనిత ఈ బానిసత్వాన్ని ఎదిరించి నిలిచింది. ఆమే నాటి అలగా జనంలోంచి అమాంతంగా పైకి వచ్చిన చాకలి అయిలమ్మ, ఆమెది జనగామ తాలూకా పాలకుర్తి గ్రామం. పక్కనే రెండు మైళ్ళ దూరంలో ఉన్న కర్కోటకుడు విసునూరి రామచంద్రారెడ్డి రాజ్యాన్ని ఎదిరించి ఆ గ్రామానికి నాయకురాలుగా నిలిచిన వీర నారీమణి. ఈ కర్కోటకుల ముందే వెట్టిచాకిరీని అడుగు తొక్కి ప్రతిఘటనకు ముందు నడుస్తున్న ఒక విముక్తివాహినికి సేనాని ఆమె. కాశ బిగగట్టి, కర్రందుకొని అర్ధరాత్రి అణగారిన జనాన్ని మేల్కొలిపి తిరుగుబాటుకు పురిగొల్పిన మరొక వీరవనిత చాకలి వీరమ్మ. వెట్టిచాకిరీ తరతరాలుగా తమ వృత్తిగానే మారిపోగా ఆ బానిస వృత్తిని చీల్చి చెండాడి తోటి జనాన్ని మేల్కొల్పడానికి అహోరాత్రులు కృషి చేస్తున్న ఒక ప్రజా నాయకురాలు. ఇది కడకు భూస్వాములకు వ్యతిరేకంగా జనగాం తాలూకా రామారంలో తలెత్తిన మరొక తిరుగుబాటు జ్వాల.

ఈ విప్లవ జ్వాల కొరివిదయ్యం అనబడే జానకమ్మ దొరసాని ఎస్టేటు లంకకు అంటుకుంది. అతిక్రూరుడుగా, పాత కాలపు నిరంకుశుడుగా పేరుమోసిన విసునూరి రామచంద్రారెడ్డి తల్లి ఆమె. జనగాం తాలూకా కడివెండి గ్రామంలో ఈ లంకిణికి ఓ లంకంత ఎస్టేటు. అప్పటికి కడివెండి గ్రామంలో శ్రమజీవులు చాకిరీని బహిష్కరించారు. ఓ మంగలి కుటుంబం తల్లీపిల్లతో సహా ఆ రోజు దొరసాని దీపాలంకరణకు, పక్కలు, పాదధూళి, పరిచర్యలకు వెళ్లనందుకు ఆమె ఇంటిపై, ఒంటిపై జానకమ్మ గూండాలు విరుచుకుపడ్డారు. ఇది తెలిసి ప్రజలు పది మందీ గుంపు కూడనే కూడారు. ఆ పరమ రాక్షసులను నిలవేశారు. అందుకు చిందులు తొక్కిన ఆ గూండాలు జనంపై కూడా విరుచుకుపడి చేయి చేసుకోనారంభించారు.

ఇంతలో ఆంధ్ర మహాసభ–కమ్యూనిస్టు పార్టీ వలంటీర్ల దళం అందనే అందింది. గూండాలపై ఎదురు దెబ్బ తీయగా బతుకు జీవుడా అని పారిపోయి దొరసాని గడిలో దూరారు. వీరుడు దొడ్డి కొమరయ్య అగ్రభాగంలో ఉండగా ఉద్రిక్తులైన ప్రజానీకం బ్రహ్మాండమైన ప్రదర్శనగా ముందుకు కదిలింది.

కాని అవమానం భరించజాలని కొరివి దయ్యం తన సైన్యాధిపతులకు సరికొత్త ఆజ్ఞలు జారీ చేసింది. ఈ మూకలు దొరసాని గడిలో నుంచే సాయుధ దాడికి సన్నద్ధమయ్యారు. ఊరేగింపు కోట గడీమూల రాగానే ముందు భాగంలో అడుగులేస్తూ

అత్యంత ఉత్సాహంతో నినాదాలిస్తున్న కొమరయ్య డొక్కలోంచి తుపాకీ గుళ్లు దూసుకుపోయాయి. ఆ మూలమడతలో నున్న కిటికీలోంచి బందిపోటు దొంగ కిరాతకుడైన మిష్కీనలీ తన షాట్‌గన్‌తో దొంగచాటుగా కాల్చగా తగిలిన దెబ్బయిది. ఇంకేముంది? దొడ్డి కొమరయ్య నేలకొరిగాడు.

ఈ సంఘటనతో ప్రజల క్రోధాగ్ని భగ్గున మండింది. ప్రజలు ఆగ్రహావేశాలతో కుతకుత లాడిపోయారు. అలాంటి స్థితిలో వున్న ప్రజలు కోటగడిని చుట్టుముట్టారు. కొరివి దెయ్యంతో సహా హంతకులను, కిరాయి దొంగలను దిగ్బంధించారు.

అదే రాత్రి విసునూరి రామచంద్రారెడ్డి నలువైపుల నున్న చోటా, మోటా దొరలకు, వారి బలగాలకు కబురంపాడు. క్రూరుడైన తన కుమారుడు బాబుదొర నాయకత్వాన అదనపు బలగాలను హుటాహుటిగా తరిమాడు. వీరికన్నా ముందే రామన్నపేట తాలూకాలోని ముడిపడిగ, నీర్మాలతోసహా అనేక గ్రామాల నుండి ఒడిసెలు, కర్రలతో ప్రజా ప్రవాహము కదం తొక్కుతూ, పదం పాడుతూ విజృంభించి కడివెండి గ్రామాన్ని కమ్మివేసింది. దాడికి వెడలి వస్తున్న దొరల బలగాలను గ్రామానికి మైలు దూరాన్నే నిలేశారు. దొరల బలగానికి అయిదు రెట్లు అమాంతంగా పెరిగి వేల జనం తెల్లవారి మధ్యాహ్నం వరకు చుట్టివేశారు. షాట్‌గన్ దెబ్బలతో దాడి ప్రారంభించిన పాతకాలపు మూకలను వడిసెల జనం తెల్లవారి మధ్యాహ్నం వరకు మూడువైపుల నుండి శత్రు బలగాలను చుట్టివేశారు. వడిసెల రాళ్ల వర్షంతో ప్రజాబలం ఎదుర్కొన్నది. ఈ ధాటికి తట్టుకోలేని ఈ కిరాయి మూకలు తమ యజమానులతో సహా పలాయనం చిత్తగించారు. దొరలు, దొరవార్లు, జమిందార్లు తమ కచ్చడాలను ఆఘమేఘాల మీద తరుముకుపోతున్నారు. కాని ప్రజావాహిని ఈ నేరస్తులను, హంతకులను వదిలిపెట్టలేదు. ఎందరెందరో పరమశత్రువులైన పెత్తందార్లు, వారి తొత్తులు అందారు.

ఈ ప్రవాహం విసునూరు పొలిమేరల దాకా సాగింది. ప్రజల చేతుల్లో చిక్కకుండా బయటపడిన దొంగలూ, దొరలూ బతుకుజీవుడా అని పారిపోయి విసునూరు దొరగడిలో దూరి వెనుతిరిగి చూశారు. ఇక దొరికినవారిలో ముఖ్యులు నీచాతి నీచులు అనుమల రాంరెడ్డి, ఒలమీది జాగీర్దారు, ఖాన్‌మియా. ఈ కిరాతకులను పేరుపేరునా సంజాయిషి అడుగుతూ దేనికదే శిక్ష విధించి, వారిపై అమలు జరిపారు. ఇది అమరవీరుడు దొడ్డి కొమరయ్య రక్తపు మడుగులో నుంచి విజృంభించిన ప్రళయం. నిజానికి నాటి బానిసత్వాన్నే ధిక్కరించి విజృభించిన మొదటి తిరుగుబాటు. మాటకుముందు 'అయ్యా! నీ కాళ్లు మొక్కుత! నీ బాంచను !' అంటూ అణగి మణగిన జనం విజృంభించి క్రూరులైన జమీందార్లపై ఎదురుదెబ్బతీసిన ఒక భీకరఘట్టం.

# ఊరేగింపులు

-ఆవుల పిచ్చయ్య

జై జై అనే శబ్దం గ్రామం వెలుపల తోట బావిమీద కూర్చుని మొఖం కడుగుచుండగా వినవచ్చింది. ఇంతలో గ్రామాలనుండి కొందరు ప్రజలు ఎర్రజెండాలు తీసుకొని గ్రామంలో వెళ్లుచుండగా చూచాను. నా హృదయం అతివేగంగా కలవరపడింది. ఒక క్షణమయిన ఆగలేకపోయాను. నోటిలోవున్న పండ్లపుల్లను తీసి నేలకు కొట్టి గ్రామంలోకి పరుగెత్తాను. కాని ఎవరో సాధ్యమయినంత తొందరలో తెలుసుకోవాలని ప్రయత్నించాను. గ్రామం చివర్లో వున్న గొల్ల యువకుడయిన గంగయ్య ఇంటికి వెళ్లి చూచేసరికి ఎవ్వరు లేరు. తొంబయి సంవత్సరముల వృద్ధురాలు మాత్రం ఉంది. చేతిలో కట్టె తీసుకొని బయటికి రావటానికి ప్రయత్నించుచున్నది. 'ఏమవ్వా గ్రామంలో ఏం జరుగుతుందని' అడిగాడు. 'ఇవ్వాళ మా అమరజీవి కొమరయ్య వీరమరణానికి ఊరేగింపు జరుగుతుంది. నేను అక్కడికే వెళ్లుచున్నాను. నీవు కూడా రావయ్యా' అని చెప్పింది వృద్ధురాలు. ఇంతలో నా పొలంలో నాటు పెడుతున్న 20,30 మంది స్త్రీలు నాట్లు పెట్టుట వదిలి గ్రామంలోకి వచ్చారు. అంతా గందరగోళంగా వున్నదని నా జీతగాడొచ్చి చెప్పగా వెంటనే పొలం దగ్గరకు వెళ్లాను. పొలంలో ఎవరూ లేరు. నీటిలో ఒరిగిన నారు దృశ్యం చూసేసరికి ఏదో విచారం వెళ్లబుచ్చుచున్నట్లుగా కనిపించింది. ఈ పాడిపంటలు చల్లగా ఉండాలని ప్రాణత్యాగం చేసిన కొమరయ్య గురించి ఈ పొలం విచారపడుచున్నదని గ్రహించాను. ఇంతలో నా ప్రక్కనున్న పట్వారి పొలంలో నుంచి పెద్దకేకల ధ్వని వినబడుట వలన అక్కడికి వెళ్లి చూశాను. జీతగాండ్రు ఒకరికొకరు తొందర తొందరగా పిలుచుకొనుచున్నారు. వ్యవసాయ కూలీల కొరకు కొమరయ్య ప్రాణాలర్పించినందున ఈ వ్యవసాయ కూలీలు ఊరేగింపులో పాల్గొనటానికి తొందరపడుచున్నట్లు తెల్సుకున్నాను.

అడవి పొలాలలో బావుల దగ్గర ఎక్కడ గూడా ఒక మానవుడు లేడు. అంతా గ్రామంలోకి చేరుకున్నారు. నా కాళ్లు ఏమాత్రం నిలబడటం లేదు. నేను ఎటు అడుగు వేస్తామన్న అడుగు లేవటం లేదు. గ్రామంవైపు మాత్రం అడుగుపడుతుంది. దారిలో వస్తూ వుండగా గొర్రెలన్నీ గుంపులు గుంపులుగావుండి ఇతర చెలకలవైపు వెళ్లకుండా క్రిందికి తలలు వేసి నిశ్శబ్దంగా నిలబడ్డవి. గొల్లవాండ్లు మాత్రం కావలి లేరు. వారుకూడా కొమరయ్యగారి ఊరేగింపులో పాల్గొనటానికి వెళ్లినట్లు బోధపడింది. ముందు వెళ్లి కాలువలో మొఖం కడుక్కొని

వెళ్ళుదామనుకొన్నాను. కాలువ దగ్గరకు వెళ్లేవరకు నీళ్లు లేవు. బావి దగ్గరకుపోయాను. బావిమీద దొక్కలు గుంజుకపోయి ముందు గడ్డి వున్నా మేత మేయకుండా వున్న ఎడ్లను చూసి నాకు చాలా చిత్రమయినది. ఆలోచించాను. వేళగాని వేళ ఎన్నలు లేని వేళ అకస్మాత్తుగా మోటలు మీదనే విడిచి రైతు గ్రామంలోకి పోయాడని ఎడ్లు విచారంతో నిలబడ్డాయని తెలుసుకున్నాను.

అంబాయని ధ్వనులు ప్రక్క వైపునుండి ఒకేసారి వినబడ్డాయి. అటు చూచేవరకు శరీరమంతా బురద జల్లుకొని నాగళ్లు మెడపై వేసుకొని మోకాటి లోతున బురద పొలాలలో నిలబడ్డ ఎడ్లను చూశాను. ఏమాత్రం కదలకుండా విశ్రాంతి తీసుకొని నిలబడ్డట్టు కనిపించాయి. పిట్టల కీచుకీచుమనే శబ్దం వినబడటం లేదు. సన్నని మంచు కురుస్తుంది.ప్రపంచమంతా ఇవ్వాళ్ల విచారం వెలిబుచ్చుతున్నట్లుగా కనిపించింది. కారుమబ్బులు పట్టాయి. మబ్బుల్లో తలదాచుకున్న సూర్యుడు కనిపించటంలేదు. నా శరీరమంతా ఒకేసారి జలదరించింది. ఇక నిలబడలేక పోయాను. గ్రామంలోంచి నినాదాలు ధ్వనులు ఎక్కువగా వినిపించుతుంటే అంతవేగంగా నా అడుగులు పడుతున్నాయి. నేను ఎంత వేగంగా నడుచుచున్నానో నాకే తెలియదు. గ్రామంలోకి వెళ్లాను. ప్రజలందరు ఆంధ్రమహాసభ ఆఫీసుకి వెళ్లినట్లు తెలిసింది. అయినను ఇంటివద్ద ఆడువాండ్లు ఉంటారనుకున్నాను. ఇంటికి వెళ్లేవరకు ఎవ్వరు కనబడలేదు. అతివేగంగా పొంగుచు పొయ్యిలోని నిప్పులను చల్లార్చుచున్న పాలు చూచాను. ఒకవైపు అన్నం పళ్లెంలో సగం మాత్రం కూరలతో కలిసియున్నది. కొమరయ్యగారి నినాదాలు వినబడగానే అన్నం తినుకుంటూ సగం అన్నం విడిచి పోయారని తెలుసుకున్నాను. ఇంతలో ప్రక్క ఇంట్లో నుంచి ఏమో మాడుతున్నట్లు వాసన వచ్చింది. ప్రక్క ఇంటిలోకి వెళ్లగానే పొయ్యిమీద అన్నంపెట్టి ఊరేగింపులో పాల్గొనటానికి స్త్రీలు వెళ్లినట్లు బోధపడింది. ఆపొయ్యిమీద మాడుచున్న జొన్న అన్నం క్రిందికి దించాను. ఇక నా ఉత్సాహం అన్నది ఆగలేక పోయింది. పొలం దగ్గర ఎవ్వరులేరు, జీతగాండ్లను పొలం దగ్గరకు పంపి ఊరేగింపులో పాల్గొనాలనుకున్నాను. జీతగాండ్ల కొరకు హరిజన వాడవెళ్లాను. ఈ వాడకు చివరవున్న చెప్పులుకుట్టే ముత్తిగాడింటి ముందుకు వెళ్లి జీతగాండ్ల కొరకు కేకలు వేశాను. కానీ జవాబు రాలేదు. ముత్తిగాడింటిముందు చెప్పులు కుట్టే సామాను, చర్మాలు అన్ని చిందరవందరగా పడి వున్నాయి. చెప్పులు కుట్టుకుంటూ విడిచి ఊరేగింపులో పాల్గొన్నట్టు తెలుసుకొని జీతగాండ్లు కూడా ఊరేగింపులో పాలొన్నారేమో నా పొలం ఏమవుతుందో నని భయం వేసి వాడలో ప్రతి ఇంటిలో చూచాను. ఎవ్వరూ లేరు. చిప్పలు, కుండలు మొదలగునవి

మాత్రమే ఉన్నవి. రోటిలో సజ్జలు పోసి దంచుతూ రోకలి పడవేసి వెళ్లిపోయినారు. ఇంతలో కొమరయ్య పేరుమీద పాటలు పాడుతు నినాదాలు ఇచ్చుట వినపడింది. ఇక ఆగలేక పోయాను. ఆంధ్రమహాసభ ఆఫీసుకి వస్తూ ఉండగా గ్రామాధికారి ఎదురయ్యాడు. గ్రామ ప్రజలు మొత్తం అక్కడ వుంటె మీరు ఎక్కడికో వెళ్లిపోతున్నారేమిటి అని అడిగాను.

'నేను అక్కడ ఉంటానికి వీలులేదు.'

'ఏం ఎందుకు నేనయినా పోవచ్చునా?'

'నిస్సందేహంగా వెళ్లవచ్చును'

'మీరెందుకు రాకూడదు? ఏం కారణం చెప్పకూడదా?'

'చేప్పేదేముంది. నేను ప్రభుత్వ బానిసను. ఆ ఊరేగింపు రాజకీయ ఊరేగింపు. అక్కడ వుంటే రిపోర్టు వ్రాయవలసి వస్తుంది. కొమరయ్య ప్రాణత్యాగాన్ని గుర్తించారు. రిపోర్టు చెయ్యటానికి చెయ్యి వణుకుతున్నది. నాకలం ఆడదు. ఊరేగింపులో వుంటే తప్పక రిపోర్టు వ్రాయాలి. లేకుంటే పై అధికారులతో బూతులు పడాలి. వీటన్నిటి కంటె ఇవాళ గ్రామంలో నుంచి వేరే గ్రామం వెళ్లటం ఉత్తమమని నిశ్చయించుకొని వెళ్లి పోవుచున్నాను' అని వెళ్లిపోయాడు.

నేను వెంటనే ఆంధ్రమహాసభ ఆఫీసుకు వెళ్లి ఊరేగింపులో పాల్గొన్నాను. ఆంధ్రమహాసభ ఏమిటి? కమ్యూనిస్టుపార్టీ జెండాలు పట్టుకున్నారు. ఏమి సంగతి? ఆంధ్ర మహాసభ జండా ఇంతవరకు నియమించలేదు? ఆంధ్రమహాసభ నాయకత్వాన, కమ్యూనిస్టు పార్టీ ఈ ఊరేగింపు జరుపుతున్నదని తెలుసుకున్నాను. ఇంతలో వీరుడైన కొమరయ్యగారికి జై! అని నినాదాలిచ్చారు. మొత్తం ప్రజలను చూడాలనుకున్నాను గాని చూపు అందడంలేదు. దగ్గరలోవున్న చెట్టు ఎక్కి పైన నిలబడ్డాను. నెత్తిమీద ఏదో రెపరెపమని చప్పుడయింది. పైకి చూసేసరికి చెట్టుపైన కమ్యూనిస్టు పార్టీ జెండా రెపరెప లాడుతుంది. కమ్యూనిస్టు పార్టీకి జై అని నినాదాలిచ్చుకుంటూ మీజాన్ పత్రికలో వ్రాసిన కొమరయ్యపాట పాడుకొంటూ వూరేగింపు బయలుదేరింది.

బురదకాళ్లతో వుండి వంటిమీద చొక్కా లేకుండా అతి ఉత్సాహంతో ఎర్రజెండాలు పట్టుకొని నినాదాలు ఇచ్చుచున్న రైతులు కనబడినారు. తలలు వూపుకుంటూ మంచులో వణుక్కుంటూ వూరేగింపులో పాల్గొన్న తొంబయి ఏండ్ల వృద్ధ స్త్రీలు కూడా కనిపించారు. హరిజనులు, చాకలి, మంగలి, వడ్ల, కమ్మరి, కాపు, రెడ్డి, మహమ్మదీయులు మొదలగు వూరేగింపులో పాల్గొనిన వారందరిని చెట్టెక్కి చూడగలిగాను. ఇక చెట్టుమీద వుండలేక పోయాను. వెంటనే వచ్చి ఊరేగింపులో

పాల్గొన్నాను. కొమరయ్య పాట చదువుతుండగా నీరైనట్టు అయింది. ప్రజలందరికి కండ్లల్లో నీళ్లు కమ్మిన యీ పాట ముగియగానే ప్రజలందరు రౌద్రులయ్యి కొమరయ్యకు జై! ప్రజారాజ్యం కావాలి! పోలీసుల దౌర్జన్యాలు నశించాలి! స్వతంత్ర భారత్ కీ జై! కమ్యూనిస్టు పార్టీకి జై అని వూరేగింపు ముగించి ఎవ్వరి ఇండ్లకు వారు కొమరయ్య సంగతి మాట్లాడుకుంటూ వెళ్లి ఇండ్లపై ఎర్రజెండాలు స్థాపించుకున్నారు. ఒక కొమరయ్య పోగానే ఇంతమంది కొమరయ్యలు సిద్ధమయ్యారు అని, తప్పక మనకోర్కెలు నెరవేరుతవని నాకు దృఢమైనది. నేను నా యింటి పై ఎర్రజెండాను స్థాపించాను. ఆ ఎర్రకాంతి మొత్తం మా బజారులో వెలిగింది. అందరు గూడి కొమరయ్య ఏ ఆశయం కొరకు ప్రాణత్యాగం చేశాడో ఆ ఆశయం కోసం కంకణం కట్టుకొని ప్రతిజ్ఞ చేశారు.

అప్పట్లో తెలంగాణ అనే దినపత్రిక, గోలకొండ అనే ద్వైవార పత్రిక రెండు కూడ మితవాదులు, జాతీయపక్షం వారికి అనుకూలంగ పనిచేసినయి. ఇదే సమయంలో అతివాదులైన కమ్యునిస్టులకు 'మీజాన్' పత్రిక తోడ్పడింది. మీజాన్ అంటే తరాజు. దీనికి సంపాదకులుగా ఉన్న అడవి బాపిరాజు కవులు, రచయితలను ప్రోత్సహించి కథలు, గేయాలను ప్రచురించిండు. ఆ విధంగ సూర్యాపేటలోని సామాన్య కార్యకర్త ఆవుల పిచ్చయ్య పార్టీ కార్యకర్తగ ఉండడమే కాకుండ అనేక కథలు, గేయాలు రాసిండు. దొడ్డి కొమురయ్య మరణం మీద ఆవుల పిచ్చయ్య రాసిన కథని ఇక్కడ ప్రచురించడం జరిగింది.

**ముఖ్యాంశాలు**

1. ఫ్రెంచి సమాజంలో ఉన్నతవర్గం – మతాచార్యులు, భూస్వాములు

2. రష్యన్‌లు స్లావ్‌భాషను, సంస్కృతిని ఇతరుల మీద రుద్దడమే రూసీకరణ.

3. కార్ల్‌మార్క్స్ సిద్ధాంతాల మీద ఆవిర్భవించబడిన పార్టీ – సాంఘీక విప్లవ పార్టీ.

4. జమీందార్‌ల ఏలుబడిలో ఉన్న భూములనే ఖుద్‌ఖాస్త్ భూములని అంటరు.

5. నిజాంకు భూమిశిస్తు చెల్లించే పద్ధతినే పేష్కష్ అంటరు.

6. నిజాం జాగీరు కింద ఉండే భూములే సర్ఫేఖాస్ భూములు.

7. బంజరు భూములను సాగుచేసినవాళ్ళే ఇజారదారులు.

8. ఇజార బంజరుదారు భూమిని సాగుచేయాలంటే చెరువును తవ్వించాలె మరియు ఐదు నుంచి ముప్పయ్ ఇండ్లతో కూడిన గ్రామాన్ని కట్టించాలె.

9. ఇజార బంజరుదారు గ్రామాన్ని కట్టించే విధానానే 'ఆబాది' అన్నరు.

10. శిస్తులేని పట్టాభూములే 'శేరిభూములు'.

11. విసునూరు గడీ నిర్మాణానికి ప్లాన్ గీసింది – వల్లూరు బసవరెడ్డి.

12. ఆంధ్రమహాసభల తొలి గ్రామ కమిటి కడవెండిలోనే ఏర్పడింది.

13. 1938లో విసునూరు రామచంద్రారెడ్డి గడీ నిర్మాణం జరిగింది

14. అబుల్ హసన్ తానీషా కాలంలోనే క్షేత్రయ్య మువ్వగోపాల పదాలను రాసిండు.

15. అసఫ్‌జాహీల రాజ్యభాగాలు: సుభాలు, సర్కార్‌లు, పరగణాలు, ఖస్బాలు.

16. వ్యవసాయాభివృద్ధికి రైతులకు అప్పులు ఇచ్చే పద్ధతిని ప్రవేశపెట్టింది
– థామస్ మన్రో

17. థామస్‌మన్రో నిజాం అలీఖాన్ కాలంలో కలెక్టర్‌గా పనిచేసిండు.

18. సికిందర్‌జా కాలంలోనే మొదటిసారి జాగీర్ధారులు తిరుగుబాటు చేసింద్రు.

19. హైద్రాబాద్‌లో వహబి ఉద్యమానికి నాయకత్వం వహించింది
– ముబారిజ్ ఉద్దౌలా.

20. మూడు సంవత్సరాల వయసులోనే సింహాసనాన్ని అధిష్టించిన నిజాం
– మీర్ మహబూబ్ అలీఖాన్

21. సాలార్‌జంగ్ చనిపోయే నాటికి మహబూబ్ అలీఖాన్ వయసు కేవలం
15 సంవత్సరాలు మాత్రమే.

22. పర్షియన్ స్థానంలో ఉర్దూను రాజభాషగా ప్రవేశపెట్టింది – మీర్ లాయఖ్‌అలీ

23. నిజాం రాజ్యాన్ని నాలుగు సుభాలుగా విభజించిన దివాన్ – కిషన్ పర్‌షాద్

24. దొడ్డి కొమురయ్య తల్లిదండ్రులు - కొండయ్య - గట్టమ్మ

25. దొడ్డి కొమురయ్య పత్తి కురుమ కులానికి చెందిన సాధారణ గొర్ల కాపరి.

26. కడవెండి గ్రామంలోని దరగాని సోమయ్య, దొడ్డి భిక్షపతి చెప్పిన వివరాల ప్రకారం దొడ్డి కొమురయ్య చనిపోయే నాటికి 22 సంవత్సరాల పైబడి ఉంటడు.

27. దొడ్డి కొమురయ్య జననం 1924 జనవరి 6గా మరియు దొడ్డికొమురయ్య
మరణం 1946 జులై 6గా నిర్ధారించడం జరిగింది.

28. జనవరి 6, 2016 దొడ్డి కొమురయ్య 92వ జయంతి.

29. దొడ్డి కొమురయ్య మరణానికి సంబంధించిన ఆవుల పిచ్చయ్య కథ - ఊరేగింపులు

30. బండి యాదగిరి రాసిన "బండెనుక బండికట్టి" అనే పాట దేశముఖ్ జన్నారెడ్డి
ప్రతాపరెడ్డికి వ్యతిరేకంగ రాసింది.

31. రజాకార్ల రాక్షసత్వానికి బలైన ఇమ్రోజ్ పత్రికా సంపాదకుడు - షోయబుల్లాఖాన్

32. 1957లో కాశీంరజ్వీ పాకిస్థాన్‌కు వెళ్ళిపోయే ముందు యం.ఐ.యం
బాధ్యతలను అబ్దుల్ వాహిద్ ఓవైసీకి అప్పగించిండు.

33. ఏవిధమైన డిమాండ్లు లేకుండానే కమ్యునిస్టులు 1951 అక్టోబర్ 21న
వాళ్ళంతట వాళ్ళే సాయుధపోరాటాన్ని విరమించుకున్నరు.

34. దొడ్డి కొమురయ్య మీద కాల్పులు జరిగిన సమయంలో హైద్రాబాద్
ప్రధానమంత్రి - ఛత్తారి నవాబు

35. దొడ్డి కొమురయ్య మరణానికి ఆధారమైన పత్రిక - మీజాన్

# ఆధారగ్రంథాలు


1. తెలంగాణ ప్రజల సాయుధపోరాట చరిత్ర
   – దేవులపల్లి వెంకటేశ్వరరావు, 1988.
2. నల్లా నరసింహులు – తెలంగాణ సాయుధపోరాటం నా అనుభవాలు
   2009, విశాలాంధ్ర పబ్లీషింగ్ హౌజ్, హైద్రాబాద్
3. కె. జితెంద్రబాబు – నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలు
   2009, తెలంగాణ జాగృతి, హైద్రాబాద్
4. తెలంగాణ రాష్ట్రం చరిత్ర ఉద్యమాలు
   – ఎలికట్టె శంకర్ రావు, 2014
5. అన్వేషి బ్రాడ్‌షీట్– నవంబర్ 2010.
6. సైసై ఓ నల్లగొండ వీరుండ – ప్రజాశక్తి బుక్‌హౌజ్, 2011.
7. తెలంగాణ సాయుధపోరాట చరిత్ర– ఎలికట్టె శంకర్ రావు, 2015

8 రావి నారాయణరెడ్డి నా అనుభవాలు – జ్ఞాపకాలు,
   2010 విశాలాంధ్ర పబ్లీషింగ్ హౌజ్, హైద్రాబాద్.

9. తెలంగాణ సాయుధ పోరాటం – వెలపాటి రామరెడ్డి,
   1948, 2014, తెలుగు అకాడమి
10. భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి అనుభవాలు – ఎలికట్టె శంకర్‌రావు, 2012.

## రచయిత పరిచయము

పూర్తిపేరు : అంబటి వెంకట నరసింహా
కలం పేరు : అంబటి వెంకన్న
తల్లి దండ్రులు : మణెమ్మ - గురువయ్య,
కులం : బెస్త (బి.సి.ఎ)
పుట్టిన తేది : 12-04-1974,
విద్యార్హతలు : ఎం.ఎ. ఇంగ్లీష్, బి.ఎడ్.,
ఎం.ఎ జానపద కళలు
చిరునామ : 7-1-155/డి9/7, శ్రీనగర్ కాలనీ,
పానగల్‌రోడ్, నల్లగొండ. 9966376072
వివాహం : ఫిబ్రవరి 08, 1996
భార్య - పిల్లలు : సరోజ - వెన్నెల, వేకువ
**ప్రచురించిన పుస్తకాలు** :
**కవిత్వం:** కదురు, వడిసెల, అంబటి వెంకన్న కవిత్వం
**పాటలు:** తుంగు, జిల్లెడుపూలు, మబ్బులు,
గోగుమల్లెలు, అంబటి వెంకన్న పాటలు
**వ్యాసాలు:** పొలిమెర,
**తెలంగాణ చరిత్ర:** ప్రత్యేక తెలంగాణ ఉద్యమం- ప్రధాన ఘట్టాలు
**పాటల సీడీలు** : తెలంగాణ బతుకమ్మపాటలు,
తెలంగాణ గౌడ్ కల్లుపాట, జంభూరాజ్జెం,
సందమామలు, బెస్తోల్ల పోరుబాట,
సర్దార్ సర్వాయి పాపన్న పాటలు,
తెలంగాణ దేవులాట, జైజై తెలంగాణ
**సినిమా పాట** : జైబాలాజి “నేనొచ్చే ఈ బాటనా...”
**నటుడిగా** : కోహినూర్, పొరుదు,
హుష్‌కాకి, నైవేద్యం నాటికలు
జైబోలోతెలంగాణ సినిమా
**అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు:** 2006లో భారతీయ దళిత సాహిత్య అకాడమీ అవార్డు
ఢీల్లీ వారి చేత